# పిడికెడు ఆకాశం

నవల

- గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 252

కౌముది మాసపత్రికలో

జనవరి 2022 సంచిక నుంచి మార్చ్ 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

*(ప్రారంభం)*

**<u>గోపాలం కథ</u>**

సీత చిన్నప్పట్నుంచీ చాలామంది మహాపతివ్రతలను గురించి చదివింది. ఆధునిక మహాపతివ్రతల్ని ఆమె శరత్ నవల్లో చూసింది. చాలా ముగ్ధురాలయింది. సవతి తల్లి ఆడపిల్లల్ని సొంతపిల్లలాగా చూడడం, అసహ్యించుకునే వ్యక్తులకు కూడా అరకప్పు టీ ఇచ్చి మంచి మాటలతో వాళ్ళ మనస్సులను మళ్ళించడం, వారి దయ, వారి సౌశీల్యంలోని శక్తి ఇవన్నీ ఆమెను ఎంతో ఆకర్షించాయి. ఆ పవిత్రతలో ఎంతో ఆకర్షణ ఉన్నదనీ, నిస్సహాయ స్థితిలో కూడా ధైర్యాన్నీ, ఆత్మశక్తినీ ఇచ్చేది ఈ సౌశీల్యమేనని ఆమె మనస్సులో పదే పదే అనుకుంది. అందుకని అలాంటి కథలూ, నవలలూ చదవడం ఒక వ్యసనంగా చేసుకుంది. పుస్తకాలన్నీ కొని ఒక బీరువాలో అమర్చింది. వాటిని మళ్ళీ మళ్ళీ చదివి, తను మొదటిసారి గుర్తించలేని ఆ పాత్రల ఔన్నత్యాన్ని పునః పునః గుర్తుచేసుకుని ఆనందిస్తూంటుంది. అలాగని కొత్త నవలలు చదవదని కాదు. కొత్త నవలలలో కూడా ఆ పాత సంప్రదాయపు ఔన్నత్యం గల స్త్రీల కోసం వెదుకుతూ ఉంటుంది. కానీ మొహానికి ఇంత పసుపు రాసుకుని కాలేజీకి వెళ్ళే స్త్రీకాని, పరపురుషుణ్ణి కన్నెత్తి చూడకుండా ఆఫీసుల్లో ఉద్యోగం చేసుకునే అమ్మాయి కాని ఆ నవలల్లో ఎక్కడా కనిపించరు. అందుకని ఇటీవల వచ్చే నవల అంటే సీతకంత ప్రీతిలేదు.

సీత తల్లిదండ్రుల చాటున పెరిగిన బిడ్డ, థర్డుఫారం చదువుతూండగా టైఫాయిడ్ వచ్చింది. తగ్గేసరికి పరీక్షలయిపోయాయి. చదువుమీద ఎంతో శ్రద్ధ చూపే సీతకి ఈ జబ్బు శారీరకంగానూ, పరీక్షలు మానసికంగానూ దెబ్బతీశాయి. ఓ రోజు ఎవరితోనూ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయింది. తల్లీదండ్రీ బేజారెత్తిపోయారు. తల్లి గుండె బాదుకుని నూతిలో పడడానికి సిద్ధమయింది. కానీ ఓనాడు సీత మామయ్య ఉత్తర వ్రాశాడు. అమ్మాయి అక్కడికి క్షేమంగా చేరిందని. ఈ చాపల్యానికి కారణాన్ని గోవిందరావు కనిపెట్టాడు. ఏదో ఒక చదువు సీతకి వ్యాపకంగా చెయ్యడం అవసరమనుకున్నాడు. వెంటనే అమ్మాయిని ఇంటికి తెచ్చుకుని బజారుకి తీసుకెళ్ళి చదవడానికి కావలసిన పుస్తకాలు కొన్నాడు. అదిగో అప్పుడే సీతకి మొట్టమొదటిసారిగా శరత్ నవలలతో పరిచయమయింది. అవికాక ఇంకా కాశీమజిలీ కథలు, పాంచకడీదేవు నవలలూ, ఒకటి రెండు చలం నవలలూ చదవడం తటస్థించింది. కాని చలం అంటే ఆవిడకి చాలా అసహ్యం ఏర్పడింది. ఆడది సంప్రదాయాన్ని గౌరవిస్తే ఎంతటి ఔన్నత్యాన్ని పొందగలదో శరత్ చెప్తాడు. ఆడది సంఘం మర్యాదలకి ఎదురు తిరిగితే ఎటువంటి అధఃపతనానికి దారి తీయగలదో చలం ఎత్తి చూపుతాడు. ఈ రెండూ నిజం కాదని సీత స్నేహితురాలు శాంత వాదిస్తూంటుంది. సంప్రదాయాన్ని గౌరవించే ఆడదానిలోని మానసిక దౌర్భల్యాన్ని శరత్ అందంగా చెప్తాడు. సంఘ మర్యాదలకి ఎదురు తిరిగే ఆడవాళ్ళ ఆత్మశక్తి చలం సూటిగా చూపించాడు అంటుంది ఆమె, ఈ అభిప్రాయబేధాలే వాళ్ళిద్దరినీ దగ్గర చేశాయి. అది వేరే విషయం.

టైఫాయిడ్ జ్వరం తగ్గాక సీత బాగా వొళ్ళు చేసింది. మనిషి కాస్త నల్లబడింది. బుగ్గలు బాగా ఊరి, శరీరం బరువెక్కి కళ్ళు కోరికతో మెత్తబడినట్లు తయారయ్యాయి. చూడడానికి ఇరవై రెండేళ్ళదానిలాగా అగుపిస్తుంది. అందువల్ల

వయస్సుని బట్టికాక, శరీరాన్నిబట్టి త్వరగా చీర కట్టుకోవడం అలవాటు చేయాలని తల్లి వర్ధనమ్మ గ్రహించింది. చీర కడితే నిండుగా కనిపిస్తుంది. నవలలు చదవడం ప్రారంభించినప్పట్నుంచి పెద్ద బొట్టు పెట్టుకోవడం, కొంగు భుజం చుట్టూ తిప్పుకోవడం అలవాటు చేసుకుంది.

సీత చాలా పుస్తకాల్ని జాగ్రత్త చేసింది. అందమైన అట్ట వేసి బీరువాలో ఉంచుతుంది. తీరికవేళల్లో పాత పుస్తకాల బూజులు దులుపుతూండడం, కొత్త పుస్తకాలకు అట్టలు వేయడం చేస్తుంటుంది. ఈ పుస్తకాల ద్వారా ఆ వీధిలో చాలామంది స్నేహితురాండ్రని సంపాదించుకుంది. అలా పరిచయమైన వారిలో ముఖ్యంగా శాంత మరీ ప్రాణమైంది.

ఈ విధమైన విజ్ఞాన సముపార్జన వల్ల సీత ఆ వయస్సు అమ్మాయిలందరి కంటే జీవన విధానం విషయంలో చాలానే తెలుసుకుంది. కుండలికరణాలు, చక్రవడ్డీలు, అక్బరు చక్రవర్తి కాలంలోని భూమి శిస్తు విధానం, చోళులు మానవులా? వంటి మీమాంసలు తెలియకపోవచ్చు కాని జీవితంలో ప్రేమ, యౌవనం, మాతృత్వం ఇలాంటివాటిని గురించి కొన్ని నిర్ధిష్టమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

ప్రేమ ఈ జీవితంలో సాధ్యపడే ఒక అపూర్వమైన ఆనందానికి సంకేతమనీ, జీవితమంటే తను కోరుకున్న పురుషుడికి ఒకే ఒకసారి సమర్పించగల పుష్పమనీ, యౌవనమంటే ఆ పుష్పం వికసించే తరుణమనీ, మాతృత్వమంటే ఆ పువ్వు గుబాళింపు అనీ కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంది. ఇవి ఈ ఇరవై ఏళ్ళ జీవితంలో మార్చుకోవలసిన అవసరాలు కాని, అగత్యంకాని కనిపించలేదు. ఎంచేతనంటే వాటిలో వేటి సమీపానికైనా ఆమె ఇంకా రాలేదు కనుక. కానయితే ప్రేమ విఫలమయాక కొన్నాళ్ళు దుఃఖసాగరంలో మునిగి, కాలం ఆ మచ్చని మాపుచేశాక మరొకరిని వివాహం చేసుకునే యువతుల నవలలంటే ఆమె కసహ్యం. అలా రాసేవాళ్ళంతా అవాస్తవికతను చిత్రిస్తున్నారని, అట్లా ఒక్కనాటికీ జరగదనీ, కనీసం ఈ భారతదేశంలో, ఈ కర్మభూమిలో జరగదనీ ఆమె నమ్మింది.

అయితే ఆ నవల్లో కనిపించే ప్రేయసీ ప్రియుల బీచ్ షికార్లు, రాయబారాలు, ప్రేమలేఖలూ అంటే తనకిష్టం. వీటికీ, తన ఆలోచనలకూ ఓ అందమైన సమన్వయాన్ని ఆలోచించింది సీత. మొదటిసారిగా జీవితంలో తన భాగస్వామిని ఎన్నుకునే స్త్రీ అతనితో షికార్లు పోవడంలో తప్పేముంది? ఇద్దరూ కలిసి పాటలు పాడుకుంటూ చిలకా గోరింకల్లాగ గడపడంలో ఆక్షేపణేమిటి?

భర్త ఏ ఆనందాన్ని కోరితే ఆ ఆనందాన్ని పంచియివ్వడమే కదా సతీ ధర్మం? ఈ ఆలోచనలూ, ఆశయాలకూ సరితూగే భర్తకోసం ఎదురుచూస్తోంది సీత, అతనెక్కడో పుట్టి ఉంటాడనీ, ఆ కలయిక అతి విచిత్రంగా, మనసు పులకరించేలాగ, సినిమాలో లాగ జరుగుతుందనీ ఆమె కలలు కంటోంది.

సీత తండ్రి గోవిందరావుకి చాలా చిన్న వయస్సులోనే సీత పుట్టింది. వాళ్ళిద్దరూ పక్కపక్కనే నిలబడితే సీత ఆయన చెల్లెలిలాగ ఉంటుంది. వాళ్ళిద్దరూ చాలా నలుపు. ఆయనకంటే సీత కాస్త పొడుగు. ఆమెకి వాళ్ళ అమ్మ పోలిక వచ్చిందని చూసినవాళ్ళు అంటూ ఉంటారు. గోవిందరావుగారు చిన్న వయస్సులో పోస్టుమాస్టారయ్యాడు. ఆయనకి చుట్టలన్నా, చుట్టాలన్నా మహాప్రీతి. ఇంటికి పదిమందిని పిలిచి భోజనం పెట్టడం, వాళ్ళు చుట్టలు కాల్చేవాళ్ళయితే మరో రెండు రోజులు బలవంతంగా ఆతిథ్యం పెంచడం ఆయనకి నిత్యకృత్యం. పోస్టాఫీసుకి వచ్చినప్పుడల్లా లంకపొగాకుతో పలకరించే ఓ ముసలాయన ఆయనకు ఆ చిరకాలంలోనే మిత్రుడయ్యాడు. అతనిపేరు కుటుంబయ్య. తల్లిదండ్రులు పెట్టిన పేరు

వృధాపోకుండా లంకంత కుటుంబం కలవాడు. స్వాతంత్రోద్యమం ముమ్మరంగా జరిగే రోజుల్లో ఆండ్రూసు దొరగారి దగ్గర టైపిస్టుగా పనిచేస్తూ, ఆయనకు తరచు గారెలు తినిపిస్తూ, ఆయన దగ్గరే ఈ చుట్ట కాల్చడం నేర్చుకున్నాడు. స్వాతంత్ర్యం వచ్చాక ఆండ్రూస్ దొరవారు లండన్ వెళ్ళిపోతూ కుటుంబయ్య స్వామిభక్తికి మెచ్చి ఆ టైప్ మిషన్ను ఆయనకు బహూకరించాడు. ఆ టైప్‌మిషన్‌తో కుటుంబయ్య కొన్నాళ్ళు కోర్టులో చెట్ల కింద దుకాణం పెట్టాడు. అయితే కోర్టులో కేసులు తక్కువయినప్పుడు, కోర్టు శెలవుల్లోనూ తన రోజు గడవడం కష్టమై, నికరంగా ఒకచోటంటూ ఏర్పరచుకుని "ఇక్కడ టైపు చేయబడును - నేర్పబడును" అని బోర్డు పెట్టాడు. ఈ రోజుల్లో ఎమ్మేకంటే టైపిస్టుకే ఎక్కువ గిరాకీ ఉన్నదని గ్రహించిన పెద్దవాళ్ళు కొందరు పిల్లల్ని ఇక్కడికి పంపడం ప్రారంభించారు. ఆ విధంగా కుటుంబయ్యకి గిరాకీ పెరిగింది. రెండు పాత మిషన్లు వాయిదాల మీద బేరం చేశాడు. ఒక స్వాతంత్ర్య దినోత్సవం నాడు "జయభారత్ కమర్షియల్ ఇనిస్టిట్యూట్" అని పేరు పెట్టాడు.

మూడు మిషన్లతో ప్రారంభమైన ఇన్‌స్టిట్యూట్ ఇప్పుడు తొమ్మిది మిషన్లకు పెరిగి మూడు పువ్వులు, ఆరు కాయలూ అయింది.

ఓ రోజు కుటుంబయ్య, పోస్టాఫీసులో గోవిందరావుతో మాట్లాడుతూ ఉండగా, సీత అక్కడికి రావడం, "ఈవిడేనా మీ అమ్మాయి?" అనడం జరిగింది.

వయసొచ్చిన ఆడపిల్లల పెళ్ళిళ్ళ గురించి కనుక్కోవడం కొందరు ముసలాళ్ళకి అలవాటయినట్టు, చదువుకుంటున్న పిల్లల్ని చూసి "టైపు నేర్చుకుంటోందా?" అనడగడం కుటుంబయ్యకి అలవాటయిపోయింది.

"అయ్యో ఇంకా అమ్మాయికి టైపు నేర్పించలేదా?" అని విస్తుపోయాడు కుటుంబయ్య. 'ఇంకా పెళ్ళిచేయలేదా?' అన్నంత ఆశ్చర్యంగా. "లేద"న్నాడు గోవిందరావు.

"అదెలాగ కుదురుతుంది? రేపు ఆ పెళ్ళి చేసుకున్నవాడు టైపు మిషనున్నవాడైతే చక్కగా వాళ్ళాయనకి ఓ ఉత్తరం ముక్క టైపు చేసుకుంటుంది. రేపట్నుంచీ పంపించండి" అన్నాడు.

ఆ మాట ప్రకారం సీతని పంపించడం ప్రారంభించాడు గోవిందరావు. టైపు నేర్చుకోవడం స్త్రీ మానసిక సౌందర్యానికి ఏ మాత్రం దెబ్బతీయదు గనుక నిక్షేపంలాగా రోజూ వచ్చిపోతూ ఉంది సీత.

సరిగ్గా ఈ సమయంలోనే ఎదురింటిలో ఇద్దరు యువకులు దిగారు. ఆ ఇల్లు చాలా నెలలుగా ఖాళీగా ఉంది. ఇల్లు కట్టించిన రెండోయేడు కొత్తగా పెళ్ళయిన భార్యాభర్తలు అందులో దిగారు. వాళ్ళ సాంసారిక జీవితం కొన్నాళ్ళు హాయిగా గడిచింది. క్రమంగా భర్తగురించీ, అతని అలవాట్ల గురించీ భార్యకి తెలియడం ప్రారంభించింది. అతను తాగుడు కాస్త ఎక్కువగానే తాగుతాడు. ఈ విషయం తెలిసి భార్య ఏడ్చింది.

వద్దని ప్రాధేయపడింది. తరువాత తరువాత అతనికి త్రాగడం అలవాటయిపోయింది. ఒకరాత్రి మరీ మత్తుగా త్రాగివచ్చి ఆమెను విపరీతంగా చావబాదాడు. ఇక భరించలేక తనూ అతన్ని కసిగా చావగొట్టి మేడమీదికి వెళ్ళి ఉరిపోసుకుంది. తెల్లవారక దెబ్బలతో స్పృహతప్పి పడివున్న భర్త క్రింద, చచ్చిపడి వున్న భార్య మీదా కనిపించారు. వీధివీధంతా విరగబడి చూశారు. ఊరంతా గగ్గోలయిపోయింది. బలవంతపు చావు చచ్చిన ఆ కొంపలోకి రావడానికి ఎవ్వరూ ఇష్టపడలేదు. పైపెచ్చు పక్కన వేపచెట్టు కూడా ఉంది. దాని కొమ్మలు ఆ యింటి డాబాను రక్షిస్తున్నట్లు మీదికి

వంగి ఉంటాయి. ఓసారి ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి అటువేపే వెళ్తూ మసక చీకటిలో రాయి తన్నుకు పడిపోయింది. పడగానే హఠాత్తుగా ఆ అమ్మాయికి ఉరిపోసుకున్న ఇలాలు గుర్తుకువచ్చి వెర్రికేక పెట్టింది. అంతే మూడురోజులు జ్వరం వచ్చి ఆ అమ్మాయి పోయింది. అప్పట్నుంచి ఇంటికి దెయ్యాల కొంప అని పేరు పెట్టారు అంతా. సీతా వాళ్ళ ఇల్లు దీనికి ఎదురు గుమ్మం. వసారాలో మంచం వేసుని కూచుంటే ఎదురింటి గదీ, వేపచెట్టు కొమ్మలూ అగుపిస్తాయి. సీతకి దెయ్యాలమీద నమ్మకంలేదు. సీతా మహాసాధ్వి రాక్షసుల మధ్య బ్రతికిరాలేదా? మానసికమైన పవిత్రతా, పాతివ్రత్యం ముందు ఏ భూతాలూ నిలువవు. అందుకని రాత్రివేళల్లో ఆ యింటిని చూసినప్పుడల్లా తను చేయని నేరానికి ప్రజలచేత శిక్షను పొందుతున్న ఆడపడుచులాగా, ఇంటిమీంచి జారే కొమ్మలు ఆమె విరబోసుకున్న జుత్తులాగా కనిపించి, ఆ ఇంటిని చూసి జాలిపడేది. ఆ ఇల్లు తను ఊహించని కథలు చెప్తున్నట్టుండేది. ఎప్పుడైనా తీరికవేళల్లో కథానాయికల్లాగే ఆ ఇల్లు తనకు స్నేహపాత్రమైంది.

వీధిలో నిలబడ్డప్పుడు ఆ ఇంటి యజమని ఎప్పుడైనా కనిపిస్తే "ఆ యింటికోసం ఎవ్వరూ రాలేదా నాయుడుగారూ?" అని ఆతృతగా అడుగుతుంది.

"ఎవరొస్తారమ్మా? ఆత్మహత్యలు జరిగిన కొంపలోకి?" అని దిగులుగా అంటాడు.

సీతకి అతని మీదకన్నా ఆ యింటిమీద విపరీతమైన జాలి కలుగుతుంది. అందువల్లనే ఆ ఇంట్లో ఎవరో దిగారనగానే త్వరత్వరగా వీళ్ళ గురించి వాకబు చేసింది. ఆ ఇంటిపక్కనే ఉంటున్న శాంత వివరాల్ని త్వరగా పట్టేసింది. కొత్తగ ఆ వూళ్ళో ప్రారంభమైన బిస్కట్ల కంపెనీలో పనిచేయడానికి వచ్చారని, వాళ్ళకా ఇంటి చరిత్ర తెలియదు. అందుకే అయిదు గదులున్న ఇల్లంతా నూరు రూపాయలకు ఇస్తున్నారనేసరికి సంతోషంగా దిగారు.

దిక్కులేని అనాధకు ఆశ్రయం ఇచ్చిన కరుణామయులుగా వారిద్దరూ కనిపించారు సీతకి. చాలా ఏళ్ళ తరువాత మళ్ళీ ఆ యింటికి డోర్ కర్టెనులు వచ్చాయి. రేడియో పాటలు పాడింది. హార్మోనియం మోత కూడా రాత్రివేళల్లో వినిపించింది. నీళ్ళుపోసుకునే చప్పుళ్ళు వినవచ్చాయి. జడత్వం ఆవహించిన ఆ మృతమూర్తికి చైతన్యం వచ్చినట్టయింది. వీలయినప్పుడల్లా ఆ కదలికల్ని గమనిస్తూ గడిపింది సీత. సీత అలా గమనించడాన్ని వాళ్ళూ వేయికళ్ళతో గమనిస్తున్నారని ఆమె గమనించలేదు. ఆమెకు ఆ యింటిమీదగల సానుభూతిని వాళ్ళు తమమీద గల ఆసక్తిగా అర్ధంచేసుకుంటున్నారని అర్ధం చేసుకోలేదు. ఆపదలో ఉన్న స్త్రీని రక్షించిన వాళ్ళ పట్ల కలిగినట్టుగా వారిపై కలిగిన దయని మరొక విధంగా అర్ధం చేసుకుంటున్నారని ఆమెకు తెలియలేదు. ఎందుకంటే ఇలాంటి సన్నివేశం ఏ నవలలోనూ చిత్రితం కాలేదు. మహాపతివ్రతలయిన కథానాయికల మీద ఇలాంటి దయాదాక్షిణ్యాలు దెబ్బతీస్తాయని ఆమె లైబ్రరీలో ఏ గ్రంథమూ ఉద్ఘోషించలేదు

సరిగ్గా ఈ పరిస్థితిలోనే పుస్తకాలపై మొదటి రాయబారం జరిగింది. ఆ ఇంటి పక్కన ఉన్న శాంత చెల్లెలు గిరిజ ఓ రోజు పరిగెత్తుకు వచ్చి "అక్కా! అక్కా! ఏమైనా నవలలు కావాలి" అంది. సీత ఆశ్చర్యపోయింది. ఎందుకంటే, కొత్త నవలలని తను కొన్నప్పుడు ఆ వీధిలోని అమ్మాయిలంతా సమావేశం కావడం మామూలు. మరి హఠాత్తుగా గిరిజ ఎందుకు పరిగెత్తుకు వచ్చిందో అర్ధంకాక "ఎవరికే?" అంది.

ఎదురుగ్గా ఉన్న మేడ చూపించి, సిగ్గుపడుతూ "వాళ్ళకే అక్కా" అంది. సీతకి ఆశ్చర్యం, ఆసక్తి పెరిగిపోయింది. అది ఆ వ్యక్తుల మీద ఉన్న ప్రత్యేకమైన ఆసక్తికాదు.

"నీకెలా తెలుసు వాళ్ళు?" అనడిగింది.

అసలు కథ ఇది - శాంత యింటికి, వాళ్ళయింటికీ ఒక్కటే ఎలక్ట్రిసిటీ కనెక్షన్, నిన్నరాత్రి గాలికి ఆ వూరి ఆనవాయితీ ప్రకారం లైట్లు పోయాయి. లైట్లు కొంతసేపటికి వచ్చాక ఫ్యూజ్ పోయింది. దాన్ని వెయ్యడానికి వాళ్ళ ఇంటికి గిరిజను పంపవలసి వచ్చింది.

ఆ సదవకాశాన్ని పురస్కరించుకుని వాళ్ళు పుస్తకాల కోసం రాయబారం పంపారు.

"నా దగ్గర పుస్తకాలుంటాయని వాళ్ళకెలా తెలుసు?"

"నేను చెప్పాను."

"ఎందుకు చెప్పావు?"

"వాళ్ళు అడిగారు కనుక."

ఇక అంతకన్నా ఎక్కువ ప్రశ్నలు వెయ్యలేకపోయింది సీత. అయినా పుస్తకాలు చదువుకోడానికి ఇవ్వడంలో తప్పులేదు. దానిలో తనకో గర్వం ఉంది. తన దగ్గర మంచి పుస్తకాలు ఉన్నాయని వాళ్ళకి తెలియడం, అటువంటి అవసరానికి తన అక్కర కలగడం. అందుకని అందంగా అట్టవేసిన మూడు పుస్తకాల్ని ఇచ్చింది సీత.

వాళ్ళిద్దరిలో ఒకరి పేరు రాజు అని, మరొకరి పేరు పాలు అని చెప్పింది గిరిజ. "పాలు ఏమిటి, పాలూ - పెరుగు" అని విసుక్కుంది. ఈ పుస్తకాలు అడిగిన వ్యక్తి రాజు అయి ఉంటాడని అనుకుంది. అనుకున్నాక ఆ విషయం మరచిపోయింది.

ఎంతవాళ్ళ గురించి ఆలోచించినా సీతకు అదొక్కటే లోకంకాదు. అదీగాక ఆ ఇంటిలో వాళ్ళు దిగాక క్రమంగా ఆ యింటిమీద దయ సన్నగిల్లింది. ఈ మధ్య మరో పది పుస్తకాలు కొని తెచ్చుకుంది సీత. వాటిని చదవడంలోనూ, అట్టలు వెయ్యడంలోనూ, స్నేహితురాండ్రకు పంపిణీలోనూ చాలారోజులు దొర్లిపోయాయి. ఈ మధ్య వర్షాలు పడుతుండడం వల్ల వరండాలో పడుకోవడం తగ్గిపోయింది.

ఇలా ఉండగా ఒకరోజు గిరిజ తీసుకువెళ్ళిన రెండు పుస్తకాలూ వెనక్కి తెచ్చి ఇచ్చింది. వాటిని చూస్తూనే భోరున దుఃఖం ముంచుకొచ్చింది సీతకి. తను వేసిన అట్టలు ఊడిపోయి ఉన్నాయి. పుస్తకానికి వేసిన అట్టజాడలేదు. ఒక పుస్తకానికి కుట్టూ జారిపోయింది. రెండో పుస్తకానికి చివర నాలుగుపేజీలు లేవు. బొద్దింకల రెట్టలు, ఒకమూల ఎలక కొరికిన జాడలూ కనిపించాయి. ఒక పుస్తకం ముందు పదిపేజీల వరకూ కొబ్బరినూనె మరకలు కనిపించాయి. అంటే వాటిని తలక్రింద పెట్టుకుని నిద్దరపోయి ఉంటారు. ఆ కోపంతో పుస్తకంతో రెండు వడ్డించింది గిరిజని. "వాళ్ళు మనుష్యులా, పశువులా" అని తిరంది. ఉగ్రరూపం దాల్చి, నోటికి వచ్చినట్టూ తిట్టి చిరిగిపోయిన పేజీలు అంటిస్తూ కూర్చుంది. అంతా చూశాక వాళ్ళకు పుస్తకాలు కావాలని మళ్ళీ అడగలేకపోయింది గిరిజ. నెమ్మదిగా వెళ్ళిపోయి జరిగినదంతా చెప్పి, 'ఇక పుస్తకాలు తీసుకురా'నని వాళ్ళతో చెప్పేసింది.

మర్నాడు ఎదురింటి అబ్బాయి పంపిన పుస్తకంలోంచి ఓ ఉత్తరం కిందపడడంతో ఆశ్చర్యపోయింది సీత. అలా అబ్బాయిలు, పుస్తకాల్లో ఉత్తరాలు పంపించడం, తమ ప్రేమని ఇలా తెలియ పరుచుకున్నాక ప్రేయసీ ప్రియులు కావడం సీత చాలా పుస్తకాల్లో చదివింది. చాలా సినిమాల్లో చూసింది. మరి ఇప్పుడీ ఉత్తరం - గులాబీ రంగు కాగితం మీద ''సీతాదేవిగారు'' అని వ్రాసి ఉన్న కాగితం చూశాక ఆ అనుభవాలన్నీ మనస్సులో కదిలాయి. చాలా కుదురుగా వ్రాశాడు ఆ అబ్బాయి. చెదిరిపోయిన జుత్తు, తరచూ మాసిన గెడ్డం చూస్తూ ఇంత జాగ్రత్తగా చెయ్యలేడనుకుంది. కానీ చాలా ఆలోచించినట్టు, శ్రమపడినట్టూ ఉంది ఉత్తరం. నల్లటి ప్యాంటు మీద ఎప్పుడూ నల్లటి బుష్‌కోటు తొడుక్కునే అతన్ని చూసి 'అబ! ఏం అభిరుచి బాబూ' అనుకుంది. కానీ గులాబీరంగు కాగితం చూశాక మంచి టేస్టేనని అర్థమవుతోంది. కానీ మనిషికి జాగ్రత్త తక్కువ. ఆ విషయం అతన్ని చూసినా, ఈ ఉత్తరం పంపడం చూసినా అర్థమవుతుంది. లేకపోతే గిరిజ ఒక్కసారి పుస్తకం తెరిస్తే ఏమయ్యేది? వయస్సు పన్నెండయినా ఆ మాత్రం ఆలోచించలేదూ అది?

సీత ఎదురింటి అబ్బాయి చొరవకీ, తెగింపుకి నిరసన భావాన్ని పెంచుకుంటూనే, స్త్రీ సహజమైన ఆసక్తితో ఆలోచించింది. అతని మీద కోపమూ వచ్చింది. అయితే ప్రేమని వ్యక్తం చేస్తూ ఇలాంటి ఉత్తరం రావడం సీత జీవితంలో కొత్త. ఇన్నాళ్ళూ పుస్తకాల్లో చదవడమే గాని, ఇవాళ నిజ జీవితంలో మొదటిసారిగా ఆ పని జరిగింది. అందుకు కారణమైన ఎదురింటి అబ్బాయి మీద ఆమెకు కాస్త దయకూడా కలిగింది. సీత చాలా అందగత్తె అని చిన్నప్పట్నుంచీ చాలామంది అంటూండేవారు. నా 'అందాలభరిణె' అంటూ అమ్మ ముద్దులాడుతూండేది. అయినా ఆ విషయాన్ని మరొకవ్యక్తి చెప్పగా వినడానికి ఎప్పుడూ అలసిపోలేదామె.

మెర్లిన్ మన్రో 'తాను చాలా అందగత్తె'నని చిన్నప్పట్నుంచీ లక్షలమంది చెప్పగా విని ఉండవచ్చు. అంతమాత్రాన లక్షా ఒకటో మనిషి చెప్పగా వినడం చికాకనిపించదు. పైగా సంతోషంగా ఉంటుంది కూడా. అహంకారం మరో అంతస్తు పెరుగుతుంది. సరిగ్గా సీత విషయంలో అలాంటిదే జరిగింది.

సంక్రాంతి పండగనాడు కొత్త పరికిణీ, పావడా వేసుకున్నంత ఉత్సాహంగా ఉంది సీతకి, ఆ రోజంతా ఆ ఉత్తరాన్ని జాకెట్టులో దాచుకుని ఇల్లంతా కలియ దిరిగింది. పెరట్లోకి వెళ్ళి ఎర్రగులాబీ తీసి తలలో తురుముకుంది. తల్లి అక్కర్లేదన్నా నాలుగుసార్లు కరివేపాకు మండల్ని కోసుకు వచ్చి వంటింట్లో పడేసింది. 'లెక్కలు చెయ్యడం ఎలాగక్కా?' అని వేణు సాధిస్తే చెప్పి బోధించే స్థిమితం లేక తనే అరనిముషంలో లెక్కలన్నీ చేసి అక్కడ పారేసింది. త్వరత్వరగా స్నానం చేసి తెల్లటి జరీ అంచు ఉప్పాడ చీర, దొండపండు రంగు జాకెట్టు వేసుకుని జాగ్రత్తగా ముస్తాబయింది. నాన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోయాక, వేణు స్కూలుకు వెళ్ళిపోయాక, అమ్మ పూజ ప్రారంభించాక డాబా మీదికి పోయి కూర్చుని జాకెట్టులోంచి కాగితం మడత పైకి తీసింది. కథలద్వారా, సినిమాల ద్వారా లభించిన పద్దెనిమిదేళ్ళ అనుభవాన్ని పూరించి ఇవాళ మొదటి పుటని ఆ క్షణంలో ఆ అపూర్వ క్షణంలో తెరవడానికి సిద్ధపడింది సీత.

అందమైన గులాబీ కాగితానికి అడ్డంగా అర్థమయీ కాని రాతలో మూడే వాక్యాలు ఉన్నాయి.

''సిస్టర్ పుస్తకాలు ఇవ్వనన్నారుట, దయచేసి ఇవ్వండి, ఫ్యాక్టరీ నుండి వచ్చాక ఏమీ తోచడంలేదు.

**......నాగరాజు.**

చదివి హతాశురాలయింది సీత. తను ఊహించినదేమీ అందులో లేకపోయేసరికి సీతకు నిరాశ, నిస్పృహ కలిగాయి. గుండె గుబగుబలాడింది. కళ్ళనీళ్ళు తిరిగాయి. ఈ ఉత్తరం ఒక అందగత్తె పట్ల అందమైన అబ్బాయి చూపిన తిరస్కారంగా కనిపించింది. ప్రపంచ సుందరీమణుల పోటీలో ప్రథమ బహుమతి పొందిన స్త్రీని తృణీకారభారంతో చూస్తే ఏమవుతుంది? అలా అనిపించింది సీతకి. మేడమీద ఒంటరిగా కూర్చుని చాలాసేపు భోరున ఏడ్చింది.

2

**అందమైన వాళ్ళకి** అందమైన పేర్లు ఉంటాయని ఊహించింది సీత. పఠితగా తన అనుభవంలో నవలా రచయితలంతా కథానాయకుల్ని ఉంగరాల జుత్తు, ఎత్తరి, చక్కని మీసకట్టూ గల నవయౌవనులుగా చేసి వాళ్ళ పేర్లను చక్రవర్తి అనో, రఘు అనో, వేణు అనో పెట్టడం చాలాసార్లు చూసింది. నల్లగా, బలంగా, నిండుగా ఎప్పుడూ తెల్లబట్టలు వేసుకునే సామాన్యులకి రామ్మూర్తి, వర్మ, శేషగిరిలాంటి పేర్లు ఉండడమూ తెలుసు. ఇప్పుడు ఎదురింట్లో దిగిన ఇద్దరు యువకులకీ ఈ రెండు తరహాల లక్షణాలు ఉన్నాయి. అందువల్ల గిరిజ చెప్పిన రెండు పేర్లు విన్నాక ఆ ఇద్దరిలో ఉంగరాల జుత్తు అబ్బాయి నాగరాజు అనీ, నల్లటి కుర్రాడు పాలు అని గుర్తు పట్టేసింది. తనని పలకరించిన అబ్బాయికి ఉంగరాల జుత్తు అనీ, పుస్తకాలు చదివే అభిరుచి ఉంటుందనీ అనుకుంది.

ఓ రోజు చీకటిపడే వేళ టైపు క్లాసు నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో వేప చెట్టుకిందకి వచ్చేసరికి ''సిస్టర్'' అని పలకరించడం వినబడి తుళ్ళిపడింది. గొంతు సుపరిచితంగా ఉంది. రోజూ ఎదుటి కిటికీలోంచి పాటలు వినిపించే గొంతు. సందేహం లేదు. ఇటు తిరిగితే నల్లగా, బొద్దుగా అతను ఇంకా నల్లగా కనిపించాడు. అటూ ఇటూ చూసింది. వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. సీతకెంతో భయం వేసింది. వాళ్ళెప్పుడైనా కనిపిస్తే చెడామడా తిట్టాలన్న ఆలోచన ఈ భయంతో మరిచిపోయింది.

''సిస్టర్'' అన్నాడతను మళ్ళీ.

ఆగింది సీత.

''సిస్టర్ పుస్తకాలు ఇవ్వనన్నారుట, కానీ ఇక్కడ మాకేం తోచడంలేదు. అంతా కొత్త. దయచేసి ఏమైనా ఇస్తూ ఉండండి.

వొళ్ళు మండిపోయింది సీతకి.

''ఎందుకు? తలగడా దిండు చేసుకుని నిద్రపోవడానికా?''

అతను ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూశాడు. వెంటనే ఏమీ అనలేకపోయాడు.

''ఎలకలచేత తినిపించడానికా? అట్టలూ, కాగితాలూ చింపి పడవలు చేయడానికి'' ఈసారి 'సిస్టర్' అంటాడని ఊహించి గట్టిగా చెప్పింది. ''నన్నలా పిలవకండి. పుస్తకాల్ని చదవడం, ఎదుటి వాళ్ళ అభిరుచుల్ని గౌరవించడం నేర్చుకోవాలని మీ మిత్రులు నాగరాజుగారికి చెప్పండి'' అని ఒక్క గుక్కలో అంది.

''కాని...''

"కానీ లేదు, అర్థణా లేదు, పాల్‌గారూ. పాటలు పాడుకునేటప్పుడు కిటికీలు మూసుకోవడం మంచిదని ఇప్పటికైనా గ్రహించడం మీ ఆరోగ్యానికి మంచిది" అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళిపోబోయింది సీత.

కానీ ఇంతలో అనుకోని ఒక సంగతి జరిగిపోయింది.

"మీరు మమ్మల్ని అపార్థం చేసుకున్నారు సీతాదేవిగారూ" అన్నాడు అతను. తనని పేరుతో పిలిచినందుకు నిర్ఘాంతపోయింది సీత. కానీ నవలల మీద తన పేరు వ్రాసుకున్న విషయం ఆ క్షణంలో ఆమెకు గుర్తుకు రాలేదు. కానీ అపార్థం చేసుకున్నారనే అందమైన వాక్యం, అన్యాయం జరిగిపోయిన కథానాయకులు చాలాసార్లు అనగా చదివింది తను. అపార్థం చేసుకోబడిన కథానాయకులు అంటే ఆమెకి అసహ్యం.

అందుకని "ఏం మీకు పుస్తకాలివ్వడమే కాకుండా మిమ్మల్ని అర్థం కూడా చేసుకోవాలా?"

"అదికాదు సీతాదేవిగారూ నా పేరు పాల్ కాదు. నేను నాగరాజును" దిగ్భ్రమతో నోటమాట రాలేదు సీతకి. ఆశ్చర్యంతో కోపమంతా పటాపంచలైంది. ఒక్కొక్కప్పుడు నవలలెంత అపార్థాల్ని సృష్టిస్తాయి. నిత్యజీవితంలో ఉంగరాల జుత్తు ఉన్న అందమైన కుర్రాళ్ళందరికీ అందమైన పేరు ఉండనక్కరలేదు.

ఆనందంలాగే, ఆశ్చర్యంకూడా ఆడదాన్ని అబలని చేస్తుంది. ఆ విషయం ఎక్కడా చదవని సీత ఓ ప్రశ్నద్వారా వ్యక్తం చేసుకుంది.

"మరి ఆయన పేరేమిటి?"

ఆ ప్రశ్నతో అమ్మాయి దర్పం కొంచెం తగ్గిందనుకున్నాడు నాగరాజు. ఈ తీరుబాటులో ఒక సిగరెట్టు తీసి వెలిగించాడు. గారడీ చూసే ప్రేక్షకురాలుగా అంతసేపూ నిలబడి ఉంది సీత.

"వాడి పేరు గోపాలరావు. గోపాలం అని పిలుస్తారు. వాడు ఉత్త ఫూలండి. మీ దగ్గర పుస్తకాలని చదివే సదవకాశాన్ని వాడే పాడు చేశాడు. వాడికి కొంచెం నిద్ర ఎక్కువ. ఎప్పుడో నేను లేనప్పుడు మీ పుస్తకాల్ని తలక్రింద పెట్టుకుని నిద్రపోయి ఉంటాడు. వాడిని క్షమించండి."

సీతకి ఆ దృష్టేలేదు "అయితే కిటికీ దగ్గర పాటలు పాడేది మీరా?"

"రేపట్నుంచీ తలుపులు మూసేసి పాడుకుంటాలెండి" అంటూ గలగలా నవ్వాడు. ఆ నవ్వు అంత చీకట్లోనూ అందంగా వినిపించింది. కనిపించింది. అంత అందంగా లేనివాళ్ళకి ఆభరణాలేవో అమరుస్తాడు భగవంతుడనుకొంది సీత.

"అయితే నేనే మిమ్మల్ని అపార్థం చేసుకున్నానన్నమాట" అపార్థం చేసుకున్న కథానాయికలంటే నాగరాజుకి అసహ్యం లేదు. పైగా ఆప్యాయత కూడా ఉంది. అందుకనే ఇమోషనల్‌గా "అయితే పుస్తకాలు పంపిస్తారా?"

"రేపు గిరిజను పంపించండి" అనేసి వచ్చేసింది. ఓడిపోయిన ఖైదీ బేషరతుగా లొంగిపోయినట్టు.

తాను చేసిన పొరపాటుని ఆమె అంత అందంగా ఒప్పుకున్నందుకు ముగ్ధుడై నాగరాజు సిగరెట్టు చేతిని కాల్చేవరకూ అలాగే నిలబడిపోయాడు.

నిజానికి పుస్తకాలు చదవాలన్న ఆకాంక్ష తప్ప మరొక దృష్టి నాగరాజుకి లేదు. నిజంగా పుస్తకాలు చదివే ఆసక్తే ఆ రోజు సీతని వేపచెట్టు క్రింద ఆపుచేయించింది. అయితే గోపాలానికి సీతమీద గల ఆసక్తే పుస్తకాల్ని అలా పాడుచేయించింది. స్త్రీలో కోపాన్ని, ఉదాసీనతని కలిగించినవాడు ఆమె దృక్పథంలో ఎక్కువకాలం నిలుస్తాడనీ, ఆ కోపాన్నీ,

దరిమిలా ప్రేమగా పరిణమింపజేసుకోగలిగితే ప్రేమ కూడా హృదయంలో ఎక్కువ కాలం నిలువగలదనీ గోపాలం ఒక సిద్ధాంతాన్ని సిద్ధం చేసుకున్నాడు. అతనిది కాలేజీలో ఫిజిక్స్ గ్రూపు.

ఆ పద్ధతి ప్రకారం నాగరాజు పుస్తకాలు చదవని సందర్భంలో వాటిని తలకింద పెట్టుకుని నిద్రపోయాడు. ఉత్త పుణ్యానికి అట్టనీ, పది కాగితాల్ని చింపి కాఫీ పెట్టుకు తాగాడు. కాఫీ పొడిని పుస్తకం అంతటా జల్లాడు. సిగరెట్టుతో రెండు కొసలు కాల్చాడు. రాత్రి వాకిట్లో మరచిపోతే ఎలుకలూ అతని ఉద్దేశాన్ని బలపరిచి, మరో రెండు కాగితాల్ని కొరికి రుచి చూసి పోయాయి. ఈ పనికి ఫలితంగా ఎప్పుడో ఆ అమ్మాయిని ఎదుర్కోవలసి వస్తుందనీ, ఆ రోజు ఇద్దరి మధ్యా ఆకర్షణకి అంకురార్పణ జరుగుతుందనీ ఆశగా ఎదురు చూస్తున్నాడు గోపాలం.

ఇలాంటి చిన్న మెలికలు పెట్టి, చాలా ఘనమైన ఫలితాన్ని సాధించడం అతనికి వంశపారంపర్యంగా వచ్చింది. అతని తాత వ్యాఘ్రావధానులుగారు వైస్రాయి పాలించే రోజుల్లో ఒక దొరగారి పి.ఏ.గా పనిచేసి, తెలుగు భాషకు తప్పుడు ఇంగ్లీషు వాఖ్యలు చేసి చాలా డబ్బు ఆర్జించారు. వాళ్ళ నాన్నగారు రమాపతిరావుగారు మొదట్లో ప్రాక్టీసు పెట్టి, కీర్తినీ, డబ్బునీ ఆర్జింపచూశారు. న్యాయాన్ని నాలుగు పాదాల నడిపించడమే తమ ధ్యేయమని, అందుకు సాక్ష్యంగా మహాత్మాగాంధీ, అబ్రహాం లింకన్ ప్రభృతుల పటాల్ని ఆఫీసు గదినిండా తగిలించి క్లయింట్లకు సుదీర్ఘమైన ఉపన్యాసాలిచ్చేవారు. అంత ధాటిగా ఆయన కోర్టులో మాట్లాడలేడని గ్రహించిన తెలివైన క్లయింట్లు కొందరు రావడం మానేశారు. అప్పట్నుంచి దొంగ సారా కేసులు, పొలాల తగాదాలు, తప్పుడు తనఖాలులాంటి కేసులు చాలా తగిలేవి. ఆ సందర్భంలో ఆయన గ్రహించిన సత్యాలు చాలా ఉన్నాయి. లాయరుగా వాళ్ళ సమస్యల్ని సృష్టించడం చాలా లాభసాటి వ్యవహారమని గ్రహించారు. మహారణ్యంలో అశోక వృక్షంగా బ్రతకడం కంటే, చెట్లు ఏమీలేనిచోట ఆముదం చెట్లు కావడం మంచిదనుకున్నాడు. చదువుకున్న వారిపట్ల చదువులేని వారికున్న గౌరవాన్ని సద్వినియోగం చేసుకోవడం మేలని గ్రహించారు. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవలసిన రీతిన, వెంటనే ఆయన లాయరు ప్రాక్టీసుకి స్వస్తి చెప్పారు. నల్లకోటు సెకెండ్ హ్యాండ్ బజారులో అమ్మించేసి ఖద్దరు తాను ఒకటి తెప్పించారు. తన దగ్గరికి వచ్చే కార్మిక క్లయింట్లతో ఉద్రిక్త కంఠంతో ఇలా అన్నారు. "రాను రాను మీ సమస్యలు పెరిగిపోతున్నట్లు నాకనిపిస్తోంది. మీ కష్టాలు తీర్చే నాథుడు కనబడడం లేదు. వీటిని చూస్తుంటే నా హృదయం ద్రవించిపోతుంది. ఈ మాటల్ని కొందరు దేశనాయకుల ఉపన్యాసాల్ని చదివి గ్రహించారాయన. అందువల్ల వచ్చిన సమస్యల్ని కోర్టులో పరిష్కరించడం కంటే మీతోనే ఉంటూ సమస్యల్ని తలయెత్తకుండానే చేయాలని సంకల్పించాను. అందుకు మీ చేయూత కావాలి."

కార్మికులు ఉప్పొంగిపోయారు. కృతజ్ఞతతో వాళ్ళు కళ్ళు చెమర్చాయి. అందరూ యేక కంఠంతో ఆయనకు జేకొట్టారు. వాళ్ళ నిజాయితీ చూసి ఒక్క క్షణం రమాపతిరావు గుండె వణికితేనేంగాక, మళ్ళీ తట్టుకుని చిరునవ్వు చిందించారు. ఆయనకు కార్మిక నాయకత్వం వచ్చింది. జీవితం మూడుపువ్వులూ, ఆరుకాయలూ అయింది. ఢిల్లీలో మంత్రితో మాట్లాడవలసిన సమస్యనొకదాన్ని సిద్ధం చేశారు. వెంటనే విమానంలో ఢిల్లీ ఎగిరిపోయారు. వాళ్ళ పెద్దబ్బాయి సీటుకి హైదరాబాద్ వెళ్ళవలసి వస్తే కార్మిక మంత్రితో మాట్లాడవలసిన ఒక టుమ్రీ సమస్యని సిద్ధం చేసి దాని పరిష్కారార్థం ఆయన హైదరాబాద్ వెళ్ళారు. కార్మికులకు వచ్చేవన్నీ సత్వర సమస్యలే కనక, ఆయన రైళ్ళలో ప్రయాణం మానుకున్నారు. ఆయన తన ఆరోగ్యం మంచిదికాదని, కార్మిక సంఘాన్ని ఒప్పించి ఒక అందమైన బంగళాలో ఉంటున్నారు.

కానీ, ఉన్నట్టుండి ఒకసారి బెంగుళూరు కార్మిక మహాసభకి వెళ్ళి పధ్నాలుగువందల ఖర్చు చూపించి, పెళ్ళానికి రవ్వల దుద్దులు చేయించాడని పొక్కింది. కొందరు కార్మికులు ఏకమై రాత్రికి రాత్రి ఆయన్ని చితక్కొట్టారు. ఒక కాలికి సింపుల్ ఫ్రాక్చర్, నడుం ఎముక పట్టు తప్పడం ఇలాంటివి జరిగాయి. ఇది మర్నాడు మిగతా కార్మికులందరికీ తెలిసి, ఈ చర్యకు కారణమైన వాళ్ళని క్షమించమని ప్రాధేయపడ్డారు. నాయకత్వం వహించే వాళ్ళకి ఈ కష్టాలు తప్పవు. నిజాన్ని గ్రహించలేని అజ్ఞానంలో ఏదో చేశారు. వారి తృప్తి కోసమైనా నేను పధ్నాలుగువందలూ చేతినుంచి పెట్టుకుంటాను అన్నారు. కార్మికులంతా ఒక్కుమ్మడిగా ఆయన ఆయన కాళ్ళమీద పడి, వారలా ఖర్చు చేయడానికి వీల్లేదని ప్రాధేయపడ్డారు. పైగా ఆయనకైన వైద్యం ఖర్చులన్నీ సంఘమే భరిస్తుందన్నారు. అంతా సద్దుమణిగాక తనను కొట్టిన వాళ్ళందరి ఉద్యోగాలూ కంపెనీ యజమానులు తీసేసే కట్టుదిట్టాలను చేయించారు రమాపతిరావుగారు.

తండ్రి కిటుకులన్నీ ఆ అంశను పుట్టిన గోపాలానికి తెలుసు. ఒక పదేళ్ళపాటు నాన్న చేసే పనులన్నీ క్షుణ్ణంగా వంటపట్టించుకున్నాడు గోపాలం. ఏ క్షణాన ఎటువంటి మాటలు చెప్పాలో, ఏ పనికి ఏ అబద్ధం సరిగా అతుకుతుందో అన్నీ గ్రహించాడు. గ్రహించి వాటిని తండ్రి మీదే ప్రయోగించడం ప్రారంభించాడు. కార్మికుల పేరిట భారీ యెత్తున తండ్రి చేసే 'బ్లాక్‌మెయిల్‌ని కొడుకు ఇంట్లోనే సంసారపక్షంగా తన ప్రయోజనాలకు చేసేవాడు. ఈ కిటుకు బయటివాళ్ళకి తెలిసిపోతే తన పని ఏమవుతుందో ఆలోచించమని రమాపతిరావుగారితో అన్నప్పుడల్లా తన కొడుకులో కూడా తన విజ్ఞానం మొలకెత్తినందుకు ఆయన సంతోషించి నవ్వుకునేవారు. కొడుకు ఆగడం ఎక్కువై, చికాకు కలిగి బియ్యే చదువుకి హైదరాబాద్ పంపించడం మంచిదని ఆయన నిర్ణయానికి వచ్చారు. వచ్చి, జూలైలో కాలేజీలు తెరవగానే పట్నం చదువుకి అన్ని ఏర్పాట్లు చేశారు. కొత్తగా హైదరాబాద్‌లో బిస్కెట్ల కంపెనీ బ్రాంచి ప్రారంభించనున్న మంగపతిరావుగారిని ఈ విషయమై సంప్రదించారు.

"ఎందుకండీ మా అబ్బాయి నాగరాజు అక్కడికి వెళ్తున్నాడు. అతనితో పంపించండి. ఇద్దరూ ఒక్కచోటే ఉండవచ్చు" అన్నాడు రమాపతి. ఆయన చేత అలా అనిపించాలనే రమాపతిరావుగారు విషయం కదిపారు. అప్పుడిక ఓ శుభముహూర్తాన పెట్టె, బెడ్డింగుతో గోపాలాన్ని బిస్కెట్ల కంపెనీ కారెక్కించి హాయిగా నిట్టూర్చారు ఇన్నాళ్ళకి ఇంట గెలిచినందుకు.

గోపాలం కంటే నాగరాజు రెండేళ్ళు పెద్ద. అతను మంగపతిరావుగారి వరపుత్రుడు. ముప్పై అయిదేళ్ళ క్రితం మంగపతిరావుగారిని తెలిసిన వాళ్ళు ఆయన్నివాళ చూస్తే అతనేనా యీయన' అని ముక్కు మీద వేలేసుకుంటారు. అప్పుడు హనావా సిగార్స్ పీలుస్తూ సన్నటి మీసాలను దువ్వుతూ, బ్రేస్‌లెట్స్ సూట్ వేసుకుని ఠీవిగా ఉండేవారు. ఇవాళ మంగపతిరావుగారు దైవభక్తులు, పంచె, సిల్కు లాల్చీ, పైన ఉత్తరీయం, ముక్కుపొడుం డబ్బాతో ఇప్పుడూ ఠీవిగా కనిపిస్తారు. పెళ్ళికాకముందు శ్రీకాకుళం దగ్గర అడవులకి వేటకి వెళ్తూండేవారు. అడవికి వెళ్ళినప్పుడు జంతువుల్నీ, పట్నంలో ఉన్నప్పుడు అమ్మాయిల్నీ వేటాడడం ఆయనకి సరదాలు. ఆయన నడుస్తూంటే అల్లంత దూరం నుంచే ఆలంపూర్ లవండర్ వాసన వేసేది. అందరి జీవితాలకీ ఆశయాలు ఉండవలసిన అవసరంలేదనీ, కనీసం ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలనీ, ఆశయాలు ఆస్తిపరుల హక్కులనీ ఆయన తన దగ్గరకు వచ్చిన అమ్మాయిలతో అంటూండేవారు. ఆ నిరంకుశత్వం ఆయనకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తి. సుఖాన్ని, అమ్మాయిల్ని, తాగుడునీ

డబ్బుతో కొనుక్కోవచ్చుననుకుంటూ అలా ఒక అయిదారేళ్ళు బ్రతికాక, కొనుక్కోకపోయినా సంక్రమించేది మరొకటి ఉందని ఆయనకి అర్థమైంది. దానిపేరు దుఃఖమని గుర్తుపట్టారాయన.

ఓసారి వేటకి వెళ్ళినప్పుడు వద్దంటున్నా వినకుండా, తుపాకీ పట్టుకుని బయటికి వచ్చారట. ఒక ఎలుగును కొట్టబోతే అది తూటా తప్పించుకుని మీదపడి రక్కింది. జబ్బ జబ్బంతా ప్రిదిలిపోయింది. అప్పటినుంచి రెండు నెలలు మంచం మీద ఉన్నారు. ఈ ఆనంద్మలో మృత్యువు కూడా ఉన్నదని అప్పుడు తెలిసింది.

సంవత్సరం క్రితం తనతో గడిపిన అమ్మాయి హఠాత్తుగా ఓసారి ఎక్కణ్ణుంచో ఒక పసిపాపతో ఊడిపడి, 'అతనే తండ్రీ' అంటూ యాగీ చేసింది. నలుగురిలో నానాగొడవ చేసి బంగలా ముందు ఏడుపులూ, పెడబొబ్బలూ సాగించింది. డబ్బూ, అధికారం చూపించి దాన్ని విడిపించుకునేసరికి మంగపతి తండ్రిగారి తలప్రాణం తోకకు వచ్చింది. డబ్బుతో పోగయే ఆనందంలో ఇంత జుగుప్స ఉన్నదని అప్పుడు అర్థమయింది. మరోసారి తప్పతాగి వచ్చి అర్థరాత్రి కారు తీసుకుని అమ్మాయిల వేటకి బయలుదేరారు మంగపతిగారు. డ్రైవరు వస్తానంటే తిట్టి అవతలకి పొమ్మన్నారు. ఆ రోజు హోరున వర్షం. వర్షంలో తడిసి ముద్దవుతూ, దారీ తెన్నూ తెలీక, ఎక్కడో కారాపి, ఏదో ఇంటి తలుపు కొట్టారు. ఎంతకీ తలుపు తెరుచుకోకపోతే బాదారు. కేకలు వేశారు. బండబూతులు తిట్టారు. అప్పుడా అమ్మాయి బయటికి రాలేదు కానీ, పదిమంది బయటికి వచ్చి చావబాదారు. మంగపతి ఎక్కడున్నాడోనని పనివాళ్ళు వెదుక్కుంటూ వచ్చి ఊరికి అయిదుమైళ్ళ అవతల లంబాడీల గుడిసెల దగ్గర తల పగిలి కారులో పడివున్న అతన్ని చూశారు. అప్పుడప్పుడే తనికి తెలివి వస్తోంది. పనివాళ్ళని చూసి, రాత్రి కారు ప్రమాదం జరిగిందనీ, ఆ విషయం ఎవరికీ చెప్పవద్దనీ చెప్పి ఇంటికి తిరిగి వచ్చారు. త్రాగుడు వల్ల తన్మయత్వమేకాక తన్నులు కూడా లభిస్తాయని అప్పుడు అర్థం చేసుకున్నారు.

ఇదంతా చూశాక ఇక కొడుకుని అలా వదిలేయడం మంచిదికాదని మంగపతిగారి తండ్రి నిశ్చయించుకున్నారు. వెంటనే, ఒక అమ్మాయిని ముడిపెట్టేశారు. ఇటువంటి సకలగుణాభిరాముడికి కట్టబెట్టడం వల్ల చిలకలాంటి ఆ పిల్ల జీవితం నట్టేటా ముంచినట్టేనని కొందరు అనుకున్నారు. కానీ అలా జరగలేదు. మంగపతిరావుగారికి పెళ్ళి చాలా గొప్ప సత్యాన్ని తెలిపింది. అడవిలో తెలియని జంతువును వేటాడడంలో ఉన్న ఆనందంలాంటిది ఇంటిలోనే అనుభవించారాయన. డబ్బుమీది ఆశతో, భయం భయంగా పరుపుమీద ఒరిగే అమ్మాయిలు ఇచ్చే ఆనందంకన్నా ప్రేమతో ఆహ్వానించే భార్య ఒడిలో ఆనందమూ, అనురాగమూ లభిస్తాయని అర్థమైంది. దీనివల్ల కోర్టు ఇబ్బందుల్లేవు.

త్రాగుడు వల్ల లభించే మత్తుకన్నా భార్య కళ్ళల్లో, కౌగిట్లో లభించే మత్తు విలువైందనీ, సుఖాన్నిచ్చేదనీ తెలిసింది. చాలా గజిబిజిగా ఇరుకుగా వేగంగా సాగిపోయే మంగపతిగారి జీవితం విశ్రాంతిగా, అందంగా, ప్రశాంతంగా గడవడం ప్రారంభించింది. ఆ మార్పు మనస్సును ఆకట్టింది. ఇలా ఆరేళ్ళు నిర్విఘ్నంగా సాగిపోయాయి. ఈలోగా తండ్రిపోవడం, ఆస్తి చేతికి రావడం జరిగాయి. ఆస్తితో బాధ్యతలు వచ్చాయి. కాలం గడుస్తున్న కొద్దీ మరొక విచారం ఏర్పడింది. పిల్లలు లేరన్న అసంతృప్తి, అందుకై ఆయన పూజలూ, పునస్కారాలూ, జపాలు, హోమాలు అన్నీ ఆనవాయితీగా చేసుకుపోయారు. ఇదిగో ఈ సందర్భంలోనే ఒకరోజు ఒక స్వాముల వారు వచ్చి బిడ్డలు కలగడానికి ఒక చక్రం ఏదో రాసి ఇచ్చి, ప్రతీవారం పూజలు జరపాలన్నారు. అయిదారుమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలన్నాడు. మంగపతిరావు

దంపతులు అన్నీ భక్తిశ్రద్ధలతో విన్నారు. పూజలు జరుగుతున్నాయి. సాధువు వెళ్ళిపోయాడు. కానీ ఆయన ధర్మమా అంటూ పదిమంది ప్రతీవారం భోజనం చేసి వెళ్తున్నారు.

కోరిక విశృంఖలత్వానికి ఒకప్పుడు అలవాటుపడిన మంగపతిరావుగారు ఒక కోరికకు బందీ అయిపోయారు. కొన్ని నియమాల చట్రంలో బిగుసుకుపోయారు. ఏమైతేనేం? మూడు నెలలు తిరగకుండానే భార్య లక్ష్మికి నెలతప్పింది. ఇక మంగపతిరావుగారి ఆనందానికి అవధిలేదు. అక్కడినుండీ పూజలు ఒకటికి రెండింతలు చేశారు. దైవభక్తి పెరిగిపోయింది. దేవాలయాలకి, ఆశ్రమాలకి విరాళాలు పంపించారు. మరో సంవత్సరానికి ఆ సాధువు ఆ ప్రాంతాలకి వచ్చేసరికి పండంటి అబ్బాయి ఆశీర్వదించమని తీసుకెళ్ళారు మంగపతిరావుగారు. ఆ సాధువు నాగేంద్రస్వాములవారు. అందువల్ల అబ్బాయ్‌కి నాగరాజు అని నామకరణం చేశారు. తనలో ఏమీలేదని, ఒకరిపై ఆయనకి కుదిరిన ఏకాగ్రతే ఆ వరాన్ని ప్రసాదించిందనీ ఆ ఏకాగ్రతకి మరోపేరు భగవంతుడనీ నాగేంద్రస్వాములు చిరునవ్వుతో ఉపదేశం చేసి వెళ్ళిపోయారు.

లేకలేకపుట్టిన పిల్లలు, పండితపుత్రులు, డబ్బున్నవారి అబ్బాయిలూ ఒక్కలాగా తయారవుతారన్న అపవాదుని నాగరాజు పోగొట్టాడు. అందుక్కారణం మంగపతిగారే. ఓడిపోయిన తండ్రి ఉండడం కొడుక్కి ఒక విధంగా లాభమై ఆయన నిరూపించాడు.

తను చిన్నతనంలో చేసిన చెడుగులన్నీ గుర్తుంచుకుని వాటికి కారణమైన వాటినన్నింటిని కొడుక్కి దూరంగా ఉంచాడు. తెలుగు బడులకు పంపిస్తే చదువు వంటబట్టకపోగా బడిపంతుళ్ళ బద్ధకమంతా అంటుతుందని చిన్నప్పట్నుంచీ థియేసాఫికల్ స్కూల్‌లో కొడుకుని చేర్పించారు మంగపతిరావుగారు. ఇంటిదగ్గర ఇద్దరు లేడీ టీచర్ల ప్రైవేటు ఏర్పాటు సత్ప్రవర్తనా, నీతి, నిజాయితీ, సంప్రదాయాన్ని గౌరవించడం, వీటి మీద క్షుణ్ణమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. అబ్బాయిని వ్యాపారపద్దతులు నేర్చుకోవడానికి స్విట్జర్లాండు పంపించినప్పుడు తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి బయలుదేరిన కొడుకు, ఎనిమిది నెలలకు తిరిగిరాగానే తండ్రిని అమాంతం కౌగలించుకుని, తల్లి నుదిటిమీద ముద్దు పెట్టుకోబోతే నిర్ఘాంతపోయారు.

నాగరాజు ఇలా ప్రవర్తించడానికి కారణం ఉంది. తన దేశంలో మంచి అలవాట్లు అనుకున్నవన్నీ స్విట్జర్లాండులో నవ్వు పుట్టించేవిగా, అనాగరికంగా కనిపించాయి. ఓసారి తనతోపాటు కాలేజీలో చదువుకున్న నేస్తురాలితో షికారుకి బయలుదేరాడు. ఆ అమ్మాయి పేరు కెరోలినా. విపరీతంగా చలిగా ఉంది. కోటు మెడ దగ్గరకి లాక్కున్నా చలి ఆగడం లేదు. కెరోలినా కూడా అలాగే బాధపడుతున్నట్టు గ్రహించాడు. ఆ బాధను అతనికి స్పష్టంగా వ్యక్తతం చేయడానికి అన్నివిధాలా ప్రయత్నిస్తోంది. "నాకూ చలివేస్తోంది చూశావా? నాకు సహాయం చెయ్యవా?" అన్న భాష ఆమె కళ్ళలో తెలుస్తోంది. తెల్లని సాయంకాలపు ఆకాశం బూడిదరంగు రూపం దాల్చింది. చలిగాలులు ఎదురు తిరిగాయి. మాటలకి దూరమయే పెదవులు గాలికి భయపడి దగ్గరవుతున్నాయి. ఆ అమ్మాయి ఉన్నట్టుండి నాగరాజు భుజం చుట్టూ చెయ్యి వేస్తే, భయపడి దూరంగా జరిగాడు. ఆమె అతన్ని ఆశ్చర్యంగా చూసింది. కొంతదూరం నడిచాక సన్నగా తుంపర్లు ప్రారంభమయ్యాయి. ఈ వాతావరణం నాగరాజుకి కొత్త. కెరోలినాకు ఈ వాతావరణం కొత్తకాదుకానీ, ఈ వాతావరణంలో ఇలాంటి వ్యక్తితో రావడం కొత్తగా ఉంది. ఒక్కసారి చల్లటి జల్లు భుజాన్ని కొట్టుకోగానే భయంతో కెవ్వున అరిచి నాగరాజు

చేతిని నడుం చుట్టూ తిప్పుకుంది. నాగరాజుకి యేం చెయ్యాలో తోచలేదు. "క్షమించండి" అంటూ గొణిగి మెల్లగా ఆ చల్లటి చేతిని వదిలించుకున్నాడు. నిర్ఘాంతపోయి అతని ముఖంలోకి చూసింది.

అప్పట్నుంచి ఇద్దరి మధ్యా సంభాషణ చల్లబడింది. ఇద్దరూ బస్సుకోసం స్టాపు దగ్గర కూర్చున్నారు. ఆ అమ్మాయి తన మీద కన్నువేసిందని తాను చాలా ధనవంతుడనీ విదేశాల్లో ఉన్నాడన్న ఆలోచన ఆమెను ప్రేరేపిస్తున్నదనీ అతను తలపోశాడు. ఆ చలిలో వెచ్చని కోరికలేమీ కదలడంలేదు. రెండు స్వెట్టర్లు, ఉలెన్ కోటు కింద మనస్సు ఏ మూలో నిద్రపోయింది. ముద్దుపెట్టుకుందామన్న పెదవులు చలికి కొయ్యముక్కల్లా ఉన్నాయి. జేగురు రంగు ఉలెన్ మఫ్లర్ మధ్య కెరొలినా ముఖం ఆపిల్ పండులాగా ఉంది. క్షణాలు గడుస్తున్నకొద్దీ చలి మరీ తెలుస్తోంది. దగ్గరగా జరిగి ముడుచుకు కూర్చోవాలని ప్రయత్నిస్తోంది కెరోలినా. నాగరాజు శరీరం వేడెక్కుతోంది. కానీ ఇరవై యేళ్ళు నేర్చుకున్న సంప్రదాయం మీద గౌరవం అతన్ని చలిలాగా మెదడుని నొక్కిపెడుతోంది. దూరంగా జరిగిపోయాడు.

"ఐయామ్ సారీ, నాకలాంటి ఆలోచనలేదు" అన్నాడు.

ఆమె బాణం దెబ్బతిన్న లేడిలాగా చూసింది. సురక్షితంగా ఉన్న పూతోటలో తుపాకీ పేల్చిన హంతకుణ్ణి చూసినట్టు అతన్ని అసహ్యించుకుంది.

"మా దేశంలో భార్యని తప్ప ఇంకో అమ్మాయిని ముట్టుకోం. అది మా సాంప్రదాయం" అని నెమ్మదిగా చెప్పినా, ఆ మాటల వెనుక చెప్పరాని గర్వం తొణికిసలాడింది.

ఆ మాటలకి బుసకొట్టిన త్రాచులాగా లేచింది కెరోలినా. "చలిలో వణికిపోతున్న చెల్లెలికి వెచ్చదనం కలిగించవా? భర్తలేని వాళ్ళంతా మీ దేశంలో మగాడి సహాయం పొందడానికి అనర్హులా? చలిలో వణికే అమ్మాయికి నడుంచుట్టూ చెయ్యివేసి రక్షణ కలిగించినంత మాత్రాన ఆమెని ప్రేమించినట్టవుతుందా? ఈ దేశంలో ఎవరయినా సరే అంతా కూడగట్టుకుని నడుస్తారు. నువ్వు నన్ను అవమానించావు" అంటూ యేవేవో అనడం మొదలుపెట్టింది.

నాగరాజుకి తలతిరిగిపోయింది. చేసే ఉపకారానికి, కలిగే ఉద్రేకాలకి సంబంధం ఉండవలసిన అవసరంలేదని అప్పుడనిపించింది. అదేగాక ఈ నీతి నియమాలుకూడా ఆ దేశంలో పరిస్థితుల్ని, వాతావరణాన్ని అనుసరించి మారుతుంటాయేమో? భుజం చుట్టూ చెయ్యి వేసిన అమ్మాయి భార్యే ఎందుకు కావాలి?

ఆ రోజునుంచి చాలామంది అమ్మాయిలతో చాలా వెచ్చటి సాయంకాలాలు గడిపాడు నాగరాజు. మళ్ళీ ఇలాంటి పొరపాటు చెయ్యలేదు. "రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌గానే బ్రతుకు" అన్నమాటని అక్షరాలా అమలు జరిపాడు.

అందువల్ల మళ్ళీ భారతదేశానికి తిరిగివచ్చే సమయానికి సంప్రదాయాన్ని గౌరవించడమే కాకుండా అవసరాన్ని బట్టి పరిస్థితుల్ని బట్టి ఒక మధ్యేమార్గం ఎంచుకోవాలని కూడా నేర్చుకున్నాడు నాగరాజు. శ్రమించి జీవితం సాగించాలనే దీక్షనూ, మన దేశంలో నిరాడంబరతనూ, సహజ సౌందర్యాన్ని, తృప్తిని జోడించి ఒక సమన్వయాన్ని తనకు తానే ఏర్పరచుకున్నాడు. మొత్తం మీద మంగపతిగారు తన కొడుకు గురించి ఆశించినవన్నీ కార్యరూపం దాల్చాయి.

కానీ ఈ చదువులో, ఈ పెరుగుదలలో ఒక్క అన్యాయం జరిగిపోయింది. నాగరాజుకి చాలా సంవత్సరాల వరకూ తెలుగు భాష దూరమైపోయింది. ఇరవైనాలుగో ఏట మొట్టమొదటిసారిగా చిన్న చిన్న తెలుగు పుస్తకాలు చదవడం అలవాటు

చేసుకున్నాడు. చదువు సాగినకొద్దీ సమకాలీన సాంఘిక వ్యవస్థలో మానవుడు పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చెందుతూనే తన అభివృద్ధికి కృషి చేయడం అతనికి అపూర్వంగా కనిపించింది.

పోరాటానికి తలవొగ్గుతూనే పోరాటాన్ని ఎదుర్కొనడానికి కావలసిన బలాన్ని కూడా అప్పటికప్పుడు కూడదీసుకునే శక్తి, కూడదీసుకోవాలన్న ప్రయత్నం మన సాహిత్యంలో అతనికి ద్యోతకమైంది. ఆవిధంగా అతనికి తెలుగు పుస్తకాల మీద అభిలాసక్తి పెరిగింది.

అవేకాక, సీత దగ్గర్నుంచి తీసుకునే పుస్తకాలలో మరొక వింత కనిపించింది నాగరాజుకి. సీత కొనుక్కున్న పుస్తకాలన్నీ ఏరికోరి ఎన్నిక చేసినవి. ఆ నవలల్లో కనిపించే స్త్రీలు దాదాపు అందరూ సీతలాగా కనిపించడం నాగరాజుకి ఆశ్చర్యం కలిగించింది. అందం, అమాయకత్వం, నిండుదనం, పెద్దబొట్టు, సిగ్గు యివన్నీ సీతలో కూడా ప్రతిఫలించాయి. నవలని చదువుతూ, ఎప్పుడైనా కిటికీ దగ్గర్నుంచి బయటికి చూసినప్పుడు సీత కనిపిస్తే ఆ కథానాయికే అలా కదిలి నడిచినట్టుండేది. ఆ నవల ప్రభావం వల్ల ఆమె మారిందో, ఆమె అటువంటి స్వభావం కలది కనక ఆ నవలల్ని చదువుతున్నదో అర్థంకాలేదు నాగరాజుకి. ఏమైనా నవలల వల్ల సీత, సీతవల్ల నవలలూ అతనిలో చెప్పలేని ఆసక్తిని కలిగించాయి. అయితే దానికి 'ప్రేమ' అనే ముద్ర మాత్రం వేసుకోలేదు నాగరాజు.

**కొన్ని రోజుల** తర్వాత ఓ రోజు సీత రోజూలాగే జయభారత్ కమర్షియల్ ఇనిస్టిట్యూట్‌కి టైపు నేర్చుకోవడానికి రాగా, తను నేర్చుకునే టైపు మిషను ముందు మరో అబ్బాయి కూర్చుని ఉన్నాడు. ఆశ్చర్యంతో అతన్ని చూసింది సీత. మొదట అతన్ని పోల్చుకోవడం కష్టమైంది. కాని చూడగా చూడగా అతన్ని గుర్తుపట్టింది. ఎదురింటిలో ఉన్న నాగరాజు అని పొరపాటుపడిన గోపాలం అనీ, ఉంగరాల జుత్తు, తెల్లని ముఖం బాగా గుర్తే. ఇంట్లో ఉన్నప్పుడు ఎప్పుడూ పెట్టుకోడు కాబోలు కాని గోల్డు ఫ్రేము కళ్ళద్దాలున్నాయి. వాటి వెనుక నల్లటి కనుబొమ్మలు, కింది పెదవికి కుడిపక్క నల్లటి పుట్టుమచ్చ, గుండ్రటి ముఖం, సూటిగా చూస్తున్నా చిలిపిగా మాట్లాడేటట్టున్న కళ్ళు, చిరునవ్వుకు సిద్ధపడిన పెదాలూ.

ఆ ముఖం ఎప్పుడో, ఎక్కడో చూసినట్టు తోచింది సీతకి. ఆలోచించగా ఆలోచించగా అర్థమైంది సీతకి. ప్రతి పున్నమినాడు ఆకాశంలో నక్షత్రాల మధ్య చూస్తున్నదని.

ఈ తడబాటులో అనుకోని ఆశ్చర్యంలో పడిపోయి ఆ క్షణంలో ఏ భావం ప్రకటించాలో మరచిపోయింది సీత.

ఇతనే తన పుస్తకాల్ని తలకింద పెట్టుకుని నిద్రపోయాడనీ, ఇతని పేరు నాగరాజు కాదనీ, ఇతని పట్ల తనిప్పుడు కోపాన్ని ప్రదర్శించాలనీ గుర్తురాలేదు. మరచిపోయి 'మీరా?' అంది.

భారతదేశంలో రెండేళ్ళపాటు స్పర్ధలతో శత్రువులైన ఇద్దరు మానవులు అరబ్ రిపబ్లిక్‌లోని ఒక మారుమూల ప్రాంతంలో ఆరు సంవత్సరాల తర్వాత తటస్థపడినప్పుడు ఆశ్చర్యంతో అన్నీ మరచిపోయి ఎలా పలకరించుకొంటారు? అలాంటి ఆశ్చర్యం తప్ప మరేమీలేదు ఆ మాటలో.

ఇట్లాంటి మాటనీ, అలా ఒక అమ్మాయి తనవేపే సూటిగా చూస్తుండడాన్ని మగవాళ్ళు మరోవిధంగా అర్థం చేసుకుంటారని సీత ఊహించలేకపోయింది. మరోవిధంగానే అర్థం చేసుకున్నాడు. నిండుగా ఆమె కళ్ళలోకి చూస్తూ 'అవును నేనే సీతా' అన్నాడు. ఆ అమ్మాయిని చిన్నప్పట్నుంచీ తెలిసినట్టు.

ఆ పిలుపుకి తుళ్ళిపడింది. అది కొత్తగా ఉన్నందుకు, చాలా అందంగా ఆప్యాయంగా ఉన్నందుకు. కానీ అలాంటి పిలుపుని అంగీకరించడంతో తనేదో నష్టపోతున్నదని భావించలేదు సీత. తను చదివిన నవలల్లో వాక్యాలే ఉన్నాయి కాని, వాక్యాల వెనుక అర్థాల్ని ఎవరూ వివరించలేదు. రచయితలు అర్థాల్ని ధ్వనించేటట్టు చేశారు. ఫలితాన్ని మాత్రమే చూపించారు.

"ఇది నా సీటు. నేను టైపు నేర్చుకునే అవర్."

"అయితే మరీ అదృష్టం, మీ దగ్గరే మొదటి పాఠం నేర్చుకుంటాను" ఆ పాఠానికి మరేదో అర్థం ఉన్నదని కళ్ళతో సూచించాడు గోపాలం.

కుటుంబయ్యగారు ఈ ఆనవాయితీని ఇదివరకే ఏర్పరిచిన విషయం సీతకు గుర్తుంది. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఆయన ఉల్ఫా అసిస్టెంటుల సంఖ్యనీ పెంచాడు. ఆ మాత్రం ఈ మాత్రం టైపు వచ్చిన వాళ్ళని ఏ మాత్రం రానివాళ్ళకి నేర్పే పద్ధతిని ఏర్పాటు చేశాడు. మరొకరికి చెప్పడం వల్ల తమకు వచ్చింది గట్టిపడుతుందని వాళ్ళకి పదే పదే చెప్పేవాడు. ఈ విధంగా ఆయనకు కాఫీ తాగడానికీ, చుట్టలు కాల్చుకుందుకూ బయటికి వెళ్ళే అవకాశం లభించింది. అందువల్ల గోపాలం మాటలకి ఆశ్చర్యం కలగలేదు సీతకి. కుటుంబయ్యే అతన్ని ఈ సీటుకు పంపి ఉంటాడనీ, చాలామందికి నేర్పినట్టే తను నేర్పడం ఆయన ఉద్దేశమనీ గ్రహించింది.

తనాపని చెయ్యనని చెప్పడానికి కుటుంబయ్య అక్కడలేడు, కాఫీకి వెళ్ళాడు. అయినా సూటిగా సమాధానం చెప్పింది సీత.

"నేను నీకు నేర్పను."

"ఏమండీ మీ యింటికి ఎదురుగా ఉండడం నేను చేసిన నేరమా?"

సీత మాట్లాడలేదు.

"మీ పుస్తకాల్ని తలక్రింద పెట్టుకు నిద్రపోయాననా?"

సీతకి నవ్వొచ్చింది. నవ్వొస్తోందని, వస్తుందని ముందే గ్రహించిన గోపాలం ముందుగానే నవ్వుతూ "పుస్తకాల్ని పాడుచేశాను గాని, స్నేహాన్ని పాడుచేసుకోనులెండి" అన్నాడు.

ఇంకా నిలబడి ఆలోచిస్తోంది సీత. ఇంతలో వెనుక నుంచి కుటుంబయ్య గొంతు వినిపించింది. "ఆ అబ్బాయికి మొదటిపాఠం చెప్పమ్మా సీతా. చాలాసేపయింది వచ్చి" అని అరిచాడు.

"చెప్పడం ప్రారంభించారు. నాకే అర్థం కావడంలేదు" అన్నాడు గోపాలం.

"రండి మనం ఇలా నిలబడే ఉండిపోతే చూస్తున్నవాళ్ళంతా అపార్థం చేసుకోవచ్చు" అన్నాడు గొంతు తగ్గించి.

ఆ మాట సీత మీద బాగా పనిచేసింది. చుట్టుపక్కల టైపు నేర్చుకుంటున్న ఇద్దరు ముగ్గురు విద్యార్థులు ఈ భాష వాళ్ళకి అర్థమయినట్టుగా చూస్తున్నారు. వెంటనే కొంగు భుజం చుట్టూ తిప్పుకుని వచ్చి సీటు మీద కూర్చుంది. గోపాలం వెనక్కి వచ్చి నిలబడ్డాడు.

టైపు మిషను మీదికి వేళ్ళు పోనిచ్చే సమయానికి అతని ఊపిరి తన జుత్తును కదిలిస్తున్నదని గుర్తుపట్టింది సీత. ఆ దగ్గరతనం ఊపిరిని బట్టి ఊహించింది. తల తిప్పితే ముఖం మరీ దగ్గరవుతుందేమోనని భయపడి ఆ పని చెయ్యడం మానుకుంది. కానీ వీలయినంత జరిగి కూచుంది. "జాగ్రత్తగా చూడండి" అంది.

"ఎంత సన్నటివేళ్ళండీ మీవి?"

"అంటే?" అనుకోకుండా తలతిప్పింది. ఇప్పుడు ముఖం మరీ దగ్గరయింది. అతని ఊపిరి పెదాలకి తెలిసింది. అదృష్టవశాత్తూ చుట్టూ ఉన్నవాళ్ళు వాళ్ళ పనిలో ఉన్నారు కనుక సరిపోయింది.

"అంటే టైపు చెయ్యడంలో మీ వేళ్ళకు వచ్చినంత వేగం నాకు సాధ్యమవుతుందా అని"

"సరే చూడండి" ఆమె టైపు చేస్తోంది.

గోరింటాకు పెట్టుకున్న ఆమె ఎర్రటి వేళ్ళు పులి అరుపు విన్న లేళ్ళలాగా గెంతుతున్నాయి.

"గోరింటాకు చేతికి పండితే, దాంపత్య జీవితమూ పండుతుంది.."

టైపు నిలిచిపోయింది.

"...అంటారు పెద్దలు" అని పూర్తిచేశాడు గోపాలం.

దూరంగా ఉన్న బల్ల దగ్గరకు లాగి "అక్కడ కూచోండి" అంది. ఈసారి కూర్చున్నాడు గోపాలం. కెమెరా ముందు గ్రూపు ఫోటోకి కూర్చున్నట్టు ఇద్దరూ మిషను ముందు కూర్చున్నారు. ఒక లైను టైపు చెయ్యడం అయింది.

"మీకు ఉద్యోగం చెయ్యడమంటే ఇష్టమాండీ?" అని గోపాలం అడిగాడు.

"టైపు నేర్చుకున్నవాళ్ళంతా ఉద్యోగం చెయ్యాలనా మీ ఉద్దేశ్యం?"

"లేకపోతే వంట చెయ్యడం ఎవరైనా వినోదానికి నేర్చుకుంటారాండీ?"

నవ్వొచ్చింది సీతకి, మాటలు సూటిగా విసరగలడనుకుంది.

"టైపు నేర్చుకోవడం వంట నేర్చుకోవడంలాంటిదా?"

"దాదాపు అలాంటిదే. అయితే ఇప్పుడు వంట చేయవలసిన చేతులు టైపు చేస్తున్నాయి. ముందు ముందు టైపు చేసే చేతులు వంట చేయవలసి వస్తుందేమో?" ఎటు వేపో చూస్తూ వేదాంతిలాగా అన్నాడు.

తనకు తెలియకుండానే కిలకిల నవ్వింది సీత. ఆ నవ్వు ఆకర్షణకి దిమ్మతిరిగి పోయాడు గోపాలం.

"మీరు ఉద్యోగం చెయ్యడానికే టైపు నేర్చుకుంటున్నారా?"

అందుకు సమాధానంగా గోపాలం యేదో రహస్యం చెప్తున్నవాడిలాగా ముందుకు వంగాడు. "నిజం చెప్పమంటారా?"

కళ్ళు పెద్దవి చేసింది. వాటిని చూసి తన్మయుడవుతూ..

"అబ్బ. కాటుక కంటి సొగసు ఇన్నాళ్ళకు అర్థమయింది" అన్నాడు చెప్పవలసిన నిజం మరచిపోయి,

"ఇదేనా మీరు చెప్పదలచుకున్నది?" అంది సిగ్గుపడుతూ.

"ఇది పిట్టకథ. అసలు కథ ఏమిటంటే నేను టైపు ఎందుకు నేర్చుకుంటానన్నది. నిజానికి ఉత్తరాలు సొంత చేత్తో వ్రాయకూడదని మా నాన్న సలహా ఇచ్చేవారు. ఆ సలహాని ప్రేమలేఖలు వ్రాయడంలో కూడా అమలు జరపలని నా ఉద్దేశం. అందుకనే టైపు నేర్చుకుంటున్నాను. నిజానికి నాగరాజు వ్రాసిన ఉత్తరాన్ని నేనయితే టైపు చేసి పంపేవాడిని."

"అమ్మాయిలకు ఉత్తరం వ్రాయడం మంచిదికాదని ఇప్పటికైనా గ్రహించడం మంచిది."

"అలా వ్రాస్తే మీకు కోపం వస్తుందాండీ"

"వస్తే తప్పా?"

"తప్పుకాదు. అన్నట్టు మీకెవరయినా చెప్పారో లేదో, కోపంలో మీరు చాలా అందంగా ఉంటారు. అది చూడడానికైనా నేను మీకో ఉత్తరం టైపు చెయ్యదలచుకున్నాను. అందుకే టైపు నేర్చుకుంటున్నాను."

సీత కోపంగా ఏదో అనబోతే "ఇష్" అని ఆపాడు.

"మీరు మిషను వైపు చూస్తూనే మాట్లాడుతూండండి. ఆ మూల కూర్చున్న అమ్మాయి మనల్నే చూస్తోంది" అన్నాడు గోపాలం.

నేరం చేసిన ఖైదీ పోలీసు మాట విన్నట్టు తలవొంచుకుని టైపు ప్రారంభించింది సీత. నిజానికి ఈ పనేం బాగుండలేదు తనకి. కానీ కుటుంబయ్య ఈ బెడద తన నెత్తిన వేశాడు. ఈసారికి ఎలాగో తప్పించుకోవాలని తొందరపడుతున్నది.

"మీరొక్కసారి ప్రయత్నించండి" అంది. ఒకటి రెండుసార్లు అక్షరాలు టైపు చేసి చూపాక.

ఇప్పుడతని పక్కన నిలబడడం ఆమె వంతయింది. అతని అందమైన ఉంగరాల జుత్తుని అంత దగ్గరగా చూడవలసి వస్తుందని సీత ఎన్నడూ ఊహించలేదు. నిగనిగలాడుతున్న నల్లటి ఎత్తుపల్లాల మధ్య వెలుగుపడి మెరుస్తోంది.

వేళ్ళు అక్షరాల మీదికి పోనిచ్చాడు. అనామికకు ఎర్రటి కెంపు తళుక్కుమంది. సన్నటి ఆర్టిస్టు వేళ్ళు. అదొక వినోదంలాగా అతి సులువుగా తను చెప్పింది చెప్పినట్టు టైపు చేసేస్తున్నాడు. అతని గ్రహింపుకు ఆశ్చర్యపోయింది. అక్షరాభ్యాసం జరగని కుర్రాడికి మొదట ఓనమాలు నేర్పడం కష్టం ఒక్కసారి అక్షరాలు కొరుకుడుబడితే బాలశిక్ష చదివించడం చాలా సులువు. కానీ ప్రారంభంలోనే సుమతీ శతకం చదివే స్టూడెంట్‌లాగా కనిపించాడు గోపాలం.

"చాలా త్వరగా పికప్ చేశారే" అని ఆశ్చర్యాన్ని బట్టబయలు చేసింది.

"గురువుగారి ప్రతిభ. అది మీ విద్యాబోధనలోని ఆకర్షణో, లేక మీలోని ఆకర్షణో" సూటిగా ముఖంలోకి చూశాడు. కొరుక్కుతినేస్తున్నట్టు ముఖంలోకి చూడడం గోపాలానికి అలవాటు. ఆ అలవాటు ఆడవాళ్ళకి ఇబ్బంది కలిగించినా దానికి ఇష్టపడని అమ్మాయిలు దాదాపు ఎవరూ ఉండరు. ఆకర్షణ, ప్రశంస ఎవరికి నచ్చదు గనుక? అందుకని సీత కూడా దాన్ని రహస్యంగా ఆనందించింది.

"ఎలాగూ కలిసివచ్చింది కనక, మీరు ఒప్పుకుంటే మరొక విషయంలో మీ శిష్యరికం చెయ్యదలిచాను" అన్నాడు గోపాలం ఆమె ఆలోచనల్ని తెంచివేస్తూ.

"ఏమిటి?"

"నేను వ్రాయక వ్రాయక ఓ కథ వ్రాశాను. మీరు నవ్వకుండా చదువుతానంటే మీకిస్తాను. మీరు చాలా నవలలు చదివారని గిరిజ అంది. మా నాగరాజూ అదే అన్నాడు. అది చదివి కొంచెం సవరణలు చేసి పెట్టాలి."

"అబ్బే నాకంత తెలియదండీ?"

"సిగ్గుపడడంలోనూ అందంగానే ఉంటారు మీరు" మరో ప్రశంస విసిరాడు గోపాలం.

"చూడండి, వంట చేసేవాళ్ళు భోజనం చెయ్యడం రాదంటే నమ్మగలమా?"

"కానీ భోజనం చేసేవాళ్ళంతా వంట చెయ్యరుగా?"

ఆ ప్రశ్నకు దిమ్మరపోయాడు గోపాలం. సీత ప్రతీ విషయం గ్రహించడమే కాకుండా, లోతుగా ఆలోచించగలదని అర్థమయింది. తన ప్రశంసలకీ, తన మెప్పులకీ మోసపోయే మనిషి కాదని అర్థం చేసుకుని సర్దుకున్నాడు.

"చూశారా మీరింత ఆలోచిస్తున్నారంటే రచన అలవాటయే ఉండాలి. పోనీ, చదివి ఎలా ఉందో చెప్పండి" అన్నాడు.

గోపాలం ఇంకా చాలా విషయాలు మాట్లాడేవాడే గానీ ఈలోగా నాగరాజు హఠాత్తుగా అక్కడికి వచ్చాడు. అతన్ని చూడగానే మొదట గోపాలం ఆశ్చర్యపోయాడు.

సీతను చూడగానే ఒక్క క్షణం ఆశ్చర్యపోయి "మీరా" అన్నాడు నాగరాజు, గోపాలం వేపు తిరిగి "ఏం బ్రదర్ దృష్టి టైపు మీదకి పోయింది? ఇప్పుడు వచ్చింది చాలకనా?" అన్నాడు.

"ఏంటి? ఈయనకి ఇదివరకే వచ్చా?" అని ఆశ్చర్యపోయింది సీత.

"అదేమిటండీ? వాడు నిక్షేపంలా హయ్యరు పాసయ్యాడు. వాడికి వచ్చిన విద్యలు నిద్రపోవడం, టైపు చెయ్యడం."

నిర్ఘాంతపోతున్న సీత ముఖం చూసి నవ్వేశాడు గోపాలం.

"మరి నువ్వెందుకు తగలడ్డావు" అన్నాడు గోపాలం కోపం పట్టలేక.

"కంపెనీ ఉత్తరాలు కొన్ని టైపు చెయవలసి ఉంది. ఆఫీసులో మిషన్ పాడయింది. వారిలోనే కదా, ఇక్కడ అవి పడేసి రేపు తీసుకుపోవచ్చుననుకున్నాను. తీరా వస్తే మీరు కనిపించారు. అవేమంతా ముఖ్యమైనవికావులే. టైపు నేర్చుకోవడం అయిందా?"

"ఆవిడ నా గురువు - ఇందాక శిక్షణ ఇచ్చారు" అంటూ సీత వేపు తిరిగి అయిందంటే లేస్తాను" అన్నాడు. సీతకి కోపం, తను మోసపోయిందని ఉదాసీనతా ఎక్కువవుతోంది. "పరిహాసాలు చాలించండి. మీకు అశ్రద్ధే చేతనవుననుకున్నాను. కానీ మోసం చెయ్యడం కూడా చేతనవునన్నమాట" గిరుక్కున ఇటు తిరిగింది.

అప్పటికి మిగతా వాళ్ళంతా వెళ్ళిపోయారు. నాగరాజు, గోపాలం బయటికి వచ్చేసరికి సీత రిక్షా కోసం ఎదురు చూస్తోంది. నాగరాజు పక్కకి వచ్చి నిలబడ్డాడు. "మేమూ ఇంటికే బయలుదేరాం. మీకభ్యంతరం లేకపోతే నా కారులో రండి" అన్నాడు.

ఇద్దరి కీచులాటలో మధ్యవర్తిగా వచ్చిన వ్యక్తి హఠాత్తుగా పెద్దమనిషి అయిపోతాడు. అప్పుడు గోపాలం ముందు నాగరాజు పెద్దమనిషిలాగా కనిపించాడు సీతకి. శరత్ నవలల్లో స్త్రీలను పరమ పూజనీయులుగా, భగవంతుని మహానైవేద్యంలాగా పవిత్రంగా చూసే రమేష్‌బాబూ, హరీష్ బాబూ కోవలో అతన్ని ఊహించి "సరే పదండి" అంది.

కారులో కూర్చోగానే ముందుసీట్లోంచి మాట వినిపించింది. "మా నాగరాజు మీ చేత కారుకి ప్రారంభోత్సవం చేయించాలనుకున్నాడు. ఇవాళే కారు వైజాగ్ నుంచి వచ్చింది" అన్నాడు గోపాలం.

సీత తుళ్ళిపడింది.

"మీరు నా మీద చేసిన ఆరోపణకి సమాధానం చెప్పుకునే అవకాశం ఇవ్వలేదు నాకు. నిజానికి నేనిక్కడికి వచ్చింది టైపు నేర్చుకోవడం కోసం కాదు. మీ ద్వారా నా కథను సవరించుకుందామని. మనస్సు బాధపెడితే క్షమించండి" అన్నాడు.

అతని ముఖం చూస్తూ పుస్తకాల లోకజ్ఞానం కాస్త తక్కువ స్థాయిలో ఉంటుందని గ్రహించాడు గోపాలం. ఓ గ్రహింపు అతనికి జన్మతః వచ్చేసింది. అందువల్ల ప్రస్తుతం ప్రచారంలో ఉన్న యువకుల తరహా అలాంటి అమ్మాయిలకు ఆసక్తిని కలిగిస్తుందనీ, ఆవిడ రోజూ పుస్తకాల్లో చదివే నరేన్‌బాబూ, హరేన్ బాబూలు నిత్యజీవితంలో కారులో ఎక్కించుకు తిప్పడానికి తప్ప బోరు కొడతారని ఊహించేవాడు. చదువుమీద ఆసక్తి అంతగా లేకపోయినా ఇప్పటి కథా ప్రపంచాన్ని స్థాలీపులాకన్యాయంగా అర్థం చేసుకుని ఇటీవల రచయితలూ, రచయిత్రుల పరపతికి కారణాల్ని ఆపోశన పట్టేశాడు. తాగుబోతు భర్తకి ఎదురుచెప్పలేక అతనితో బాధలు పడుతూ, భగవంతుడికి మొక్కుకుంటూ, ఉద్యోగం చేసి కుటుంబాన్నీ, అతని త్రాగుడునీ పోషించిన సుశీల కథ ఈ రోజుల్లో బాగా రాణిస్తుంది. వాడిని ఎదిరించి పిల్లలూ యిల్లూ వదిలిపోయిన సుగుణ కథ ఇప్పట్లో పనికిరాదు. కథలో కాస్త ఎక్కువ మోతాదులోనైనా సెంటిమెంటు కలవాలి. సుశీలకి చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోవాలి. బాబాయి ఆమెను చిన్నప్పట్నుంచి పెంచాలి. అతను దేవుడు. చదువుకునే రోజుల్లో ఒక దుర్మార్గుడు ఆమెను ప్రేమించాడు. ఆ ప్రేమను తిరస్కరించాలి. కానీ అతడు పగతీర్చుకునేటట్టు ఆమె మీద దుష్ప్రచారం సాగించాడు. తప్పనిసరిగా అతన్నే కట్టుకుంది. తన మంచితనంతో, ఓర్పుతో, దీక్షతో సహనంతో చివరికి మంచివాణ్ణి చేసింది. ఈ ధోరణులన్నింటినీ అర్థం చేసుకుని సుశీల కోవకు చెందిన సీతను ఎటువంటి వ్యక్తులు ఆకర్షిస్తారా అని ఆలోచించాడు.

వినయం, గౌరవం మర్యాదలూ ప్రకటించే యువకులలో ఆకర్షణ ఏమీ కనిపించదు. వాళ్ళనింక బాగు చెయ్యవలసినదేమీలేదు. కానీ మొరటుగా, విచ్చలవిడిగా, అల్లరిగా, పెంకిగా కనిపించే యువకులు వీళ్ళని ఆకర్షిస్తారు. ఎంచేతనంటే వాళ్ళని బాగు చెయ్యవలసిన అవసరం, బాగు చెయ్యడంలో బోలెడంత త్యాగం, ఇవన్నీ వారికి మంచి శక్తినిస్తాయి. త్యాగం, ఓర్పు, సహనాలను చూపే అవకాశం ఇవ్వలేని భర్త ఎందుకు? బుద్ధిమంతులైన అమ్మాయిల దృష్టిని అల్లరిపిల్లలు ఆకర్షిస్తారని గోపాలం మరీ బుద్ధి వచ్చిన వయస్సులోనే డైరీలోని మొదటి పేజీలో వ్రాసుకున్నాడు. ఈ సిద్ధాంతమంతా దృష్టిలో ఉంచుకుని ఆ సాయంకాలం వేసుకున్న పథకం నూరుపైసలా రాణింపుకు వచ్చేసరికి తనని తాను మనస్సులోనే అభినందించుకున్నాడు గోపాలం.

అతననుకున్నట్టుగానే ఎన్ని కోపాల్ని ప్రదర్శించినా, ఎంత విసుగు కలిగినా, కారు దిగే సమయానికి ఆ ఇద్దరిలోనూ గోపాలమే మరింత సన్నిహితంగా కనిపించాడు సీతకి. గౌరవ పురస్కారంగా ఆసక్తిరహితంగా నాగరాజుకీ, స్నేహపూర్వకంగా గోపాలానికి నమస్కారం చెప్పి తొందరగా మెట్లెక్కింది సీత.

ఆమె వేపే దీర్ఘంగా చూస్తున్న గోపాలాన్ని "ఇది ప్రేమా" అని తట్టిలేపాడు నాగరాజు.

"నాన్సెన్స్ ఆ పదాన్ని మా వూళ్ళో అటకెక్కించాను. అది సరే కాని, బ్రదర్. నాకు కారు డ్రైవింగ్ నేర్పుతావా?" అని అడిగాడు. ఏదో జ్ఞాపకం వచ్చినట్టు.

"అలాగే లే" అన్నాడు నాగరాజు, అందువల్ల భవిష్యత్తులో, గోపాలం సాధించనున్న సత్ఫలితాన్ని ఊహించలేక.

ఈ కోరికలో, ఈ కోరికకు నాగరాజు తెలిపిన అంగీకారంలో ఒక అమ్మాయి జీవిత పరిణామాలకు, మంచికానీ, చెడు కానీ, ఒక బలమైన పునాదిరాయి పడింది.

4

**కొన్ని కథలకు సుఖాంతమయే** అదృష్టముండదు. ఈ కథకు అలాటి అదృష్టం పట్టేదే కాని, మసక చీకటిలో సీత కారు దిగడాన్ని, గౌరవ పురస్కారంగా నాగరాజుకీ, అభిమాన పురస్కారంగా గోపాలానికి నమస్కారం పెట్టి, కొంగు భుజం చుట్టూ తిప్పి వెళ్ళడాన్ని పక్క ఇంటి మాధవరావుగారు చూశారు. ఆయన సీత స్నేహితురాలు శాంత తండ్రి. వయస్సులో నిక్షేపంగా యాభై దాటాడు. మిలట్రీనుంచి సరిగ్గా నాలుగేళ్ళ క్రిందటే రిటైర్ అయి తప్పనిసరి కనక, ఇంటిని స్వయంగా నిర్వహించుకు వస్తున్నాడు. ఆయన మిలటరీ ఉద్యోగం, ఇప్పటి బతుకూ వెనక చాలా చరిత్ర ఉంది.

చదువుకునే రోజుల్లో మాధవరావు హైస్కూలుకంతటికీ ఫుట్‌బాల్ ఛాంపియన్. ఇనుపముక్కలాంటి ఛాతీ విరుచుకుని ఆరడుగుల ఎత్తు విగ్రహం హైస్కూల్‌లో తిరుగుతుంటే ముచ్చటపడి టీచర్లు కూడా అతన్ని వదిలిపెట్టడం ఇష్టంలేక వరుసగా నాలుగయిదేళ్ళు ఫెయిల్ చేశారు. అయినా చలించలేదు మాధవరావు. ఒకేమాట మీద ఉన్నాడు. ఒకే ధోరణిలో ఎస్సెల్సీ ఫెయిలయ్యాడు. ఆరోసారి చదివేటప్పుడు తన తోటి విద్యార్థులకంటే ఏడేళ్ళు పెద్దవాడయ్యాడు. అతనికంటే మరో రెండేళ్ళు మాత్రమే ఉన్న పంతులమ్మ కొత్తగా హైస్కూల్‌లో సైన్సు టీచర్‌గా చేరింది. ఆమె చాలా తెలివైంది. ఆరోగ్యమే మహాభాగ్యమని నమ్మింది. అందుకని మాధవరావన్నా, బంతి ఆట అన్నా, అతని ఛాతీ అన్నా మంచి మక్కువ కలిగేది. అందుకని మిగతా పిల్లలందరికీ కేవలం సైన్సు పాఠమే చెప్పి, అతనికి మాత్రం సెక్స్ పాఠాలు కూడా నేర్పింది. లేబరేటరీ పీరియడ్లు అందరికీ నాలుగే ఉంటే, సరిగ్గా చేతకాదు కనక, మాధవరావుకి మరి నాలుగు ఎక్కువ వేసింది. అతనికి స్వయంగా యోగాలు నేర్పింది. ఆ సమయంలోనే పంతులమ్మ ధర్మమా అంటూ, చాలా ప్రయోగాలు చేశాడు మాధవరావు.

ఈ పరిస్థితుల్లో వాళ్ళ నాన్న కనిపెట్టి కొడుక్కి చదువుకంటే భిన్నమైనవి చాలా అలవడ్డాయని గుర్తించి, వాడి తెగులు కుదరాలని వెంటనే పెళ్ళి చేశాడు. పెళ్ళయ్యాక తను అనుకున్నట్టూ కొడుకు తెగులు కుదిరిందని సంతోషిస్తూ చచ్చిపోయాడు. కొత్తగా వచ్చిన భార్య బంతి ఆటకి ఇప్పుడు ఎక్కువ అవకాశాలు దొరకనివ్వలేదు. మొదటి రోజే గాలి తీసేసింది. తండ్రిపోయాక ఇంటి బాధ్యతలు పెరిగాయి. భార్య అతని భర్తత్వాన్ని ఎప్పటికప్పుడు గుర్తుచెయ్యసాగింది. ఆవిడ ధాటికి తట్టుకోలేక ఆ రోజుల్లో ఓ రాత్రి లేచిపోయి మిలటరీలో చేరిపోయాడు. ఆ చేరడం చేరడం పంతొమ్మిది సంవత్సరాలు మిలటరీలో ఉన్నాడు. కష్టాలు మనిషిని సాపు చేసినట్టు సుఖాలు చెయ్యవు.

కష్టాలు మనిషిని సాధువుని చేస్తాయి. సుఖాలు పొగరెక్కిస్తాయి. ఆత్మ విశ్వాసాన్ని ఒక స్థాయి పెంచి ఆత్మవంచనకి చోటు చేస్తాయి. గయ్యాళి పెళ్ళాం, మిలటరీ ఉద్యోగం ఈ రెండూ మాధవరావుని శాంతచిత్తుడిగా, సహనపరుడిగా

తయారుచేశాయి. అడపాదడపా యింటికి వస్తూ, ఇంటికి వచ్చినప్పుడు ఆఫీసర్లకులాగే పెళ్ళాం పట్ల భయభక్తులతో ఉండేవాడు. అదిగో ఆ సందర్భంలోనే శాంతా, గిరిజ పుట్టారు. శాంత తండ్రికి ఉన్న భయభక్తులు బహిరంగంగానూ, తల్లికి గల విసురు అంతరంగంగానూ అబ్బింది. పాకుతున్న చీమల్ని ఎవరూ చూడకుండా ఏడిపిస్తూండడం, ఎవరూ లేనప్పుడు గిన్నెల్ని నూతులలో పడేయడంలాంటి రహస్యమైన విలాసాలు శాంతకి ఉండేవి. పెద్దయ్యాక వొళ్ళు నలుగురికి కనిపించేలాగా పలచటి జాకెట్టూ వేసుకోవాలని, ఎత్తుమడమల జోడు తొడుక్కుని బజార్లో నడవాలని కోరికలు కలిగాయి కాని ఒక కాలు కుంటి. అయినా నడవడానికి శాంతకి అభ్యంతరం లేదు. అయితే తల్లిపోయాక ఆమె కట్టుదిట్టాలని తండ్రి అవలంభించాడు. పందొమ్మిదేళ్ళు ఆఫీసు అధికారులకూ మాటలకీ లొంగి ఉండడమే అలవాటయింది. కానీ మిలటరీ నుంచి వచ్చేశాక పెళ్ళాం పోయాక అధికారాలన్నీ తన హస్తగతం అయినట్టనిపించింది. అవన్నీ పిల్లల మీద చూపడం ప్రారంభించాడు. వాళ్ళిద్దరినీ మిలటరీ డిసిప్లిన్‌లో పెంచాలని సంకల్పించాడు. మిలటరీ జీవితానికి సాక్ష్యంగా అప్పటి కోరమీసాల్ని మాత్రం అలాగే ఉంచాడు. అవి ఒకప్పుడు గొప్ప బ్రతుకు బ్రతికిన జమిందార్లలాగా, వొలిసిపోయి బలహీనంగా ప్రతి చిన్నగాలికి రెపరెపలాడుతుంటాయి. తత్ఫలితంగా పిల్లలకి తండ్రి అంటే పిరికితనం ఏర్పడింది. కానీ అతను విధించే ఆంక్షల మీద గౌరవం ఏర్పడలేదు. పైపెచ్చు "పెద్దవాళ్ళకు మాత్రమే" అన్న సినిమా చూడాలని చిన్నపిల్లకి అనిపించనట్టు, ఆయన 'వద్దు' అన్న వాటిలో స్వారస్యం ఉందనీ, అవన్నీ అతననుభవించి, వాటి ఆనందాన్ని గ్రహించి, తమకు మాత్రం స్వార్థంతో దూరంగా ఉంచుతున్నాడనీ, శాంతా, గిరిజా భావించారు.

ఇందుకు నిదర్శనంగా వాళ్ళు ఆయన మాటకి వ్యతిరేకంగా రెండో ఆట సినిమాలకి వెళ్ళారు. మరోసారి పరశురామాలయన్ సర్కస్ చూశారు. అప్పుడు తమ పక్కనే కూర్చున్న టెర్లిన్ ప్యాంటు అబ్బాయి మాటిమాటికి తమ పక్క చూసి చిరునవ్వు నవ్వుతూ కూల్‌డ్రింక్ కూడా ఇప్పించాడు. ఇంటి దగ్గర తన కారులో వదిలేస్తానని మాట ఇచ్చాడు. వాళ్ళ నాన్న పుస్తకాలు చదవకూడదని ఆంక్ష పెట్టిన రోజుల్లోనే శాంత కొవ్వలి నవలలు చదవడం, వాటిలో ఉన్న ఆకర్షణకి లోనుకావడం జరిగింది. అసలు వీధిలోకి రాకూడదని ఆంక్ష జరిగాక, తండ్రి బజారుకి వెళ్ళినప్పుడల్లా అరుగు మీద స్నేహితురాండ్రతో సభ తీరడంలో గల స్వారస్యం తెలుసుకుంది. పక్కింట్లో అబ్బాయిలు దిగాక అటువేపు నడవడం కూడా బహిష్కరించాడు మాధవరావు. కానీ వీలయినప్పుడల్లా, సీత ద్వారా గిరిజ రాకపోకల ద్వారా ఆ అబ్బాయి పుట్టుపూర్వోత్తరాలు శాంతకి బాగా తెలుసునని మాధవరావుకి తెలిఉయదు.

అసలు విషయానికొస్తే, పక్కింటి అబ్బాయిల కారులోంచి సీత దిగడం చూసేసరికి అతని వంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. అధికారాల్ని దుర్వినియోగం చేసిన సైనికోద్యోగి పైన వచ్చే కోపంలాంటిది అతనికి వచ్చింది. కాగా ఆశ్చర్యం వేసింది. సీతని వాళ్ళిద్దరూ కారులో ఎక్కడికో తీసుకెళ్ళి (ఇది అతడు ఊహించుకున్నది) సంధ్యవేళ తీసురావడంలో వాళ్ళ మధ్య సాన్నిహిత్యం ఎంత పెరిగిపోయిందో ఊహించుకుని దిగ్భ్రాంతుడయాడు. ఈ విషయాన్ని తను ముందే ఊహించలేకపోయినందుకు కాస్త చిరాకు కూడా వేసింది. అతనికి హఠాత్తుగా ఒక ఆలోచన తోచి చరచరా లోపలికి వచ్చాడు. వంట చేస్తున్న శాంత దగ్గరికి వచ్చి పీట వేసుకు కూర్చున్నాడు.

"పక్కింట్లో ఇద్దరు అబ్బాయిలు దిగారు చూశావా?" అన్నాడు.

ఆ ప్రశ్నకు ఒక్క క్షణం బిత్తరపోయి, "చూడలేదు" అంది శాంత, చూశానంటే ఏమవుతుందోనని భయపడుతూ.

కానీ ఆ జవాబుకి విసుగుగా తండ్రి "చూడలేదూ? మరేం చేస్తున్నావిన్నాళ్ళూ? కనీసం చూడననయినా చూడక" అన్నట్టు ముఖం పెట్టేసరికి మరీ ఆశ్చర్యపోయింది.

"పోనీ వాళ్ళు సీతతో ఎప్పుడన్నా మాట్లాడుతున్నారని తెలుసా?"

"నాకేం తెలుసు?" అంది.

మాధవరావు ఒక్కక్షణం ఆలోచించి "సీత నీకంటే అందమైనదేమీకాదు" అన్నాడు.

"మరలాంటప్పుడు నా వేపయినా చూడక ఆ అమ్మాయితో ఏ మొహం పెట్టుకుని మాట్లాడి ఉంటుందన్న ఉద్దేశంతో మాధరావు ఈ ప్రశ్నని వేయలేదు. కానీ రాయి గోడకి తగిలిందా అని అడిగే బదులు గోడ రాయికి తగిలిందా అన్నట్లు అడిగాడు అంతే.

"నీకు తెలుసా? సీత వాళ్ళ కారులో తిరుగుతోంది."

"నిజంగా?"

"వాళ్ళ ముగ్గురూ ఎక్కడికో వెళ్ళి ఇందాకనే తిరిగి వచ్చారు."

శాంత ఆశ్చర్యపోయింది. పుస్తకాలు తీసుకురావడం, వాళ్ళు సీతకు ఉత్తరం రాయడం ఇవన్నీ తెలుసు. ఈ కారు ప్రయాణం ఇటీవలి పరిణామం అయి ఉంటుందని దాని గురించి వెంటనే తెలుసుకోవాలని శాంత అనుకుని పైకి మాత్రం మాట్లాడలేదు.

"రేపు గిరిజని పంపించి సీతని ఒకసారి పిలిపించు. ఆ అమ్మాయితో మాట్లాడాలి" అంటూ లేచాడు మాధవరావు.

మాధవరావు, గోవిందరావులు స్నేహితులు. స్నేహితులంటే ఒకే వీధిలో ఉన్నారు కనుక, హో' అంటే హో' అనుకునే స్నేహం. పైగా తమ పిల్లలు, సీత, శాంత దగ్గర్నుంచి మాధవరావు సిగరెట్లు తెప్పించుకుంటారు. అదీకాక వాళ్ళు ఉంటున్న ఇల్లు మాధవరావు పిత్రార్జితం. అందువల్ల తమ ఇంట్లో ఉన్నవాళ్ళ వ్యవహారాలు తను పట్టించుకోవలసిన అగత్యం ఉన్నదని తీర్మానించుకుని సీతని ఒక్కసారి హెచ్చరించాలనుకున్నాడు. కొందరు పెద్దవాళ్ళకి సముదాయించే విచక్షణ లేకపోయినా ఎదుటి వ్యక్తి చిన్నతనాన్ని గుర్తుచేస్తూ మాట్లాడడం సరదా. ఆ విధంగా తమ పెద్దరికం గుర్తొస్తుంది కనుక. "ఇంత వయస్సొచ్చింది ఇంకా చెట్లెక్కుతున్నావా?" అనడంలో తను ఒక్కప్పుడు బాగా ఎక్కి, ఇప్పుడు మానేశానని చెప్పే గర్వం ఉంది. పైగా మాధవరావు మొదట్నుంచీ మొన్నమొన్నటిదాకా చిన్నవాడుగా అంటే ఒకరి చెప్పుచేతుల్లో వాడుగానే బ్రతికాడు. చిన్నప్పుడు బంతి ఆటల్లో కెప్టెన్ చేతిలో ఆడాడు. చదువుకునేటప్పుడు పంతులమ్మ ఎప్పుడు లేబరేటరిలోకి రావాలో శాసించేది. పెళ్ళయాక భార్య అతని నిత్యకృత్యాన్ని నిర్ణయించేది. మిలటరీలో రిటైరయాక, తన భార్య పోయాక పిల్లలు తన మాట విని అక్షరాలా నడుచుకోవడం అతనికి చాలా సరదాగా ఉండేది. పాఠం వ్రాయలేదని గిరిజ చేత గుంజీలు తీయించేవాడు. అలాంటప్పుడు డ్యూటీలో బీడీ కాల్చినందుకు తనని ఆఫీసర్ గ్రౌండు చుట్టూ పరిగెత్తించిన సందర్భం గుర్తు చేసుకుని ఇన్నాళ్ళకి ఆఫీసర్ అధికారాన్ని చెలాయింపగలిగినందుకు సంతోషించేవాడు. ఇవాళ మాధవరావుకి అలాంటి మరో అవకాశం లభించినందుకు సంతోషంగానే ఉంది.

అందువల్ల మర్నాడు ఉదయం సీత వచ్చినప్పుడు ఆ మాటా ఈ మాటా అవగానే వాళ్ళతో "ఎక్కడికెళ్ళావమ్మా?" అని అడిగాడు.

ఆ ప్రశ్నకి నిర్ఘాంతపోయింది "ఎవరితో?"

"ఆ పక్కింటి అబ్బాయిలతో, ఆ వీధిలో కనిపించే కారులోనే. నాకు తెలీదనుకోకు. అంతా తెలుసు. అయినా వయసులో ఉన్న అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలమ్మా. అందరూ మనలాంటి మంచివాళ్ళే ఉండరు. కొందరు మసిపూసిన మారేడుకాయల్లా కనిపిస్తారు. నువ్వు మా శాంతలాంటిదానివే. నిన్న మీరంతా కలసిరావడం నేను చూశాను. నాకంతా అర్థమైపోయింది. ఇదే మీ నాన్నగారు చూస్తే కొంపమునిగేది. నేనూ అలాంటివాణ్ణే అనుకో. అందుకనే నేనే ఈ మాట చెప్దామనుకున్నాను" అని తలమీద చెయ్యివేసి వాత్సల్యంగా అన్నాడు.

అప్పుడక్కడ శాంత లేదు. ఇంట్లో ఏదో పని చేసుకుంటోంది. అందువల్ల తనని తానే సమర్థించుకోవలసిన అగత్యం ఏర్పడింది సీతకి.

అందుకని "ఏ మాట చెప్దామనుకున్నారు మామయ్యగారూ?" అంది. అలా ఆయన్ని ఎప్పుడూ పిలవలేదు. ఇప్పుడింత ఆప్యాయత చూపాడు కనక అలా పిలిస్తే బాగుంటుందనుకుంది.

"ఇదే నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండాలని అసలు నిన్న ఎక్కడికి వెళ్ళారు మీరంతా?" నవ్వుతూ 'నాకు తెలుసులే' అన్నట్టు మళ్ళీ అడిగాడు.

"అబ్బే నేను టైపు నేర్చుకు వస్తుంటే కారు ఆపి ఎక్కించుకున్నారు మామయ్యగారూ. చీకటిపడింది. రిక్షాలు లేవు. అయినా మర్యాదగా ఇంటిదగ్గర దింపుతామంటే తప్పేముందని వెనకసీట్లో ఎక్కి కూర్చున్నాను."

"అంతేనా?" ఏదో గొప్ప విషయం చెప్తుందని ఊహించాక అతి పేలవమైన విషయం విన్నట్టు నిరుత్సాహంగా అన్నాడు.

"అంతేనండీ"

తన పుస్తకాల విషయం ఇతనితో చెప్పడం మంచిదా కాదా అని ఆలోచించే సమయంలో "అహ ఎందుకడుగుతున్నానంటే ఒక్కొక్కప్పుడు తియ్యటి మాటలతోనే మనల్ని మోసం చేస్తారు కొందరు గోముఖ వ్యాఘ్రాలు. నువ్వు తెలియనిదానివి. నీకలాంటివి తెలీవు" అని మరీ ప్రేమగా వీపు నిమిరాడు మాధవరావు. కితకితలతో యాతన పడిపోయి చెయ్యి తప్పించుకుంది సీత.

"మరేం మాట్లాడలేదండి. వాళ్ళు చాలా మంచివాళ్ళు. చాలా మర్యాదస్తులు. చాలా బుద్ధిమంతులు కూడానూ" అంది. ఆయనకి విశ్వాసం కలిగేలా మాటకి మాట చేరుస్తూ.

"దుర్మార్గులు, లుచ్చాలు, పోకిరీ వెధవలు" అన్నంతగా ఒక్కొక్క మాటకీ గతుక్కుమన్నాడు మాధవరావు. ఆయనకి ప్రపంచంలో మంచితనం మీద ఎక్కువ నమ్మకాలు లేవు. ఉన్నా, ఇన్ని మంచి విషయాలు ఉంటాయని అతను ఊహించలేని విషయం.

అయినా సర్దుకుని, "నిజమేలే, నాకూ అలానే కనిపించారు. అయినా మీ నాన్నగారితో నాకున్న స్నేహాన్ని బట్టి, నీకూ మా శాంతకీ ఉన్న స్నేహాన్ని బట్టి ఓసారి చెప్పాలనుకున్నాను అంతే. "

సీత లేస్తే మరింత దగ్గరకి వంగి "మా శాంత గురించి ఏమైనా మాట్లాడారేమిటి కొంపదీసి?" అని ఆసక్తిగా అడిగాడు.

"అబ్బే లేదు లేదు" అంది సీత,

"పోనీలే. అంతే చాలు. నువ్వు వెళ్ళమ్మా. ఇంక ఆ వెధవకారు ఎక్కకు" అని మళ్ళీ తల నిమిరాడు మాధవరావు.

ఈ ఆప్యాయతకి ముగ్ధురాలయిపోయింది సీత. నాన్నగారు అభిమానించడం, అలా దయతో బుజ్జగించడం ఆమె చూడలేదు. ఆయనంటే భయం, భక్తి తప్ప బుద్ధి వచ్చాక ఇట్లా సన్నిహితంగా ఉండి ఎరగదు. ఇప్పుడీ ఏభై ఏళ్ళ ముసలాయన ఆప్యాయత చూసి శరత్ నవలల్లోని ఏ భట్టాచార్య బాబునో గుర్తు తెచ్చుకుంది. "వస్తాను మామయ్యగారూ" అంటూ గుమ్మం దిగింది.

దిగుతూనే ఎదురుగా వచ్చిన కారు మీద హఠాత్తుగా పడబోయి ఆపుకుంది. తలెత్తితే చిరునవ్వుతో గోపాలం ఎదురయ్యాడు స్టీరింగు ముందు. పక్కనే నాగరాజు ఉన్నాడు.

"కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుంటున్నాను. మొదటి యాక్సిడెంటు మీతోనే అయేది" అన్నాడు గోపాలం.

"అలా ఎందుకనుకోవాలి? నేర్చుకోవడానికి ఆమె శకునం మంచిదేమో?" అన్నాడు నాగరాజు.

సిగ్గుపడుతూ నవ్వింది సీత.

"మంచిమాట. కాలేజీకి బయలుదేరాను. ఈ రోజు లాభంలో మీకు సగం, నాకు సగం" అన్నాడు గోపాలం.

అంటూనే కారు ముందుకు నడిపించాడు. నవ్వుకుంటూ సీత అటువేపు చూస్తూ నిలబడడాన్ని మాధవరావు మెట్లమీద నుంచి గమనిస్తూనే ఉన్నాడు.

**ఆ తర్వాత వాళ్ళిద్దరూ** చాలాసార్లు చాలా సాయంకాలాలు జంటగా గడిపారు. సినిమాలకి వెళ్ళారు. గోల్కొండ చూశారు. జూ చూశారు. తనడిగితే కారు ఇవ్వడని తెలిసి సీత చేత అడిగించాడు గోపాలం.

"ఒక్క నిజం చెపితే ఇస్తాను" అన్నాడు నాగరాజు.

"ఏమిటి?"

"మీకు పెళ్ళంటే ఇష్టమా, ప్రేమంటే ఇష్టమా?" నవ్వింది సీత.

"రెండూ వేరు వేరుగా ఉంటాయా?"

"ప్రేమలేని పెళ్ళిళ్ళు చూస్తున్నాంగా. అలాగే పెళ్ళి జరగకుండా ప్రేమలో పడితే"

నవ్వుకున్నాడు. పాము చేత్తో పట్టుకుని, విషం ప్రాణం తీస్తుందని భయపడేవాడిని ఏమనాలో అర్థం కాలేదు. సీతకి ప్రేమ ముఖ్యం కాదు. పెళ్ళి. పెళ్ళి గురించి చాలా చదువుకుంది. వింది. చూసింది. దానికోసం ఇష్టంలేని ప్రేమను అంగీకరిస్తుంది. గోపాలానికి పెళ్ళి ముఖ్యం కాదు. ప్రేమ ముఖ్యం. దానికోసం ఆమె నమ్మకాల్నీ, ఆశల్నీ ప్రోత్సహిస్తున్నాడు.

వాళ్ళను చూసి తను ఈర్ష్య పడుతున్నాడా? అన్న ఆలోచన కలిగింది క్షణకాలం. నవ్వొచ్చింది ఆ ఆలోచనకే, ఆతర్వాత ఆలోచించడం కూడా మానుకున్నాడు నాగరాజు.

ఈ మధ్య మాధవరావు బెడద హఠాత్తుగా తగ్గిపోయింది. ఆ రోజు గోపాలంతో అతని విషయం చెప్పుకున్నాక, గోపాలం `ఆ విషయం నేను చూస్తాలే` అన్నాక ఇంక ఏ ప్రమాదం లేకుండా పోయింది.

కారణం? చాలా ఉంది.

ఎప్పుడైనా, ఎక్కడైనా పెద్ద ఇబ్బంది వస్తే రెండు మార్గాల్ని రమాపతిరావుగారు తన దగ్గరకి వచ్చేవారికి సూచిస్తుండడం విన్నాడు గోపాలం. మొదట గొంతు చించుకుని గట్టిగా అరవడం, ఎదుటివాడు ఎదురు తిరిగి సమాధానం చెప్పే గట్టివాడని తోస్తే వెంటనే తగ్గి కాళ్ళు పట్టుకోవడం. ఈ పద్దతి ప్రకారం మాధవరావుతో ఏది చెయ్యడమో అని ఆలోచించి నెమ్మదిగానే సాధించాలనుకున్నాడు గోపాలం. అందువల్ల ఓ రోజు ఉదయం మాధవరావు బజారుకి బయలుదేరుతుంటే పలకరించాడు గోపాలం.

"నమస్కారం మామయ్యగారూ" అంటూ.

ఆ ఇంటి ముందుకు వచ్చేసరికల్లా కావాలని తలవొంచుకుపోయే మాధవరావు ఎవరినో పిలుస్తున్నాడనుకుని రెండడుగులు వేశాడు.

"మిమ్మల్నేనండీ: అని రెట్టించాడు గోపాలం. దిమ్మెరపోయాడు మాధవరావు. ఆయన లోపలికి వచ్చాక సకల సపర్యలూ చేశాడు గోపాలం.

కుర్చీలో కూర్చోబెట్టి ఫ్లాస్కులో కాఫీ తీసి ఇచ్చాడు. చాలా శ్రద్ధగా ఆయనకి ఎదురుగా ఉన్న గుమ్మం మీద కూర్చున్నాడు.

"సరిగ్గా మీలాగే మా అమ్మ తమ్ముడొకాయన ఉండేవారు. మిమ్మల్ని చూస్తే ఆయన గుర్తుకొస్తారు. ఆయనిప్పుడు చచ్చిపోయారు" అన్నాడు.

"అలాగా!" అని విచారం వెళ్ళబోశాడు మాధవరావు.

"రోజూ మిమ్మల్ని చూస్తుంటాను. చూసినప్పుడల్లా అనుకుంటుంటాను పలకరించాలని. మళ్ళీ ఏమనుకుంటారోనని భయపడుతూ ఉంటాను. అయినా తప్పేముందిలే. పెద్దవారు పిలిచి కాఫీ ఇస్తే తప్పా అనుకున్నానివాళ."

"ఎంతమాట? మీరేం చేస్తున్నారిక్కడ?"

ఇంక అదను దొరికిందన్నట్టు విషయమంతా చెప్పేశాడు. "నేను కాలేజీలో బి.ఎ చదువుతున్నానండీ. మా మిత్రుడు నాగరాజు ఇప్పుడు మేడమీద పడుకున్నాడనుకోండి. వాడు బిస్కట్ల ఫ్యాక్టరీకి ప్రొప్రయిటరు. అబ్బో! వాళ్ళ నాన్న పెద్ద లక్షాధికారి. వాడి పెళ్ళికప్పుడే ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. రేపు వచ్చే పెళ్ళిళ్ళ సీజనులో వాడు చేసుకుంటున్నాడు. నాకా? మా నాన్నగారు తొందరపడుతున్నారనుకోండి. నేనే చదువు పాడవుతుందని తటపటాయిస్తున్నాను. అన్నట్టు మా నాన్నగారు తెలుసా? రమాపతిరావుగారు. ఎక్కడ కార్మికుల సమ్మెలు, తగాదాలు ఉన్నా మా నాన్నగారి పేరు వినిపిస్తుంది."

"ఓహో! ఆయనా తెలియకేం?" అన్నాడు మాధవరావు. నిజంగా తెలియకపోయినా అదేదో రోడ్డు మీద తిరిగే కుక్కని గురించి చెప్పినట్టు.

"ఏం మాట్లాడుతున్నాను?" అని మధ్యలో ప్రశ్నించాడు, మాధవరావు జాగ్రత్తగా వినేట్టు చేయడానికి.

"అదే నీ పెళ్ళి గురించి."

"ఆఁ ఏదోలెండి. ఈ కాలంలో ప్రతీవాడూ డబ్బు మూటగట్టుకోవాలని చూసేవాడే కాని అబ్బాయీ, అమ్మాయీ అన్యోన్యతగా ఉన్నారా లేదా అని ఆలోచించేవాడెవడండీ? నా మట్టుకు నాకు కుంటో, వెంటో, మంచి అమ్మాయిని గుణవంతురాల్ని ఆ మాటకి వస్తే కట్నమైనా లేకుండా చేసుకోవాలని ఉంది. తమరేమంటారు?"

"ఏమంటాను? చాలా బుద్ధిమంతుడివి నువ్వు. ఈ రోజుల్లో తండ్రుల బాధలు మీకు తెలియనివి కావు. దానికి తోడు అబ్బాయి తండ్రులు మెడకేస్తే కాలికి, కాలికేస్తే మెడకి వేసి, పెళ్ళయ్యాక గోచీ, చిప్పా ఇస్తున్నారు చేతికి. నువ్వు యోగ్యుడివి కనుక అలా అనుకున్నావు. నిజానికి నాకూ ఇద్దరమ్మాయిలున్నారు, అబద్ధమెందుకు? పెద్దమ్మాయికి కాస్త కుంటి అన్నమాటేగానీ, నువ్వన్నట్టు చాలా గుణవంతురాలు" అంటూ కీ ఇచ్చిన బొమ్మలాగా చెప్పుకుపోతున్నాడు మాధవరావు.

ఈ సంభాషణంతటినీ టేపు రికార్డు చేసి కోర్టుకెక్కించినా అమ్మాయిని చేసుకుంటానని ఎక్కడా మాట ఇచ్చినట్టు రుజువు కాకుండా మెలికలు తిప్పాడు గోపాలం. కానీ లౌకిక ప్రపంచంలో ఎవడు విన్నాకూడా, ఆ భావం అక్షరాల స్ఫురించేటట్టు చూశాడు మాధవరావు. ఆ తర్వాత సరాసరి ఇంటికి వెళ్ళి ఉప్మా చేయించి పంపించాడు గిరిజ చేత. ఆ చర్యకి ఆశ్చర్యపోయింది ఆ అమ్మాయి. మర్నాటి నుంచి దాదాపు వీళ్ళ దగ్గర నుంచి ప్రతిరోజూ పేపరు తెప్పించుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఒక సాయంకాలం కాఫీకి ఇంటికి పిలిచి శాంత చేత కాఫీ ఇప్పించాడు. ఆ సందర్భంలో పొరపాటున నోరుజారి, "మీరు, సీత స్నేహితులేగా" అన్నాడు.

"అవునండీ" అన్నట్టు తలూపింది శాంత.

మాధవరావు వెర్రెత్తిపోయాడు అయినా తట్టుకుని "అబ్బే స్నేహం అంటే పెద్ద స్నేహం కాదు. ముఖపరిచయం. అమ్మాయిని నేను టైపుకీ దేనికీ పంపించలేదు. ఏ పుస్తకాలూ చదవదు" అని గర్వంగా చెప్పాడు. అవన్నీ పెద్ద అర్హతలయినట్టూ.

"అబ్బే! నాకూ ఆ అమ్మాయి ఉత్త ముఖపరిచయమే. ఒకరోజు నేనూ, నాగరాజు కారులో వస్తూంటే కనిపించింది. మేం కాఫీ పొడి కొనుక్కోబోతుంటే రిక్షా దొరకలేదనీ, కారులో తీసుకెళ్ళమనీ బ్రతిమలాడింది. సరే అన్నాం. అయినా పరాయి అమ్మాయిల్ని వయస్సులో ఉన్న కుర్రాళ్ళు కారులో తీసుకెళితే నలుగురూ నానామాటలు అనుకుంటారు చూడండి" మాధవరావు ముఖం చూస్తూ అన్నాడు. మాధవరావు ఏదో పని ఉన్నట్టు దగ్గుతూ కిటికీదకా వెళ్ళివచ్చాడు. నిక్షేపంలాంటి కుర్రాణ్ణి నానామాటలు అనుకున్నందుకు మనస్సులో దురపిల్లిపోయాడు ముసలాడు.

ఇవన్నీ కనిపెడుతూనే ఉన్నాడు నాగరాజు. ఒకసారి అడిగాడు. "ఏరా బ్రదర్ ఇది మరో ప్రోగ్రామా?" అంటూ.

"కాదులే. మొదటి ప్రోగ్రామ్‌నే కట్టుదిట్టం చేసుకుంటున్నాను. రుణశేషం, శత్రుశేషం ఉండకూడదన్నారు. ఈ ముసలాణ్ణి దారిలో పెడుతున్నాను" అన్నాడు.

నిజంగా మాధవరావు దారిలో పడిపోయాడు. రాత్రివేళల్లో గోపాలం వెల్లకిలా పడుకుని చదువుకునేటప్పుడు పక్కనే వచ్చి కూర్చుని "అమ్మాయి పెళ్ళి త్వరలో చెయ్యాలనుకుంటున్నానోయ్. వయసొచ్చిన అమ్మాయి ఇంట్లో ఉంటే గుండెల మీద కుంపటిలా ఉంటుంది. తర్వాత నాకు చెయ్యి కాల్చుకోక తప్పదనుకో. అయిన చేసేదిలేదు" ఇలాంటి కబుర్లు చెప్పేవాడు. ఇవన్నీ వింటూ మధ్య మధ్య 'అయ్యో ఎంతమాట? లక్షలు విలువ చేసే ముక్క అన్నారు' అంటూండేవాడు గోపాలం.

ఒకటి రెండుసార్లు, సీతా, గోపాలం కలిసి తిరగడం, హోటళ్ళకెళ్ళడం మాధవరావు చూశాడు కానీ అవి తను అడగడం బాగుండదనీ, చూసీ చూడనట్టు ఊరుకున్నాడు. పిల్లనిచ్చిన మామగారికి అల్లుడిలో తప్పులు పట్టే అర్హతలేదు.

కానీ ఒకరోజు సినిమాలో వాళ్ళిద్దరినీ చూశాక ఇక ఆగలేకపోయాడు మాధవరావు. ఎర్రగా, బుర్రగా ఉన్న అబ్బాయిని బుట్టలో వేసుకోవడానికి, వానాకాలం చదువుతో వచ్చిన తెలివితేటల్ని సీత ప్రదర్శిస్తోందని గునిశాడు. దీన్ని అరికట్టడానికి మార్గాన్ని మరి రెండూ రాత్రులు ఆలోచించి అట్నుంచి నరుక్కురావాలనుకున్నాడు. అందుకని ఆ నెల అద్దె పుచ్చుకోవడానికి సీత ఇంట్లోనే ఉన్న సమయం, గోవిందరావు లేని సమయం చూసి ఇంట్లో ప్రవేశించాడు.

"రండి అన్నగారూ" అంటూ బల్ల జరిపి కాఫీ తెచ్చి ఇచ్చింది వర్ధనమ్మ.

ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతుంటే సీత వచ్చింది. "ఏమ్మా కులాసా? అని ప్రశ్నించాడు.

నవ్వుతూ తలూపింది సీత..

అతనిమీద ఇదివరకటి కోపం పోయింది సీతకి. ఒక విజయాన్ని సాధించిన తరువాత శత్రువు పట్ల చూపే జాలిలాంటిదది. ఆమె కిప్పుడు బాధలేదు. పాపం ఆయన బలహీనత అది` అనుకుంది.

ఇప్పుడిక సీతకూడా అక్కడే ఉంది కనుక ఏదో జ్ఞాపకం వచ్చినట్టు ప్రారంభించాడు "అన్నట్టు చెప్పడం మరిచిపోయానమ్మా. ఓ మంచి శుభవార్త" అంటూ.

లోపలికి వెళ్ళబోతున్నదల్లా సీత ఆగింది. "ఏమిటది మామయ్యగారూ" అంటూ స్థంభానికి ఆనుకుని నిలబడింది.

"నాకా వయస్సయిపోతోంది. బ్రతికుండగానే శాంతకి మూడుముళ్ళు వేయాలనుకుంటున్నానమ్మా" అన్నాడు.

"చూశావా అమ్మా వయస్సులో ఉన్న పిల్లలకి పెళ్ళిళ్ళంటే ఎంత ముచ్చటో" అని విసిరి, "ఎదురింటి అబ్బాయి లేడూ, సన్నగా పొడుగ్గా, ఉంగరాల జుత్తూ, అతడూ"

తుళ్ళిపడింది సీత. ఒక్కసారి తల తిరిగి నేలన పడిపోతుందేమోనని భయమేసింది. బలవంతంగా మనస్సు కూడదీసుకుని గోడకి చేరబడింది.

"అబ్బాయి పేరు గోపాలం. మంచివాడు. బాగానే చదువుకున్నాడు. తండ్రి రాజకీయ నాయకుడు. పెద్ద కట్నాలూ అవీ ఏం కోరడం లేదు. నువ్వు అతన్ని చూశావుగా"

సీత నిర్జీవంగా తలూపింది.

"అమ్మాయి గుణం, చక్కదనం చూసి చేసుకుంటానని అతనే అన్నాడు. ఒకరోజు వెళ్తూంటే `మామయ్యగారూ` అని పిలిచాడు. పలకరించాడు. తన వంశ మర్యాద, మంచీ అదీ చెప్పాడు. ఇంటికి తీసుకువెళ్ళాను. అమ్మాయిని చూశాడు. అయినా సమయం రావాలి కానీ ఏది ఆగుతుందమ్మా?"

"నిజం.. నిజం నాకూ చాలా సంతోషంగా ఉంది. తల్లిలేని పిల్ల. త్వరగా ముడివేయండి. మీకూ ఓ బాధ్యత తీరుతుంది" అంది వర్ధనమ్మ.

మాధవరావు సీతని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు. కళ్ళనీళ్ళు ఆపుకోవడానికి ఎంత ప్రయత్నిస్తోందో గుర్తించాడు. కింద పెదవి పంటికింద నలిగిపోతోంది. శవంలాగా వేలాడిపోయింది సీత. తను వచ్చిన పని అయిందనుకున్నాడు. ఇక అమ్మాయి గోపాలం ముఖం చూడదనుకుని లేచాడు `నేను వస్తానమ్మా` అంటూ.

వర్ధనమ్మ వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఆ చీకట్లో అక్కడే అచేతనంగా కూలబడింది సీత. ఆ క్షణంలో ఆమెకి ఎవరిమీదా కోపం రాలేదు. దుఃఖమూ రాలేదు. తన నుంచీ దూరం చేయడానికి ఎవరో గోపాలానికి మత్తుమందు ఇచ్చి తననుంచి దూరంగా తీసుకుపోతున్నట్టు అనిపించింది. ఎంత ప్రయత్నించినా అతని చిరునవ్వులో, పలకరింతలో కపటం కనిపించలేదు.

రాత్రంతా నిద్దరపట్టలేదు సీతకి. ఇటువంటి కష్టంలో ఏం చెయ్యాలో గోపాలం వుంటే చెప్పేవాడు. కానీ గోపాలానికి సంబంధించిన సమస్యేకావడం చేత సలహా పొందే అవకాశం పోయింది. ఈ సందర్భంలో ఎవరైనా స్నేహితులు ఉంటే బాగుణ్ణనిపించింది సీతకి. ఒంటరిగా పక్కమీద కూర్చుని మూడు ఝాముల రాత్రివరకూ ఆలోచించింది. అలసటతో, ఆలోచనతో అప్పటికి తల బరువెక్కి దుఃఖం వచ్చింది. జీవితంలో మొదటిసారిగా ఒంటరితనం తెలిసింది. దూరాన తల్లి పడుకుంది. ఈ ఆలోచనల బారి నుంచి తప్పించుకోవాలంటే ఎవరో ఒకరికి చెప్పాలి. గోపాలాన్ని తనకి దూరం చెయ్యకుండా చూడాలి. మనస్సులో, కోరిక ఏర్పరచుకున్నంత సులువుగా ఆ ఇంటికి వెళ్ళి అతనితో బ్రతకడం సాధ్యపడేటట్టు లేదు. ఎవరివల్ల సాధ్యమవుతుంది? ఇంక ఆలోచించలేకపోయింది. మెల్లగా లేచి వచ్చి అమ్మ పక్కనే కూర్చుని తట్టి లేపింది.

వర్ధనమ్మ కళ్ళు విప్పి "ఇంకా నిద్రపోలేదా సీతా?" అంది.

"లేదమ్మా నిద్ర రావడంలేదు" అంది మెల్లగా.

"ఏం? ఒంట్లో బాగోలేదా?" చేతి మీద చెయ్యి వేసి చూసింది.

"అదికాదు. నాకు భయంగా ఉంది."

"ఎందుకే భయం?" నివ్వెరపోతూ అడిగింది తల్లి.

"ప్రేమించిన వాళ్ళు ఎక్కడయినా మోసం చేస్తారా అమ్మా?"

"ప్రేమ ఏమిటే నీ మొహం?" అంది ఆవిడ.

"జవాబు చెప్పు."

తెల్లవారుఝామున కూతురికి వచ్చిన ఆ సందేహానికి విస్మితురాలయింది ఆ ఇల్లాలు. "ఎందుకొచ్చింది నీకా సందేహం? ఎవరు ప్రేమించారు? ఎవర్ని?"

ఎంతోసేపు ఆలోచించి తల్లి భుజం పట్టుకుని మెల్లగా అంది. "నేను తప్పు చేశానమ్మా."

ఇన్ని రోజులు, వారాలు, నెలలు చాలా సంతోషంతో, చాలా గర్వంగా గోపాలంతో స్నేహాన్ని మనస్సులో ఊహించుకుంటున్న అమ్మాయి, చదివిన అన్ని పుస్తకాల సాక్ష్యంతో ఆనందాన్ని పదిరెట్లు చేసుకున్న అమ్మాయి ఎట్టకేలకు 'నేను గోపాలాన్ని ప్రేమించాను' అని చెప్పలేకపోయింది. ఆ క్షణంలో 'నేను తప్పుచేశాను' అని మాత్రమే అనగలిగింది.

వర్ధనమ్మకి ఇప్పుడు నిద్ర పూర్తిగా తేలిపోయింది.

సీత ముఖాన్ని రెండుచేతులా తనవేపు తిప్పుకుని "ఏం చేశావే?" అని ఆతృతగా అడిగింది. ఆ కంఠంలో దుఃఖపు జీర, ఆప్యాయతతో కూడిన సానుభూతి కనిపించేసరికి సీత కళ్ళు జలజలా వర్షించాయి.

తల్లి గుండెలో తలదాచుకుని, అంతవరకూ జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పేసింది సీత. నిశ్చేష్టురాలయి అంతా విన్నది ఆ ఇల్లాలు. గుట్టుమట్టుగా ప్రపంచాన్ని చూడకుండా పెంచిన అమ్మాయి గుండెలో ఇన్ని కోరికలుంటాయని, అవి అదను చూసుకుని దెబ్బ తీస్తాయనీ, పల్లెటూళ్ళో పెరిగిన ఆవిడకి తెలియదు. అందుకని ఆశ్చర్యంతో, దుఃఖంతో పెదవి అదిమి పట్టుకుని అంతా వింది.

అంతా చెప్పి "ఏం అమ్మా నేను తప్పు చేశానా?" అని సీత తలెత్తితే,

"భ్రష్టురాలా చేసింది వెధవపనని కూడా ఒకళ్ళు చెప్పాలా? రేపు నాన్నగారు తలెత్తుకోలేని పని చేశావు" అంది. దుఃఖం ముంచుకు రాగా ఫెళ్ళున చెంపమీద ఒక్కట్టిచ్చింది.

ఈ ఇరవయ్యో శతాబ్దపు మానవుడికి గుండెలు చీల్చే దుఃఖంలో కూడా అలసిన 'రేపే గుర్తుకొస్తోంది. మసక బారిపోతున్న నైతిక విలువలు గుర్తు రావడం బతుకు భయం కమ్మని ఆశల్ని, అందమైన జీవితపు మాధుర్యాన్ని ఉరి తీస్తోంది. విషాదకరమైన క్షణంలోనూ అన్నేళ్ళ జీవితాన్ని చూసిన ఇల్లాలికి మర్నాడు భర్త సమక్షంలో తలయెత్తుకోవలసిన అగత్యమే గుర్తుకు వచ్చింది.

కూతురు దుఃఖాన్ని చూసి ఇక ఆగలేకపోయింది వర్ధనమ్మ. ఒక్కసారి సీతని దగ్గరకి తీసుకుని ఆమె వీపుమీద ముఖం ఆనించి ఘొల్లుమంది.

గదిలోంచి గోవిందరావు నిద్దట్లోంచే "ఏమిటే అది?" అన్నాడు. తల్లీ కూతురూ నిశ్శబ్దమయిపోయారు. ఊపిరి కూడదీసుకుని "ఏమీ లేదండీ" అని సమాధానం ఇచ్చింది వర్ధనమ్మ. ఇద్దరూ కలిసి పెరటి వసారాలో వచ్చి కూర్చున్నారు.

వాళ్ళిద్దరి కళ్ళూ కన్నీటితో నిండిపోయాయి.

ఉదయం గోపాలం ఈల పాట పాడుకుంటూ ఫ్లాస్కులో కాఫీ తాగడానికి లేచేసరికి తెగని జీవిత సమస్యని చర్చించుకుంటున్న వాళ్ళిద్దరూ అతనికి కనిపించారు.

గోవిందరావు ఈ విషయం తెలియగానే చేతికి దొరికిన రూళ్ళ కర్రతో సీతను బాదాడు. కర్తవ్యం తోచని భయం నుంచి విముక్తి కావాలంటే అంతకు మించినది ఏదో మనస్సుకి కావాలి. అప్పుడు భయం వెనుకబడుతుంది. పక్కనే దుఃఖం ఉంటుంది. ఈ భయం పోగొట్టుకోలేనిదని తోచగానే దుఃఖం తోసుకు వస్తుంది. ఇవన్నీ జరిగాయి గోవిందరావు విషయంలో. వర్ధనమ్మ భయపడుతూనే జరిగిందంతా భర్తతో చెప్పింది, తప్పదు కనుక. అతను మొదట నమ్మలేదు. విస్తుపోయాడు. వెర్రి చూపులు చూశాడు, భయపడ్డాడు, అరిచాడు. సీతని పిలిచాడు. సీతని పిలిచి ఎడాపెడా కొట్టాడు. దెబ్బలకి శరీరాన్ని అప్పగించి బాధతో నలిగి, స్పృహకోల్పోయి ముద్దలాగా కూలిపోయింది సీత.

చిన్నతనం నించి తండ్రిని ఒకరోజు ఇది కావాలని అడగలేదు. టైఫాయిడ్ జ్వరానికి మందు కావాలని అడిగింది. తర్వాత పుస్తకాల్ని అడిగింది. అడగకుండానే ఆమె కిచ్చిన బహుమతి ఈ దెబ్బలు. తన తల్లిపేరు పెట్టుకున్నాడు ఆమెకి. "సీతా" అని పిలిచినప్పుడల్లా తనని ముప్పయ్యేళ్ళు పెంచిన తల్లి ఆత్మీయత ఆ పిలుపులో వినిపించేది. ఇప్పుడు ముద్దలాగా కూలిపోయిన కూతుర్ని చూడలేక మంచం మీద కూర్చుని తనూ ఏడ్చాడు. ఇప్పుడు ఇద్దర్నీ ఓదార్చడం వర్ధనమ్మ వంతయింది.

శవం వెళ్ళిపోయాక ఏర్పడే ఒక భయంకరమైన నిశ్శబ్దం రెండురోజులపాటు ఆ ఇంటిని ఆవరించింది. ఎవరి ఆలోచనలో వారు, ఎవరి దుఃఖాన్ని వారు నిశ్శబ్దంగా అనుభవించారు. ఒక్క వేణూకి మాత్రం ఇవేమీ అర్థంకాలేదు. ఎవరూ అర్థం కానివ్వలేదు. కానీ వాడికి అక్కయ్యని కొట్టడం ఆశ్చర్యంగా, పైశాచికంగా కనిపించింది. రెండోరోజు సీత తీవ్రమైన జ్వరంతో మంచం పట్టేసరికి హడలిపోయారు. ఎవరూ లేనప్పుడు సీత తమ్ముణ్ణి పిలిచింది.

''ఓ చిన్న సహాయం చేస్తావా?'' అని అడిగింది.

''ఏ సహాయమూ చేసే వయస్సు లేదని బాధపడుతున్న వేణుకి ఈ మాట చాలా ఉత్సాహాన్నిచ్చింది. ''నువ్వేం చెయ్యమన్నా చేస్తానక్కా. ఏం చెయ్యమంటావు, చెప్పు?'' అన్నాడు.

''ఒక్కసారి శాంతతో మాట్లాడాలిరా! ఎవరూ చూడకుండా రాత్రి పదిగంటలకి వీధి కొళాయి గట్టు దగ్గరకు రమ్మను'' అంది.

వాడు లేచి పరిగెత్తబోతే ''జాగ్రత్త! నాన్నగారికి తెలిస్తే చంపేస్తారు'' అంది.

దుఃఖంలో ఉన్న స్త్రీ సులువుగా త్యాగానికి సిద్ధపడితే పురుషుడు సాహసానికి పూనుకుంటాడు. శాంతని గోపాలానికి చేస్తారన్న విషయంలో తనకు చెయ్యరన్న ఆలోచన మొదటి క్షణంలో దుఃఖానికి దారి తీస్తే తన హఠం వల్ల శాంతకీ గోపాలం కాకుండా పోతాడేమోనన్న భాం మళ్ళీ మళ్ళీ ఆలోచించేటట్టు చేసింది. శాంత నిజంగా పెళ్ళి చేసుకోవాలనుకుంటే తను అడ్డు నిలబడడం ఏం స్నేహమనిపించుకుంటుంది? తను మధ్యలోంచి తొలిగిపోతే?

''నిజంగా గోపాలాన్ని చేసుకోవాలనుందటే నీకు?'' మొదటి ప్రశ్న సూటిగా వేసేసరికి శాంత బిత్తరపోయింది. ఆరునెలలుగా ఆహారం, నిద్రలేనట్టు దిగజారిపోయిన ఆమెనీ, దుఃఖంతో పత్తికాయలయిన కళ్ళనీ, కంఠంలో వ్యక్తమయే నిర్వేదాన్ని చూసి భోరుమంది శాంత.

ఒక్కసారి స్నేహితురాల్ని కావలించుకుని ''సీతా నేనా గోపాలంగారిని సరిగా చూడనయినా చూడలేదేఁ ఇవన్నీ నాన్న ఆలోచనలు. నాతో ఒక్కసారైనా మాట్లాడలేదు. అయినా ప్రాణం పోయినా నీ దారికడ్డు వొస్తాననుకున్నావా? బెంగపెట్టుకోకే'' అంటూ అప్పటికనవలసిన మాటలు వల్లించింది సీత మనస్సుని తృప్తి పరచడానికి.

అంతవరకూ ఆ ఆలోచనలతో బరువెక్కిన మనస్సు తేలికపడి నీరసం వచ్చింది. అంత జ్వరంలోనూ ఎలా నడిచి రాగలిగిందో తనకే తెలియదు. ఇప్పుడు శాంతతో మాట్లాడాక సగం బాధ తగ్గినట్టనిపించింది.

''ఉద్రేకంలో ఏదో తొందరపడి అమ్మతో అనేశాను. తర్వాత ఆలోచిస్తే నీకన్యాయం చేస్తున్నాననిపించింది. నీకే అభిప్రాయం లేకపోతే నాకే భాధలేదు. నాకేమవుతుందోనన్న దిగులు లేదు. మంచో చెడో ఒక మార్గం ఎంచుకున్నాను. అందులో నాశనమయినా నాకు బాధలేదు'' అంది సీత.

తన స్నేహితురాలు ఎంత పెరిగిందా అని దిగ్భ్రమతో చూసింది. జీవితాన్ని ప్రేమించి కలలు కనే వయస్సు నుంచి, జీవితంలో అడుగుపెట్టే క్షణానికి వచ్చి నిలిచింది సీత. ఆ క్షణంలో ఏ స్త్రీకయినా ఆ అందం వస్తుంది. భుజం మీద చెయ్యి వేసి ''దేనికీ అధైర్యపడకు. ఆవేశంలో ఏ పనీ చెయ్యనని మాటియ్యి'' అని చెయ్యి చాపింది శాంత.

ఆలోచిస్తూ చేతిలో చెయ్యి వేసింది సీత.

గోపాలంతో సాన్నిహిత్యం పెరిగాక వాళ్ళిద్దరూ ఒక్కసారయినా కలవలేదు. అందుకని ఆ రాత్రిలో కొళాయి గట్టున కూచుని అన్ని విషయాలూ ఒకరినొకరు చెప్పుకున్నారు. అన్నీ మాట్లాడినా వాళ్ళ సంభాషణ వెనుక ఏదో దిగులు ఉన్నట్టు అర్థమైంది. 'నాన్నగారు వస్తారేమో అక్కా చాలా సేపయింది. ఇంక పద' అని వేణు హెచ్చరించే వరకూ ఇద్దరూ కూర్చుని వున్నారు.

**గోవిందరావుకి బాధ్యత, బాధల** మధ్య మనస్సు నలిగిపోతోంది. దుఃఖం నుంచి తేరుకున్న కొద్దీ కర్తవ్యం గుర్తుకు రాసాగింది. ఏం చెయ్యడానికీ తోచలేదు. ఓ సాయంకాలం కుర్చీలో కూర్చునవ్వాడల్లా హఠాత్తుగా లేచి 'వర్ధనీ' అని భార్యని పిలిచాడు. ఆ పిలుపుకి పరిగెత్తుకు వచ్చింది.

"నేనొక్కసారి ఆ గోపాలరావుతో మాట్లాడి వస్తాను. నువ్వు అమ్మాయిని కనిపెట్టుకుని వుండు" అంతవరకూ ఒత్తిడి చేస్తున్న ఆలోచనల మధ్య, అతని గొంతు ఆవేశంతో వణకడం గమనించి, వర్ధనమ్మ అతని చెయ్యి పట్టుంది.

"వద్దండీ, అమ్మాయిని మీరేమన్నా మీ కడుపున పుట్టింది కనక ఏడుస్తూ సహిస్తుంది. ఆ అబ్బాయిని ఏమీ అనే అధికారం మీకు లేదు అంది దుఃఖంలోనే. ఆ మాట అంటుంటే ఆమెకు కళ్ళనీళ్ళు వచ్చాయి.

ఆలోచించాడు గోవిందరావు తలూపి "నువ్వు చెప్పింది నిజమే. అయినా అతనితో మాట్లాడితేగాని మనశ్శాంతి ఉండదు. అతన్నేమీ చెయ్యనులే" అంటూ ముందుకు నడిచాడు.

అప్పటికే సాయంకాలం గడిచి చీకటి తెరలు ముసురుకుంటున్నాయి. మల్లె పందిరి వెనకాల నుండి సీత ముందుకు వచ్చింది. తను చెయ్యి చేసుకున్నాక అదే చూడడం అమ్మాయిని, జాలిగా బాధగా పలకరించాడు "ఏం అమ్మా?" అంటూ.

"ఆయనతో మాట్లాడతారా నాన్నా?" అనడిగింది.

తమ మాటలు విన్నదని గ్రహించాడు. "అవునమ్మా. కాని.."

మధ్యలోనే ఆపింది. "మరేం ఫరవాలేదు మాట్లాడండి. కానీ ఒకవేళ అతనిమీద మీకు చాలా కోపమొస్తే ఇందులో సగం పొరపాటు నాది కూడా ఉందని మరచిపోకండి. అతని ఒంటిమీద చెయ్యి పడితే నేను బ్రతకను."

కూతురిలో ఇంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చిందా అని ఆశ్చర్యపోయాడు గోవిందరావు. భర్త అనే వ్యక్తిమీద స్త్రీకి ప్రేమ గౌరవం, భక్తి పెళ్ళితోనే ప్రారంభం కావు. పుట్టుకనుంచీ పెంచుకుంటున్న ఈ భావాన్ని, పెళ్ళి తర్వాత ఒక వ్యక్తికి అంకితం చేస్తుంది. అందువల్ల భార్యాభర్తల బాంధవ్యం మగాడికి పెళ్ళితోనే ప్రారంభమవుతే, ఆడదానికి పుట్టుక నుంచీ ప్రారంభమయినట్టే లెక్క.

"నీ బ్రతుకు నాశనం చేసినవాడికి కూడా మంచి జరగాలనే కోరుకోమన్నావా అమ్మా" అన్నాడు గోవిందరావు.

"అన్యాయం అన్నది మనం అనుకోవడంలోనే ఉంది నాన్నా. ఆయన నన్ను చేసుకుంటానంటే ఇదంతా న్యాయమని మీరే అంటారు" నవ్వింది. ఈ ప్రశ్నలకి ఎలా సమాధానం చెప్పాలో ఆమెకి తెలియనిది కాదు. ఈ జవాబుకి బిత్తరపోయాడు.

"అలాగేలే. మేమనుకున్న అన్యాయాలు, అక్రమాల మాటకేం? నువ్వనుకున్న న్యాయమైనా నీకు జరిగితే మాకంతే చాలు" అనుకుంటూ మెట్లు దిగాడు.

అప్పుడే గుమ్మంలో అడుగుపెడుతున్న గోపాలం, భుజం మీద చెయ్యి పడితే వెనక్కి తిరిగి గోవిందరావుని చూసి తుళ్ళిపడ్డాడు. గోవిందరావు చాలా ప్రయత్నంతో నవ్వు తెచ్చుకుని "ఆఫీసు నుంచి వస్తున్నారా? అన్నాడు. తలూపాడు గోపాలం.

"అలా పార్కు వేపు వెళదాం పదండి."

"నాకు కొంచెం పని.."

"మీకు పని ఉన్నా గత్యంతరం లేదు. రండి" భుజం మీద చేతితోనే అతన్ని వెనక్కి తిప్పాడు. తనకంటే దాదాపు ఇరవై యేళ్ళు పెద్దవాడయినా చేతిలో ఎంత బలం ఉందో అర్థమైంది గోపాలానికి తన చేతికింద గోపాలం శరీరం వణకడం గ్రహించి నవ్వుకున్నాడు గోవిందరావు. దారి పొడుగునా జనాభా పెరుగుదల గురించి, వాతావరణం గురించి మాట్లాడుతూ అసలు విషయం కదపకపోయేసరికి గోపాలం మరీ బిత్తరపోయాడు.

ఇద్దరూ పచ్చికలో కూలబడ్డాక మెల్లగా అన్నాడు గోవిందరావు. "నువ్వేం భయపడక్కరలేదు. నీ మీద చెయ్యి చేసుకోనని ఇంట్లో మాటిచ్చి వచ్చాను. మనిద్దరం స్నేహితుల్లా మాట్లాడుకుందాం కొంతసేపు. ఏమంటావు?"

తలూపాడు గోపాలం. "ఏం చెప్పమంటారో అడగండి."

"సీతతో స్నేహం చెయ్యడంలో నీ ఉద్దేశ్యమేమిటి?"

"ఉద్దేశమేముంటది?"

"అంటే సరదాకా?"

"అబ్బే అలాక్కాదు."

"లేక వినోదానికా?"

గోపాలం ముఖం ఎర్రనయింది. "సీత అంటే నాకు గౌరవం ఉంది."

"అందుకని దాని జీవితం నాశనం చెయ్యాలని ముచ్చటపడ్డావా?"

"నేను నాశనం చెయ్యడం లేదు."

"మరి మనిషి బాధతో, దుఃఖంతో చావడానికి మరేదైనా పేరు పెట్టుకున్నావా?"

చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు గోపాలం. ఇలా మాట్లాడుకుంటూ పోతే తను ఇంట్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేనేమోనని భయమేసింది గోవిందరావుకు. అతనితో మాట్లాడుతుంటే క్షణక్షణం ఉద్రేకం పెరుగుతోంది.

"ఒక్క విషయం చెప్పు గోపాలరావు నీకు వినోదం దానికి జీవిత సమస్య. మీ ఇద్దరి స్నేహం ఎంతవరకు పోయింది? స్నేహితుడిగానే అడుగుతున్నాను."

తలెత్తి అతనివేపే చూస్తున్నాడు గోపాలం.

"భయంలేదు. నిన్నేం చెయ్యను చెప్పు."

"చాలావరకు.."

"అంటే?"

తలవంచుకున్నాడు గోపాలం. అర్థమైంది గోవిందరావుకు. ఒక్కసారి దుఃఖం ఉద్రేకం శరీరాన్ని కుదిపేశాయి. అతి ప్రయత్నం మీద తమాయించుకున్నాడు. చాలాసేపు కావాలని మాట్లాడలేదు. తర్వాత అడిగాడు మళ్ళీ.

"ఇప్పుడేం చెయ్యదలచుకున్నావు?"

"ఏం చేస్తాను?"

"సీతను పెళ్ళి చేసుకుంటావా?"

"చేసుకుంటే మా నాన్న నాతో తెగతెంపులు చేసుకుంటాడు. డబ్బు ఇవ్వడు. చదువు ఆగిపోతుంది. ఉద్యోగం దొరకదు."

"మరి ఇవన్నీ ఆలోచించకుండానే ప్రేమించావా?"

"అవును"

"నేను చదువు చెప్పిస్తాను. ఉద్యోగం ఇప్పిస్తాను. ఏం?"

"అదికాదు."

"ఇంకేమిటి అభ్యంతరం?"

"నిజం చెప్పమంటారా? నాన్న నాకు పెళ్ళి చేసి కట్నం సంపాయించాలనుకుంటున్నాడు."

"నీకు కట్నం తీసుకోవాలనుందా?"

"లేకపోతే సుఖంగా బ్రతకడం ఎలా?"

అవును, ఎలా? సుఖంగా బ్రతికే డబ్బుకోసం, డబ్బును ఇచ్చే ఉద్యోగం కావాలి. డబ్బును ఇచ్చే ఉద్యోగం కోసం డబ్బును తెచ్చేపాటి చదువు కావాలి. కానీ చదువు ఇచ్చే విచక్షణ, సంస్కారం చూపే ఆదర్శం అక్కరలేదు. అన్నీ ఆలోచిస్తూ బ్రతికేదెట్లా? ఇన్ని మాటల్లో చెప్పలేదు గోపాలం, కానీ చెప్పిన మాటల్లో దాదాపు ఇన్ని భావాల్నీ ప్రదర్శించాడు.

"నువ్వు సుఖంగా బ్రతకడం కోసం సీతని మరిచిపోతానంటున్నావు. మరి అది నిన్ను మరచిపోవడం కోసం బ్రతకడమే మానేయాలి. అది ఆలోచించావా?"

మాట్లాడలేదు గోపాలం. కష్టాల్ని కొందరు గుండె నిబ్బరంతో సాధిస్తారు. కొందరు చావుతో సాధిస్తారు. తెలిసీ తెలియని కష్టాల్ని కొనుక్కుని బతుకుతూ చచ్చేకంటే, తెలుసుకుని కష్టాల్ని దూరం చేసుకోవడం కోసం చావడం మంచిది కాదా?

నవ్వొచ్చేదే గోపాలానికి, కానీ ఎదురుగా గోవిందరావు ఉన్నాడు.

విసుగేసింది గోవిందరావుకి. అతనితో ఎంత వాదించినా లాభంలేదు. జీవితాన్ని, ప్రేమను వేరు వేరు అరల్లో బిగించి, అవసరమైనప్పుడు వేర్వేరుగా ఉపయోగించుకోవడం ఇతనికిదే మొదటి పర్యాయం కాదనిపించింది. లేచి నిలబడ్డాడు. చిత్రమేమిటంటే అతన్ని మింగేసంత కోపంతో అక్కడికి వచ్చాడు గోవిందరావు. ఇప్పుడు కోపం లేదు. ఒక పరిస్థితికి రాజీపడ్డ ఉదాసీనత, నిస్పృహలాంటిదేదో మనస్సులో కదులుతోంది.

మర్రిచెట్టు క్రిందకి వచ్చాక, గొంతు పూరించుకుని అన్నాడు. "అయిందేదో అయిపోయింది. ఇందులో విపరీతంగా నష్టపోయింది నేనూ, నా కూతురూ. మళ్ళీ అడ్డురాకు నా తోవకు. ఈసారి మా విషయంలో జోక్యం చేసుకుంటే దేవుడు కూడా నిన్ను కాపాడలేడు."

అని ముందుకు నడిచిపోయాడు. అతను వెళ్ళిపోయేవరకూ నిలబడ్డాడు గోపాలం. తర్వాత ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాడు రెండు కొండల మధ్య అగాధమైన లోయని దాటడానికి త్రాటిమీద ఊపిరి బిగపట్టి నడిచినంత అలసటను అనుభవించాడు ఈ కొద్దిక్షణాల్లో. ఇప్పుడు విశ్రాంతిగా ఉంది. అంతేకాదు, తన తండ్రి నేర్పిన సూత్రాల ప్రకారం ఒక విషయాన్ని ఎటూ తెగకుండా నడిపించడం కూడా విజయమేనని నిరూపించాడు. వెంటనే హోటల్‌కి వెళ్ళి రెండు జిలేబీలు తిని మజ్జిగ త్రాగి వచ్చాడు.

తిరిగి వస్తూంటే అతనికి హఠాత్తుగా ఒక విషయం గుర్తుకొచ్చింది. ఆలోచిస్తున్న కొద్దీ గోవిందరావుని తను జయించడం పట్ల కలిగిన తృప్తి చప్పబడుతోంది. ఎందుచేత? హఠాత్తుగా అతనికి తట్టింది.

నిజంగా తను సీతని ప్రేమిస్తున్నాడు.

మొదట చాలామంది జాబితాలో ఆమెనీ కలపబోయినా ఈ అమాయకత్వం, ఆరాధనా తనని ఆకర్షించింది.

ఇంత త్వరగా పరిస్థితులన్నీ తనని బిగించెయ్యకపోతే ఏం జరిగేదో?

గోవిందరావు బ్రతుకంటే భయపడి వణికి తన బ్రతుకు భయంకరమయే పరిస్థితి కల్పించబోయాడు. దానినుంచి తను తప్పించుకు పారిపోవలసి వచ్చింది.

కాకపోతే తను సీతను ప్రేపిస్తున్నాడు.

## 10

తెల్లవారు ఝామున మూడయింది.

డాబామీదకి వంగిన వేపచెట్టు గాలికి సందిగ్ధంలో ఉన్న మనస్సులాగా ఊగిసలాడుతోంది. ఉదయపు వెలుగుని ఇరవై గంటల క్రితం మరచిపోయిన పక్షులు గుడ్డి వెన్నలని సంధ్యగా భ్రమసి కేకలు వేస్తున్నాయి.

అరుపుల మధ్య సన్నగా తన పేరు వినిపించి నిద్దట్లోంచి మేలుకున్నాడు గోపాలం. ప్రక్కనే నాగరాజు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. పదే పదే తలుపు చప్పుడు, బలహీనంగా పిలుపూ తెలుస్తోంది. పక్షుల్లాగే వెన్నెల గుడ్డి వెలుగు చూసి తెల్లవారిందని భ్రమపడ్డాడు. పనిమనిషి ఇవాళ తొందరగా వచ్చిందనుకున్నాడు. నిద్ర పాడుచేసినందుకు విసుగేసింది. కళ్ళు నలుపుకుంటూ మెట్లన్నీ దిగి వచ్చి తలుపు తీశాడు. తలుపు మీదే సొమ్మసిల్లిన శరీరం. అది తెరుచుకోగానే అతని మీదకి జారిపోయింది.

ఉలిక్కిపడ్డాడు. ఆ ఊపిరి అతనికి గుర్తే. 'సీతా!' అన్నాడు. సమాధానం చెప్పే స్పృహ ఆమెకి లేదు. తెరిచిన తలుపులకి ఎదురుగా, బెదిరిన మనస్సుతో విజృంభించిన ఆలోచనతో ఎన్ని యుగాలో నిలబడిపోయాడు. ఆప్యాయంగా దగ్గరకి తీసుకుంటాడని, ఆదరించి కన్నీరు తుడుస్తాడనీ ఆశపడ్డ సీతకి తెలివిరాగానే భుజం మీద చెయ్యి స్పర్శ మాత్రం తెలిసి గుండె కదిలింది. చెయ్యి తప్పించుకుని తలుపు దగ్గరకి వేసింది. మూలన ఉన్న కూజా దగ్గరకి వెళ్ళి నీళ్ళు ముఖం

మీద జల్లుకుంది. జ్వర తీవ్రత ఎక్కువయిన సూచన బాగా తెలుస్తోంది. అయినా లక్ష్యం చెయ్యకుండా అతని గదిలోకి నడిచి కిటికీ మీద కూచుంది.

మంత్రముగ్ధుడిలాగా లోపలికి వచ్చాడు గోపాలం. టేబుల్ మీద వాచీ రెండు దగ్గర ఆగిపోయింది.

"ఇప్పుడెంతయింది?" అన్నాడు.

"ఏమో తెలీదు. హఠాత్తుగా తెలివొచ్చింది. ఆలోచించిన కొద్దీ భయం ఎక్కువైంది. మీ దగ్గరకి వచ్చేశాను. వాళ్ళు మనిద్దరినీ వేరు చేద్దామనుకుంటున్నారు. నాన్నగారు మీతో పెళ్ళి గురించి మాట్లాడతారనుకున్నాను. కానీ తెగతెంపులు చేసుకు వచ్చారట."

"అయితే?"

ప్రశ్న కఠినంగా వినిపించింది సీతకి. గుండెలో శూలంతో పొడిచినట్టయింది. 'అలాగా' అని ఆశ్చర్యపోతాడనో, 'నీకేం భయంలేదు' అని ఓదరుస్తాడనో ఆశించింది.

"అందుకని అర్ధరాత్రి పారిపోయొచ్చావా? ఎవరైనా చూశారా?"

"ఏమో తెలియదు. అయినా చూస్తే తప్పేం? రేపయినా ఇది నలుగురికి తెలియవలసిందేగా? నేనింక ఇక్కడ్నుంచి వెళ్ళను."

"సీతా నీకు మతిపోయిందా ఏమిటి?"

పక్కకి వొచ్చి కూర్చున్నాడు. ఆమెకి ఆ మాటల్లో భోరున దుఃఖం వచ్చింది. అతని ఒడిలో తల వుంచుకుని ఏడ్చేసింది.

జాలీ, ఆప్యాయతలతో మనస్సు ఆలోడితమైంది. తల నిమురుతూ "ఏడవకు సీతా, ఇంట్లోంచి వచ్చేసినంత మాత్రాన పెళ్ళి జరిగిపోదు. ఇలా మనిద్దరినీ ఎవరైనా చూస్తే కొంప మునుగుతుంది" అన్నాడు.

"ఉస్మాన్ సాగర్ ముందు, పార్కులో, కారులో, సినిమాల్లో ఎవరైనా చూసినప్పుడు కొంప మునుగుతుందని గుర్తు ఎందుకు లేదు?" అని అడగడం సీతకి చేతకాలేదు.

"నన్ను ఒంటరిగా వదిలెయ్యకండి. ఈ కష్టంలో మీరు తప్ప నాకెవ్వరూ బంధువులుగా కనిపించడం లేదు. మా వాళ్ళంతా నన్ను అసహ్యించుకుంటున్నారు" అంది దుఃఖంతో.

ఆమె పట్టుదల చూస్తున్న కొద్దీ గోపాలానికి భయమెక్కువైంది. ఒక క్షణం ఒక యుగంలాగా గడుస్తోంది. భయంతో, మొండితనం, కాఠిన్యం వచ్చింది.

'ఇలా రావడానికి వీల్లేదు సీతా. మీ ఇంటికి పద. గుమ్మం వరకూ దిగబెట్టి వస్తాను" అని లేచాడు.

జ్వరంతో, దుఃఖంతో ఎరుపెక్కిన కళ్ళతో అతని వేపు చూసింది.

"హాయిగా ఆడుతూ పాడూతూ తిరిగేదాన్ని. నాకీ ప్రేమని ఎందుకు నేర్పారు. ఇప్పుడు ఎటూకాని పరిస్థితిలో నన్ను వదిలిపోతారా? మీకిది న్యాయంకాదు" అంది.

మాట పూర్తికాకుండానే తలుపు చప్పుడైంది. దుఃఖంతో పూడుకుపోయిన గొంతు రహస్యంగా సీతని పిలుస్తోంది.

"ఎవరూ?" అన్నాడు గోపాలం వణికిపోతూ.

"అమ్మ" అంది సీత నిర్లక్ష్యంగా.

"నేను రానని, ఇక్కడే ఉంటానని చెప్పి రండి" అంది.

గోపాలం క్షణం సేపు కర్తవ్య మూఢుడయ్యాడు. బయట పిలిచే కంఠంలో దుఃఖం ఎక్కువవుతోంది. ఒక్కసారి చైతన్యం తెచ్చుకుని, సీత భుజం పట్టుకుని చరచరా నడిచి గుమ్మం వరకూ వచ్చాడు. తలుపు తీసీ తియ్యడంతో వర్ధనమ్మ, పోయిన వస్తువు దొరికినట్టు రెండు చేతులతో సీతను వాటేసుకుంది. కానీ అంత హఠాత్తుగానూ సీత ఆమెని విడిపించుకుని గోపాలం వెనక్కి వచ్చి నిలబడింది.

"ఇకనుంచి నేను నీ కూతుర్ని కాదమ్మా, ఈయన భార్యని" అంది. అంతే మరుక్షణంలో ఆమె చెంప ఛెళ్ళుమంది. సీతకి ముఖం తిరిగింది. ఇంత వయస్సులో కూతురి మీద మొదటిసారిగా చెయ్యి చేసుకున్నందుకు విచారం కలగలేదు. స్పృహలేని ఆ శరీరాన్ని రెండు చేతులతో పట్టుకుని గోపాలం వేపు తిరిగింది.

"ఆయన్ని పదిరోజులుగా ఆపలేకపోతున్నాను. ఉద్రేకంతో ఊగిపోతున్నారు. ఆయన పడుకునే ఉన్నారు. ఈ విషయం తెలిస్తే మీకేం జరుగుతుందోనని భయంగా ఉంది. దయచేసి ఇక్కణ్ణుంచి వెళ్ళిపోండి. మీ కాళ్ళు పట్టుకుని చెపుతున్నాను" అని గుమ్మం వైపు తిరిగి, అంతలో ఆగింది.

"నవ్వుతూ ఆడుకునే అమ్మాయిని శవంలాగా మోసుకుపోయే స్థితి వచ్చేసింది. ఇకనైనా దాన్ని మరచిపోండి. కన్నపాపానికి చచ్చిపోయేవరకూ దాన్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటాం. పెళ్ళి ఊసెత్తకుండా అది మీకిచ్చిన సుఖానికి, కనీసం మాకు ఈ మాత్రం సహాయం చేసిపెట్టండి" దుఃఖం ముంచుకురాగా, కూతురు చుట్టూ చేతులు వేసుకుని మెల్లగా నడిపించుకుపోయింది.

కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు గోపాలం.

11

తరువాత జరగవలసిన సంఘటనలు అతి విచిత్రంగా, కళ్ళు మూసి తెరిచేలోగా జరిగిపోయాయి.

నాగరాజుకి తెలివొచ్చి కిందకి వచ్చేసరికి జరగాల్సిందంతా జరిగిపోయింది. విషయమంతా తెలుసుకున్నాక, అప్పటికప్పుడు గోపాలాన్ని మరో స్నేహితుడి ఇంటికి బదిలీ చేయించాడు. మరి రెండు రోజుల్లో మంచి ఇల్లు చూసి అందులో ప్రవేశ పెట్టాడు. నాగరాజు ఎలా చెపితే అలా తు.చా తప్పకుండా నడుచుకున్నాడు గోపాలం. అతనింకా సీత వెళ్ళిపోతూ చూసిన చివరి చూపునుంచి తేరుకోలేదు.

మూడోనాడు మధ్యాహ్నానికి రమాపతిరావు నాగరాజు టెలిగ్రాం అందుకుంటూనే, మరో ఆలోచన లేకుండా బయలుదేరారు. స్టేషన్లో దిగుతూనే ముందు గోపాలాన్ని కలుసుకోవడానికి వెళ్ళలేదు. సరాసరి నాగరాజు ఫ్యాక్టరీకి వెళ్ళాడు.

"ఏవిటోయ్ మావాడేం చేశాడు?" అని తాపీగా ప్రశ్నించాడు నాగరాజుని కుర్చీలో చేరగిలపడుతూ.

జరిగినదంతా, పొల్లుపోకుండా విపులంగా చెప్పాడు నాగరాజు. అంతా విని పగలబడి నవ్వాడు. "ఇక్కడ వీడేదో ఉద్ధరిస్తాడనుకున్నాను. ఆఖరికి ప్రేమ చిక్కుల్ని కూడా విడదీసుకుని బడుద్ధాయి అయాడన్నమాట" అనేసరికి నాగరాజు నిర్ఘాంతపోయాడు.

రమాపతిరావుగారికి ఇందులో ఏ విషయమూ, భయంగాని, ఆశ్చర్యంగాని కలిగించలేదు. చిక్కుల్ని కల్పించడం, మళ్ళీ వాటిని విప్పే సుళువులు తనకే మిగుల్చుకోవడం. ఇవన్నీ తనమీద జుత్తు నెరిసిపోయేటన్ని చూశాడు తన అనుభవంతో. ఇది ఒక కార్మిక సమస్యలో వెయ్యోవంతు లేదు. నాగరాజుకి అతను చూపిన ఆర్గ్యుమెంటు ఇది. "అబ్బాయి అమ్మాయిని ప్రేమించాడు. అవును అమ్మాయిని ప్రేమించక అమ్మమ్మను ప్రేమిస్తాడా? అమ్మాయి కూడా అబ్బాయిని ప్రేమించింది. భేష్ బాగుంది మా అబ్బాయి అందగాడు కాదు, కనీసం నీ అంత అందగాడు కాడు. అయినా ప్రేమించిందంటే వాడు ధనవంతుడని గ్రహించి ఉండాలి. వాళ్ళనాన్న బాగా సంపాదిస్తున్నాడని గుర్తించి ఉండాలి. వాడు తెలివైన వాడనీ, మంచి ఉద్యోగాన్ని సంపాదించుకుని తన పిల్లల్ని పోషించుకుంటాడని గ్రహించి ఉండాలి" ఇక్కడ ఒక సామెత వాడాడు రమాపతిరావు. "బెల్లం ఉన్నచోటే చీమలు చేరతాయి" ఆ తరవాత ఈ ప్రేమ వ్యాపారంలో ఇద్దరూ పందాలు వొడ్డారు. అమ్మాయి ఓడిపోయింది. అంతమాత్రాన చచ్చిపోతుంది, ఆత్మత్యాగం చేసుకుంటుంది అనడం వొట్టి భ్రమ. నేను నమ్మను. ప్రేమా? ఆ మాటకర్థం లేదు. అదెక్కడ ఉందో నేనింతవరకూ చూడలేదు. ముప్పయి ఏళ్ళు పెంచిన తల్లిపోతే ఎలా బ్రతకడమా అని ఏడ్చిన కొడుకులున్నారు. ఆ తల్లిపోయాక డెబ్బైయేళ్ళు బ్రతికిన వాళ్ళు ఉన్నారు. అయినా ఇరవైయేళ్ళు పెంచిన తల్లిదండ్రుల మీద లేని ప్రేమ ఆ అమ్మాయికి ఆరునెలల్లో వీడిమీద ఎట్లా పుట్టుకొచ్చింది? వీడు చేసింది మోసమా? ఏమీ కమిట్ కాలేదని చెప్పాడంటున్నావు. పెళ్ళిచూపులు చూసినవాళ్ళందరినీ చేసుకుంటారటోయ్. ఆధునికులు కనుక మరో అడుగు ముందుకు వేశారు. కారులో తిరిగారు. పార్కులకి వెళ్ళారు. కలిసి బ్రతుకుదామనుకున్నారు. పోనీ, ఇద్దరూ కాకపోతే వీడే అన్నాడనుకుందాం. విడిపోయారు. మనమేం చేస్తాం? వాడికేం కాకుండా చూసుకునే బాధ్యత నాది.

సాయంకాలం గోపాలాన్ని తీసుకుని 'క్వాలిటీ'కి వెళ్ళాడు రమాపతిరావుగారు. ఇక్కడ మాత్రం నాగరాజుతో మాట్లాడినంత నవ్వులాటగా మాట్లాడలేదు.

"బుద్ధిగా చదువుకుంటావని పంపిస్తే ఇదా నువ్వు చేసేది?" అని గంభీరంగా ప్రారంభించారు.

"అందరు అమ్మాయిల్లాగా కాదు నాన్నా ఈ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకుందామనుకున్నాను."

"అనుకున్నావా, ఆ అమ్మాయితో అన్నావా?"

"అనలేదు."

"బ్రతికించావు."

"లేదు నాన్నా నేను ఆ అమ్మాయికి అన్యాయం చెయ్యదలచుకోలేదు" సీత కన్నీళ్ళని గుర్తుచేసుకుంటూ నిర్ధారణగా అన్నాడు.

ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు రమాపతిరావు. తన పరోక్షంలో గోవిందరావుని ఎదిరించిన కొడుకు ఇప్పుడూ మళ్ళీ మెత్తటి ఆలోచనలకి లొంగిపోతున్నాడని గ్రహించాడు. ఈ పరిస్థితిలో ఆ భావాన్ని చెడగొట్టడం తక్షణ కర్తవ్యమని నిర్ధారించుకున్నాడు.

"మరి అలాంటప్పుడూ ఇంతవరకూ ఎందుకు రానిచ్చావ్?"

"అంటే?"

"రిజిస్టర్ మారేజ్ చేసుకుని నాకు టెలిగ్రాం ఇస్తే పోయేదిగా? లేకపోతే ఆ అమ్మాయి నీ ఇంటికి వచ్చినప్పుడు ఆ పని చేస్తే పోయేదిగా?"

తెల్లబోయాడు గోపాలం. "అయితే నువ్వు అప్పుడు ఒప్పుకునేవాడివా?"

"నా ఒప్పుదలతో నీకు పనేముంది? ఒక అమ్మాయిని నిష్కారణంగా గంగలో ముంచినందుకు లోకమంతా నీకు కిరీటం పెట్టేది."

"కాని.." ఏదో చెప్పాలని ఏమీ చెప్పలేకపోతున్నాడు గోపాలం.

నవ్వాడు రమాపతిరావు. "ఎందుకు చెయ్యలేకపోయావో చెప్తాను విను. నీకు డబ్బున్న తండ్రి కావాలి. ఆస్తి కావాలి, చదువు కావాలి, నలుగురిలో పరువు ప్రతిష్టలు కావాలి. ఇవన్నీ ఉన్న తర్వాత నీకు కావలసినది అమ్మాయి. అంతేనా?"

మాట్లాడలేదు గోపాలం.

చాలా చిన్న ఉదాహరణలు ఉపయోగించి కొడుకు కలలన్నీ చెదరగొట్టేశాడు రమాపతిరావు. అతను జయించిన మహా మేరు పర్వతాలలో ఇతను ఒక గులకరాయి.

"రెండు పనులు చెప్తాను. చెయ్. నువ్విప్పుడు తింటున్న ఐస్‌క్రీమ్ ఈ ఊర్లోకెల్లా ఖరీదైనది. నీ జేబులో డబ్బంతా నాకిచ్చేయి. ఇవాళంతా ఊరు తిరుగు. రమాపతిరావు కొడుకునని చెప్పకు. సాయంత్రానికి ఈ ఐస్‌క్రీమ్‌ని నీ అంత నువ్వు సంపాదించుకోగలిగితే ఆ అమ్మాయిని ఇచ్చి నేను పెళ్ళి చేస్తాను."

గోపాలం విస్తుపోయాడు.

"పోనీ, మరో పని చెప్తాను విను. 'ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. తండ్రి దుర్మార్గుడు కావడం వల్ల డబ్బు ఇవ్వలేదు. చదువు నిలిచిపోయింది. అందుకని దయచేసి మీరు ఉద్యోగం ఇస్తే ఒక తిరుగుబాటుని సమర్థించిన వారవుతారు' అని చెప్పి కనీసం ఒక్కచోట ఉద్యోగం సంపాదించు - ఈ పెళ్ళి నేను చేస్తాను."

గోపాలం మాట్లాడలేదు. "నాకిదంతా తెలుసు" అన్నాడు చివరికి నిట్టూరుస్తూ.

"అవును. నీకు తెలుసని నాకూ తెలుసు. అందుకే గోవిందరావుకి ఎదురు నిలువగలిగావు. ఇప్పుడిక జావ కారకు. నీ పరీక్షలయేవరకూ నిశ్శబ్దంగా ఇక్కడ గడిపేయ్. ఈ చిన్న విషయానికి చదువు పాడుచేసుకోవడం మంచిది కాదు. తర్వాత కాలేజీ మార్చేద్దువుగాని. నేనింక వెళ్ళిరానా?"

గోపాలరావు గొర్రెలాగా తలాడించాడు. 'క్వాలిటీ'లో బిల్లుకి ఇంటికి టాక్సీలో వెళ్ళడానికి, ఇతర ఖర్చులకి అయిదువందలు జేబులో ఉంచి అక్కడ్నుంచి అటే వెళ్ళిపోయాడు. అతని మాటకంటే అయిదువందలు చూడగానే 'నిజం' అర్థమైంది. చల్లటి మరో ఐస్‌క్రీమ్ తిని ఇంటికి చేరాడు పదిగంటలకి.

వెళ్ళిపోతూ మళ్ళీ నాగరాజుని కలిశాడు రమాపతిరావు. 'అబ్బాయితో అంతా మాట్లాడాను. సెటిల్ చేసేసాను' అన్నాడు.

'ఏమిటి సెటిల్ చేశా'రని నాగరాజు అడగలేదు. అది తనపని కాదు కనుక.

'ఈ వ్యవహారంలో ఆ అమ్మాయి చాలా నష్టపోయినట్టు కనిపిస్తోంది. తండ్రి కూడా చాలా బాధలకు గురయినట్టున్నాడు. కావలిస్తే ఒకటి రెండువేలు ఇచ్చయినా ఇది తీరిపోయేటట్టు చూడు" అన్నాడు నాగరాజుతో.

నాగరాజుకి నవ్వొచ్చింది. ఒక ఘాటయిన మాట అన్నాడు.

"డబ్బు కోసమే ఆ అమ్మాయి ప్రేమించి ఉంటే, మీ వాడికంటే నన్నే ప్రేమించేది. వాళ్ళకిది వద్దులెండి."

తన ఐశ్వర్యం మీద దెబ్బకొట్టాడని గుర్తించి, ముఖం నల్లబుచ్చుకున్నాడు రమాపతిరావు. డబ్బు కాకపోతే మరి దేనికోసం ఆ అమ్మాయి ప్రేమించినట్టు? ఏమో? అది తనకర్థంకాని విషయం - అర్థం కాకపోయినా నష్టంలేదు. ‘సరే‘నంటూ అక్కణ్ణుంచి సరాసరి రైలుకి బయలుదేరాడు.

అంతే.

మూడునెలలకి ముప్పైవేల రూపాయల ఆస్తి ఉన్న లేబర్ కమీషనర్‌గారి ఒకే ఒక కూతుర్ని తల్లిదండ్రుల ఆజ్ఞ ప్రకారం పెళ్ళిచేసుకున్నాడు గోపాలం.

***నాగరాజు కథ***

12

ఇరవై యేళ్ళు బలమైన పునాదులతో నిర్మించిన భవనం ఒక తుఫాను గాలి తాకిడికి సమూలంగా కూలిపోయాక, ఆ శిథిల సమాధి మీద ఏర్పడిన నీరవ నిశ్శబ్దంలాంటిది ఆక్రమించుకుంది సీత జీవితాన్ని.

గోపాలానికి పెళ్ళయిపోయిందన్నప్పుడు కూడా ఆమె ఒక్క క్షణం వింతగా చూసిందే తప్ప నిర్ఘాంతపోలేదు. కన్నీరు కార్చనూలేదు. మొదట ఈ నిర్లిప్తతను చూసి తల్లిదండ్రులు భయపడిన మాట నిజం. కాని బయటికి బ్రద్దలయ్యే అగ్ని పర్వతం కంటే, లోన దహించుకునే మంచుకొండయినా ఫరవాలేదనుకున్నారు. సీత ఇదివరకటంతగా ఎవరినీ ఎదిరించడం లేదు. ఏ పనికీ అడ్డుచెప్పడంలేదు. ఒక నెలరోజులకి జ్వరం తగ్గాక టైపు క్లాసుకి కూడా వెళ్ళడం ప్రారంభించింది.

ఒక పెద్ద నదీ ప్రవాహం ఒడ్డుని ఒరుసుకు పారి, దాటిపోయాక ఇంకా దాని గుర్తులు మంచివీ, చెడ్డవీ మిగిలిపోతాయి. అలాగే ఆ ఇంట్లో ఒక జ్ఞాపకం సీతగానూ, మరొకటి నాగరాజు స్నేహంగానూ మిగిలిపోయాయి. నాగరాజు ఆమె పట్లా, ఆమె కుటుంబం పట్లా చూపే సానుభూతి వాళ్ళకి అతన్ని మరింత సన్నిహితం చేసింది. అప్పుడప్పుడు వాళ్ళ వాకిట్లో కూర్చుని మంచీ చెడ్డా విచారించి పోవడం అలవాటు చేసుకున్నాడు. వాళ్ళు అందుకు అభ్యంతరం చెప్పలేదు. ఇలాంటి కష్టాలు అందరితోనూ పంచుకునేవి కావు. కాని పంచుకోగలిగే ఒక్క మంచివాడినైనా ఎందుకు దూరం చేసుకోవాలి? సీత గతాన్ని తలచుకుని కన్నీరు కార్చడానికి, వర్ధనమ్మ వర్తమానాన్ని గుర్తుచేసుకుంటూ దుఃఖించడానికి, గోవిందరావు భవిష్యత్తును ఊహించుకుని బాధపడడానికి నాగరాజు సాక్ష్యం దొరికాడు. అతని ముందు ఎవరికి వీలయినప్పుడు వాళ్ళు ఈ కర్మకాండ జరిపేవారు. సీత మాత్రం గతాన్ని తలుచుకునేదేమో కానీ అతని ముందు మాట్లాడేది కాదు. ఒక్కరోజు కూడా గోపాలాన్ని గురించి అడగలేదు. ఎక్కడికి వెళ్ళాడని ప్రశ్నించలేదు. బ్రతుకు పాడయిందని విచారించలేదు. ఆమె స్థయిర్యానికి నిర్ఘాంతపోయాడు నాగరాజు.

గోపాలానికి పెళ్ళయిందని తెలిసి గోవిందరావు, భార్య నిట్టూర్చారు. ఇంకేం మాట్లాడలేదు.

"గోపాలానికి పెళ్ళయింది తెలుసా?" అన్నాడు నాగరాజు.

ఆ మాటకి చలించలేదు సీత. "మీరు వెళ్ళారా?" అంది.

తలూపాడు.

"మరి వెళ్ళేముందు చెప్పలేదేం నాకు?"

"మీరేమైనా బాధపడితే మళ్ళీ అల్లరవుతుందని. మీకు బాధ కలగడం నాకిష్టంలేదు. ఇప్పటికి కలిగింది చాలు."

నవ్వింది సీత సమాధానంగా. కొంతసేపు ఆగి, "అమ్మాయి ఎలా ఉంటుంది?" అంది.

"గోపాలం అమ్మాయిని పెళ్ళి చేసుకోలేదు" అని సీత తెల్లబోయి చూస్తే, "వాళ్ళ నాన్న డబ్బుని" అన్నాడు.

"కానీ అమ్మాయి మీ అంత అందంగా ఉండదు."

"అదృష్టవంతురాలు. అందం నా అదృష్టాన్ని పాడుచేసింది. అందం లేకపోయినా ఆవిడకి అదృష్టం పట్టింది."

"అదికాదు. అందంలేని అమ్మాయికి వాళ్ళ నాన్న అదృష్టం కొనిపెట్టాడు."

"అవును" అంది పరాకుగా. బాధపడుతున్నదేమోననుకుని, "మీరింక బాధపడకూడదు. ఆ విషయాల్ని ఎంత త్వరగా మరచిపోతే అంత మంచిది" అన్నాడు.

సీత వ్యంగ్యంగా నవ్వింది.

ఆ నవ్వు చూసి నాగరాజు భయపడ్డాడు.

ఓ రోజు నాగరాజుని పలకరించి, "మీ కారులో తిరగాలని ఉంది. ఒక్కసారి తీసుకెళ్ళరూ?" అంది.

ఆ కోరికకి ఆశ్చర్యపోయాడు. కారులో కూర్చున్నాక ఉస్మాన్‌సాగర్ తీసుకెళ్ళమంది. ఎదురుగ్గా ఎండలో తళతళా మెరిసే నీరు కనిపించే చోట కారు ఆపమంది. "ఇక్కడ కాసేపు ఒంటరిగా కూర్చోవాలని ఉంది. మీరలా తిరిగిరండి" అంది. ఏదయినా అఘాయిత్యం చేస్తుందని భయపడుతూనే, చెట్ల మధ్య నుంచి నడుస్తూ నీటివరకూ పోయాడు. కారులో సీత అలా నిశ్చలంగానే ఉంది చాలాసేపు. గాలికి చెట్ల ఆకులు మీద రాలిపడుతున్నాయి. పెళపెళలాడే ఎండలో చెట్ల కింద నీడ స్వచ్ఛమైన పాలబిందెలో పడ్డ మట్టిబెడ్డలాగ నల్లగా ఉంది.

ఎంతోసేపటికి మెల్లగా కారు దగ్గరికి నడిచి వస్తే, వెనక సీట్లో కూర్చుని ఏడుస్తోంది. భయపడిపోయాడు నాగరాజు.

"ఏడుస్తున్నారా?" అని పలకరిస్తే తుళ్ళిపడి లేచి, కళ్ళు తుడుచుకుంది.

"ఇక పదండి పోదాం" అంది తొందరగా.

కారు నడుస్తూంటే అటూ ఇటూ చూస్తూ జుత్తు వెనక్కి తీసుకుంది. "ఎందుకు రమ్మన్నారు ఇక్కడికి?" అన్నాడు కాసేపటికి.

పాత విషయాలు మరచిపొమ్మన్నారు మీరు. మరచిపోవడం ఎక్కడో ఓ చోట ప్రారంభం కావాలిగా. అందుకని ఇక్కడికి వచ్చి ఈ క్షణం నుంచీ మరచిపోవాలనుకున్నాను" అంటూ పిచ్చిగా నవ్వింది.

"మరచిపోతారా?"

"పందెం" అంది.

ఆ దుఃఖమంతా ఎక్కడ మాయమైందో, ఊళ్ళోకి వచ్చేవరకూ పిచ్చిప్రశ్నలు వేస్తూ కూర్చుంది.

నలభై రోజులు జ్వరం అనుభవించాక ఒక్కసారిగా తగ్గిపోవడమూ రోగ లక్షణమే.

అది మంచిది కాదు. ప్రేమ బాధితురాలు ఆ బాధావిముక్తికి కొన్నాళ్ళు తీసుకోవాలి. అంతేకాని మర్నాటి నుండి హాయిగా తిరగడమేమిటి?

సీత ఆ విషయాల్నే తలచక యథాప్రకారంగా తిరగడంతో గోవిందరావుకి మరీ భయమెక్కువైంది. బయటికి కనిపించే బాధ అంతర్ముఖమయినట్టు తోచింది. వర్ధనమ్మతో సంప్రదించి, చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు. త్వరగా పెళ్ళి జరిపిస్తే ఆ విధంగా ఆలోచనల నుంచి విముక్తి లభిస్తుందని తలపోశాడు. కాని అంతవరకూ అంతర్ముఖుడై కుటుంబ విషయాల్నే చూసుకుంటున్న గోవిందరావు ఇప్పుడు మొదటిసారిగా బయటి ప్రపంచంలోకి రావడంతో అతనికి కొన్ని విచిత్రమైన విషయాలు తెలిశాయి. తెలిసిన ఒకటి రెండు సంబంధాల్ని కదపకపోతే "ఆ కాలేజీ అబ్బాయిలతో కారుల్లో తిరిగిన అమ్మాయి సంగతేనా?" అని అడిగేసరికి తెల్లబోయాడు. ఆరునెలలు తిరిగేసరికి అతనికి ఒక విషయం అర్థమైంది. తన కుటుంబాన్నీ, సమీప గతంలో తన జీవితాన్ని తెలిసిన ఎవరితోనూ బాంధవ్యం కలవదని.

పెళ్ళికి సంబంధాలు చూస్తున్నారని తెలిసి ఒకరోజు సీత తల్లితో గట్టిగానే చెప్పింది. "నాకిప్పట్లో పెళ్ళి చేసుకోవాలని లేదు" అంటూ.

"ఏం? మరో గోపాలం వచ్చేవరకూ ఆగుతావా?" అంది తల్లి నిష్టూరంగా ఆ మాటలో కర్కశత్వం కంటే విసుగు, ఉదాసీనత ఎక్కువ కనిపించాయి. తండ్రి దాదాపు అలాంటి అభిప్రాయాల్నే వ్యక్తం చేశాడు. అప్పుడు అర్థమైంది సీతకి. పెళ్ళి తనకవసరమైనా కాకపోయినా, పెంచిన పిల్లలకి పెళ్ళిచేయడం తల్లిదండ్రుల హక్కు అని.

నాగరాజుతో ఓ రోజు అంది "నాకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు."

"మంచిదే" అన్నాడు.

"నాకిప్పుడు చేసుకోవాలని లేదు."

"కాని పెళ్ళి జరిపించడం వాళ్ళకిప్పుడు అవసరం."

"నా కిష్టం లేకపోయినానా?"

"అవును. మీ యిష్టాన్ని సరిగ్గా చెప్పుకోలేకపోయారు. వాళ్ళ కష్టాన్ని ఇప్పుడు సరిగ్గానే తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మీకు ఆనందం లేకపోయినా, వాళ్ళ తృప్తికైనా మీరిప్పుడు అంగీకరించాలి."

నాగరాజుతో మాట్లాడడం వల్ల ఓ కొత్త విషయం తెలిసింది సీతకి. ఆ తర్వాత ఇకనెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. కాని ఆరునెలల ప్రయత్నం తరువాత వాళ్ళు విసిగిపోయారని తెలిసి లోలోపల నవ్వుకుంది.

ఒకరోజు ఉన్నట్టుండి, గాలిలోంచి ఎగిరివచ్చినట్టుగా నల్లటి బట్టలతో, పెద్ద పెట్టె, బెడ్డింగు స్వయంగా మోసుకుంటూ వచ్చి దిగాడు ఒకతను. అతణ్ణి చూసి చాలాసేపటి వరకూ గుర్తుపట్టలేకపోయింది వర్ధనమ్మ. తర్వాత ఉన్నట్టుండి 'బదిరీ' అని అరిచింది.

"నేనే అక్కయ్యా" అంటూ వంటింటి గుమ్మం మీద కూర్చున్నాడు బదిరి. అతణ్ణి చూసి అప్పుడే పదేళ్ళు దాటింది. ఆమెకి అతను స్వయానా తమ్ముడు కాదు. ఏదో కాస్త దూరపు చుట్టరికం. పదేళ్ళ క్రితం ఇంట్లోంచి పారిపోయాడని విన్నాక ఒక పెళ్ళిలో బంధువులంతా ఒక మూలన కూర్చుని ఒక్క ఏడుపు ఏడ్చి ఊరుకున్నారు. తీరా వాడు భిలాయ్‌లో చేరి ఏదో

ఉద్యోగం వెలగబెడుతున్నట్టు అందరికీ తలో ఉత్తరం వచ్చింది. అంతే. ఆ తర్వాత వాడి గురించి వర్ధనమ్మ వినలేదు, ఆలోచించనూ లేదు. ఇప్పుడు చూస్తే నల్లగా మొద్దులా తయారయాడు. పేరు బదరీ నారాయణ. ముద్దుపేరు 'బదరీ'. భిలాయ్ వెళ్ళాక 'బద్రీ' అయ్యాడు. అలవాటు తప్పడం వల్ల తెలుగు హిందీలాగ, హిందీ పంజాబీలాగ మాట్లాడడం అలవాటయింది.

బదరీలో ఓ ప్రత్యేకత ఉంది. అవసరమైన వాటికంటే అన్నింటినీ కాస్త ఎక్కువ పెరిగింది. జుట్టు ఉంగరాలు తిరిగి ఉండలేక, అణిగి ఉండలేక ఎగదన్నేసింది. సామాన్లు కూడా ఒక మనిషి బరువుకి ఎక్కువే ఉన్నాయి. అన్నిటికీ మించి, ఇద్దరికి సరిపడే మీసాలు ముఖానికి వంపు తిరిగి ఉన్నాయి. అసలు వాటిని చూశాకనే వర్ధనమ్మ అతణ్ణి పోల్చుకోలేక బిత్తరపోయింది. బదరీ అమ్మా, నాన్న కోనసీమలో ఏదో పల్లెటూళ్ళో ఉంటున్నారు. అక్కడికి వెళ్ళి భిలాయ్ వెళ్తూ ఒక్కసారి బంధువులందరినీ చూసిపోదామని వచ్చాడు.

సీత వరండాలోకి వస్తే పిలిచి మామయ్యని చూపించింది. దాన్ని చూస్తూనే దిగ్గున లేచి నిలబడ్డాడు. సీతకీ, అతనికీ కనీసం పదేళ్ళ తేడా ఉంది. చిన్నప్పుడు దాన్ని ఎత్తుకు తిరిగేవాడు. "ఇది సీతే! హత్తెరీ! ఎంత మారిపోయింది" అంటూ, పళ్ళు బిగించి రెండు బుగ్గలు పట్టుకున్నాడు. సీతకు ముఖం ఎర్రనయి బిత్తరపోయింది.

"నిన్ను చూసి ఎన్నాళ్ళయిందే ఇంకా ఏడుస్తూ నా భుజం మీద కూచున్న గుర్తు" అంటూ ఒక్కసారి వీపు చరిచాడు.

"వీడు బదరీ మామయ్యే. చిన్నప్పుడు నిన్ను ఎత్తుకు తిరిగేవాడు" అని నవ్వుతూ, అతను తీసుకునే చొరవకు అర్థం చెప్పింది తల్లి.

గోవిందరావుకి ఈ బదరీ మామయ్య ఎవరో ఎంత వెదికినా గుర్తురాలేదు కానీ, అతణ్ణి చూడగానే తన కూతురికి పెళ్ళి చెయ్యాలన్న విషయం గుర్తుకొచ్చింది 'మేనరికం చేసుకుంటాడేమో అడుగు' అని భార్య చెవిలో ఊది, పనుందని బజారున పడ్డాడు.

కానీ వర్ధనమ్మ మొహమాటపడిపోయింది. మనసులో విషయాలన్నీ కెలుకుతుండగా చూస్తూ చూస్తూ అమ్మాయిని చేసుకోమని అడగలేకపోయింది. కాకపోతే అమ్మాయికి పెళ్ళీడు వచ్చిందని, సంబంధం చూస్తున్నామనీ, ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు చెయ్యడమంటే పెద్ద యజ్ఞం చేసినంత పనవుతోందని, ఇవన్నీ ఇలా ఉండగా అమ్మాయి పెళ్ళి వద్దని భీష్మించుకుందనీ చెప్పింది. వీటిలో చాలా విషయాలు బదరీ బుర్రకెక్కలేదు. తెలిసిన విషయమల్లా అమ్మాయి పెళ్ళికి ఇష్టపడడం లేదని.

"ఎందుకు చేసుకోదూ? నేను మాట్లాడుతానుండు" అని అక్కణ్ణుంచి లేచాడు.

రాత్రి ఆరుబయట మంచం వాల్చుకుని ఆకాశాన్ని చూస్తూ నక్షత్రాల్ని లెక్క బెడుతున్న సీత మంచం మీదే సరాసరి వచ్చి కూర్చున్నాడు బదరీ. తుళ్ళిపడి లేచింది సీత.

"ఏమే? పెళ్ళి చేసుకోవట?" అని ప్రారంభించాడు.

ఆమె నిర్ఘాంతపోయింది.

అదేం గమనించలేదు బదిరీ. "నాకు మీ అమ్మ చెప్పిందిలే" అంటూ, ఈ రోజులలో పెళ్ళిళ్ళ పద్దతి గురించి, మధ్యప్రదేశ్‌లో అమ్మాయిల పెళ్ళిళ్ళ సంప్రదాయాల్ని గురించి అరగంటసేపు లెక్చరు ఇచ్చాడు.

"మరి నువ్వేమంటావు?" అని ప్రశ్నించేవరకూ తీరికగా, మోకాళ్ళ మీద తల ఆనించి మంచం ఒక మూలకి కూచుంది.

అంతా అయ్యాక తలెత్తి నవ్వింది. "ఇంతకూ అమ్మ నీతో చెప్పదలుచుకున్నది నీకర్థం కాలేదు."

"ఏమిటది?"

"నిన్ను చేసుకోమని."

"నన్నా"

"లేకపోతే నీతో చెప్పుకోవడమేం?"

చాలాసేపు మాట్లాడలేకపోయాడు. తర్వాత మెల్లగా తలెత్తి సీత ముఖం చూశాడు. భార్య అర్హతల కోసం తన ముఖాన్ని వెదుకుతున్నాడని గ్రహించింది. వెన్నెల నీడల్లో సుఖ దుఃఖాల అల్లికలాగా సీత ముఖం కనిపించింది అతనికి.

"నిన్ను పెళ్ళి చేసుకోవడానికి ఎవరైనా ఎందుకు వెనకాడాలి కాని.."

ఏదో అనబోతే నవ్వి అతణ్ణి ఆపింది. వివాహం పేరిట మోసపోవడం ఎంత ఘోరమో తను ఇంకొకరి వల్ల అనుభవించి చూసింది. అలాగే ఇంకో వ్యక్తిని తన పేరిట ఆ దుఃఖంలోకి దింపదలచుకోలేదు.

"అమ్మ నీకు చాలా అన్యాయం చేస్తోంది మామయ్యా. అసలు విషయం నీకు చెప్పలేదు."

దుఃఖపు జీర ఎక్కడా రానివ్వకుండా కథలాగ అంతా చెప్పుకుపోయింది సీత. మధ్యలో ఒక్క విషయం కూడా వదిలిపెట్టలేదు. అంతా చెప్పి "ఇదీ మామయ్యా, అసలు కథ. ఇదంతా విన్నాక కూడా నువ్వు పెళ్ళి చేసుకుంటానంటే అమ్మ చాలా సంతోషిస్తుంది."

"నువ్వో?"

నవ్వింది. "పెళ్ళి సంతోషానికనే ఆలోచన చాలా రోజుల కిందటే మరచిపోయాను. నా మాటకేంలే? అమ్మకయినా తొందరపడి జవాబు చెప్పకు. కానీ ఒక్కటి. నువ్వు చేసుకోకపోవడం వల్ల ఇక్కడ ఎవరూ బాధపడరు. నువ్వు చేసుకుంటానంటే నీ భుజాల మీద పెంచిన నేను బాధపడతాను. ఇంక వెళ్ళు" అంది. అంతవరకూ ఆపుకున్న దుఃఖం ఇంక ఆగలేదు. కానీ అతను వెళ్ళేవరకూ ఎలాగో ఆపుకుని తరువాత తలగడలో ముఖం దాచుకుంది.

చిన్న మబ్బు తునక అడ్డుపడి చంద్రబింబాన్ని కిలుం పట్టిన ఇనుపరేకులాగ తయారు చేసింది.

13

కుటుంబయ్య సార్థకనామధేయుడు. ఆ పేరు ఏ ముహూర్తాన పెట్టారోగాని ఇంటినిండా తొమ్మిదిమంది సంతానం ఉంది. పిల్లలంతా వీధుల్లోకి పోతూ ఆడుకునే రోజుల్లో పరవాలేకపోయింది కానీ, వాళ్ళు పెరిగి ఒక్కసారే ఆరుగురూ స్కూళ్ళకి బయలుదేరేసరికి వాళ్ళ జీతాలు, పుస్తకాలూ, బట్టలూ, చిల్లరమల్లర ఖర్చులు తట్టుకోలేకపోయాడు. పెద్దవాడు ఎస్సెల్సీలోకి వచ్చిన సంవత్సరం కాస్త అటూ ఇటూ అన్నట్టున్న ఓ టైపు మిషను బేరం పెట్టాడు. రెండో అమ్మాయి మలేరియా జ్వరానికీ, చివరివాడి ఉబ్బసానికి మరో టైపు మిషన్, మిషన్లలో రెండింటికైనా బేరం పెట్టకపోతే పిల్లలు ఈసారి

బళ్ళకీ, కాలేజీకీ వెళ్ళేదారి కనిపించలేదు. అన్ని మార్గాలూ శతధా ప్రయత్నించి వీగిపోయాడు. ఇంతలో హఠాత్తుగా మాధవరావు కనిపించి చక్కని ఆలోచన చెప్పాడు. అది విని మొదట నిర్ఘాంతపోయాడు కుటుంబయ్య. అసలా పని సాధ్యపడుతుందా అని తటపటాయించాడు. "మరేం పర్వాలేదు. ప్రయత్నించి చూడు" అన్నాడు మాధవరావు నవ్వుతూ.

అవసరం తొందరపెట్టగా ఓ రోజు సీత ముందు బయటపడ్డాడు. "నీతో చిన్న పని ఉందమ్మా" అంటూ.

సీత ఆశ్చర్యపోయింది. తను చేసిపెట్టగల పని ఏముంటుందా అని. అయినా "చెప్పండి" అంది.

"మరేం లేదు. అబ్బాయిని కాలేజీకి పంపాలి. వీళ్ళుకాక ఈ యేడు మావాడు చదువుకి తయారవుతాడు. ఇంటావిడ జబ్బుతో మంచమెక్కింది. నా టాన్సిల్స్ ఆపరేషన్‌ను రోజు రోజుకీ వెనక్కి జరుపుతున్నాను. ఈ పరిస్థితుల్లో ఒక్క వెయ్యి రూపాయలుంటే పని జరిగిపోతుంది" అన్నాడు నసుగుతూ.

కుర్చీ వెనుక కునుకు నక్కలాగ కూచుని కాలం వెళ్ళబుచ్చుకునే ముసలి బ్రాహ్మడి కష్టాలు చాలా విచిత్రంగా కనిపించాయి సీతకి. ఇంకా విచిత్రం. ఆ సహాయం తనని కోరడం.

నవ్వింది. "నేనెక్కడ తేగలనండీ అంత డబ్బు?" అంది.

"అలా అనకు. నీ పలుకుబడిని ఊహించే నీ దగ్గరకి వచ్చాను. మీ నాన్నా, నేనూ చిరకాలం నుంచీ స్నేహితులం. నువ్వే నన్ను రక్షించాలి."

"నా పలుకుబడి అంటే?"

"పోనీ, నీ స్నేహితుల పలుకుబడి అను. నీ కోసం కారులో వచ్చే అతను పెద్ద ఫ్యాక్టరీ ప్రొప్రయిటరటగా?"

"ఎవరు చెప్పారు?"

"పెద్దవాళ్ళు, ధనవంతుల గురించి ఒకరు చెప్పాలా? వాళ్ళ ముఖం మీదే రాసుంటుంది. నువ్వంటే అతనికి స్నేహం కదా?"

కుటుంబయ్యకు డబ్బు తప్ప ఆ మాటల వెనుక ధ్వనించే అర్థాలు స్ఫురించలేదు. ఎవరో అతన్ని తన దగ్గరకు పంపి ఉంటారని అర్థం చేసుకోడానికి ఎంతోసేపు పట్టలేదు సీతకి. కొంత పెంకెతనం, కొంత తిరస్కారభావం, కొంత కోపం తోసుకొచ్చాయి.

"నా నుంచి ఏమి ఆశించి వాళ్ళు నాకు సహాయం చేస్తారు. మీరేం చెయ్యగలరు వాళ్ళకి?" అంది.

దిమ్మెరపోయాడు కుటుంబయ్య. ఒక్క క్షణం తట్టుకోలేకపోయాడు. "నా దగ్గరేముందమ్మా నాలుగు మిషన్లు తప్ప మరేమీ లేవు. అవీ తీసేస్తే రోజు గడవదు. నువ్వు చెయ్యగలవనుకున్నాను. పోనీలే" అంటూ టేబులు వెనక్కి వెళ్ళి గోడకి చేరబడ్డాడు.

అప్పటికా విషయం మరచిపోయింది గాని సాయంకాలం నాగరాజు కారు తీసుకుని ఈవేపు వచ్చేసరికి మళ్ళీ ఆ విషయం గుర్తుకు వచ్చింది. ఫ్యాక్టరీ నుంచి ఇల్లు చేరేటప్పుడు నాగరాజు ఒకసారి లోపలికి తొంగి చూడడం కద్దు. ఇవాళ చాలా అలసినట్టు కనిపించాడు. "పదండి, త్వరగా కాఫీ తాగాలి. బాగా ఆకలిగా ఉంది. హోటల్‌కి పోయి ఏదయినా తిందాం" అన్నాడు ఎదురుగ్గా కూచుంటూ.

భూకంపాన్ని ఊహించుకున్నప్పుడు భయం వేస్తుంది. మొదటిసారి భూమి కంపించి బ్రద్దలయినప్పుడూ భయంకరంగా ఉంటుంది. అంతమాత్రానా ఆ ప్రాంతం నుంచి ఎవరూ పారిపోరు. పైగా ప్రశాంతంగా తిరుగుతూ ఆ సంఘటనల్ని కథలుగా చెప్పుకుంటారు. ఒక విధమైన నిర్లక్ష్యం ఏర్పడుతుంది. అలంటి నిర్లక్ష్యమే నాగరాజు పరిచయాన్నీ, అతని కారులో ప్రయాణాన్ని సాధ్యమయేటట్టు చేసింది సీతకి. ఇప్పుడు నలుగురి గురించి దృష్టి ఆమెకూ లేదు, నాగరాజుకీ లేదు. ఆశ్చర్యపోయేమిటంటే, ఆ దృశ్యాన్ని గుర్తించాలనే దృష్టి ఈ 'నలుగురి'కీ తగ్గిపోయింది.

హోటల్లో కాఫీ తాగుతూ "మీ సహాయం కోసం నా దగ్గరకి రికమండేషన్లు వస్తున్నాయి" అంది సీత.

"అదేమిటి?" అంటూ తెల్లబోయాడు నాగరాజు.

"అందులో వింతేముంది? నేను మీ స్నేహితురాల్ని. అందుకని మీరు డబ్బు సహాయం చెయ్యగలరని వాళ్ళ ఉద్దేశం."

"ఎవరి ఉద్దేశం?"

"ఎవరో ఊహించలేరా?"

ఆలోచించాడు. "మాధవరావా?"

తుళ్ళిపడింది సీత. ఇంతవరకూ అతని గురించి ఆలోచించలేదు సీత. కుటుంబయ్యకు ఈ సలహా ఇచ్చింది మాధవరావేనా? అయినా కావచ్చు.

"ఎవరు చెప్పారో తెలియదు కాని అడిగింది మా టైపు ఇనిస్టిట్యూట్ కుటుంబయ్య."

కాఫీ చప్పరిస్తున్నాడు నాగరాజు. "ఎంత కావాలిట?"

"వెయ్యిరూపాయలు. నన్నడగడం వింతగా ఉంది. సరాసరి మిమ్మల్నే అడగొచ్చుగా?"

నవ్వాడు నాగరాజు. ఆ సలహా చెప్పిన వ్యక్తికి నా గురించి కూడా తెలిసి ఉండాలి. "నన్నడిగితే తప్పకుండా మిమ్మల్ని అడుగుతాను. ఎంత ధనవంతుడైనా హామీ లేనిదీ, ఏదో రూపంలో తిరిగివస్తుందనే నమ్మకం లేనిదీ డబ్బివ్వడు."

నిర్ఘాంతపోతూ అతని ముఖం చూసింది సీత. అతని మాటల్ని అర్థం చేసుకొందుకు ప్రయత్నిస్తూ.

"వ్యాపారం చెప్పాను నేను. మాటల మధ్య అర్థాలు వెదక్కండి. ఆలస్యమవుతుంది. ఇక పదండి" అని లేచాడు నాగరాజు.

తర్వాత ఆ విషయం ఆలోచించలేదు సీత.

కాని ఆ మర్నాడు ఇనిస్టిట్యూట్‌కి వెళ్ళేసరికి రెండు చేతులూ జోడించి కుటుంబయ్య ఎదురుగ్గా వచ్చాడు "నన్ను రక్షించావు తల్లీ. నీ మేలు మరిచిపోను" అంటూ.

నివ్వెరపోయింది సీత. ఏమైందండీ?" అన్నది, ఏమీ అర్థం కాక.

"అతను నిజంగా దేవుడులాంటివాడమ్మా. రాత్రికి రాత్రి మా ఇల్లు వెదుక్కుంటూ వచ్చి నాకు వెయ్యి రూపాయలు ఇచ్చి వెళ్ళాడు. నువ్వు చెప్పావట. 'ఇది చాలా' అని కూడా అడిగాడు. 'కాగితం ఏదైనా రాని ఇవ్వమంటారా బాబూ' అన్నాను. 'అక్కర్లేదు, మా స్నేహితురాలి హామీ చాలు' అని వెళ్ళిపోయాడు. నిజంగా దయామయుడు. నా కష్టాలకి మీరిద్దరూ దేవతల్లాగ అడ్డుపడ్డారు. మా ఆవిడకీ నాకూ సంతోషంతో కళ్ళనీళ్ళు వచ్చాయి."

అని ధారాపాతంగా మాట్లాడుకుపోతున్నాడు కుటుంబయ్య. కానీ అదేమీ వినిపించడం లేదు సీతకి. ఆమె ఆశ్చర్యంతో ఎటూ ఆలోచించలేకపోయింది. తనకి మాటమాత్రమైనా చెప్పకుండా ఎందుకిచ్చారు? తను ఇవ్వమనయినా చెప్పలేదే? సాయంకాలం అతను వస్తే అడగాలనుకుంది.

కానీ ఆ సాయంకాలమే కాదు, మరి మూడు నెలలవరకూ ఏ సాయంకాలమూ అతను కనిపించలేదు. అతని ఇంటి తలుపులకి తాళం వేసి ఉన్నాయి.

**మాధవరావు చర్యల్ని** ఆసరా చేసుకుని మనం అతన్ని దుర్మార్గుడనుకోవసిన పనిలేదు. బ్రతకడానికి కొన్ని సుళువులు ఆయన ఏర్పరచుకున్నాడు. ఆ సుళువుల్ని ఆధారం చేసుకుని అతను ప్రయాణం చేస్తున్నాడు. పాము సూటిగా ప్రేకుతుంది. జెర్రి మెలికలు తిరుగుతుంది. రెండూ ముందుకు పోవడానికి చేసే ప్రయత్నాలే. ఆ మాటకి వస్తే, దుర్మార్గుడు కూతురికి పాలుపోసి పెంచుతాడు కాని విషం పోసి పెంచడు.

గోపాలం సంబంధం తన కూతురికి దాదాపు ఖాయం అయినట్టే భావించి మాధవరావు ఒకరిద్దరికి లోపాయికారిగా చెప్పాడు కూడాను. కాని అది పుసిగిపోయి, అతనికీ సీతకీ మధ్య ఉన్న వ్యవహారం తను ఊహించిన దానికంటే ఘోరమైనదని గ్రహించి గోపాలం జారుకున్నాక, తన సంబంధం విషయం బయటికి రాకుండా వెంటనే కట్టుదిట్టాలు చేసుకుని జాగ్రత్తపడ్డాడు. ముందు చెప్పిన ఒకరిద్దర్ని కూడా "ఆఁ! ఈ గోపాలం కాదు, గోపాలం అంటే ఇతనొక్కడేనా? సవాలక్షమంది ఉన్నారు. అయినా ఇటువంటి లుచ్చాకి నా కూతుర్ని ఎలా చేస్తాననుకున్నారు?" అని బుకాయించాడు.

ఈ సందర్భంలో అతనికి తటస్థపడ్డ సంబంధమే రాంబాబుది. రాంబాబుది బ్రతికిచెడ్డ కుటుంబం. వాళ్ళ పూర్వులెప్పుడో జాగీర్దార్లు. వాళ్ళ ముత్తాత స్త్రీలోలుడై, చాలా డబ్బు తగలేస్తే, వాళ్ళ తాత మిగతా ఆస్తి అమ్మి పట్టణానికి వచ్చి త్రాగుడు మరిగాడు. తండ్రి మిగతా ఆస్తితో లాభసాటి వ్యాపారం ఏం చెయ్యాలా అని ఆలోచించి, ఆలోచించి రాజకీయ నాయకుడయ్యాడు. తర్వాత ఎమ్మెల్యే అయి ఓ రాత్రి బాగా తాగి జీపు కాలువకి గుద్దుకోగా మరణించాడు. రాజకీయ నాయకుడు కనక వీరస్వర్గం అలంకరించాడన్నారు. ఆయన చాలా ఆస్తి గడించాడే కాని, అదంతా ఆయన ఉన్న రోజుల్లో ఖర్చుపెట్టేశాడు. అతను చనిపోయేటప్పటికి రాంబాబు చదువింకా పూర్తికాలేదు. అయినా తండ్రిపోయాక ఉద్యోగంలో చేరక తప్పింది కాదు. చచ్చిపోయిన ఎమ్మెల్యే కొడుకు కనక అంత సుళువుగా ఉద్యోగం దొరకలేదు. చివరికి ఇంజను డ్రైవరుగా చేరాడు. అదీ స్థూలంగా అతని కథ. రాంబాబుకి త్వరగా పరిగెత్తేదేదయినా చాలా ఇష్టం. పైగా అతని కల నిజమైనంత సంతోషించాడు. తన తండ్రి నిజంగా బ్రతికుండి చదువు చెప్పిస్తే తన గది ఏమయేదోనని అప్పుడప్పుడనుకునేవాడు. ఇలా ఓ రాత్రి ప్రయాణంలో అనుకుంటుండగా రాక్షసి బొగ్గు పేలి ముఖం కాలింది. అసలే నల్లగా ఉన్న ముఖం మరింత నల్లనయి అందవికారంగా తయారైంది. ఇంజను డ్రైవరు అందంగా ఉండవలసిన అవసరం లేదు కనుక. రైళ్ళలో తిరగడం తప్పనిసరయినప్పుడు ఇంటిదగ్గర తల్లికి తోడులేకపోవడం గురించి చాలా బాధపడేవాడు. ఈ సందర్భంలోనే తెలిసిన వాళ్ళు 'పెళ్ళి చేసుకోవడం మంచి'దని సూచించారు. రాంబాబుకి ఓ చిన్న రైల్వే ఫిలాసఫీ ఉంది. ఈ జీవితం పరుగు రైలు ప్రయాణంలాంటిది. ఎలాంటి వాడికైనా మంచికానీ, చెడుకానీ అందగాడు కానీ, కురూపి కానీ ఇందులో చోటుంటుంది. వాళ్ళందరూ చేరేది ఒక్క గమ్యానికే. ఆ మాత్రానికే ఈ ప్రయాణంలో ఏ పెట్టె ఎక్కితేనేం?

ఎవరితో ఎక్కితేనేం? అందుకని అందం, గిందం పట్టింపు లేకుండా జబర్దస్తీగా ఉండి తల్లికి, తనకీ సేవచేసే ఇల్లాలిని వెదకడం ప్రారంభించాడు. ఈ వెదుకులాటలోనే మాధవరావు అతనికి తగిలాడు. రాంబాబుకి శాంత అన్నివిధాల నచ్చింది. కాని, కాలు కుంటికావడం, మరీ సన్నంగా ఉండడం వల్ల తను అనుకున్నట్టూ పనీపాటా చెయ్యలేదేమోనని భయపడ్డాడు. ఆ భయమేదో మాధవరావు ముఖం మీదే చెప్పేశాడు కూడాను. మాధవరావు మొదట నిరుత్సాహపడిపోయిన మాట నిజమే కాని, ఇక్కడ అతను హృదయ వైశాల్యాన్ని ప్రకటించాడు. ఒడ్డూ, పొడుగూ కాస్త బలంగా ఉండే మనిషి కావాలంటే సీతని చేసుకోమని సలహా చెప్పాడు. అది అతని ఔదార్యానికే చిహ్నం. తీరా పెళ్ళయాక సీత వెనుక గల కథంతా చెప్పి రాంబాబు నడుం మీద దెబ్బకొట్టడం మాధవరావు ఉద్దేశమని అనుకుంటే ఏమీ చెప్పలేం.

ఇంజను డ్రైవరయితే మాత్రమేం? చాలా డబ్బొస్తుంది. పనికి తోడు కావాలసినంత విశ్రాంతి కూడా ఉంటుంది. ఎక్కడికి వెళ్ళాలన్నా పాసులు, ముఖం మీద మాత్రం మచ్చ ఉంది కాని, మనిషి బాగున్నాడు. పైగా కింద తరం వాళ్ళు జమీందార్లాయే. జమీందార్ల సంబంధం వెదికినా దొరుకుతుందా ఈ రోజుల్లో? అని గంటసేపు బోధపరిచింది వర్ధనమ్మ సీతకి. సీత వింటూ కూర్చుంది. ఏమీ మాట్లాడలేదు. అంతా విన్నాక కూడా ఏమీ అనలేదు. కుళ్ళిపోయిన కూరగాయలని చవక ధరకైనా చెల్లగొడితే చాలుననే తాపత్రయం వాళ్ళ ప్రయత్నాల్లో కనిపించి ఏమీ సమాధానం చెప్పలేదు. ఒక్కసారి పోటీలో వీగిపోయిన వాడికి ఏ సౌకర్యాలూ కోరే హక్కు ఉండదు.

సంబంధానికి మధ్యవర్తిత్వమంతా మాధవరావు స్వయంగా నడిపాడు. గోవిందరావు కూడా ఏమీ ఎదురు చెప్పలేదు. అతని మనస్సులో ఏముందో ఎవరికీ అర్థంకాలేదు గానీ దేనికీ అతను అభ్యంతరం పలకలేదు.

అయితే సీతకి ఇంజన్ డ్రైవర్ భార్య అయ్యే అదృష్టం లేదు. ఎంచేతనంటే సీత జీవిత కథ ఎలాగో రాంబాబు చెవుల వరకూ ప్రాకింది. ఈ కథ చెప్పినవాళ్ళు చెప్పిన తీరు అతనికి నచ్చలేదు. "మాకు తెలిసింది ఇదొక్కటే కథ. ఇంకా తెలియనివి ఎన్ని ఉన్నాయో అయినా ఇదంతా అడిగారు కనుక చెప్పాం" అన్నారు. ఎమ్మెల్యే కొడుకయినా, తనకి నచ్చిన ఇంజను డ్రైవర్ పదవికి కుదురుకున్నట్టే, తనకి ఇష్టమైన భర్తని ఎన్నుకునే ప్రయత్నాన్ని సీత చేసిందని అతను సరిపెట్టుకోలేకపోయాడు. అందుకు కారణం తన ప్రయత్నం విజయవంతమై తను డ్రైవరయ్యాడు. ఆమె కోరుకున్న వ్యక్తికి భార్య కాలేకపోయింది.

చివరిక్షణంలో తనకిష్టంలేదని ఇతడూ వ్రాశాడని తెలిశాక వర్ధనమ్మ గుండె జారిపోయింది. ఆ రోజు ఇంట్లో ఎవరో చచ్చిపోయినట్టు రాగాలు తీస్తూ ఒక రాత్రి, ఒక పగలూ ఏడ్చింది. ఆ నిస్పృహతో సీతని తిట్టి శాపనార్థాలు పెట్టింది. "ఇంత దుఃఖం మాకు తెచ్చి పెట్టేకంటే నువ్వు చచ్చినా బాగుండేది" అంది బాధతో.

"అవునమ్మా చచ్చిపోతే బాగుండేది" అనుకుంది సీత. కానీ చచ్చిపోయే ధైర్యం లేదు ఆమెకి. ఆ రాత్రి మళ్ళీ కూతుర్ని దగ్గరికి తీసుకుని అంతలేసి మాటలన్నందుకు మరో రాగం పెట్టింది వర్ధనమ్మ.

గోవిందరావుకిదంతా తెలుసు. కానీ ఏమీ మాట్లాడలేదు. పెళ్ళి కుదిరినప్పుడు ఎంత నిర్లిప్తంగా ఉన్నాడో, అది పోయినప్పుడూ అంత చెక్కుచెదరకుండానే ఉన్నాడు.

అందర్లోకి ఎక్కువ లుబలుబలాడిపోయాడు మాధవరావు. ఒకరోజంతా బాధపడి చివరికి తనూ ఆ ఇంటి గడప మీద కూర్చుని తను వాళ్ళకి చేయాలనుకున్న ఒక్క సహాయం ఇలా జారిపోయిందనీ, అయినా విచారించవద్దనీ, తన బొందిలో ప్రాణం ఉండగా సీతకి సంబంధం చూసే బాధ్యత తనదేననీ శపథం పట్టి వెళ్ళిపోయాడు.

ఈ ఏడుపులూ, పెడబొబ్బల వెనుక మూగగా నలిగిపోయిన వ్యక్తి సీత. ప్రతీ వ్యక్తీ పెళ్ళివల్ల తమకు దక్కే ప్రశాంతతనీ, బాధ్యత వదిలించుకోవడాన్నీ ఊహించుకుంటూ, పెళ్ళి చేసుకోవలసిన తన అభిప్రాయాన్నే మరచిపోయారు. అందుకూ బాధనిపించలేదు సీతకి. ఈసారయినా వాళ్ళు తమ ప్రయత్నాన్ని సఫలం చేసుకుంటున్నారని భావించింది. ఆకలిగొన్నవాడు మంచి ఆహారం తినాలనుకుంటే కష్టంకాని, అవసరమైతే గడ్డి కూడా చాలునని భావిస్తే బాధేలేదు. కాని ఆ ఇంజను డ్రైవరు కూడా తనని పెళ్ళి చేసుకోవడానికి తిరస్కరించాడని తెలియడంతో సీతకి అహం దెబ్బతింది. తన అభిరుచిని తను ప్రదర్శించుకోబోవడం ఈ జీవితంలో తనని అంత పనికిమాలినదానిగా చేసిందా? ఆలోచించిన కొద్దీ దుఃఖం వచ్చింది. దాన్ని ఇంతవరకూ ఎవరూ పంచుకోలేదు సరికదా, తనివితీరా ఏడ్చే అవకాశమూ ఇవ్వలేదు. ఇంట్లో అంతా నిద్రపోయాక వాకిట్లో మంచం మీద కూర్చుని భోరున ఏడ్చింది. ఆ సమయంలో ఎవరైనా భుజం తట్టి ఓదారిస్తే బావుణ్ననిపించింది. అది ఎవరితోనైనా చెప్పుకోవలసిన బాధ. కానీ తనకి దయనీ, అభిమానాన్ని పంచగల వాళ్ళంతా తనవల్ల బాధపడుతున్నారు. హఠాత్తుగా అర్థం చేసుకుని సానుభూతిని చూపగలిగేవాడు నాగరాజు ఒక్కడే అతనక్కడ ఉంటే ఎంత బావుణ్ణు అనుకుంటూ ఆశగా ఎదురింటివేపు చూసింది.

కాలు ముందుకు సాగలేదు.

ఎదురుగ్గా వెలుగు కనిపిస్తున్నా చేరలేక అక్కడే నిలబడిపోయింది సీత.

దూరాన గదిలో దీపం ఆరిపోవడం ఆమెకి కనిపిస్తూనే ఉంది. అప్పుడిక ఆమె మనస్సుకి చీకటి ఆకాశం అద్దం పట్టింది.

## 15

మర్నాడు ఓ బుట్టలో ఆపిల్ పళ్ళు పట్టుకొచ్చాడు నాగరాజు. అప్పటికి గోవిందరావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. వర్ధనమ్మ దేవాలయానికి వెళ్ళింది. సీత తలంటి స్నానం చేసి జుత్తు ఆరబోసుకొంటోంది. నాగరాజుని చూడగానే ఆమెకి కలిగిన భావం కోపం. కష్టంలో ఉన్న ఆప్తుణ్ణి వదిలేసి దూరంగా పారిపోయిన వ్యక్తిమీద కలిగిన ఉదాసీనతలాంటిది కలిగింది.

"మమ్మల్ని వదిలేసి ఎక్కడికి పోయారు. చాలా దుర్మార్గులు మీరు" అంది. నిన్న రాత్రంతా దుఃఖం లేదు కాని, ఆ ఛాయలు మాత్రం మాటలు వింటూంటే కళ్ళలో మెరిశాయి. వర్షం వెలిసిన తర్వాత నిశ్శబ్దంలాంటిది ఆమె మనస్సుని ఆవరించుకొందిప్పుడు.

"ఏం? ఏం జరిగిందిప్పుడు?" అన్నాడు నాగరాజు. "కొంచెం పని ఉండి ఢిల్లీ వెళ్ళాల్సి వచ్చింది. అక్కణ్ణుంచి పుణ్యక్షేత్రాలు చూస్తానంటూ అమ్మ కూడా వచ్చింది. తీర్థయాత్రలు చేసుకు వచ్చేసరికి ఇన్నాళ్ళు పట్టింది."

"మీ అమ్మగారు ఇక్కడికి వచ్చారా మీతో?"

"ఆవిడని ఇంటి దగ్గర వదిలి వచ్చాను."

పళ్ళబుట్ట అక్కడే ఉంచి పెట్టెమీద చతికిలబడ్డాడు. అతని సాన్నిధ్యంలో క్రమంగా ఆమెకేదో బలం వస్తున్నట్టుంది.

"మీకు చెప్పాలనుకున్నాను. కానీ వ్యవధి చాలలేదు. నేను వెళ్ళాక ఏమైనా జరిగిందా? మీరు మునుపటిలాగా లేరు."

"ఎలా ఉన్నాను?"

"వారం రోజులుగా నిద్రాహారాలు లేనట్టున్నారు."

నవ్వింది. "ఆలోచనలకి అంత బలం ఉందన్నమాట."

"ఎందుకు ఆలోచించడం?"

"ఆలోచించకపోవడం ఎలా? అవి నన్ను వదలడం లేదు. ఆలోచనలు రాని స్థితి ప్రయత్నించి సాధించగలమంటారా?" తేలికగానే అడిగింది.

తేలికగానే సమాధానం చెప్పాలనుకున్నాడు. "నాకు తెలిసి పూర్తిగా నీటిలో మునిగిపోతున్నవాడు ఏమీ ఆలోచించలేడనుకుంటాను. తొందరగా కారులో ప్రయాణం చేస్తున్నప్పుడు వేగం మీద దృష్టి ఉంటుంది కాని, ఆలోచనలమీద ఉండదు."

ఆశ్చర్యంగా అతని ముఖ చూసింది. "అయితే చీర మార్చుకుని వస్తాను. ఇవాళంతా మీ కారులో నన్ను తిప్పండి.."

"కాని ఆఫీసు పని.."

"అది రేపు చూసుకుందురుగాని, ఉండండి, ఒక్క క్షణంలో వస్తాను" అని మాయమైంది. ఏవో ఆలోచనలనుంచి తప్పించుకుపోవాలనే ప్రయత్నాన్ని గ్రహించి ఇంకేమీ మాట్లాడలేదు.

పల్చటి నీలిరంగు చీర కట్టుకుని వచ్చింది. నీలిరంగు మధ్య నల్లటి ముఖం, సాయంకాలపు ఆకాశం మీద నిలిచిన మబ్బుతునకలాగ ఉంది. ఉరిశిక్షననుభవించడానికిపోతున్న వాడి చివరి కోరిక తీరేటప్పటి తృప్తిలాంటిది ఆమె ముఖం మీద కనిపించింది. ఆమెని చూసి జాలేసింది నాగరాజుకి.

"ఎక్కడికి వెళ్దాం" అన్నాడు కారులో కూర్చున్నాక.

"ఎక్కడికో తెలీదు. సాయంకాలం దాకా ఇంటికి వెళ్ళను. వీలయినంతవరకూ ఆ కారు ఆగకుండా వెళ్ళాలి."

నవ్వొచ్చిందతనికి. "మీరు ఇంట్లోంచి పారిపోయారని గాభరా పడతారు."

నవ్వింది. "అలా జరిగితే సంతోషించి, మరిచిపోయే స్థితిలో ఉన్నారు అంతాను. మరేం ఫరవాలేదు పదండి."

ఒక గమ్యం లేకుండా బయలుదేరారు. చాలాసేపు నిశ్శబ్దంగానే ప్రయాణం సాగింది. కారు వేగానికి ఆలోచనలు తెగిపోవడం లేదు. పైగా కూడుకుంటున్నాయి.

"నాకు చెప్పకుండా కుటుంబయ్యకి వెయ్యిరూపాయలు ఎందుకిచ్చారు?" హఠాత్తుగా అడిగింది.

"మీరు చెప్తారనే ఇచ్చాను. నూతిలో దూకిన తర్వాత శవాన్ని చూడడం ఎక్కువ బాధనిపించదు కానీ, దూకబోతున్న వాడిని ఆపలేకపోవడం బాధగా ఉంటుంది. ఇంతకీ అప్పటికి నా దగ్గర డబ్బు ఉంది."

"అతను ఇవ్వలేకపోతే?"

"మీరు అబద్దమనుకోండి, నిజమనుకోండి. ఎవరికైనా ఏదయినా ఇచ్చేముందు ఆలోచనల చట్రంలో ఆ సహాయాన్ని బిగించను. అందరికీ అప్పులు ఇవ్వడం నాపని కాదు. కానీ ఇచ్చిన తర్వాత దాని గురించి ఎక్కువ ఆలోచించను."

ఆశ్చర్యంగా అతని ముఖం చూసింది. వెనుక సీటులో కూర్చున్నదల్లా కాస్త ముందుకి వంగి "ఆ విద్య నాకూ నేర్పండి బాబూ. నేను నష్టపోయానే అనే బాధ నన్ను పీల్చేస్తోంది."

నాగరాజు నవ్వాడు. "నేను మీకు నేర్పాలా? భలే మిమ్మల్ని చూసే నేను నేర్చుకున్నది" అన్నాడు. సీత నిర్ఘాంతపోయింది. చాలాసేపు ఆలోచిస్తూ ఉండిపోయింది.

"ఏమిటాలోచిస్తున్నారు" అంటే

"మీకో కథ చెప్తాను" అంటూ రాంబాబు కథ మొదటినుంచి చివరివరకూ చెప్పింది. చెప్తూంటే జరిగినప్పటి దుఃఖం రాలేదు. "చూశారా? ఆఖరికి ఇంజను డ్రైవరు కూడా నన్ను అక్కరలేదన్నాడు" అని పకపక నవ్వింది. ఆ బాధని, నవ్వేసి మరిచిపోదామనే ప్రయత్నం. కానీ ఆ నవ్వు వెనుక త్రోసుకువచ్చే కించ గమనించాడు నాగరాజు.

"ఏం మాట్లాడరేం?" అంది అతను ఎంతకీ సమాధానం చెప్పకపోయేసరికి.

"స్నేహితుడిగా నేనో సలహా చెప్తాను వింటారా?"

"చెప్పండి"

"మీరు త్వరగా పెళ్ళి చేసుకోవడం మంచిది"

మొదటిసారిగా సీత వొళ్ళు మండిపోయింది.

"ఎవరిని? మిమ్మల్నా?" అని అడిగింది. దిమ్మెరపోయాడు నాగరాజు.

"పెళ్ళి ఎవరిని చేసుకోవాలన్న ఆలోచన ఒక్కటే మిగిలింది. అదీ నాకోసం కాదు. మా అమ్మా నాన్న కోసం. ఎవరికైనా కష్టపడి పనిచేసే పనిమనిషి కావలసినా వెళ్ళిపోవాలని ఉంది. అప్పుడైనా వాళ్ళ మనస్తాపం తగ్గుతుంది. నిస్పృహకన్నా ఆత్మహత్య మరొకటి లేదనుకుంటాను" ఇప్పుడిక కళ్ళనీళ్ళు ఆగలేదు సీతకి. ధారాపాతంగా కళ్ళవెంట నీళ్ళొచ్చాయి. ఎదురుగా కనిపించే అద్దంలో. ఆమె నీటిని వర్షించే తొలకరి మబ్బులాగా కనిపించింది నాగరాజుకి. కారు ఆపేశాడు.

"ఆగిపోయారేం?" అంది ఆమె ఆశ్చర్యంగా.

"ఈ కారు వేగం మీ ఆలోచనల్ని జయిస్తుందనుకున్నాను. కానీ మీ ఆలోచనలే ఈ వేగాన్ని జయించాయి. ఇక వెనక్కి పోదామా?" అన్నాడు.

నవ్వుకుంది సీత. "పదండి. గమ్యంలేని మన ప్రయాణంలాగే ఉంది ఈ జీవితం కూడాను" అంది.

ఆమె పరిస్థితి చూసి పుస్తకాలు ఈవిడ ఎందుకు చదువుకుందా అని బాధపడ్డాడు నాగరాజు. ఆలోచించే శక్తి పుస్తకాలు ఇచ్చాయి. దుఃఖాన్ని అందంగా, అద్వితీయంగా పేర్చి చెప్పే శక్తి కూడా అక్కడిదే విచిత్రంగా తనూ యోచనలోనే పడ్డాడు.

"పెళ్ళితో చాలామంది ఆడవాళ్ళకి సమస్యలు ప్రారంభమవుతాయంటారు. కానీ నాకు పెళ్ళే సమస్య అయింది" అంది ఉన్నట్టుండి.

"మీకిప్పుడొచ్చిన పెద్ద సమస్య చెప్పమంటారా?" మాట మరిపించడానికి అన్నాడు.

"ఊఁ"

"ఆలోచన, దానినుంచి తప్పించుకోవడం, ఎటువంటి కష్టాన్నయినా చిరునవ్వుతో మరచిపోవడం మీరే నాకు నేర్పి, మీరే మరచిపోయారు. దయచేసి కొన్నాళ్ళు దానిగురించి మరచిపోండి. అంతా అదే సర్దుకుంటుంది" అన్నాడు.

కారు మళ్ళీ ఊరులోకి వచ్చింది. "ఇక ఇంటికి పోదామా?" అన్నాడు.

"వద్దు, వద్దు" అంది ఆత్రంగా.

"మరి?"

మీ ఆఫీసు ఎప్పుడూ చూడలేదు. నన్ను తీసుకెళ్ళరూ?"

ఆలోచించాడు. "తీసుకెళ్తాను. కానీ ఇప్పుడు కాదు. నేను సరాసరి ఆఫీసుకు వెళ్ళడంలేదు."

"అయితే నన్ను గార్డెన్‌లో వదిలిపోండి."

ఇంటికి ఇప్పుడే చేరడం ఇష్టంలేదని గ్రహించాడు. మరింకేమీ మాట్లాడకుండా సరాసరి కారుని గార్డెన్‌కి పోనిచ్చాడు.

ఆమె దిగాక తనూ దిగబోతుంటే ఆమె ఆపింది. "అక్కర్లేదు. మీరు వెళ్ళిరండి. నేను వెళ్ళగలను."

ఒంటరిగా ఉండాలనుకుంటుందని అర్థమైంది. "ఇప్పుడు నాలుగైంది. ఇప్పట్నుంచీ ఒక్కరూ ఏం చేస్తారు?"

"ఏమో? ఆ చెట్లన్నీ ఏం చేస్తున్నాయి? వాటి రహస్యమేదయినా తెలుస్తుందేమో చూస్తాను.. బై" అంది.

"మరీ చీకటి పడేవరకూ కూర్చోకండి" అని బయలుదేరాడు.

రాత్రి తొమ్మిది గంటలకి నాగరాజు ఇంటికి వచ్చేసరికి గుమ్మంలో మాధవరావు, గోవిందరావు కూర్చుని ఉన్నారు. అతను కారు ఆపగానే ఇద్దరూ హఠాత్తుగా అతని మీదకి వచ్చిపడ్డారు. వాళ్ళు అడిగిన మొదటి ప్రశ్న "అమ్మాయేదీ?"

నిశ్చేష్టుడయాడు నాగరాజు. "ఇంట్లో లేదా?"

"ఉదయం నీతో తీసుకెళ్ళావుగా? ఇంట్లో ఎలా ఉంటుంది?" మాధవరావు అన్నాడు.

నోటమాట రాలేదు నాగరాజుకి ఉదయం సీత తనతో వచ్చినట్టు వేణు సాక్ష్యం ఉంది. ఇప్పుడామె వెనక్కి తిరిగి రాకపోతే తాను తీసుకెళ్ళిన సాక్ష్యమే మిగులుతుంది. ఆలోచించిన కొద్దీ అతనికి వణుకు పుట్టింది. సీత ఏమై ఉంటుంది? మరో ఆలోచన లేదు అతనికి. ఆ రోజే పదే పదే ఆత్మహత్య గురించి మాట్లాడింది. తనని ఒంటరిగా వదిలిపెట్టమంది. ఇంటికి వెళ్ళమంటే నవ్వింది. గుండె గొంతులో కదిలి అతనికి దుఃఖం వచ్చింది. మరో మాట లేకుండా కారు వెనక్కి తిప్పాడు.

"ఎక్కడికి పారిపోతున్నావ్?" అని అరిచాడు మాధవరావు అతని జబ్బ పట్టుకుని. అతనిమీద విపరీతమైన అసహ్యం వేసింది నాగరాజుకి. "పారిపోవాలనుకుంటే ఇన్నాళ్ళూ ఆగేవాడిని కాదు మాధవరావుగారూ. కాని ఆ అమ్మాయి ఇవాళ ఆత్మహత్య చేసుకుంటే అది మీలాంటి పెద్ద మనుష్యుల చలవే. ప్రేమించిన వాళ్ళు మనుషుల్ని బ్రతికించుకుంటారుగానీ చంపుకోరండి. చెయ్యి వదలండి" అని విడిపించుకున్నాడు.

అంతవరకూ గోవిందరావుకి ఆ ఆలోచన వచ్చినట్టులేదు. ఆ మాట అనగానే మాధవరావు భుజం మీద తల ఆనించి బావురుమన్నాడు. జాలేసింది నాగరాజుకి.

"బాధపడకండి గోవిందరావుగారూ, ఎక్కడ ఉన్నా సీతని నేను తీసుకొస్తాను. ఆవిడ ఎక్కడ ఉందో నాకు తెలుసుననుకుంటాను."

''నీకు తెలియక ఇంకెవరికి తెలుస్తుంది? నీకే తెలియాలి'' అన్నాడు మాధవరావు మళ్ళీ. తన మాటలకి తట్టుకుని కూడా మాట్లాడుతున్నాడంటే మనిషికి లజ్జా, పశ్చాత్తాపం లేదనుకున్నాడు నాగరాజు.

''నన్ను రమ్మంటారా?'' అని బలహీనంగా అడిగాడు గోవిందరావు.

ఆలోచించాడు. ''మీరు వద్దు. ఎందుకు ఇంటికి రాలేదో నాకూ ఆశ్చర్యంగానే ఉంది. నా మీద నమ్మకం ఉంటే నన్నొక్కడినే వెళ్ళనివ్వండి. తర్వాత మీ ఇష్టం'' కారు తలుపు తెరిచాడు.

కళ్ళు తుడుచుకున్నాడు గోవిందరావు. ''దానికిప్పుడు మేమంతా శత్రువులమయిపోయాం. దాన్నేమీ అనను. ఎలాగయినా వెతికి ఇంటికి తీసుకురండి'' అని కారు తలుపు మూసేశాడు.

ఆలోచనలు తరుముకు రాగా తిన్నగా హుస్సేన్ సాగర్‌కి వచ్చాడు. కట్టమీద ఇంకా రాకపోకలు ముమ్మరంగానే ఉన్నాయి. ఎక్కడయినా జనసమ్మర్థం పోగయారేమోనని వెదికాడు. కాని ఎక్కడా అలికిడి లేదు. చీకటిలో హుస్సేన్ సాగర్ రహస్యాల్ని దాచుకున్న స్త్రీ హృదయంలాగా నిశ్చలంగా ఉంది. ఒక్కసారి నీటిని చూడగానే దానికింద ఎక్కడైనా సీత శరీరం ఉండవచ్చుననే ఆలోచన కలిగింది కళ్ళనీళ్ళు వచ్చాయి. ఒక్క క్షణం. అంతే, ఇక కాలం వృధా చెయ్యలేదు. తిన్నగా గార్డెన్‌కి వచ్చాడు. తలుపులు మూసి, రొట్టె తింటున్నాడు మాలి. పదిసార్లు అరిస్తే బయటికి వచ్చాడు.

''ఏమో సార్, అమ్మాయంటే ఎవరని చెప్పగలం? చాలామంది వచ్చారు. చాలామంది వెళ్ళారు'' అన్నాడు నాగరాజు ప్రశ్నకు.

''నువ్వు గేటు వేసేముందు ఎవరైనా వెళ్ళారా?'' గుర్తులు చెప్పాడు. గుర్తుపట్టాడు మాలి. ''గుర్తుంది సార్. ఒక్కరే వెళ్ళారు. నేను జ్ఞాపకం చేసేవరకూ కూచునే ఉన్నారు. మాకు టీకి డబ్బులు కూడా ఇచ్చి వెళ్ళారు'' వచ్చీరాని తెలుగులో వివరించాడు.

బస్సు స్టాపు దగ్గర వెదికాడు. ఒకే ఒక్క రొట్టె కోసం పోటీ పడుతున్న ముసలి గుడ్డి సాయిబూ, కుంటి కుక్కా కనిపించాయి. చుట్టూ వెదుక్కుంటూ ఇంటివేపు బయలుదేరాడు. సగం దూరం నడిచాక రోడ్డుపక్కనుంచి అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్న సీత కనిపించింది. ఆమెను చూడగానే ''సీతా'' అని అరిచాడు. చుట్టుపక్కల వాళ్ళు తుళ్ళిపడి చూసేటట్టు. సీత కూడా చుట్టూ చూసి నాగరాజు కనిపించేసరికి నివ్వెరపోయింది

''ఏమిటీ ఇప్పుడా ఆఫీసునుంచి ఇంటికెళ్తున్నారు?'' అంది నవ్వుతూ.

నాగరాజు నవ్వలేదు. గంభీరంగా ''మొదట కారెక్కు'' అన్నాడు.

అతని ముఖం చూసి భయపడింది. అంతకు మించి అతని ఏకవచన ప్రయోగానికి ఆశ్చర్యపోయింది. కారులో కూర్చోగానే ఆమె వేపు తిరిగి ''ఎందుకిలాంటి పని చేశారు? నా మట్టుకు నాకే మీ రెండు చెంపలూ వాయించాలనిపిస్తోంది'' అన్నాడు కోపం తీరక.

స్థాణువయిపోయింది సీత. ఆమెకేం అర్థంకలేదు. ''ఏం చేశాను'' అంది.

''ఎందుకిలాంటి పని తలపెట్టారు? మీకెన్నోసార్లు చెప్పాను. సాహసం చెయ్యవద్దని''

తెల్లబోయింది సీత. ''ఎలాంటి పని తలపెట్టానంటారు?''

''నిజం చెప్పండి, ఆత్మహత్యా ప్రయత్నం చెయ్యలేదా మీరు?''

"నేనా?" ఒక్క క్షణం అతన్ని విచిత్రంగా చూసి పగలబడి నవ్వడం ప్రారంభించింది. "ఆఫీసులో పని ఎక్కువయి ఉంటుంది మీకు. నా గురించి ఆలోచిస్తూ నిద్రపోతే ఏదో పీడకల వచ్చి ఉంటుంది. సరిగ్గా చూడండి. నేను సీతనే. నేనేం ఆత్మహత్య చేసుకోవడం లేదు. చేసుకోబోవడంలేదు. పార్కునుంచి ఇంటికి వెళ్తున్నాను."

ఈసారి ఆశ్చర్యాన్ని తట్టుకోవడం తనవంతయింది. ఒక్కసారి జరిగిందంతా ఆలోచించుకున్నాడు. మాధవరావు, గోవిందరావుల ఆందోళన, తన అనుమానం తప్పిస్తే ఆమె ఇంట్లోంచి పారిపోయి ఉంటుందనీ, ఆత్మహత్య చేసుకుంటుందనీ అనుకోవడానికి ఆస్కారాలు లేవు.

"మరి ఇంతవరకూ ఎక్కడున్నారు?"

"సాయంకాలం నన్నెక్కడ వదిలిపెట్టారో అక్కడే ఉన్నాను. ఏదో ఆలోచిస్తూ కూచున్నాను. మాలి టైమయిందని గుర్తుచేశాడు. బయటికి వచ్చేశాను. బస్సు దొరకలేదు. నడుస్తున్నాను."

ఒక్కసారి సూటిగా ఆమె ముఖం చూసి నవ్వడం ప్రారంభించాడు.

"ఏం, నవ్వుతారేం?"

"అక్కడ మీ నాన్నగారూ, మాధవరావుగారూ మీరు ఎక్కడికో పారిపోయి ఉంటారని అనుకుంటున్నారు."

"ఎక్కడికి పారిపోతాను?"

"ఏమో? అది వాళ్ళ అనుమానం. మీకు పారిపోయే అవసరం అగత్యం ఏమీలేదు కనక నాకు మరో అనుమానం కలిగింది. మీరు ఆత్మహ.." నవ్వేశాడు.

"ఆ మాట వింటూనే మీ నాన్నగారు తట్టుకోలేకపోయారు. ఏడ్చేశారు. హుస్సేన్ సాగర్ ముందు నిలబడితే మీరు గుర్తొచ్చి నాకూ కన్నీళ్ళు తిరిగాయి."

సీత మాట్లాడలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"చచ్చిపోవడం ఎంత బాగుంటుందా అని ఆలోచిస్తున్నాను. చచ్చిపోతే ఇంత మంచి సానుభూతి లభిస్తుందన్నమాట."

"ఛ! ఏమిటా ఆలోచనలు?" నవ్వేసింది అంతలో.

"అంతసేపు మీరు పార్క్‌లో కూర్చోకుండా ఉండాల్సింది."

"మీరు నన్ను వదిలిపోకుండా ఉండాల్సింది."

"మీరే వెళ్ళమన్నారుగా?"

"లేకపోతే ఉండమని అంటానా? మీరూ ఉంటే త్వరగా ఇంటికి చేర్చేవాళ్ళు"

ఆమె మీద కోపం రాలేదు నాగరాజుకి. "అక్కడ మీవాళ్ళు ఓ కారణానికీ, మీరు మరో కారణానికీ నామీదే నింద వేస్తున్నారు. సరే కానివ్వండి. ఏదో ఒకనిందని నిజం చేస్తాను" అన్నాడు.

ఇంటికి వచ్చేసరికి ఇద్దరూ అతి సామాన్యంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. మధ్యలో నవ్వుకుంటున్నారు. గుమ్మం ముందు కారాపాక, గోవిందరావు ముఖంలో ఆతృత చూశాక మళ్ళీ వారి మనస్తాపం గుర్తుకొచ్చి గంభీరుడయాడు నాగరాజు.

కారు దింపి "ఇదిగో మీ అమ్మాయి. పార్కు నుంచి తిరిగి వస్తూంటే తీసుకొచ్చాను" అని నవ్వుచెప్పాడు.

గోవిందరావు సీత భుజాన్ని ఒకచేత్తో పట్టుకుంటూ "నాగరాజుగారూ మీరు మా శ్రేయస్సు కోరిన వాళ్ళని అంతా నమ్మాం. ఒక్కసారి చచ్చిన పాముని మళ్ళీ కర్రతో కొట్టకండి. ఇందాక మాధవరావు చెప్పిన మాటలు నమ్మలేదు. కాని ఇప్పుడు నమ్మక తప్పడంలేదు. అమ్మాయిని మీరు పెళ్ళిచేసుకోవాలనుకుంటే ఇది కాదు మార్గం" అని, దిగ్భ్రాంతురాలైన సీతను లోపలికి నడిపించుకుపోయాడు.

ఆ తర్వాత చాలాసేపటి వరకూ నాగరాజుకి దిక్కుతోచలేదు.

16

**తన అభిప్రాయం తప్పనుకున్నాడో,** లేక ఆ పరిస్థితికి రాజీపడ్డాడో కాని, మర్నాడు ఉదయమే గోవిందరావు వచ్చి నాగరాజుని కాఫీకి ఇంటికి తీసుకెళ్ళాడు. విషయమేమిటంటే సీత టైపు పరీక్ష పాసయింది. తుఫానులో ఇరుక్కున్న వాడికి అల్లంత దూరాన దీపం కనిపించినట్టుగా అందరి ముఖాల్లోనూ చాలారోజుల తర్వాత ఓ సంతోషపు రేఖ కనిపించింది.

ఇంకా పూర్తిగా నలభై అయిదేళ్ళయినా నిండని గోవిందరావు విశ్రాంతిగా నిట్టూర్చాడు. "ఇక నేను చచ్చిపోయినా పర్వాలేదు. అది కుటుంబాన్ని సాకగలదు" ఈ మాటలు నాగరాజు తప్ప ఇంకెవరూ వినలేదు.

"మీకేం ఇంకా మరిన్ని ఏళ్ళు బ్రతికే వయస్సుంది. మీ మనవలతో అనవలసినమాట" అన్నాడు నాగరాజు నవ్వుతూ.

కొన్ని శుభాలు జరగడం మాట ఎలా ఉన్నా ఆలోచించుకోడానికే హాయిగా ఉంటాయి. ఆ మాటకి 'ఆ రోజు వస్తుందంటారా?' అన్నట్టు కృతజ్ఞతతో చూశాడు గోవిందరావు.

"దానికింక పెళ్ళికాకపోయినా ఇబ్బంది లేదు. దేవుడు దయతలచకపోతే యేదో ఉద్యోగం చేసుకుంటుంది. దాని రాత కెవరేం చేస్తారు?" అని వేదాంతాన్ని ప్రకటించింది వర్ధనమ్మ సీత ఎదురుగానే.

"మా స్కూల్లో టైపిస్ట్ పని ఖాళీగా ఉందన్నారక్కా. కనుక్కుని రేపు చెప్తాను" అన్నాడు వేణు.

ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబాన్ని అమ్మాయి పాసయిన ఒక చిన్న టైపు పరీక్షెలా ప్రభావితం చేయగలదా అని ఆశ్చర్యంతో చూస్తూ కూర్చున్నాడు నాగరాజు. కుర్చీలో కూర్చున్నవాడికి కుక్కకి రొట్టె విసరడం వినోదమయితే కావచ్చుగాక, కుక్కకి మాత్రం అది ఆహారం. నాగరాజు ఫ్యాక్టరీలో ఏడుగురు టైపిస్టులున్నారు. తనకి ఒక పి.ఏ ఉంది. సీతకి సులువుగా ఒక ఉద్యోగం ఇవ్వగలడు. కానీ ఆ విషయాన్ని నోటివరకూ వచ్చినా మాటని ఆపుకున్నాడు.

లేచి బయటికి వస్తూ 'సాయంకాలం ఇన్స్టిట్యూట్‌కి వస్తాను. వెళ్ళిపోకండి' అనేసి వచ్చేశాడు. కానీ అనుకున్నదానికంటే చాలా ముందుగా వెళ్ళాడు. వెళ్ళేసరికి కుటుంబయ్యగారు కూర్చునే స్థలంలో సీతని చూసి ఆశ్చర్యపోయాడు. "టాన్సిల్స్‌ని కుటుంబయ్యగారు అశ్రద్ధ చేశారట. ఆసుపత్రిలో వాళ్ళావిడని చేర్చడానికి వెళితే నువ్వు

కూడా చేరాలన్నారట డాక్టర్లు. వెంటనే ఆపరేషన్ జరగాలట. నన్ను ఈ పనంతా చూడమన్నారని వాళ్ళబ్బాయి చెప్పి వెళ్ళాడు.''

నవ్వొచ్చింది నాగరాజుకి. ''భలే, అయితే పరీక్ష పాసయిన రోజే ప్రిన్సిపాల్ ఉద్యోగం కూడా వచ్చిందిన్నమాట. మీకివాళ పార్టీ ఇవ్వాలనుకున్నాను. కానీ ఇప్పుడు నేను పార్టీ తీసుకోవాలి'' అని నవ్వుతూ ఎదురుగ్గా కూర్చున్నాడు.

''అయితే ప్రిన్సిపాల్‌గారూ తమరొక్క క్షణం బయటికి రావచ్చునా? లేక కుర్చీ వదలడానికి వీల్లేదా?''

''ఫరవాలేదు పదండి. నేను వాళ్ళకేం చెప్పాలి గనక? వాళ్ళంతట వాళ్ళే టైపు చేసుకుంటారు. కుటుంబయ్యగారు చేసేది అదే. అందరం వెళ్ళాక తలుపులు వేసుకుపోదాం'' అని లేచింది.

అప్పటికి ఇంకా మధ్యాహ్నపుటెండ వాలుపట్టి వంటిని కాలుస్తోంది. పగబట్టిన వాడి కోపంలాగా వాడిగా, వేడిగా ఉంది ఎండ.

కారులో కూర్చున్నాక ''పార్టీ మీరిస్తారా? నన్నివ్వమంటారా?'' అన్నాడు. నవ్వింది సీత.

''నేనేం ఇవ్వగలను మీకు? బాధలో ఉన్నవాడిని కూడా నవ్విస్తారు మీరు.''

''పోనీ ఓ మాట ఇవ్వండి. మీకిష్టమైన కోరికేదో చెప్పండి. అది నేను తీరుస్తాను. అందుకు అంగీకరించాలి మీరు.''

చాలారోజుల తర్వాత మనస్సు గాలిలో తేలిపోతున్నట్టుంది సీతకి. ఈ చనువుగాని, ఆత్మీయతగాని ఈ మధ్య చాలా సకృతుగా లభించాయి ఆమెకి. అయినా కోరికలేమున్నాయి తనకి? ఆలోచనలు తెమిలేవరకూ కారు నడుస్తూనే ఉంది. కాస్సేపటికి ఎదురుగ్గా చార్‌మినార్ కనిపించింది. నిర్దోషి శీర్షంలాగ ఠీవిగా, గర్వంగా నిలబడిన కట్టడాన్ని చూస్తూ చటుక్కున అంది. ''ఆ చార్‌మినార్ మీదకి వెళ్ళాలని ఉంది'' పకాలున నవ్వాడు నాగరాజు.

''నన్ను వెక్కిరిస్తున్నారు మీరు. లేకపోతే అదొక కోరికా? దాన్ని తీర్చడానికి నేనే కావాలా?''

''అంతకు మించి ఏమున్నాయి. ఇంత సులువుగా తీరేవి?'' మాటల్లో మళ్ళీ నిర్వేదం ధ్వనించడం కనిపెట్టి ''సరే దిగండి. చూసి వద్దాం'' అన్నాడు.

లేడిపిల్లలాగ పదేసి మెట్లు ఒక్క ఊపుతో ఎక్కి వెనక్కి తిరిగి ఆగుతోంది. ఆ ఉత్సాహాన్నీ, సంతోషాన్నీ చూసి ఆశ్చర్యపోయాడు నాగరాజు. అతి ఘోరమైన సమస్యల మధ్య కూడా అతి విచిత్రమైన విషయాల్లో ఆటవిడుపును వెదుక్కుంటారు ఆడవాళ్ళు. తనని సంతృప్తి పరచడానికి చార్‌మినార్ అన్నదనే అనుకున్నాడు కాని, ఇప్పుడు ఈ అల్లరి చూశాక తను చాలా మంచిపని చేశాడనిపించింది. ఆమెను చుసిన కొత్తలో నవ్వుతూ పలకరించే పాత సీత కనిపించిందిప్పుడు. సగం మెట్లెక్కేసరికి అసలే బరువైన శరీరం త్వరగా అలసిపోయింది. తలంటు పోసుకున్న జడపాయలుగా వీడి చెక్కిళ్ళ మీదకి జారింది. కుంకుమ చెమటకి తడిసి ముక్కు మీదకి తోవ చేసుకుంది. ఎర్రటి బ్లౌజు తడిసి వంటికి అంటుకుంది. మీది మెట్టు మీద నిలబడి 'రండి' అంటోంది. కాళ్ళు పట్టుకుపోయి గోడకి చేరబడిపోతే కిలకిలా నవ్వుతోంది.

''నా కోరికని తీర్చడంలో ఇంత అలసట ఉందని గుర్తించలేకపోయారు మరి.''

నవ్వాడు నాగరాజు. "ఇంత అలసటలో మీకానందం ఉందని నాకేం తెలుసు" అంటే సిగ్గుపడింది. నల్లని ముఖంలో సిగ్గు చాలా అతికినట్టు అమిరింది. తనని గమనిస్తున్నాడేమోనని కళ్ళకొనల నుంచి చూసింది. తననే తదేకంగా చూస్తున్నాడని గ్రహించి స్థంభాల మధ్యనుంచి కనిపిస్తున్న నగరం వేపు తల తిప్పింది.

అక్కడికి మనుషులు బెల్లాన్ని వెదుక్కుంటున్న చీమల్లాగా కనిపిస్తున్నారు. ఇళ్ళు చీమల పుట్టల్లాగా ఉన్నాయి. అక్కడక్కడా నీరు కనిపిస్తున్న మూసీ నదిలో ఎండపడి మెరిసి, ఎండిపోయిన పాలచారలాగా ఉంది.

మిగతా పదిమెట్లు ఎక్కేసరికి తనూ అలసిపోయింది. మీదికి వచ్చేకొద్దీ మెట్లు దగ్గరై మార్గం మరీ సన్ననయింది. మీదికి చేరాక దూరంగా పీలికల్లాగా కనిపించే మనుషులవేపే చూస్తూ నిలబడింది. వెనుక ఆలస్యంగా మీదికి వచ్చాడు నాగరాజు.

"ఏమిటి చూస్తున్నారు?" అంటే

"చూడండి. వాళ్ళంతా చిన్న పురుగుల్లాగా కనిపిస్తున్నారిక్కడికి. కానీ వాళ్ళ మనస్సుల్లో నాకు మల్లేనే మేరు పర్వతాల్లాంటి సమస్యలు ఎన్ని ఉన్నాయో?"

"ఏది, మీ సమస్య ఒక్కటి చెప్పండి చూద్దాం"

విచిత్రంగా చూసింది అతన్ని.

"నాకు సమస్యే లేదంటారా?"

"అలాంటివి కొద్దిగానో గొప్పగానో అందరికీ ఉంటాయి. దాన్ని మనం చూడడంలో, ఎదుర్కోవడంలో ఉంటుంది. దీన్ని పదే పదే జ్ఞాపకం చేసుకోవడంతో, మీరు క్రమంగా 'నాకు ఎన్నో సమస్యలు ఉన్నాయి' అనే ఆలోచనకు బానిసవుతున్నారు. అట్లా చెప్పుకోవడాన్ని మీ మనస్సు గర్వంగా భావిస్తోంది. ఇది చాలా ప్రమాదకరమైన జబ్బు. జీవితంలో ప్రతి విషయాన్నీ సమస్యలతో పోల్చి చూసుకోకండి. మీరిప్పుడు సంతోషంగా ఉన్నారు. ఈ క్షణంలో మీ సమస్యల జ్ఞాపకం ఆ సంతోషాన్ని చెదరగొడుతోంది."

విస్తుపోయి అతణ్ణి చూసింది.

"ఇక పోదామా?" అన్నాడు.

"ఉండండి. కాస్సేపు అలసట తీర్చుకోనివ్వండి" ఉన్న ఒకే మెట్టుమీద కాళ్ళు వేలాడేసి కూర్చుంది. అతను గోడమీద చదికిలబడ్డాడు.

"నా మీద మీకెందుకింత దయ?" అంది ఉన్నట్టుండి హఠాత్తుగా.

"ఏమో తెలీదు. నవ్వుతూ, ప్రశాంతంగా తిరిగే అమ్మాయిని నేనే పరిచయం చేసుకున్నాను. నా స్నేహంతోనే మీకు కష్టాలు, మనస్తాపాలూ పరిచయాలయాయి. క్రమంగా మీరు దిగజారిపోవడం చూశాను. మళ్ళీ మీలో ఈ పాత సీతని చూడాలనే ఉత్సాహమే కారణమేమో?"

"చూడగలరంటారా?"

"అది మీరు సహకరించడంలో ఉంటుంది."

తుళ్ళిపడింది సీత. ''అంటే?'' అంది, సూటిగా కళ్ళల్లోకి చూస్తూ. ఆమె ఊహించిన అర్థాన్ని గ్రహించి జవాబు చెప్పడానికి తొందరపడ్డాడు. ''అంటే గతాన్ని మరిపించే నా ప్రయత్నాన్ని మీరంగీకరిస్తే చాలు. మళ్ళీ ఆ పాత స్నేహితురాల్ని మీలో చూడగలిగిననాడు నా పని అయిపోతుంది. అప్పుడు నేను నిశ్చింతగా వెళ్ళిపోతాను.''

''అంతేనా?''

''చూశారా? నా ప్రయత్నంలోనూ నా స్వార్థమే ఉంది. మీకు నవ్వు తెప్పించడమూ నా తృప్తికే'' ఫక్కున నవ్వాడు.

కానీ సీత నవ్వలేదు. ఏదో ఆలోచిస్తోంది. నుదిటిన పట్టిన చెమటకి జుత్తు నుదుటికి అంటుకుపోయింది. నల్లటి కింది పెదవి, కాఠిన్యానికి శిక్షననుభవిస్తున్న జీవితాన్ని గుర్తు తెస్తోంది. సన్నటి మెడ మీద నరాలు రెపరెపలాడుతున్నాయి.

''నిన్న మా నాన్నగారి మాటలకి ఏమయినా అనుకున్నారా?'' హఠాత్తుగా అడిగింది.

''లేదు'' అన్నాడు కాస్సేపు ఆలోచించి.

''ఎందుకని?''

''ఆయన పరిస్థితిలో ఉన్నవాళ్ళు ఎవరైనా అలా అనుకోక తప్పదు. పాముని చూసి భయంలేని వాడు నలుగురిలో నవ్వుతూ దానితో ఆడకూడదు. అప్పుడు వాడు అందరికీ శత్రువవుతాడు. వాడూ నలుగురిలా భయపడాలి. సమాజపు సగటు బలహీనతే ఒక విధంగా సమాజాన్ని ఒకటిగా కట్టిపడేసే బలం కూడాను. అందుకు భిన్నంగా ప్రవర్తించే నిజం వాళ్ళని శంకిస్తుంది. నిన్న మనం కళ్ళనీళ్ళు కార్చుకుంటూ కారులోంచి దిగి ఉంటే మీ నాన్నగారు నాకు కృతజ్ఞత కూడా చెప్పేవారు. అంతే తేడా!''

వింతగా మొదటిసారిగా చుస్తున్నట్టు నాగరాజుని దిమ్మెరపోయి చూసింది సీత.

''ఇవన్నీ ఎక్కడ నేర్చుకున్నారు మీరు?'' అని ప్రశ్న వేసింది, చిన్నపిల్లలాగ.

''మీరిచ్చిన పుస్తకాల్లో.''

''మరి నాకు కనిపించలేదేం?''

''మీరు ఆ పుస్తకాల్లో పాత్రల్ని అర్థం చేసుకున్నారు. నేను వాళ్ళు బ్రతుకున్న వ్యవస్థని చూశాను. వ్యక్తుల్ని రచయితలు తయారు చేశారు. వ్యవస్థని వాళ్ళు తయారు చెయ్యలేరు. అందుకని అది సహజంగా ఉండి పాత్రలు వింతగా, కొత్తగా కనిపిస్తాయి. రెండింటికీ సమన్వయం కుదిరినప్పుడే మంచి రచనలు వస్తాయి'' అంతలో ఆగి ''ఇదేమిటి? చార్‌మినార్ మీద సాహిత్య గోష్ఠి ప్రారంభించాం మనిద్దరం? ఇక పదండి'' అని లేచాడు.

ఏమాలోచిస్తుందో ఏమో ఆమె ఇంకా అలానే కూర్చుని ఉంది. భక్తితో కుదిరిన ఏకాగ్రతం కంటే, భయంతో, భయంలో కుదిరే ఏకాగ్రత చాలా భయంకరంగా ఉంటుంది. తన జీవితాన్ని గురించి ప్రతీ ఆలోచనా అటువేపు లాగేస్తోంది ఆమెని. ఆ క్షణంలో ఆమెని చూస్తే జాలేసింది నాగరాజుకి. అనుకోకుండా 'సీతా' అన్నాడు.

చెవిలో రహస్యం చెప్పినట్టుగా, ఎవరో ఆప్తుల పలకరింతలాగా వినిపించి ఆమె విస్తుపోతూ తల ఎత్తింది. ప్రతి తియ్యటి పలకరింతా ఆమె మనస్సుని అర్థం చేస్తున్నదిప్పుడు. అప్రయత్నంగా కళ్ళనీళ్ళు వచ్చాయి.

''ఎందుకేడుస్తున్నారు?''

''అబ్బే, ఏడవడంలేదే?'' కళ్ళు తుడుచుకుంది.

"నాకు సంతోషంలో కూడా కళ్ళనీళ్ళు వస్తున్నాయి. దురదృష్టం, ఆనందాన్ని చెప్పుకోడానికి కూడా ఇంతకన్నా మారో మార్గం లేదు నాకు. నిజంగా నాకు చాలామంచి బహుమానం ఇచ్చారు ఇవాళ. ఇంక పదండి" అని పక్కకి తప్పుకుని నిలబడింది. ఆ చిన్న స్థలంలో మనిషి పక్కకి తప్పుకుని తొలగడానికి చోటిచ్చే అవకాశం లేదు. తప్పుకోవడానికే వీలులేని స్థలంలో మనిషి పక్కకి తప్పుకుని తొలగడానికి చోటిచ్చే అవకాశంలేదు. తప్పుకోవడానికే వీలులేని స్థలంలో ఇద్దరూ ఇరుక్కుపోయారు. అతను తప్పుకోలేదు. ఆమె భుజం చుట్టూ చెయ్యివేసి దగ్గరకి తీసుకుని ఆమె తలని ఆప్యాయంగా తన భుజానికి ఆనించుకున్నాడు.

"భయపడకండి. చివరికంతా మంచే జరుగుతుంది" అన్నాడు మెల్లగా. ఆమె శరీరం ఆకులాగా కంపించడం అతని శరీరానికంతటికి తెలిసింది. ఆమె మెరుపులాగా అతని చేతిలోంచి తప్పించుకుని మెట్లన్నీ ఒక్క ఉదుటున దిగడం ప్రారంభించింది. 'సీతా' అని పిలవాలనికాని, ఆమెతో మాట్లాడాలని కాని ధ్యాసపోయింది నాగరాజుకి.

లజ్జతో, అవమానంతో స్థంభీభూతుడయి అలాగే నిలబడిపోయాడు. అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. 'సాబ్' అని పిలుస్తూ దర్వాన్ వచ్చాడు.

"టైమ్ అయిపోయింది సాబ్. దర్వాజా బంద్ చెయ్యాల. మేమ్ సాబ్ తమర్ని పిలుస్తున్నారు. కారులో కూర్చున్నారు" అన్నాడు.

కారు దగ్గరకి వచ్చేసరికి తలుపు తెరిచి "త్వరగా రండి. ఇంకా ఇనిస్టిట్యూట్ తలుపులు మూసుకుని ఇంటికి పోవాలి" అని చిరునవ్వు నవ్వింది.

ఆ నవ్వులో ఇదివరకటి నిండుదనం, స్వేచ్ఛా లేకపోవడంతో ఖిన్నుడయి, మంత్రముగ్ధుడిలా స్టీరింగు ముందు కూర్చున్నాడు.

17

మరో వారం రోజుల తర్వాత ఓ సంఘటన జరిగింది.

ఆసుపత్రిలో ఉన్న కుటుంబయ్యని చూడడానికి, ఇనిస్టిట్యూట్ వ్యవహారాలు చెప్పడానికి వెళ్ళింది సీత. ఆమెను చూస్తూనే కళ్ళనీళ్ళతో పలకరించాడు కుటుంబయ్య. "ఈ నరకం నుంచి విముక్తిలేనట్టుందమ్మా. మరేవో కొత్త బాధలు బయటపడ్డాయి. డైబెటీస్ వుందిట. ఇన్నాళ్ళూ తెలియక అశ్రద్ధ చేశాను. ఇప్పుడీ జబ్బులు నా కొంపముంచుతున్నాయి" అన్నాడు.

బెంగతో, బాధతో చిక్కి శల్యమైన కుటుంబయ్యని చూస్తూ క్షణకాలం మాట్లాడలేకపోయింది.

"మీరిక్కడ చాలాకాలం ఉండడం తప్పకపోయేటట్టయితే ఇనిస్టిట్యూట్ వ్యవహారాలు చూడడానికి ఎవరినైనా మనిషిని చూడడం మంచిది. అవన్నీ నావల్ల అయేవికావు. అప్పుడే జీతాలు కడుతున్నారు. ఇదిగో డబ్బు"

"ఇక ఇనిస్టిట్యూట్ నడపడం నావల్ల అయేదికాదు తల్లీ. ఇకనుంచీ అవన్నీ నాగరాజుగారికి అప్పగించు. ఇనిస్టిట్యూట్ ఆయనకి అమ్మేశాను."

నిర్ఘాంతపోయింది.

"ఎప్పుడు అమ్మేశారు?"

"మొన్న చూడటానికి వచ్చాడు. ఇన్‌స్టిట్యూట్ తీసుకుని మరో వెయ్యి రూపాయలు కావాలన్నాను. 'అది నేనేం చేసుకోను' అని నవ్వాడు. మళ్ళీ ఏం ఆలోచించాడో ఏమో 'సరే'నన్నాడు. మర్నాడు కాగితాలూ అవీ వ్రాసుకుని వచ్చాడు. ఇక నాకూ ఇనిస్టిట్యూట్‌కు రుణం తీరిపోయింది తల్లీ" అన్నాడు.

ఏమీ మాట్లాడలేదు సీత.

"రోజూ కలుస్తాడుగా? నీతో చెప్పే ఉంటాడనుకున్నాను" అన్నాడు మళ్ళీ.

"ఈ మధ్య కలవడంలేదు. అయినా ఇలాంటివన్నీ నాతో చెప్పవలసిన అవసరం ఏముంది? అంది.

"అయితే ఈ డబ్బును ఏం చెయ్యమంటారు?"

"అంతా ఆయనకే ఇవ్వు" అన్నాడు.

లేచి వచ్చేసింది సీత. కుటుంబయ్య దగ్గర కొంత నిర్లక్ష్యాన్ని ప్రకటించిందేగాని, ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తూనే ఉంది సీత. కుటుంబయ్యకు నాగరాజు సహాయం చెయ్యడంలో తనకి ఆక్షేపణ లేదుకాని, తను పరిచయం చేసి ఇద్దరూ ప్రాణస్నేహితులై తనని బహిష్కరించినప్పటి ఉదాసీనత మనస్సులో మెదిలింది. అయినా అతను అవుననుకున్న పనిని కాదనడానికి తనకేం అధికారం ఉంది అనుకుని సరిపెట్టుకుంది.

అయితే రోజు రోజుకీ స్టూడెంట్స్ చెల్లించే డబ్బు తన దగ్గర ఉండిపోయింది. నాగరాజు కనిపించలేదు. ఇదివరకులాగా మేడమీద దీపం వెలగడంలేదు. ఆమెకి అతనితో మాట్లాడాలన్న ఆసక్తి ఎక్కువైంది. ఒకరోజు ఇంటి తలుపు తీసి ఉండటం చూసి వెళ్ళి తలుపు తట్టింది. ఇంటి యజమాని నాయుడుగారు తలుపు తీశారు. ఇంటికి మళ్ళీ సున్నాలు వేయిస్తున్నాడు. సీతని చూసి ఆశ్చర్యపోయాడు.

"నాగరాజుగారు లేరా?" అని అడిగింది.

ఆయనా సీతకథ చాలాసార్లు విన్నాడు. ఇప్పుడూ ఆమె స్వయంగా ఇంటికి రావడంతో కథ చాలామట్టుకు రూఢీ అయిపోయింది. విషయమంతా అర్థమైనట్టు నవ్వాడు.

"అదేమిటమ్మా ఆయన వారంరోజుల క్రితమే ఇల్లు ఖాళీ చేసేశారు. మీకు చెప్పలేదూ? వాళ్ళ ఫ్యాక్టరీలోనే బంగళాలో ఉంటారట" అన్నాడు.

సీత వెనక్కి తిరిగి వస్తూంటే 'ఆయన తమకు ఏమయినా బంధువులా?' అని అడిగాడు కావాలనే.

సీత ఆగింది. ఇదివరకటి బెరుకుతనం, భయం లేకుండా "అవును. చాలా కావలసిన వారు. ఈ మాటు మీకు కనిపిస్తే నేనొకసారి కలుసుకోమన్నానని కూడా చెప్పండి" అనేసి ఇంట్లోకి వచ్చేసింది.

ఆమెకి తల తిరిగిపోయింది. కొన్ని విషయాల్ని రహస్యంగా ఉంచడంలోనో, లేదా కొన్నింటిని ఎదుటివాడే తెలుసుకుని ఆశ్చర్యపడేటట్టు చెయ్యడంలోనో ఆసక్తి ఉంటుంది కొందరికి. ఆప్తుల మధ్య ఇట్లాంటి ఉత్కర్ష కొందరికి నచ్చదు. తనకు తెలియని రహస్యాలేమైనా నాగరాజుకి ఉన్నాయేమోననుకుంది సీత. ఏమైతేనేం? ఒక్కసారి కలిస్తే బావుణ్ణన్న ఆలోచన యెక్కువైంది. అతనిపేరు చెపితే ఎక్కడ ఉంటున్నది తెలుసుకోవడం యేమంత కష్టం అనిపించలేదు. ఒక నౌకరు ఫ్యాక్టరీకి ఎడమవేపుగా బంగళా తోవ చూపాడు. చాలా సామాన్యంగా, కాని చాలా విలక్షణంగా ఉంది బంగళా. ముందు పెద్ద వేపచెట్టు. దాని నీడలో కుర్చీలు వేసి ఉన్నాయి. గోడలకి చాలా భాగం అద్దాలే ఉన్నాయి. ద్వారానికి నీలిరంగు కర్టెన్లు వేసి

ఉన్నాయి. చెట్టుకింద కుర్చీలో కూర్చోమని చెప్పి లోపలికి వెళ్ళాడు నౌకరు. లోపల ఎవరిదో దగ్గు వినిపిస్తోంది. డాక్టరు బయటికి వచ్చి కారులో ఎక్కాడు. నాగరాజు కారు ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని చూసింది. కానీ ఎక్కడా ఆ ఛాయలేదు. ఒకవేళ ఇంట్లో లేడేమో?

చాలాసేపటికి బయటికి వచ్చాడు నౌకరు. 'అయ్యగారు రమ్మంటున్నారండీ' అన్నాడు. లోపలికి నడవబోతుంటే 'అయ్యగారు బాగా విశ్రాంతిగా ఉండాలని డాక్టరుగారు చెప్పి వెళ్ళారండీ' అని మాట చేర్చాడు. ఆశ్చర్యానికి కూడా వ్యవధి లేదు. గదిముందుకు వచ్చింది సీత. లోపల్నుంచి 'రా సీతా' అని పిలిచాడు నాగరాజు. ఆ పిలుపుకు విస్తుపోయింది.

కొందరు దూరంగా ఉన్నా మనస్సులో పెంచుకున్న బాంధవ్యాన్నీ, స్నేహాన్ని పురస్కరించుకుని ఆ వ్యక్తి కనిపించగానే ఆప్తునిలా పలకరించాలనిపిస్తుంది. సీత ఎన్నాళ్ళ నుంచో తన బంధువులాగా పలకరించాడు నాగరాజు. అతన్ని చూస్తూనే ఆశ్చర్యపోయింది. ఈ పదిరోజుల్లోనే చాలా నీరసించి పోయినట్టనిపించాడు. మంచం మీద కూచుని ఉన్నాడు. పక్కనే మందుసీసాలూ, పళ్ళూ ఉన్నాయి.

"ఇలా కూర్చో" అని కుర్చీ చూపించాడు.

"మనం క్రితంసారి కలుసుకున్న రోజు రాత్రి చచ్చిపోతానేమోననిపించింది. ఓ రాత్రి తెలివొచ్చేసరికి విపరీతమైన చలి, వొళ్ళు నొప్పులూ ప్రారంభమయ్యాయి. రెండు గంటలసేపు యమబాధననుభవించాను. మొదటిసారిగా చాలా నిస్సహాయంగా ఏడ్చాను. సహాయం చెయ్యడానికి దగ్గర ఎవరూ లేరు. కాస్త చలి తగ్గగానే రాత్రికి రాత్రి కారు తీసుకుని ఇక్కడికి వచ్చేశాను" అని అన్నాడు.

ఏమీ మాట్లాడలేక అతన్ని చూస్తూ కూచుంది. "మీకెవరికీ చెప్పడానికికూడా వ్యవధి లేకపోయింది. కోపం వచ్చిందా?" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అంతకన్నా కోపం తెప్పించే పనులు చాలానే చేశారు మీరు" అంది సీత ఉదాసీనంగా.

అతని ముఖం నల్లబడింది. "అయితే ఇంకా నన్ను క్షమించలేదన్నమాట మీరు. చూశారుగా నేను చేసినదానికి ఇన్నాళ్ళూ శిక్షననుభవిస్తున్నాను" అని అన్నాడు.

అతని దైన్యతకు జాలితో ఆర్ద్రమైంది సీత మనస్సు. "అబ్బే అదికాదు నేననేది. నాకు తెలియకుండా టైప్ ఇనిస్టిట్యూట్ ఎందుకు కొన్నారు?"

నిజంగా ఎందుకు కొన్నాడో చెపితే ఆమె తక్షణం తను చేస్తున్న పని మానుకుంటుంది. అది తనకు తెలుసు. అందుకనే మెల్లగా అన్నాడు.

"ఈ మధ్య కుటుంబయ్యగారు అబ్బాయిని నా దగ్గరకి పంపించారు. డబ్బు కావాలని. నా దగ్గర లేదన్నాను. మర్నాడు ఇనిస్టిట్యూట్ అమ్మేస్తానని, తనెలాగూ వెయ్యి రూపాయలు ఇవ్వాలి కనుక మరో పదిహేను వందలు ఇచ్చి పైసలు చెయ్యమని చెప్పాడు. బ్రతిమాలుతూ పెద్ద ఉత్తరం వ్రాశాడు. చివరికి ఒప్పుకోక తప్పలేదు."

నాగరాజే స్వయంగా వచ్చాడని కుటుంబయ్య ఎందుకు అబద్ధం చెప్పాడో అర్థం కాలేదు సీతకి. కొందరు బీదరికానికి కూడా అందమైన అలంకారాలు చేసుకుంటారు.

"మీతో ఎంతోసేపు దెబ్బలాడాలని వచ్చాను. మిమ్మల్ని చూసేసరికి ఏం మాట్లాడలేకపోతున్నాను. వంట్లో బాగోలేదని నాకెందుకు కబురు చెయ్యలేదు?" అంది.

"కొందరు స్నేహితులు సంతోషాన్నే పంచుకుంటారు. కొందరు దుఃఖాన్ని కూడా పంచుకుంటారు. మీరు అలాంటి సహాయం చేస్తారని అనుకోలేక సాహసించి చెప్పలేకపోయాను. అయినా నేనే మీకు చాలా బాధలు తెచ్చిపెట్టాను. నా బాధకూడా ఎందుకు?" "ఇక్కడికొచ్చినప్పుడు 'సీతా' అన్నారు. ఇప్పుడు మళ్ళీ 'మీరు' అని మొదలుపెట్టారే? నన్నేమనాలో తేల్చుకోండి" నవ్వింది ఆ మాట మారుస్తూ.

ఆమెని చూస్తూంటే అతనికి ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చినట్టయింది. "ఈ ఏడురోజులూ ఎంత బాధపడ్డానో తెలీదు, ఆ రోజు నా ప్రవర్తనకి మీరేం అనుకుంటున్నారో అన్న ఆలోచనే నిజంగా నా అనారోగ్యానికి కారణం. ప్రపంచంలో ఏది పోగొట్టుకున్నా నష్టం లేదు. కాని మనిషి మీద విశ్వాసాన్నీ, గౌరవాన్నీ పోగొట్టుకోవడం చాలా ఘోరం."

"విశ్వాసం పోయిందో పెరిగిందో మీకు బాగా తెలుసా? మీరు నా పుస్తకాల్లో సంఘాన్ని గురించే చదివారు. రేపు పంపుతాను. వ్యక్తుల గురించి కూడా కాస్త చదవండి" అని నవ్వుతూ లేచి నిలబడింది.

"మనుషులకి వేరే ధర ఏదయినా ఉంటే బాగుణ్ణు ఆమె చిరుకోపంతో ఇటు తిరిగితే నవ్వేశాడు.

"ఇప్పుడు మీ యజమానిని నేను. మీకు నేను శలవు ఇవ్వాలిగా? అలాగే ఇస్తాలెండి."

"స్టూడెంట్స్ జీతాలు కడుతున్నారు. ఆ డబ్బంతా నా దగ్గర ఉండిపోయింది. దాన్నేం చెయ్యమంటారు?"

"అదంతా మీ జీతంలాగా తీసుకోండి. పని చేస్తున్నారుగా? కుటుంబయ్యగారిలాగా మీ చేత ఊరికే పనిచేయిస్తే నాకు పాపం చుట్టుకుంటుంది" అన్నాడు

సీత నవ్వుకుని గుమ్మందాకా వచ్చింది. "కారులో పంపించేవాడినేకాని కారిప్పుడు లేదు. అమ్మేశాను" అన్నాడు, మెల్లిగా లేచి గుమ్మం దాకా వస్తూ.

"అదేం?" అంది నిర్ఘాంతపోతూ.

"కారు వల్లే నేను చాలా తప్పులు చేస్తున్నాను. అదీగాక దానిలో కూర్చుంటే పాత విషయాలన్నీ గుర్తుకొస్తున్నాయి. ఈ మధ్య మంచి బేరం వచ్చింది. ఇచ్చేశాను. మళ్ళీ నెలరోజుల్లో కొత్త కారు పంపుతానన్నారు నాన్నగారు" అన్నాడు.

గేటు దాటబోతుంటే "అప్పుడప్పుడు వస్తూండండి. ఇనిస్టిట్యూట్ విషయాలు చెప్పడానికైనా" అన్నాడు.

గేటుదాటి వస్తూ 'అసలు అందుకే ఇనిస్టిట్యూట్ కొన్నాడా' అనుకుంది.

నవ్వొచ్చింది సీతకి.

కొందరికి గులాబీపువ్వు తలలో తురుముకుంటే తృప్తి ఉంటుంది. కొందరికి దాన్ని చూస్తేనే ఆనందం కలుగుతుంది.

**గోపాలం నుంచీ,** ఆ సంఘటనల్నుంచీ సీతని తేరుకునేటట్టు చేయడమే నాగరాజు ఉద్దేశ్యమైతే అతను ఆ ఫలితాన్ని సాధించాడనే చెప్పాలి. కానీ ఆ ప్రయత్నంలో మరొక చిత్రం కూడా జరిగిపోయింది. ఆ జ్ఞాపకాల స్థానంలో

నాగరాజుని గురించిన ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయి. రొట్టెని అరచేతిలో పట్టుకుని రెండుగా చెయ్యడానికి పదునైన కత్తిని పట్టుకున్నాడు. రొట్టెతోపాటు చెయ్యి కూడా తెగింది.

సీత తన పరిస్థితినొక్కసారి బేరీజు వేసుకుంది. ఇంట్లో తల్లికి తండ్రికి తనమీద ప్రేమాభిమానాలు తగ్గిపోయి, క్రమంగా ఆ స్థానంలో భయాందోళనలు ఆక్రమించుకున్నాయి. తన చుట్టూ బ్రతికేవాళ్ళంతా ఇదివరకులాగా స్నేహంతో కాకుండా మాటల్లో హేళనకూడా జతచేశారు.

ఇదివరకు 'బాగున్నావా సీతమ్మా' అని పలకరించేవాళ్ళు ఇప్పుడు 'నీకేమమ్మా బంగారు పిచ్చుకవి. ఏ కష్టం వచ్చినా సుఖం వచ్చినా ఆదుకునే ఆప్తులున్నారు. కానీ వాళ్ళయితే నువ్వు తలచుకుంటే అవసరానికి నీవాళ్ళే అవుతారు' అంటున్నారు.

ఎంత నిర్లక్ష్యంగా ఉందామనుకున్నా బయటికి వచ్చేసరికి ఏదో పిరికితనం మనస్సుని ఊపేస్తోంది.

గోపాలం దూరమై అప్పుడే సంవత్సరం గడిచిపోతోంది. అప్పటి జ్ఞాపకాలు చీకట్లో కాలికి గుచ్చుకున్న ముల్లులాగా గుర్తుకొచ్చినప్పుడల్లా కరేల్ మంటోంది, తనకీ, ఇంట్లోవాళ్ళకీ.

కాలం తొందరగా పరిగెత్తుతోంది. ఆడదానికి వయస్సు కళ్ళు మూసుకు తెరిచేలోగా దాటిపోతుంది. ఈలోగా తన మంచిచెడ్డలు ఆలోచించే తల్లిదండ్రులు కూడా దాటిపోతే తన పరిస్థితి ఎటూ కాకుండా పోతుంది.

కావలసిన భర్తని సంపాదించిపెట్టే అవకాశాన్ని తల్లిదండ్రుల నుంచి స్వయంగా లాక్కున్నాక, తను స్వయంగా సంపాదించుకునే అదృష్టాన్ని కోల్పోయాక మంచి భర్తని కోరుకునే హక్కు తన జీవితంలో శాశ్వతంగా దూరం చేసుకుంది సీత. ఇక తన ఇష్టాయిష్టాల్ని ప్రదర్శించే అవకాశంలేదు. ఇప్పుడు తన జీవితం ఇంజను డ్రైవరు అభిరుచి మీదా, పాత మామయ్యల ఇష్టాయిష్టాల మీదా, రెండో పెళ్ళి భర్తల అవసరాల మీదా ఉంది. దానికి ఎదురు తిరిగితే కొన్నాళ్ళయాక బ్రతకడానికి అర్హత కోల్పోవలసి వస్తుంది. ఈ పరిస్థితి భయంకరంగా తోచింది సీతకి. సుఖంగా బ్రతికే అవకాశాన్ని పోగొట్టుకుని బ్రతకడమే గత్యంతరంగా, లక్ష్యంగా చేసుకున్న మజిలీ దగ్గర నిలబడింది ఆమె.

సాధారణంగా ఈ పరిస్థితుల్లో స్త్రీ నిర్వేదానికి, ఓ విచిత్రమైన వేదాంతానికీ నిరాశకీ బందీ అవుతుంది. ఒక విచిత్రమైన పిరికితనానికి బానిసై ఎటూకాని పరిస్థితిలో నిలిచిపోవడం సీత ఎరుగును. అందుకని వాళ్ళకి కాస్త భిన్నంగా ఆలోచించడం నేర్చుకుంది. ఏడుస్తూ కళ్ళు మూసుకు నిద్రపోవడం వల్ల ప్రయోజనం లేదు. కళ్ళు విప్పి జీవితపు పరుగుని అందుకోగలిగే మార్గమేదైనా ఉందా అని ఆలోచించాలి. బ్రతుకు భయం మనిషిని కృంగదీయడానికి వీలు లేదు. మనిషి బ్రతకాలి.

ఈ ఆలోచన వచ్చాక సీత చాలామట్టుకు మారిపోయింది. చాలా రోజుల తర్వాత పెదాల మీద చిరునవ్వును వికసింపజేసింది. అపశ్రుతిని పలికే గొంతును ఎవరూ వినరు. అందుకని మాటల్లో ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుంది.

జ్వరం తగ్గి నాగరాజు ఇనిస్టిట్యూట్‌కి వచ్చినప్పుడు సీతని చూసి ఆశ్చర్యపోయాడు. హఠాత్తుగా అతనికి భయం వేసింది. మళ్ళీ ఇంట్లో ఏదైనా జరిగిందేమోననుకున్నాడు.

"రండి ప్రొప్రయిటర్‌గారూ" అంటూ తను లేచి కుర్చీ చూపింది నాగరాజుకి.

"అహహ! మీరే ఆ కుర్చీలో కూర్చోండి. మహాభారత గ్రంథాన్ని కొనే డబ్బున్నంత మాత్రాన అది చదివినట్టుకాదు. నాకు కొనే డబ్బు ఉంది. మీకు దాన్ని నిర్వహించే నేర్పు ఉంది. మీరే దీన్ని నడపాలి" అని ఆవిడ వద్దంటున్నా వినకుండా భుజం పట్టుకుని కుర్చీలో కూలవేశాడు. దానికి ఆమె ఆశ్చర్యపడలేదు. కనీసం పడినట్టు కనిపించకుండా జాగ్రత్త పడింది. ఆ తొందరలో అతనలా చెయ్యవలసి వచ్చినా, ఆమె ఆశ్చర్యపడనందుకు అతనికి ఆశ్చర్యం కలిగింది. ఆతర్వాత దాని గురించి చాలాసేపు ఆలోచించాడు.

ఆమె జీవితంలో సమస్యలన్నింటి పరిష్కారానికి కీలకం తెలిసిన వ్యక్తిలాగా ఆమె పెదాల చివర చిరునవ్వును గుర్తించి విస్తుబోయాడు. "ఇదేమిటి? ఇంత త్వరలో మీరు మారిపోయారు" అన్నాడు.

"మొదట ఇది చెప్పండి. ఈ మార్పు బాగుందా?"

"చాలా బాగుంది. దాన్ని మీలో చూడాలని నేను ఇన్నిరోజులు ప్రయత్నించాను. కానీ నేను లేకుండా చూసి మీరే సాధించారు."

"కాదు మీరే సాధించారు. ఈ మార్పుకి మీరే కారణం" అంది. కాని అలా అన్నందుకు సిగ్గుపడింది. ఆమాట తగలవలసిన చోటే తగిలింది నాగరాజుకి. అతని దిగ్భ్రమ ఇందువల్ల ఎక్కువైందే కాని తగ్గలేదు.

పూర్తి స్వేచ్ఛ లభించిన స్త్రీవల్లా, పూర్తి నిర్బంధంలో ఉన్న పురుషుని వల్లా ప్రమాదమే కాని, క్షేమం తక్కువ. ఇంత స్వేచ్ఛ ఈమెకెవరిచ్చారా, ఏ ఆలోచన ఇంత ఆనందాన్ని విడుదల చేసిందా అని ఆలోచించాడు. కానీ ఎంతకీ ఆ సమస్య తెగలేదు.

సాయంకాలం తనతోపాటు రిక్షాకోసం నిలబడిన నాగరాజుని చూస్తే సీతకి నవ్వొచ్చింది.

"జ్ఞాపకాల్ని మరచిపోవడమంటే కష్టాల్ని కొనుక్కోవడం కాదు సార్. మీకు రిక్షా బేరం చేసిపెట్టడానికి ఒక అసిస్టెంటును వేసుకోండి" అంది.

నిజంగానే ఇద్దరికీ రిక్షా దొరకలేదు. ఆలస్యం అవుతున్నకొద్దీ ఆ రోజు సాయంకాలం సంఘటన గుర్తుకొచ్చి నాగరాజుకి భయం ఎక్కువైంది. చివరికి ఒక రిక్షా దొరికాక, "రండి ఇద్దరం దీంట్లోనే పోదాం. మిమ్మల్ని బంగళా దగ్గర వదిలేసి నేను పోతాను" అంది సీత.

ఆశ్చర్యపోయాడు నాగరాజు. అభ్యంతరం ఎలా తెలపాలో అర్థం కాలేదు.

"ఎవరైనా చూస్తే బాగుండదు."

"కారులో కూర్చున్నప్పుడు చూస్తే బాగుండేదా? మనం కూర్చోవడం బాగుందనుకున్నప్పుడు చూస్తే తప్పేం? పదండి, ఇక ఆలస్యం చెయ్యకండి" అతని చెయ్యి పట్టుకుని ముందుకు నడిపించింది.

"ఇంత ధైర్యం నీకెవరు నేర్పారు సీతా?" అన్నాడు రిక్షాలో కూర్చున్నాక.

"ఇది ధైర్యం కాదు సార్. చొరవ. మొదటిరోజు బలవంతంగా అన్నం తినిపించిన అమ్మని రెండోరోజు అన్నం పెట్టమని అడగాలని పసిపాపకు ఎవరూ చెప్పరు."

"మరి రోజూ అమ్మ కనిపించకపోతే పసిపాప ఏడుస్తుందా?"

"నిక్షేపంగా."

"అయితే రేపట్నుంచి నేను కనిపించను."

"నన్ను ఏడిపించాలనా?"

"కాదు, అలవాటు తప్పించాలని."

నవ్వు ఆగిపోయింది. "అలా ఎప్పటికీ చెయ్యకండి, మీకు పుణ్యముంటుంది."

మొదట సీత ఇంటికే దారి తీయించాడు నాగరాజు. సీత రిక్షా దిగుతున్నప్పుడు వాళ్ళని ఎవరూ చూడలేదు.

"కారు త్వరగా పంపించమని మీ నాన్నగారికి రాయండి" అంటూ లోపలికి నడిచింది సీత.

మూడు రోజుల తర్వాత ఓ మధ్యాహ్నం చీటి రాసి పంపించాడు నాగరాజు. "ఇవాళ నా పుట్టినరోజు. సాయంకాలం స్నేహితులకి పార్టీ ఇస్తున్నాను. మీ పని పూర్తి అయాక దయచేసి రండి. నేనే స్వయంగా వచ్చి పిలిచేవాణ్ణే. కాని పని తీరడంలేదు."

అలాగేనని నౌకరుకి చెప్పి పంపించింది సీత. కానీ పని పూర్తి చేసుకుని బయలుదేరేసరికి చాలా ఆలస్యమైంది. రోజంతా పనిచేయడంవల్ల సాయంకాలమయేసరికి బాగా అలసిపోయింది సీత. అదీగాక, ఆ రోజు నాగరాజు పుట్టినరోజన్న విషయం ఆఫీసుకి వచ్చిన తరువాత గుర్తుకొచ్చింది. అందువల్ల అక్కడికి వెళ్ళే ప్రయత్నంలో కూడా రాలేదు.

గేటు దాటి లోపలికి వచ్చేసరికి చెట్టుకింద కుర్చీలో ఒంటరిగా కూర్చుని వున్నాడు నాగరాజు. చుట్టూ వేసిన టేబుళ్ళూ, కుర్చీలూ ఖాళీగా ఉన్నాయి. అందరూ వెళ్ళిపోయి నట్టున్నారు. ఊదొత్తులు వెలుగుతున్నాయి. నాగరాజు ముందు మాత్రం బిస్కెట్లు, ఫ్లాస్కు ఉంది. ఇంట్లోంచి వీణావాద్యం రేడియోలోంచి వినిపిస్తోంది. ఒక లైటు ఉంది. ఆ వెలుగులో ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. కుర్చీకి అడ్డం తిరిగి కుర్చీ చేతుల మీద కాళ్ళు వేలాడేశాడు. మొదటిసారిగా పంచె, లాల్చీ వేసుకోవడం చూసింది. పంచెలో చాలా పొడుగ్గా సన్నంగా కనిపించాడు నాగరాజు. అతను కూచుని చదివినప్పుడూ, రాసినప్పుడూ ఎప్పుడూ చూడలేదు సీత. చదివేటప్పుడు కళ్ళద్దాలు పెట్టుకుంటాడు అనుకుంటా. వెడల్పాటి నల్లటి ఫ్రేమున్న కళ్ళద్దాలున్నాయి. కాస్తపాటి వెలుగులో నాగరాజు కొత్తగా, అందంగా కనిపించాడు. తను వచ్చిన అలికిడి గుర్తించలేదు అలాగే చదువుకుంటున్నాడు. కొంతసేపటికి కదిలి 'రామూ! మంచినీళ్ళు' అని అరిచాడు.

అక్కడే నిలబడింది సీత ఆసక్తితో చూస్తూ. రాము పరిగెత్తుకు వచ్చాడు. సీతని చూశాడు. గ్లాసు అందిస్తూ "అమ్మగారు వచ్చారు బాబూ" అన్నాడు.

"ఏరీ?" అంటూ లేచాడు నాగరాజు. తలెత్తి దగ్గర్లోనే నిలబడ్డ సీతని చూసి ఆశ్చర్యపోయాడు. "ఎప్పుడొచ్చారు?"

"చాలాసేపయింది. మీరు చాలా ఏకాగ్రతతో చదువుతున్నారు. ఎదురుగ్గా చూస్తే కళ్ళజోడులో ముసలాడిలాగా కనిపిస్తున్నారు. చదివేటప్పుడు కళ్ళజోడూ అవసరమా?"

"చిన్నప్పుడు ఈత కొట్టేవాడిని. గట్టుమీంచి నదిలోకి దూకాను. ఒక కంటిరెప్పకి ముల్లు తగిలింది. అదృష్టవశాత్తూ కన్నుపోలేదు కానీ ఇప్పుడు ఆ కంటికి చూపు చెదిరింది" అన్నాడు.

"తీసెయ్యండి బాబూ! మీరు ముసలివాళ్ళలాగా ఉన్నారు" అంది నవ్వుతూ. తీసేశాడు నాగరాజు.

ఇప్పుడు తలెత్తి ఆమెను చూశాడు. చెదిరిన జుత్తూ, తొందరగా రావడం వల్ల చెమటపట్టిన నల్లటి ముఖం, నలిగిపోయిన తెల్లచీర "అదేం అలా ఉన్నారు? ఒంట్లో బాగోలేదా?" అనడిగాడు.

"అబ్బే లేదే" అంది అప్పటికి తన అవతారం తనకి గుర్తుకొచ్చింది సీతకి. తనని తాను చూసుకుని సిగ్గుపడిపోయింది ."ఇన్స్టిట్యూట్ నుంచి ఇంటికి వెళ్ళే వ్యవధి లేకపోయింది. మీ పుట్టిన రోజుకి కూడా మీ ఉద్యోగస్తులకి సెలవులివ్వరాయె. అలాగే వచ్చేశాను" అంది.

"నాకు పుట్టినరోజులు జరుపుకోవడం ఇష్టంలేదు. ఎప్పుడూ జరుపుకోలేదు కూడా. కానీ ఇవాళ జరపాలని నాన్నగారు రాశారు. జరిపించడానికి ఆయనకో పరమార్థం ఉంది."

"ఏమిటది?"

ఆలోచించాడు నాగరాజు. సూటిగా ఒక్కసారి ఆమె ముఖం చూశాడు. "ఇప్పుడు కాదు, తరువాత చెపుతాను" అని నవ్వేశాడు.

హఠాత్తుగా మరేదో అర్థం స్ఫురించింది సీతకి. తను ఆలస్యంగా వచ్చినందుకు ఇప్పుడు మరీ బాధపడింది.

ఫ్లాస్కు తీసి కాఫీ రెండు కప్పులలో పోశాడు. "ఇది నా బర్త్‌డే కేక్. కాస్త రుచి చూడండి" అంటూ ప్లేటు ముందుకు తోశాడు.

"నేను ఆలస్యమవుతానని తట్టలేదు. అలా అనిపిస్తే వచ్చేదాన్నికాదు."

"అప్పుడు నేను మీ ఇంటికి రావలసి వచ్చేది రిక్షాలో" నవ్వాడు.

కాఫీ తాగడం అయ్యాక "నేను రోగంతో పడుకున్నప్పుడు వచ్చారు. ఇప్పుడు మరీ ఆలస్యంగా వచ్చారు. లేకపోతే ఈ ఫ్యాక్టరీ అంతా చూపేవాణ్ణి. రండి, మా ఇల్లయినా చూద్దురుగాని" అని లేచాడు.

చిన్న ఇల్లయినా చాలా అందంగా అలంకరించారు. ఏర్పాట్లన్నీ ఎక్కడివక్కడ సౌకర్యంగా చేశారు. మొదటి వసారా దాటాక కుడివేపు విజిటర్స్ హాలు, దాని పక్కన బెడ్ రూం. మరొక గుమ్మం వెనక పక్క తోటలోకి ఉంది. ఎడమవేపు డైనింగు హాలుకి ద్వారం లేదు. ఒక పెద్ద ఆర్చిలాగా చేసి నీలిరంగు కర్టెన్లు వేశారు. మరీ కాంతివంతం కాని దీపాలు వేశారు డైనింగు హాలులో. మేడమీద గదుల్లేవు. మెట్లు దాటేసరికి పైన అంతా చీకటిగా కనిపించింది. ఉన్నట్టుండి నాగరాజు ఏం చేశాడో ఏమో మీద చిన్న నటి తుంపర్లు పడడం ప్రారంభించాయి. మొదట వర్షమేమో అనుకుని తలెత్తింది. నక్షత్రాలు ఆకాశం మీద మెరుస్తున్నాయి.

"ఇదేమిటి మేఘం లేని వర్షం" అంది.

ఒక్కసారి ఉన్నట్టుండి డాబా అంతా ఎర్రటి కాంతితో వెలిగింది. "ఆర్టిఫిషియల్ ఫౌంటెన్. మా ఇంట్లో సుఖానికి మేడ దిగనక్కరలేదు. మేడ ఎక్కాలి" అని నవ్వాడు నాగరాజు.

"ఇంత మంచి ఇంట్లో ఉండక ఇన్నాళ్ళూ అక్కడ ఉన్నారేం?"

"ఇది మా గెస్టు హౌస్. ఫారెన్ ఎక్స్‌పర్ట్స్ ఫ్యాక్టరీలో పనిచెయ్యడానికి వచ్చి ఇన్నాళ్ళూ ఉన్నారు. అందుకని నేను అక్కడ ఉండవలసి వచ్చింది. ఇంతకీ అక్కడ లేకపోతే మీ పరిచయం కావడం ఎలా?" మెట్లు దిగి రాగానే రాముా వచ్చి "భోజనం రెడీ సార్" అన్నాడు.

''రండి, భోజనం చేసి వెళ్దురుగాని'' అన్నాడు.

''అందరికీ టీ పార్టీ, మీకు డిన్నర్ సరిగానే కుదిరింది.''

డైనింగు టేబులు ముందు కూచున్నాక అతనికి హఠాత్తుగా అనుమానం వచ్చింది. ''ఇంట్లో చెప్పి వచ్చారా?''

''లేదు'' అంది.

''వాళ్ళు భయపడితే?''

నవ్వింది సీత. ''మొదటిసారి నీటిలో పడినవాడికే భయం. రెండోమాటు పడినప్పుడు చావు కూడా పాతగానే కనిపిస్తుంది. ఒకసారి దానికి దగ్గరగా వచ్చాడు కనుక. మా వాళ్ళకి భయం కూడా అలవాటైపోయింది.

భోజనం అయేసరికి చాలాసేపైంది. పూర్తికాగానే ఇంక ఆగలేదు. లేచి నిలబడింది ఇక వెళ్తానని.

''మరి నా స్నేహితులు ఇచ్చిన ప్రజెంట్సు చూడరూ?'' అంటూ తన గదిలోకి తీసుకెళ్ళాడు. ''నేను సిగరెట్టు కాల్చనని ఒకాయనకి తెలీదు. సిగరెట్టు లైటరు ఇచ్చాడు. దాన్ని స్టౌ వెలిగించుకుందుకి ఉపయోగించాలి'' అంటూ చూపించాడు.

ఒకాయన రాబోయే చలికాలానికి కాశ్మీర్ శాలువా ఇచ్చాడు. ఫ్యాక్టరీ స్టాఫ్ తోలు పెట్టె, మరో కావలసిన మిత్రుడు ఫారెన్ షేవింగ్ సెట్ ప్రజెంటు చేశారు.

ఇద్దరూ చెట్టుకిందకి నడిచి వచ్చారు.

నవ్వుతూ యథాలాపంగా అన్నాడు నాగరాజు. ''మరి మీ ప్రెజెంటు ఏదీ?''

తెల్లబోయింది సీత. ప్రజెంటు తీసుకురావాలనే గుర్తుకూడా లేదు. అందుకని ఏం చెప్పడానికి తోచలేదు. నవ్వేసింది. ఆమెను క్షమించినట్టు దయగా నవ్వాడు నాగరాజు. ఫరవాలేదులెండి, ఊరికే అన్నాను'' అన్నాడు.

''పోనీ రిక్షాలో చార్మినార్ తీసుకెళ్ళమంటారా మిమ్మల్ని'' అంది నవ్వుతూ.

ఇద్దరికీ హఠాత్తుగా ఆ సంఘటన గుర్తుకు వచ్చి తుళ్ళిపడ్డారు. ఒకరి ముఖం ఒకరు చూడడానికి తలెత్తారు. కానీ ఇద్దరూ చెట్లనీడలో ఉన్నారు. చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయారు. ఇద్దరూ ఒకే విషయం గురించి ఆలోచిస్తున్నారని తెలుసుకోవడానికి ఎంతో సేపు పట్టలేదు. ఆ ఆలోచన వచ్చాక వొకరికి తెలియకుండా వొకరు వణకడం ప్రారంభించారు. వణుకుదల భయంతో కాదు, తెలియని మత్తు, ఆవేశం, ఉద్వేగాలతో. అతనింకా ఆలోచిస్తుండగానే ఆమె వేడి శరీరం అతని చేతిలో గుర్తు తెలిసింది. జుత్తు గుండెకు అనుకుంది. వేళ్ళు నడుముని చుట్టుకున్నాయి. ఊపిరి మనస్సుకి మండిస్తోంది.

''సీతా!'' అన్నాడు.

చెట్లు ఆకుల కదలికలో ఆ పిలుపు గాలి ఆగిపోయింది.

ఆ పిలుపులో మత్తు వాతావరణమంతా వ్యాపించింది.

ఆ పిలుపు సీతకి వినిపించలేదు. కానీ అలా పిలుస్తాడని, పిలిచే ఉంటాడని తలెత్తింది. చీకట్లో పెదాల నలుపు గుర్తు తెలియలేదు కానీ, వాటి వేడి అర్థమైంది నాగరాజుకి. ఆమె కళ్ళ అర్థం అవగాహన కాలేదు కానీ, చేతులు మాట్లడే భాష అర్థమైంది. మనస్సులోని భావం గుర్తురాలేదు కానీ శరీరం సూచించే మమత అర్థమైంది.

"టాక్సీ రెడీ సార్" అని రాము గేటూ తెరుచుకు వచ్చాడు. సీత చెవిలో రహస్యంగా నాగరాజు "ఇది చాలా పెద్ద బహుమతి. థాంక్స్" అన్నాడు.

19

మర్నాడు 'మీతో ఒక విషయం మాట్లాడాలి' అని సీత వినిపించీ, వినిపించినట్టు అతనితో అన్నప్పుడు,

నాగరాజు నవ్వేసి "నువ్వు మాట్లాడేదో నాకు తెలుసు. నేనూ దాని గురించే ఆలోచిస్తున్నాను" అని ఆ విషయం అంతటితో తుంచేశాడు. సీత ఆశ్చర్యపోలేదు. ఇదివరకులా కాకుండా ఆ మాత్రమైనా మాట్లాడినందుకు సంతోషించింది. తను అనుకున్న ఆలోచనలు తప్పుకాదని, చివరికంతా సుఖంగానే ముగుస్తుందనీ అనుకుంది. అక్కడితో మరింత ధైర్యం, ఆత్మవిశ్వాసం వచ్చాయి.

ఆ తర్వాత ఆమె చాలాసార్లు నాగరాజుతో కలిసి రిక్షాలో వెళ్ళింది. అలా వెళ్ళగా వాళ్ళని చూసినవాళ్ళు చూశారు; మాట్లాడుకున్నవాళ్ళు మాట్లాడుకున్నారు.

కొందరు "ఆ వెళ్ళేది పోస్టుమాస్టరుగారి అమ్మాయి కదూ" అంటే

"నీకు తెలియనిదేముంది సీతమ్మవారు" అని ఇద్దరికీ అర్థమయే భాషలో నవ్వుకున్నారు.

మరికొందరు "అమ్మాయి మంచి ధారణ మనిషి. ఓడిపోయినా తనే గెలిచానని నిలబడింది. చివరికి అతన్ని కట్టుకుని ఆవిడే సుఖపడుతుందేమో ఎవడు చూడొచ్చాడు" అనుకున్నారు.

మరికొందరు "ఒక్కసారి తన బలహీనత తెలుసుకున్నాక మరో తప్పు చేయరు. అలాగే చూస్తుండు. ఆఖరికి ఆ అమ్మాయే జయిస్తుంది" అని కొందరు ఆమెను ప్రశంసించారు. మొత్తం మీద అందరూ మాట్లడుకునే అవకాశం ఏర్పడింది ఆమెను గురించి. నాగరాజు నెక్‌టైలు కొనడానికి చాలాసార్లు ఇద్దరూ 'లండన్ ఫాషన్స్'కి వెళ్ళారు. ఆమె చీరల్ని అతను చాలా సెలక్ట్ చేశాడు. అతను ఎయిర్ కండిషన్ బ్లౌజ్ బాగుందంటే ఆమె మర్నాడే కుట్టించుకుంది. అతను కత్తి యుద్ధం చిత్రాలు బాగుంటాయంటే ఆమె అతనితో కలిసి వెళ్ళింది. చాలాసార్లు అతనితో కలిసి బంగళాలో భోజనం చేసింది.

బంగళాలోని కుర్చీలకి దీపాలకి, కర్టెనులకీ, నౌకర్లకీ వారిద్దరి బంధుత్వం అర్థమైపోయింది. కుర్చీలకి ఎప్పుడు దగ్గర జరగాలో తెలిసిపోయింది. లైట్లు తమ అవసరం ఎప్పుడు లేదో తెలుసుకున్నాయి. కర్టెన్లు అందంగా ఉండడమే కాకుండా రహస్యాల్ని దాచే గుణం కూడా తమకున్నాయని మొదటిసారిగా గ్రహించాయి.

ఒక ఉద్యమంలో రోజు రోజుకీ ఘనవిజయాన్ని సాధిస్తున్నట్టు ఉల్లాసంగా గడిచి పోతున్నాయి రోజులు సీతకి.

"మీరు ఆలోచిస్తున్న విషయం ఏం చేశారు?" అని ఆమె గుర్తు చేసినప్పుడల్లా అతని ఆవలింతో, కాఫీ అవసరమో, రేడియో ఆపు చేయవలసిన అగత్యమో ఏదో వచ్చేది.

అయినా అతనూ ఆలోచిస్తున్నాడుగా? తొందరేముంది?

వర్ధనమ్మకి ఇదంతా అర్థమవుతున్నా అడగలేదు.

బియ్యం లేనప్పుడు బ్లాకు మార్కెట్టులోనైనా కొనుక్కుని తిని బ్రతుకుతారు కాని చచ్చిపోతారా? అవి మంచి బియ్యమైతే చాలు. భగవాన్ ఈసారైనా గట్టెక్కనీ.

గోవిందరావుగారు ఒకసారి రిక్షా దిగుతుంటే అడిగారు "ఎక్కడినుంచమ్మా?"

"ఇదేమిటి? లోకానికంతా తెలుసు ఎక్కడినుంచి వస్తున్నానో? నీకు తెలీదా?" అన్నట్టు చూసింది.

"ఇన్స్టిట్యూట్ నుంచి 'పని' ఉందని నాగరాజుగారు పిలిపించారు నాన్నా. రిక్షాలు దొరక్క ఆలస్యమైంది" ఆ మాట నిజం కాదని తండ్రికీ తెలుసునని తనకీ తెలుసు. తనకీ తెలుస్తోందని తండ్రికీ తెలుసు. కానీ గోవిందరావు మరో ప్రశ్న వెయ్యలేదు. తన సమాధానం విన్నాక ఒక చెంపపెట్టుకీ, ఒక తిట్టుకీ, ఒక నిందకీ సిద్ధపడిన సీత అతని తాటస్థ్యానికి నిర్ఘాంతపోయింది. అతని కోపానికి కూడా అనర్హురాలైపోయిందా తను? తనంటే ఎంత నిర్లక్ష్యం ఏర్పడింది ఇంట్లో. దైవవశాత్తూ ఈ నిర్ణయమైనా త్వరగా తీసుకోగలిగింది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుంది.

శాంత ఒకరోజు అంది. "తెలిసి తెలిసి మళ్ళీ మరో తప్పు చేస్తున్నావేమోనోయ్" అని.

"అని మీ నాన్నగారు చెప్పారా?"

"నాకంతా తెలిసిందిలే" నవ్వింది.

"ఇదివరకులా నువ్వు నాతో అన్నీ చెప్పడం లేదు. అయినా అర్థం చేసుకున్నాను."

"ఈసారి అన్నీ తెలిసే జాగ్రత్తపడుతున్నాను."

"నాగరాజుగారికి పాతకథ అంతా తెలుసు. ఆయన కారులో ప్రయాణం బాగుంటుందని, ఆయన బంగళా పెద్దదనీ తప్పు?" అని అడిగితే ఏం జవాబు చెప్పేదా అని ఆలోచించింది సీత.

"ఆయన బాగా డబ్బున్నవాడు. డబ్బున్న వాళ్ళకి మంచిమీద నమ్మకం ఉండదు. అది ఉంటే డబ్బే ఉండేది కాదు కనుక. జాగ్రత్త" అంది.

అన్నీ కీడు తలపెట్టే విషయాలే చెప్పడం నచ్చలేదు సీతకి. పైగా ఇంత తనకి వచ్చి చెప్పడానికి కారణం శాంతకి 'ఈర్ష్య' కూడా కలిగి ఉండొచ్చునని భావించింది. ఆమె మాటలకి మనస్సులో నవ్వుకుంది. ఆమె హెచ్చరిక చేస్తున్నకొద్దీ తనకి అతని మీద విశ్వాసం, తను చేస్తున్న పని మీద నమ్మకం పెరిగిపోయింది.

"మంచో, చెడో ఇంతకన్నా నాకు గత్యంతరం లేదు. నీకు ఒక్క కాలే కుంటి కనుక ఎప్పటికైనా పెళ్ళి కాగలదన్న ధైర్యం వుంది. నాకు శీలం కుంటిదయిందని నలుగురూ అనుకుంటున్నారు. అలాంటప్పుడు నన్ను క్షమించగల ఒక్క వ్యక్తయినా దొరకడం నా అదృష్టం."

ఇంక మాట్లాడలేకపోయింది శాంత.

ఒకరోజు మసక చీకటివేళ మాధవరావు వచ్చి మళ్ళీ వర్ధనమ్మ ముందు పంచాయితీ పెట్టాడు. సీత అప్పుడే రిక్షా దిగింది. రిక్షాలో నాగరాజు కూడా ఉన్నట్టు అనుమానం కలిగింది మాధవరావుకి.

"ఆ రిక్షాలో అతను నాగరాజేనా అమ్మా" అన్నాడు సీత లోపలికి రాగనే. అతన్ని చూసి తుళ్ళిపడింది సీత.

తలూపి లోపలికి వెళ్ళిపోయింది. చాలాసేపు మాధవరావు, వర్ధనమ్మా నిశ్శబ్దంగా ఉండిపోయారు. మెల్లగా 'చూడు సీతమ్మా' అని పిలిచాడు మాధవరావు.

"చూడు సీతమ్మా, నీ అంతట నువ్వే నీ బతుక్కి అన్యాయం చేసుకుంటున్నావు" అన్నాడు.

సీతకి ఉక్రోషం వచ్చింది. "నా బ్రతుకెప్పుడో అన్యాయం అయిపోయింది మీలాంటి వారివల్ల" అంది. ఆ మాటకి వర్ధనమ్మ "సీతా" అని అరిచింది. న్

"అననీ అమ్మా. ఆముదం రుచిగా ఉండదులే. అలా అని పోయడం మానేస్తారా? కానీ ఒక్కమాట విను సీతమ్మా, అతను నిన్ను రోజు రోజుకీ మభ్యపెట్టి లోబరుచుకుంటున్నాడు" అన్నాడు.

సీత ఏమైనా సరే ఇవాళ ఈ పోరాటంలో చివరివరకూ పాల్గొనదలచింది. "అతను కాదు మీకు తెలియాలంటే నేనే అతన్ని రోజురోజుకీ లోబరుచుకుంటున్నాను సరా" అంది.

ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

"ఎందుకమ్మా? ఇప్పుడేమైందని నీకు?"

"పదేళ్ళ తరువాత ఈ మాటలు అనడానికి మీరుంటారా మామయ్యగారూ?" బంధుత్వాన్ని నొక్కి పలుకుతూ ఈ మాట అంది. ఈ మాట వ్యంగ్యంగా చెంపపెట్టులాగా తగిలింది అతనికి.

"మీ అమ్మాయి కంటే నేనే అందంగా ఉంటాను. మీ అమ్మయి కంటే చదువుకున్నాను. మరి నాకు ఇంజను డ్రైవర్ని వెదికి పెట్టారేం? నా పెళ్ళి సంబంధాలు ఇరవైసార్లు తప్పిపోయాయేం? అదంతా అలా ఉంచండి. నాకూ రోజూ మల్లెపువ్వులు కొనిపెట్టగల కుంటి, గుడ్డి భర్తతో బ్రతకడం మా అమ్మా నాన్నా బ్రతికుండగా జరుగుతుందని మీరు హామీ ఇస్తే, ఇవాళనుంచి ఇల్లు కదలను. కుళ్ళిపోయిన మామిడిపళ్ళ బుట్టని ఎవరో కొనుక్కోవాలనుకుంటున్నారు. అమ్మడం చేతకాని మీకు ఎందుకు బాధ?"

ఘొల్లుమంది వర్ధనమ్మ. "పెద్దమనిషి నీ మంచి కోరి మంచిమాట చెప్పడానికి వస్తే నోరు పారేసుకుంటావటే రాక్షసీ. ఎన్ని మాటలు నేర్చావు? ఇంత తెలివైనదానివి వాడి చేతుల్లో ఎలా మోసపోయావే? " అంటూ ఏడ్చింది.

సీత మాటల్లో ఎంతో కొంత నిజం కనిపించింది కాబోలు. చాలాసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు మాధవరావు.

"నీ ఆలోచన మంచిదే కానీ నువ్వు చేస్తున్న పనే తొందరపాటంటాను. నాగరాజు మంచివాడనడానికి ఒక్క కారణం చెప్పు. దుర్బుద్ధి అతనికుందని చెప్పడానికి నేను వెయ్యికారణాలు చెప్తాను."

ఈ ప్రశ్నకి సమాధానం ఎంత వెతికినా దొరకలేదు సీతకి. ఆలోచించిన కొద్దీ దుఃఖం వచ్చింది. "మీకు సంజాయిషీ చెప్పుకోవలసిన పనిలేదు. మీకు అర్థంకాని వాళ్ళంతా చెడ్డవాళ్ళకిందేనా జమ?" అంది చివరికి.

నవ్వాడు. "ఆకలి వేసేవాడు తినేదంతా రుచికరమైన పదార్థమే అనుకుంటాడు. ఏమీ దుర్బుద్ధి లేకపోతే నువ్వు పనిచేస్తున్న టైపు ఆఫీసు ఎందుకు బేరం చేశాడు? నిన్ను తన దగ్గర కట్టిపడేసుకోడానికేగా? ఎదురుగుండా ఇంట్లో ఉండేవాడు. బంగళాకెందుకు ఇల్లు మార్చాడు. మా కన్నుమూసి నిన్ను చేరదియ్యడానికేగా? కారు ఎందుకు మూలపడేశాడు? రిక్షాలో నీతో తిరుగుతూ... నా నోటితో చెప్పమంటావా?"

"కారు అమ్మేశారు."

"అమ్మేశాడో, దాచిపెట్టాడో నువ్వు చూశావేమిటి?"

మాధవరావు మీద చచ్చేంత చికాకు వేసింది సీతకి. వాటికి సమాధానం చెప్పే అదను ఇది కాదని, నాగరాజుతో హాయిగా బ్రతికిన రోజు వాళ్ళ నోళ్ళు వాటంతట అవే కట్టుబడతాయని మనసులో అనుకుంది. నాగరాజు సదుద్దేశాన్ని అర్థం చేసుకోలేని వాళ్ళ అసమర్థతకి ఆమెకి జాలివేసింది. ఇక అక్కడ కూర్చోలేక లేచి వచ్చేసింది.

మాధవరావు మరో నాలుగు మాటలు వర్ధనమ్మతో చెప్పి వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనం చేస్తుండగా వర్ధనమ్మ "అమ్మా సీతా! నీకు ఏం చెప్పడానికి నేనే చిన్నదాన్నయిపోయానే. నీకేదైనా జరిగితే నేను బ్రతకను. బాగా ఆలోచించుకో" అంది.

రాత్రి మంచం మీద శరీరం వాల్చేసరికి ఈ మాటలతో ఆమె మనస్సు వికలమైపోయింది. వీటినుంచి విముక్తి నాగరాజు సాన్నిధ్యంలోనే లభిస్తుందని మరొక్కసారి రూఢిగా అప్పుడనిపించింది.

మర్నాడు ఈ మాటలన్నీ నాగరాజుతో చెప్పి వీళ్ళ తెలివి తక్కువతనానికి నవ్వుకోవాలనుకుంది. ఆ మర్నాటి సాయంకాలం కారు హారన్ వినిపించి ఇనిస్టిట్యూట్ వసారాలోకి వచ్చింది సీత.

పాతకారులోనే నాగరాజు చిరునవ్వుతో కనిపించాడు. నివ్వెరపోయింది.

"కారు అమ్మేశానన్నారే" అంది.

"ఒక వెయ్యి తక్కువైనా మా స్నేహితుడు కదా అని పైసలుతక్కువ చేసి కారు ఇచ్చేశాను. వాడూ సౌత్ అంతా తిరిగి తనకి అక్కరలేదని వాపసు ఇచ్చేశాడు. రా, కారెక్కు" అన్నాడు.

నిర్ఘాంతపోయి నిలబడిపోయింది సీత.

20

**ఏమో నాగరాజు** చెప్పింది నిజమేనేమో. ఎవరో మనస్సులో అనుమానం మొక్క నాటితే దాన్ని పెంచవలసిన అవసరమేముంది? అయినా నాగరాజుని కూడా అనుమానిస్తే తనెవరిని నమ్ముకొన్నట్టు? అందువల్ల అతన్ని శంకించడానికి భయపడింది సీత.

అడగడానికి అనువుగా ఉండే సమయాల్లో సీత అడిగేది "ఆ విషయం ఆలోచించారా?" అని.

"ఏ విషయం?" అని అతను అడిగితే "మన పెళ్ళి విషయం" అందామనుకునేది. కాని అతను అనలేదు. 'ఆలోచిస్తున్నాను' అనేవాడు. పదే పదే అదే ప్రశ్న వెయ్యడం వల్ల ఒకటి రెండుసార్లు విసుక్కున్నాడు కూడాను. నలుగురూ తమపై ప్రకటించే అవిశ్వాసాన్ని నవ్వుతూ అతనికి చెప్పుకునేది సీత. అందువల్ల అతనిలో ఇటువంటి ఆలోచనలు లేకపోయినా వాటికి చోటవుతుందని ఆమె ఊహించలేదు. అది వినడానికి అతనికి మనస్కరించడం లేదని కూడా ఆమె ఊహించలేదు. కారణం తెలీదు కాని కొన్నాళ్ళనుంచి నాగరాజు ఇనిస్టిట్యూట్‌కి రావడం తగ్గించేశాడు. ఎప్పుడూ లేనిది ఆఫీసుకి ఫోన్లు చేస్తే నౌకర్లు అతను బిజీగా ఉంటున్నాడని చెప్పేవారు. బంగళాకి అతను చాలా ఆలస్యంగా వస్తున్నాడు. అయితే ఇవన్నీ అతను ప్రయత్నపూర్వకంగా చేస్తున్నాడనీ అనుకోవడానికి వీలులేదు. కాని నిజంగా అతనికి తీరుబాటు ఉండి ఉండదు. ఉంటే నాగరాజు కనిపించేవాడు.

"నాగరాజు కనిపించడం లేదేం?" ఒకరోజు గోవిందరావు అడిగాడు.

నాగరాజు ఎందుకు వస్తున్నాడో ఎప్పుడూ ప్రశ్నించని వాడు "రాలేదేం?" అని అడిగేసరికి ఆశ్చర్యపోయింది సీత.

"ఆఫీసు పని ఎక్కువగా ఉంది నాన్నా అందుకు రావడంలేదు" ఆ మాటలు అతను నమ్ముతాడని విశ్వసించింది కాని, ఆ మాటల్లో తనకే అర్ధంకాని సంశయం గోవిందరావుకి అర్ధమైంది. అయినా అతనింకేం మాట్లాడలేదు.

ఒకరోజు నాగరాజు దగ్గర్నుంచి ఉత్తరం పట్టుకుని ఒకాయన వచ్చాడు. దళసరి అద్దాల కళ్ళజోడు, పైజమా, షర్టు, దానిమీద కోటు వేసుకున్నాడు. జుత్తు చాలామట్టుకు ఊడిపోయింది కానీ, ఉన్నదాన్ని పైకి దువ్వాడు. మాట్లాడుతున్నప్పుడు ఆలోచిస్తున్నట్టు, ఆలోచిస్తున్నప్పుడు మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నట్లు మొహం పెడతాడు. పేరు కోటేశ్వరరావు. నాగరాజు పంపారనగానే సంతోషపడింది.

"ఇన్నాళ్ళూ కనిపించడంలేదేం ఆయన"

"రామచంద్రపురంలో తరచు పని వస్తోంది. అక్కడ గెస్టుహౌస్‌లో ఉంటున్నారు" అన్నాడు.

సీత నివ్వెరపోయింది.

"ఇక్కడికి రావడంలేదా?"

"ఎప్పుడైనా వస్తే వస్తారు, వచ్చినా వెంటనే పని చూసుకు వెళ్ళిపోతున్నారు."

ఆమె ఆలోచిస్తుండగా నాగరాజు ఉత్తరం ఆమెకిచ్చాడు.

"ఇతను కోటేశ్వరరావు నీకు ఒంటరిగా ఇనిస్టిట్యూట్ చూసుకోవడం కష్టమవుతుందని పంపిస్తున్నాను. ఇతను అన్ని విషయాలూ మేనేజ్ చేస్తాడు. అన్నిటికీ అతణ్ణి నమ్మవచ్చు" ఇదీ ఉత్తరంలోని విశేషం.

సీతకి ఆశ్చర్యం కలగలేదు. తనని సంప్రదించకుండా నాగరాజు చేసే చాలా పనుల్లో ఇది ఒకటి. కానయితే ఈ విషయంలో ఎందుకో మనస్సు జివ్వుమంది. అతనికి సంబంధించిన హక్కులన్నీ క్రమంగా తన నుంచి హస్తగతం చేసుకుంటున్నట్టు అనిపించింది. కానీ చేసేదేమీలేదు. మర్నాటి నుంచి ఠంచన్‌గా కోటేశ్వరరావు ఇనిస్టిట్యూట్‌కి వస్తున్నాడు. ఇప్పుడు సీత వీలయినప్పుడు వెళుతుంది. లేనప్పుడు మానేస్తోంది.

ఎందుకు మానేస్తోందో గోవిందరావుకీ, వర్ధనమ్మకీ చూచాయగా అర్ధమవుతోంది. కానీ వాళ్ళేం మాట్లాడలేదు. కారణం ఏం మాట్లాడాలో తెలియకపోవడమే.

ఒకరోజు ఉదయమే సీత ఇంటిముందు కారాగితే సీతతో పాటు ఇంట్లో అంతా అబ్బురపడ్డారు. 'సీతా' అని పిలుచుకుంటూ లోపలికి వచ్చాడు నాగరాజు. అందరినీ కుశల ప్రశ్నలు వేసి వాకిట్లో కూర్చుని వర్ధనమ్మ ఇచ్చిన కాఫీ తాగాడు.

"ఇంతకాలం ఏం చేస్తున్నారు?" అంది సీత, ఎవరూ దగ్గర్లో లేనప్పుడు.

మంచి హుషారుగా ఉన్నాడు నాగరాజు. "అదేం ప్రశ్న? ఇప్పుడేం చేస్తారని అడక్క" అన్నాడు ఆమె తెల్లబోతే నవ్వి "ఆడవాళ్ళు గతాన్ని గురించి ఫెయిలవుతూంటారు. అందువల్ల మనిద్దరం కలసి వర్తమానాన్ని గురించి ఆలోచించాలని వచ్చాను" అన్నాడు.

ఏదో చెప్పాలని వచ్చినట్టు గుర్తుపట్టింది సీత.

"ఏమిటి సంగతి?" అంది.

"నాతో వస్తావా? ఓ గంటసేపు పని ఉంది" అన్నాడు.

చీర మార్చుకుని క్షణంలో తయారైంది.

"నువ్వు నాతో మాట్లాడాలనుకున్న విషయాన్ని గురించి ఆలోచించాను" అన్నాడు కారులో.

తుళ్ళిపడింది సీత. విషయమేమైనా అర్థమవుతుందేమోనని అతని ముఖం చూసింది. కాని అతని ముఖం గంభీరంగా ఉంది.

"అయితే ఈ ఆలోచనకేనా ఏమిటి ఇన్నాళ్ళూ నన్ను తప్పించుకు తిరిగారు?" అంది నవ్వుతూ.

"అవును" అని జవాబు వచ్చేసరికి ఆశ్చర్యపోయింది.

"ఏమాలోచించారు?" అంది చాలాసేపటికి.

"అదంత సులువుకాదు చెప్పడం. మనమిప్పుడు ఒకచోటికి వెళ్ళబోతున్నాం. అక్కడ నీ పేరు జానకి. జ్ఞాపకం ఉంచుకో" అన్నాడు.

"అదేమిటి?"

"అదేమిటో తర్వాత చెబుతాను. ఇది మాత్రం మరచిపోకు. వస్తూ దారిలో నేనాలోచించిన విషయం చెప్తాను" అన్నాడు.

ఇదంతా చూడగానే తను ఊహించినంత చల్లటి నిర్ణయానికి నాగరాజు రాలేదేమోనని భయం కలిగింది సీతకి. తనకి తెలియకుండానే కాళ్ళు వణికాయి.

కొంతసేపటికి అన్నాడు "మొన్ననే ఇంటికి వెళ్ళి వచ్చాను."

సీత మాట్లాడలేదు.

"నాన్నగారికి అన్ని విషయాలూ చెప్పాను."

"ఏమన్నారు?"

"ఏమీ అనలేదు. ఊరుకున్నారు. అమ్మకి కూడా ఏం చెప్పారో మరి ఆవిడా మాట్లాడలేదు. నేను బయలుదేరి వచ్చేస్తుంటే 'నీకు ఉత్తరం రాస్తాను' అన్నారు."

"వ్రాశారా?"

"నిన్ననే ఉత్తరం వచ్చింది. మూడే వాక్యాలున్నాయి అందులో. వేమూరి రంగధామారావుగారిని కలుసుకో. ఆ అమ్మాయిని కూడా తీసుకువెళ్ళు. కానీ ఆ అమ్మాయి ఎవరో తెలియనివ్వకు."

తెల్లబోయింది సీత. "అంటే ఏమిటి అర్థం? మీ నాన్నగారు ఒప్పుకున్నట్టా?"

"ఏమిటో నాకూ అర్థంకాలేదు. పెద్ద దెబ్బలాట జరుగుతుందేమోనని భయపడ్డాను. కానీ ఇంత సుళువుగా తేల్చేశారు నాన్నగారు. ఆయన మామూలుగా నోరు పారేసుకోరు. ఉద్రేకపడరు. ఆ అలవాటు నామీదా పెట్టారు."

కారు ఊరు దాటి అయిదుమైళ్ళు నడిచింది. ప్రకృతి ఆడంబరమైన జీవితాన్ని సన్యాసాన్ని స్వీకరించినట్టు నిర్లిప్తంగా ఉంది. రెండువైపులా చెట్లూ గుట్టలూ మిగిలాయి. అయిదో మైలు దాటాక పక్కకి తిరిగింది కారు.

"మీకు రంగధామారావుగారు తెలుసా?"

"ఒక్కసారి నాన్నగారితో వచ్చాను. చాలా సంవత్సరాల క్రిందటి మాట. అప్పుడు నేను చాలా చిన్నవాణ్ణి."

మెల్లగా మనుషుల అలికిడి తెలిసింది. దూరాన చిన్నపల్లె కనిపించింది. అక్కడికి కారు రావడం ఆశ్చర్యం లేనట్టుంది. పిల్లలు కూడా సునాయాసంగా తప్పుకుంటున్నారు. ద్రాక్షతోటల పందిళ్ళు తెలుస్తున్నాయి. హఠాత్తుగా కారు ఆపి, ఒక గేట్లోకి

మళ్ళించాడు. రెండు ప్రక్కలా ద్రాక్ష వేశారు. దూరాన పొడుగాటి రైలుపెట్టెలాంటి ఇల్లు కనిపించింది. మీదన గడ్డి చాలా అందంగా పరిచారు. దానిమీద ఆకుపచ్చ రంగు వేశారు. ఏదో అందమైన పనితనంలాగా దూరం నుంచి కనిపిస్తోంది.

దూరం నుంచి ఆ ఇంటి మీద సదభిప్రాయం కలగలేదు కాని - దగ్గరకి వచ్చేకొద్దీ తన ఉద్దేశం మార్చుకుంది సీత. పక్కన చాలా ఖరీదైన కారు, ఒక ట్రాక్టరూ, కొత్త జీపూ ఓ పెద్ద పందిరి కింద ఉన్నాయి. పదిమంది పనిమనుషులు ఏవో ఎరువులు కలుపుతున్నారు. ట్రాక్టరు పాడైందని ఇద్దరు బాగుచేస్తున్నారు. చాలా అందమైన కర్టెన్లు వేశారు తలుపులకి. లోపల రేడియోగ్రాం పాటలు పాడుతోంది. శరీరంతో పాటు తలని మోయలేనంతగా నేలను కరుచుకున్నట్టు రెండు కుక్కలు నేలని వాసన చూసుకుంటూ పరిగెత్తుకు వచ్చాయి నాగరాజు కారు ఆపగానే. అతను అక్కడ పాత పరిచయస్తుడిలాగా ఉన్నాడు. అందుకని కుక్కలు అరవడం మరచి ఊపిరి తొందరగా వొదుల్తూ, అతని చుట్టూ తిరుగుతున్నాయి.

సీతకి వాటి భాష అర్థమై ఉంటే అతను తరచు వస్తున్నాడని పోలిక పట్టేది.

ట్రాక్టరు మీద పాగా కట్టుకున్న మనిషి నమస్కారం చేశాడు.

"ఏరా సింగులూ! బాగున్నావా?"

"చిత్తం దొరా" అన్నాడు.

"ఈ ట్రాక్టరు గేరు తిరగడంలేదు దొరా. అయ్యగారు పుస్తకంలో చూసి రావడానికి వెళ్ళారు" అన్నాడు.

అదికూడా నాగరాజుకి పరిచయంలాగా ఉంది. లోపలికి నడవబోయినవాడల్లా ట్రాక్టరు మీదకి ఎక్కాడు.

కుక్కలు సీతని పరీక్షిస్తున్నాయి. పెద్దబాంబుని పేల్చడానికి ముందు ఏర్పడిన నిశ్శబ్దంలాగా ఉంది సీతకి ఈ పరిస్థితి.

లోపల్నుంచి సన్నటి గొంతు "సుశీ, లక్ష్మీ" అని పిలిచింది. అవి వాటి పేర్లులాగా ఉంది. ఆప్యాయంగా మూలుగుతూ లోపలికి దారితోశాయి.

ట్రాక్టరు కదిలింది.

అరవైయేళ్ళ ముసలాయన పుస్తకం పట్టుకు బయటికి వచ్చేసరికి ట్రాక్టరు నడుస్తూ ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇప్పుడు తెలిసింది" అనబోయి, ఆగి ట్రాక్టరు మీదవున్న నాగరాజుని చూసి "నువ్వటోయ్ రాజా - రా, రా" అని నవ్వుతూ పలకరించాడు.

ఎర్రటి పట్టు పంచె కట్టుకుని ఉన్నాడు. పైన జరీ ఉత్తరీయం. చొక్కాలేదు. గంధపు బొట్టు మధ్య ఎర్రటి కుంకుమ మెరుస్తోంది. పూర్తిగా బట్టతల, ముఖంలోకల్లా కళ్ళు పెద్దవి. గొంతూ పెద్దదేనని మాట్లాడినప్పుడు గ్రహించింది సీత. వెనక్కి తిరగబోయి కారు దగ్గర ఉన్న సీతను చూసి అనుమానంగా ఆగారు ఆయన. చక్కగా, తీరుగా లేచిన వరి చేను మధ్య కలుపు మొక్కను చూసినప్పటి విసుగు అతని ముఖంలో చూసింది. అది దాచుకోవడానికి కూడా అట్టే ప్రయత్నించలేదు ఆయన.

"ఈవిడెవరు?" అని సూటిగా అడిగాడు. అప్పుడే ట్రాక్టరు దిగిన నాగరాజుని అంత తీక్షణతని అతడు ఊహించనట్టు ఒక్క క్షణం తడబడ్డాడు.

"మిస్ జానకి అని కొత్తగా మా ఆఫీసులో చేరిన స్టెనోగ్రాఫర్. నా పి.ఏ" అన్నాడు.

సీత నమస్కారం చేసింది. పి.ఏ అంటే నాగరాజు కంటే ఒకస్థాయి తక్కువని గ్రహించినట్టున్నారు ఆయన. 'ఊఁ' అని తలూపారు. కాని చెయ్యెత్తి నమస్కారం చెయ్యలేదు.

"కాబోయే మామగారింటికి పి.ఏతో వచ్చావు. ఇది అఫిషియల్ ట్రిప్పేమిటి?" నవ్వారు రంగధామరావుగారు. "అయినా పి.ఏ.లకు ఎక్కువ చనువు ఇవ్వకూడదోయ్. కొన్నాళ్ళయాక ఆఫీసులో వ్యాపార విషయాలు మరిచిపోయి మనస్సులో దుకాణం పెడతారు" ఆ అమ్మాయి వింటుందన్న జంకు కూడా లేకుండా సూటిగానే అన్నారు. ప్రతిమాటకూ దేశాన్ని గురించో, సంఘాన్ని గురించో జీవితాన్ని గురించో జనరలైజు చెయ్యడం అతనికి అలవాటు. డాక్టరుగా రైల్వేలో చాలాకాలం పనిచేసి నచ్చక (అతనికి కాదు, రైల్వే వాళ్ళకి) రాజీనామా చేసి వచ్చేశారు. నచ్చడం అంటూ ఎలాంటిదో తెలీదు. కనుక ఈ పల్లెటూరి వాళ్ళు అతనితో సరిపెట్టుకుంటున్నారు. అతని మాటలన్నీ ఓపిగ్గా విన్నవాళ్ళకి అతను మంచి డాక్టరు. కాని వినాలని తెలిసిన వాళ్ళు చాలా తక్కువ.

ఇల్లు లోపల మరీ అద్భుతంగా ఉంది. ఐశ్వర్యానికి నిరాడంబరత అనే తొడుగు వేసినట్టుంది. అందమైన పాలరాతి విగ్రహాలు టేబుల్ మీద ఉన్నాయి. గాజు అద్దాల బీరువాలు మొదటి గదిలో వేశారు. ముందుకు కనిపించే గదులు కాక మరి మూడు గదులు వెనకన ఉన్నట్టున్నాయి. ప్రతి గదిలోంచి స్వేచ్ఛగా పనిమనుషులు తప్ప ఆ ఇంట్లో ఎవ్వరూ కనిపించలేదు. ఇందాక వినిపించిన సన్నటి గొంతు ఎవరిదా అని అనుకుంటూ లోపలికి వచ్చింది సీత. కావాలని ముందు గదిలోకి బయటి గాలి రాకుండా చేశారు. గోడలకి నిలువుగా క్రీమ్ కలర్ కర్టెన్లు వేసి, అంత చిన్న గదికి మూడు ట్యూబ్‌లైట్లు నిలువుగా అమర్చారు. ఆ వెలుగుకి కళ్ళముందు ఏదో పల్చటి కల జారినట్టూ అనిపించింది. లోపలికి వస్తే తన గొంతు తనకే వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది. కింద పువ్వులు జల్లినట్లు రంగురంగుల ఊలు తివాసీ పరిచివుంది. ఈ అభిరుచికీ, ఆయనకీ పొంతన కనిపించదు. అతనిలో కనిపించే నిరాడంబరత కూడా ఒక తొడుగు వంటిదేనా అని అనుమానం కలిగితే అందులో ఆక్షేపణ లేదు.

"ఏమిటోయ్ నువ్వు చాలా పెద్దవాడివయిపోయావట" చిన్నప్పట్నుంచీ తన ముందే ఆడుకుంటూ పెరిగిన పసివాడిని హెచ్చరిస్తున్న ధోరణిలో అడిగారు రంగధామరావుగారు.

విచిత్రం నాగరాజు కూడా అలాగే వినయం, సిగ్గూ నటిస్తున్నాడు. ఇద్దరు ధనవంతుల మధ్య బాంధవ్యంలో ఇంత కృత్రిమత్వం ఉంటుందేమో అనిపించింది సీతకి. దంతపు సింహం తలలు చెక్కిన కుర్చీ మీద దూరంగా కూర్చుంది.

"మీ నాన్న ఏడుస్తూ పదిపేజీల ఉత్తరం రాశాడోయ్. నువ్వెవరో అమ్మాయిని ప్రేమించావట. పెళ్ళి చేసుకుంటానన్నావట. ప్రేమ, పెళ్ళి ఒకచోట ఉంటాయని ఎలా అనుకున్నావోయ్. ఫారెన్ వెళ్ళివచ్చిన వీరుడివి" అన్నాడు నేరస్తుడిని ప్రశ్నిస్తున్న న్యాయాధిపతిలాగ.

సీత కంఠంలో ఒక్కసారి జీర కదిలింది. నాగరాజు కూడా తుళ్ళిపడ్డాడని గ్రహించింది.

"ఏం చెయ్యమంటావని మీ నాన్న వ్రాశాడు. నువ్వేం చెయ్యకు. మీ వాడిని నా దగ్గరకి పంపించు. నేను మాట్లాడతాను అన్నాను. నువ్వొచ్చావు అయామ్ గ్లాడ్ చూడు, ప్రేమిస్తే ప్రేమించావు కాని ఇక మానేయ్" అన్నాడు. కుళ్ళిపోయిన ఆపిల్ పండుని విసిరి వేయమన్నట్టు.

నాగరాజు మాట్లాడలేదు. ఇట్లాంటి సంభాషణ జరుగుతుందని అతను ఊహించి ఉండడు. "అంత సులువా అండీ మానేయడం?"

"సులువేమిటోయ్, ఒక కారు కొన్నావు. మంచి కారు కాదని తరువాత ఎక్స్‌పర్ట్ చెప్పాడు. అదే పట్టుకు వేలాడతావా? వెంటనే మార్చేయవ్. అలాగే ఇదీనూ" తన ఉదాహరణకి తనే మురిసిపోతూ పగలబడి నవ్వాడు.

సీతకి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"అలా వీల్లేదండి" అన్నాడు నాగరాజు.

తెల్లబోయి చూశాడు రంగధామారావుగారు. హఠాత్తుగా ముందుగు వంగి "ఏం? ముందుగా కమిట్ అయిపోయావేమిటి?"

నాగరాజు ఆశ్చర్యంతో తలెత్తితే "ఐ మీన్ బాడిలీ" అన్నాడు.

నాగరాజు మాట్లాడలేదు.

"మరేం పరవాలేదు. మరీ అవసరమైతే లోపాయికారిగా కాంపన్సేషన్ ఇచ్చేద్దాం. చచ్చి తలక్రిందులయినా మన ఆర్య మతాన్ని నిలబెట్టాలోయ్. ఈ సోఫిస్టికేషన్ మన జీవితాన్ని ఎంత పాడు చేస్తుందో నీకర్థం కావడంలేదు. ఏనాటికైనా మన మతం, మన పూర్వులు చెప్పిన నైతిక సూత్రాలే మనకి శ్రీరామరక్ష."

డాక్టరుగారు కెనడా, ఇంగ్లాండు, ఇంకా చాలా దేశాలు తిరిగారు. అక్కడివాళ్ళంతా స్వదేశాన్ని, స్వమతాన్ని ప్రేమించడం చూశారు. ఆ ప్రేమ చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపించింది. అక్కణ్ణుంచి దేశానికి తిరిగి వచ్చాక తనూ అంతం గురించి మాట్లాడడం ప్రారంభించారు. అప్పట్లో ఆయనకి, భగవద్గీతలో ఎన్ని అధ్యాయాలు ఉన్నాయో, దాన్ని అర్జునుడు చెప్పాడో, కృష్ణుడు చెప్పాడో తెలీదు. ఆ తర్వాత తర్వాత త్వరగా కొన్ని విషయాలు తెలుసుకున్నారు. భారతం ఒక శాస్త్రులుగారిని పెట్టుకుని చదివించుకున్నారు. అక్కడికీ ఆయనకి చాలా అర్థం కాలేదు. అయినా విదేశాల్లో తిరిగి వచ్చిన ఆయన స్వమతాభిమానం ఇంటలెక్చువల్స్‌లో చాలా రాణింపునకు వచ్చింది.

క్రమేణా కొంతవరకు నిజంగానే ఆయనకు అభిమానం కలిగింది. రుద్రాక్షలు అవసరమని ఒక మిత్రుడు ఢిల్లీ వెళ్తున్నప్పుడు, బదరీనుంచి ఖరీదైన వాటిని ప్లేన్‌లో తెప్పించారు. నిరాడంబర జీవితాన్ని అభిలషించే ఇక్కడికి వచ్చి ప్రశాంతమైన జీవనం గడుపుతున్నారు. ఆయన అనేది ఒక్కటే. మానవుడు కనీసమైన కోర్కెలు తప్ప ఎక్కువ కోరకూడదు. అలా కోరితే తోడి మానవుని దోచుకున్నట్టే లెక్క. ఆయన కనీసపు కోర్కెలు ఉదయమే తేనె, జామ్ వేసిన రొట్టె స్లైయిస్‌లు, రెండు గ్లాసుల పాలు, రెండు కూరలు, పులుసు, చారూ, స్వీటుతో భోజనం. మధ్యాహ్నం ఆపిల్ జ్యూస్, రాత్రి నాలుగు చపాతీలు, బంగాళాదుంప కూర, ఒక డన్‌లప్ పిల్లో పరుపూ, వెండి ఫ్రేమ్ కట్టించిన సీతారాముల ఫోటో. ఇంతే. ఇంతకు మించి ఆయనకింకేమీ అక్కరలేదు.

ఇప్పుడూ ఆయన చెప్పిన నైతిక సూత్రాల సమీక్ష నాగరాజు బుర్రకెక్కలేదు. కానీ ఆయన చెప్పిన మాటల్ని గౌరవించాలనుకున్నాడు.

మెల్లగా అన్నాడు "మొదట్లో ఇంత ఆలోచించలేదండీ నేను. కాని ఇప్పుడు కాదనడం ఆ అమ్మాయికి అన్యాయం చేసినట్టే అవుతుంది."

ఆ సమాధానంతోనే అతని బలహీనతను కనిపెట్టేశారు రంగధామరావుగారు. ఆయనకు సైకాలజీ వెన్నతో పెట్టిన విద్య. "వీల్లేదు" అంటే కాస్త తగ్గేవాడే కాని 'ఇప్పుడు కాదనడం' అనగానే ఒక మెట్టు దిగువనే ఉన్నాడని అర్థంచేసుకున్నారు.

"అబ్బాయ్, ప్రేమ అనేది ఇంటిని అందంగా ఉంచడానికి మనం పెంచుకునే క్రీపర్ లాంటిది. దాన్ని ఎంతవరకూ ఉంచాలో అంతవరకే ఉంచి మిగతాది కత్తిరించేస్తాం. అంతేకానీ దాన్నలా పెరగనిస్తే ఇల్లంత్యా అడివవుతుంది. అందుకే మన పురాణాల్లో, ఇతిహాసాల్లో ఎక్కడా ప్రేమ ప్రసక్తిలేదు. సంసార పక్షం అమ్మాయి అంటున్నావాయే. దేవుడు దెయ్యం, మంచీ చెడూ తెలిసే ఉంటుంది. ఘటనలేనిదే పెళ్ళికాదు సరికదా ఆఖరికి చావుకూడా రాదని అర్థమై ఉంటుంది. అందుకని అవసరానికి ప్రేమించినా, ఇప్పుడు కాదంటే 'కర్మ' అని సరిపెట్టుకుంటుందే కాని నిన్ను అపార్థం చేసుకోదు" అన్నారు. సీత అక్కడ కూచోలేక పోయింది. దుఃఖం ఆగలేదు. కానీ అది తెలియకుండా దగ్గుతెర నటించి బయటికి వచ్చేసింది. "ఏం జానకి" అని నాగరాజు లేచాడు.

"నువ్వు కూచోఃయ్ " అని "ఒక డ్రింకు కలిపి ఆ అమ్మాయికివ్వండి" అని అరిచారు రంగధామారావుగారు. కాని నాగరాజు ఆగలేదు, ఆమె వెనక్కి తిరిగి వచ్చేవరకూ బయట నిలబడే ఉన్నాడు.

"ఇంక వెళ్ళిపోదామండీ" అంది సీత.

"ఒక్క క్షణం" అనడానికి మాత్రం వ్యవధి దొరికింది నాగరాజుకి.

లోపలికి వచ్చి కూచున్నాక "ఏమంటావ్?" అన్నారు డాక్టరుగారు, ఆర్గ్యుమెంట్ అంతా అయ్యాక జ్యూరీ నిర్ణయాన్ని అడిగినట్టు.

నాగరాజు మాట్లాడలేదు. మరో లాజిక్ ప్రారంభించారు.

"ఇంతకూ పెళ్ళనేది సోషల్ కష్టమ్. అది ఎవరితోనో ఒకరితో జరిగి తీరాలిగాని ఎవరితో అన్న బెడద ఇప్పుడెవరికీ లేదు. ఈ రోజుల్లో ఆడదానికి ఎగ్జిస్టెన్స్ భయం. మగాడికీ అంతే. ఈ అమ్మాయితో బ్రతుకు సరిలేదనుకుంటే ఇంకో అమ్మాయిని చేసుకుంటావు. 200రూల జీతం చాలనప్పుడు 300 రూపాయల జీతానికి ప్రయత్నించడంలేదూ?"

'ఇదీ పురాణాల్లో ఉందా?' అని అడగడం నాగరాజుకి తెలియలేదు. అయితే సెంటిమెంట్‌కి లొంగలేదని తెలిశాక అచ్చంగా ఇరవయ్యో శతాబ్దపు లాజిక్ ప్రదర్శించారు డాక్టరుగారు. నయాన్నో, భయాన్నో మతాన్ని ఉద్ధరించాలి అన్నది ఆయన లక్ష్యమే. ఆ రోజుల్లో హాయిగా బ్రతకలేని వాళ్ళకి ఆధారం కల్పించి చాలామందిని బ్రిటీష్ వారు క్రైస్తవుల్ని చెయ్యలేదూ?

మరొకప్పుడయితే ఏమయేవాడో కాని నాగరాజుకి ఇప్పుడు రోటిలో తలదూర్చినట్టుంది అతనింకా మౌనంగా ఉండడం చూసి బలమైన ఆయుధాన్ని ఒరలోంచి తీశారు డాక్టరుగారు.

"అయినా నువ్వు బాగా చదువుకున్నవాడివి. మీ నాన్న ఎందుకు నీ మనసు మార్చుకోమంటున్నాడో ఈ పాటికి నువ్వు గ్రహించే ఉండాలి."

అర్థంకాలేదన్నట్టు చూశాడు నాగరాజు.

"హెలెన్ నాకొక్కర్తే కూతురు. నేను పోతే, ఆఉ లక్షల ఆస్తి కలిసి వస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు నేను చావక తప్పదు కదా" అదేదో పెద్ద చమత్కారమైనట్టు ఘొల్లున నవ్వారు.

"అందుకని స్నేహితులైన మేమిద్దరం వియ్యం అందుకోవాలనుకున్నాం. అదీగాక మరేదో కొత్త ఫ్యాక్టరీ డబ్బు కావాలన్నాడు మీ నాన్న. చేతిలో డబ్బు లేకుండానే మిషనరీకి ఆర్డరిడచ్చేశాడట కూడాను. నాతో అంటే మూడుముళ్ళు పడేదాకా ఆగమన్నాను" అని ఆగారు.

ఈ సందర్భంలో 'డ్రైవర్' అని అరుస్తూ హెలెన్ బయటికి వచ్చింది. ఆవిడ పేరు హేమలత. విదేశీ ప్రభావం వల్ల పేరు మతాంతరీకరణమైంది. హెలెన్ అయింది. ఆ అమ్మాయిని చూసి నివ్వెరపోయింది సీత. ఆ పేరు బట్టి ఏ ఇంగ్లీషు గౌన్, ఎత్తుమడమల జోడూ, కిరీటం జుత్తుతోనూ దర్శనమిస్తుందనుకుంది. కాని మామూలు కంచిపట్టు చీర కట్టుకుని, చక్కగా వాలుజడ వేసుకుని, సన్నటి గొలుసు వేసుకుని, ఎర్రటి బొట్టు దిద్దుకుని వచ్చింది. చూడగానే చాలా అందంగా ఉందనిపించింది. కాని మనిషి పొడుగు. ఎత్తుకు తగ్గ శరీరం లేదు. అంతస్తుకి తగ్గ అభివృద్ధి లేదు. ఆకారంలో కనిపించే సంప్రదాయం ఆలోచనలో, స్వభావంలో లేదని అర్థమైంది సీతకి. లోపలికి వస్తూనే నాగరాజు వేపు ఒక చిరునవ్వు విసిరి...

"ఏమిటీ డాడీ? కాలేజీకి జీపు రెడీ చేశాడు డ్రైవరు. దాంట్లో వెళితే ఏ డి.ఎస్పీ గారి అమ్మాయో, పి.డబ్ల్యూ.డి ఇంజనీరుగారి అమ్మాయో అనుకుంటారు. కారు లేకపోతే వెళ్ళను" అంది గునుస్తూ.

"కాలేజీకి చేరడం ముఖ్యం కాని ఏదయితే ఏమమ్మా? ఒకే గమ్యానికి చేరడానికి ఇవన్నీ సాధనాలు" ఫిలాసఫీని మెటీరియల్ వరల్డ్‌కి అనువదిస్తూ అన్నారు.

"అలాంటప్పుడు కారు ఇస్తేనేం?"

నవ్వారు. "చూశావోయ్ ఇది ఎంత చక్కగా జీవితాన్ని అర్థం చేసుకున్నదో, విప్లవాన్ని నువ్వొక్కడివే సాధించలేవని తెలిసినప్పుడూ నువ్వే ఎందుకు నష్టపోవాలి?"

"నేను చేస్తున్నది విప్లవం అనుకోలేదండీ."

"ఏమిటి నాన్నా అది?"

"ఏం లేదమ్మా రాజుకి క్రాఫింగ్ చేయించుకుంటే బాగుంటుందా? పిలక చేయించుకుని పంచె కట్టుకుంటే బాగుంటుందా?"

"ఛీఛీ అలాంటి ఆలోచన ఎందుకొచ్చింది అసలు? ఇప్పుడే బాగున్నాడు."

అసలు విషయం వదిలేసి ముద్దాయిని తప్పుదోవ పట్టించిన ప్లీడరులాగా నవ్వుతూ "చూశావా నువ్వు నచ్చావుట దానికి. నే చెప్పలా? మా స్నేహితుల కోరికలు మీరు ఇద్దరూ తీర్చాలోయ్" అని అమ్మాయి వేపు తిరిగి "కారు తీసుకెళ్ళమ్మా వెళ్ళేటప్పుడు కావలిస్తే డి.ఎస్.పిగారి అమ్మాయిని కూడా నీ కారులో తీసుకెళ్ళు" అన్నాడు తన హాస్యానికి తానే ముచ్చటపడిపోతూ.

వెళ్తూ "మీ ఫ్యాక్టరీ చూపిస్తానన్నారు. అది చూపించేవరకూ మీతో మాట్లాడను" అంటూ వెళ్ళిపోయింది.

నాగరాజు నవ్వలేదు. కానీ కూతురు మాటలకి మురిసిపోతూ నవ్వారు డాక్టరుగారు. కొంతసేపటికి అడిగారు. "ఏమిటి నేను చెప్పే విషయాన్ని గురించి ఆలోచిస్తున్నావా?"

"లేదండీ ఆలోచించాల్సింది ఏమీ లేదు. దీనికోసం మీకూ రాసి అనవసరంగా మనసుని పాడుచేశారు నాన్నగారు" అన్నాడు నాగరాజు. అతని పట్టుదల డాక్టరుగారికి నచ్చింది. ఆయన ఇప్పుడిక మరోదశ ముందుకు పోయారు. "అయినా అడ్డమైన వారినీ నమ్మి జీవితాన్ని వేస్టు చేసుకోవడం తెలివితక్కువోయ్. సంస్కారం, సంస్కరణలంటే మనస్సు చెపితే అది చెప్పినట్టు చేసెయ్యడం కాదు. మంచీ చెడూ, విచారణని చక్కగా పెంచగల మనస్సు చెప్పినట్టు చేయడం అదీ. నువ్వు మంచిని సరిగ్గా గుర్తించావని అనుకోను. ఆ అమ్మాయిని చూడకుండా నేను చెప్పగలను" అన్నారు రంగధామారావుగారువేపు చూస్తూ.

ఇప్పుడామెను ఉద్దేశించి అన్నారు. "నువ్వు చెప్పమ్మా నువ్వూ ఆడదానివే. ఆడవాళ్ళని కించపరచడంలేదు. ఎర్రగా బుర్రగా ఉన్న అబ్బాయిల్ని లోబరుచుకునే వాళ్ళు చాలామంది ఉంటారు. వాళ్ళకి ఉచ్చం, నీచం ఉండదు. మన దేశాన్ని తద్వారా పతనానికి దారి తీయిస్తున్నారో వారికి అర్థంకాదు. మనవాడికి అందం ఉంది ఐశ్వర్యం వుంది, కారు ఉంది, హోదా వుంది. అవన్నీ చూసి ఆ అమ్మాయి ఇతన్ని వలలో వేసుకుందంటాను. నువ్వేమంటావు?" అని ఆగారు.

ఎక్కడలేని ధైర్యం వచ్చింది సీతకి. కళ్ళనీళ్ళు దాచుకోవడానికి ప్రయత్నించకుండానే తలయెత్తి "కాదంటాను" అంది.

నిర్ఘాంతపోయారు డాక్టరుగారు.

"కాదంటావా? ఇంతకీ నువ్వు ఆ అమ్మాయిని చూశావా?"

"చూశానండీ మీరూ చూస్తున్నారు. నేనే ఆ అమ్మాయిని."

తలమీద పిడుగుపడ్డట్టు నిశ్చేష్టులయారు డాక్టరుగారు. చాలాసేపు అతనికి నోటమాట రాలేదు.

"నువ్వా! నువ్వేనా? మరి ఇంతసేపూ చెప్పలేదేం?"

నాగరాజు వేపు తిరిగి "మరి నువ్వలా చెప్పవేమోయ్ ఛ, ఛ, ఛ" అని తల పట్టుకున్నారు.

ఇక సీతకి దుఃఖం ఆగలేదు. కుర్చీ మీద తల ఆనించి ఘొల్లుమంది.

నాగరాజు లేచాడు. "డాక్టరుగారూ మీరేమీ అనుకోకపోతే ఇక నేను వెళ్తాను. నా మాట వినలేదని మా నాన్నగారికి రాయండి"

"అంతేనా?" అన్నారు డాక్టరుగారు.

కుర్చీ దగ్గరికి వెళ్ళి సీతని రెండు చేతులతో లేవనెత్తాడు. ఆమె భుజం చూట్టూ చెయ్యివేసి "రా సీతా" అన్నాడు.

డాక్టరుగారు మంత్రముగ్ధుడిలా లేచారు.

"ఇవాళ మంచిరోజు కాదోయ్, నా మనస్సు పాడయింది. నువ్వు ముందు ఎందుకు చెప్పలేదు. అయినా ఈ అమ్మాయి మంచి పిల్లలాగే ఉంది." కారు వెళ్ళిపోయే వరకూ ఏదో గొణుగుతూనే ఉన్నారు.

21

**ఈ తతంగమంతా** తనకి మెత్తటి చెప్పుతో బుద్ధి చెప్పాలని అందరూ కూడబలుక్కుని ఆడిన నాటకంలాగ కనిపించింది సీతకి. నాగరాజు తన ఇంటికొచ్చి తీసుకెళ్ళడం, తండ్రి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందని చెప్పడం ఇదంతా

పన్నుగడలాగ తోచింది. అతను చెప్పిన మాట తప్ప నిజంగా ఉత్తరం వచ్చిందన్న నమ్మకం ఏమిటి? తనే సీత అని మొదటినుంచి డాక్టరుగారికి తెలుసునేమో? నాగరాజుకి తెలియకుండానే ఇవన్నీ జరిగాయని నమ్మలేకపోయింది.

ఏమైనా బయటికి చెప్పలేని మూగబాధననుభవించింది. "నాన్నగారు ఇంత ఆలోచించి వ్రాశారని నేను ఊహించలేకపోయాను" అంటే

"పోనీ డాక్టరుగారు తన కూతురిని ఇచ్చి చెయ్యాలనుకుంటున్నాడని గ్రహించావా?" అని అడగలేకపోయింది.

నాగరాజుని గురించి, తనని చేసుకోవడం వల్ల నాగరాజుకి కలగబోయే కష్టాల్ని గురించి తెలిశాయిప్పుడు. ఇది తెలిసేటట్టు చేయడానికి నాగరాజు తండ్రి ఈ సమావేశం ఏర్పాటు చేశాడేమో? మళ్ళీ ఆలోచనల మీద ఆలోచనలే ఉక్కిరిబిక్కిరి చేశాయి.

"నన్ను క్షమించు సీతా! నిన్ను అనవసరంగా ఇరకాటంలో పెట్టాను" అంటే,

"మీరేం చేస్తారులెండి. మీకు మాత్రం ఏం తెలుసు ఇలా జరుగుతుందని?" అని కళ్ళు తుడుచుకుంది సీత.

"ఆ అమ్మాయి నాకంటే ఆరేళ్ళు చిన్న. ఇంకా చిన్నపిల్లలాగే కనిపిస్తుంది. మా ఇద్దరికీ పెళ్ళని ఎప్పుడూ నేనూహించలేదు. పెళ్ళంటే ఆవిడకి అర్థం తెలుసునా అని నా అనుమానం ఇప్పుడు హెలెన్ గురించి ఆలోచించడం లేదు. తన గురించి ఆలోచించుకుంటోంది.

"కొంచెం కాఫీ తీసుకుని వెళ్ళవూ" అన్నాడు బంగళా దగ్గరకి వచ్చాక.

ఇష్టంలేకపోయినా తప్పనిసరిగా దిగింది. ఎవరూ చూడకుండా దొంగతనంగా, ప్రవేశ అర్హతలేని స్థలంలోకి వెళుతున్నట్టుగా తోచింది. తనే స్వయంగా కాఫీ తీసుకొచ్చాడు.

"నా అభిప్రాయం చెప్పేముందు నాన్నగారి అభిప్రాయం తెలుసుకోవాలనుకున్నాను. నాన్నగారి కోరిక తిరస్కరించే ముందు ఒక్కసారి చివరిసారి ఉత్తరంలో వ్రాసిన కోరిక తీరిస్తేనే మంచిదనిపించింది. కాని అనవసరంగా ఇద్దరం బాధపడవలసి వచ్చింది. ఆ రోజు నా పుట్టినరోజు కూడా జరిపి తీరాలని, వీళ్ళని పిలవాలని నాన్నగారు వ్రాశారు. దాని అర్థం ఇప్పుడర్థమైంది" అన్నాడు తనలో తానుగా. తన పశ్చాత్తాపం ఆమెకు ఉపశమనాన్ని కలిగిస్తుందని అనుకున్నాడు. తన నిర్ణయాన్ని చెప్పి ఆమెను ఆశ్చర్యంలో ముంచి ఎత్తాలనుకున్నాడు. కాని ఇప్పుడు "ఏమైనా సరే నా నిర్ణయాన్ని మార్చుకోను సీతా" అన్నాడు.

సీత ఆ మాటలకి తుళ్ళిపడింది. రెండు రోజుల క్రితం చాలా ఆనందాన్ని కలిగించవలసిన ఈ మాటలు ఇప్పుడు చాలా ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయి.

"ఉండండి. మరొక్కసారి ఆలోచించండి" అంది. తెల్లబోయాడు నాగరాజు.

"అదేమిటి సీతా! దీంట్లో ఆలోచించవలసిందేముంది?"

ఏముంటుందీ అని ఇంకా యోచిస్తోంది సీత.

"ఏమయినా డాక్టరుగారు తెలివి తక్కువ వారు కారు. మీ గురించి ఇన్ని విషయాలు నాకు తెలియవు. నన్ను ఆలోచించుకోనివ్వండి."

అతను మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా "నేను వెళ్తాను" అని లేచింది.

"పద, నిన్ను దిగబెట్టి వస్తాను."

"మీరు వద్దు. డ్రైవరు ఉంటే పంపండి. లేకపోతే రిక్షాలో వెళ్తాను" అంది. కంఠంలో పట్టుదల కనిపించి స్తంభీభూతుడయాడు నాగరాజు. ఒక్క క్షణం ఆగి మెల్లగా గేటుదాటి నడిచి వచ్చేసింది సీత.

మొదటి పొరపాటుకి సానుభూతి చూపించిన వారు ఎంత సన్నిహితులైనా రెండవ పొరపాటుకి సానుభూతి తెలియజేయరని తెలుసు సీతకి. అదీగాక తనతోపాటు నీటిలో మునుగుతున్నవారు తనకి సహాయం చేయలేరు. అందుకని ఈసారి తల్లితో చెప్పుకోలేదు. రాత్రంతా మధనపడి మర్నాటి ఉదయం సరాసరి మాధవరావు ఇంటికెళ్ళింది. "మామయ్యగారూ" అంటూ.

అతను ఆశ్చర్యపోయాడు.

"నేను నాగరాజుని చేసుకోబోవడంలేదు" అని సూటిగా ప్రారంభించింది. ఒక్క క్షణం నోటమాట రాలేదు అతనికి.

"అంటే అతను నిన్ను చేసుకోనన్నాడా?"

"లేదు. నేనే చేసుకోకూడదనుకున్నాను."

విషయమంతా చెప్పింది. అంతా విని తృప్తిగా నవ్వాడు. మంచిపని అయిందని కాదు. తను వూహించినంతా అయిందని. "నే చెప్పలా, ధనవంతులతో వియ్యమూ, కయ్యమూ రెండూ ప్రమాదమేనని, అంతా వాళ్ళాడిన నాటకం. దీంట్లో నాగరాజు కథానాయకుడు."

తల అడ్డంగా ఊపింది. "అందుకు కాదు. నేను మానేస్తున్నది."

తెల్లబోయాడు. "మరెందుకూ?"

"నన్ను చేసుకుంటాననే అన్నారు. కానీ ఆయన అదృష్టానికి అడ్డు రాదలచుకోలేదు.

ఈ పెళ్ళితో ఆయన వ్యాపారానికి సంబంధం ఉంది. లక్షల ఆస్తి కలసి వస్తోంది."

ఈ కారణమంత బాగా నచ్చలేదు మాధవరావుకు. కాని పెళ్ళి ఆగిపోతుందన్న విషయం అర్థమైంది. ధనవంతుల ఇంట్లో బీద అమ్మాయిలు బ్రతకడం కష్టమన్నదే అతనికి తెలిసిన విషయం. అదిప్పుడు జరగడం లేదు.

ఏమయినా ఆమె అట్లా తనని సలహా అడగడానికి రావడం చాలా ఆనందం కలిగించింది మాధవరావుకి. ఆమె మీద ఎక్కడలేని వాత్సల్యం పుట్టుకొచ్చింది. "బాధపడకమ్మా రెండోసారి నువ్వే తొందరపడ్డావు. నష్టపోయావు" అని బల్లమీద కూచున్న ఆమె పక్కకి వచ్చి కూచున్నాడు.

ఆమెకు కళ్ళనీళ్ళు ఆగలేదు. "కాని నిజంగా నాకు దూరం కావాలని లేదు మామయ్యగారూ. కానీ తప్పదు."

"అవునమ్మా తప్పదు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం కంటే కాలకుండా చూసుకోవడం మంచిది. ఈ విషయం నిజంగా పెళ్ళయాక తెలిస్తే ఎంత బాధపడేదానివో ఆలోచించు. అతను ఎంతకయినా తగినవాడు. ఇన్ని చేసిన వాడు రేపు నిన్న వీధిలోకి గెంటినా గెంటగల సమర్థుడు."

"వద్దు. ఆయన్నేమీ అనవద్దు. అంతా నా దురదృష్టం" అని ఏడ్చింది సీత. అతని వొడిలో మొదటిసారిగా తలవాల్చి.

జాలితో అతని మనస్సు ఆర్ద్రమైంది. మృదువుగా ఆమె వీపు నిమిరాడు. తల నిమిరాడు. చెక్కిళ్ళు నిమిరాడు.

స్పర్శజ్ఞానం కూడా నశించిన రాయి అయిపోయింది సీత.

పసిపిల్ల పిప్పరమెంట్ల రుచి మరిగితే ఇంక వదిలిపెట్టనట్లుగా త్యాగం రుచి మరిగిన ఆడది దాన్ని వదిలిపెట్టడం కష్టం. పైగా పిప్పరమెంటు నములుతూ పసివాడు పక్కవాడివేపు గర్వంగా చూసినట్టు ఒక విచిత్రమైన గర్వం కూడా కలుగుతుంది వాళ్ళకి. సీతకి మొదటిసారిగా త్యాగం రుచి తెలిసింది. తనని ప్రేమించిన వ్యక్తిని (కనీసం తన దృష్టిలో) అతని సుఖం కోసం అతని భావి భవిష్యత్తు కోసం తను వదులుకోబోతున్నది.

తనకు జరిగే నష్టాల్లో ఇది రెండోది. కాని ఇది జరగడం వల్ల నాగరాజుకి జరిగే నష్టం తను జీవితమంతా భర్తీ చేయలేనిది.

"నేను నాగరాజుని చేసుకోవడంలేదు" అని అన్నప్పుడు తల్లి తెల్లబోయింది.

"ఏమయిందే? మళ్ళీ ఏమొచ్చిందే?" అంది ఏడుపు గొంతుతో.

"ఏం లేదు. ఈ పెళ్ళి అతనికి శ్రేయస్కరం కాదు."

"మానేయడం నీకు మాత్రం?"

"నేనెలాగూ పాడయాను. నావల్ల అతనూ ఎందుకు పాడవ్వాలి?"

"ఇంత వేదాంతం తెలిసినదానివి మొదట ఎందుకు తొందరపడ్డావు?"

"తెలిశాక ఇప్పుడయినా కీడు జరగకుండా చూసుకోవడం మంచిదేగా?"

ఆమెతో వాదించలేకపోయింది తల్లి. దుఃఖం ముంచుకొచ్చి గోడకేసి తల బాదుకుంది. ఆమెకు తలనుంచి రక్తం వస్తూంటే కంఠం జీరపోయింది సీతకి.

"ఎందుకమ్మా నాకోసం నువ్వు అంత బాధపడతావు?"

"నేనింకా చావలేదని. నీ అంత పాపిష్టిది చచ్చినా బావుణ్ణు" అని పదే పదే అంది. గోవిందరావుకి తెలిసి అతనేం మాట్లాడలేదు. భార్యని ఏమీ ప్రశ్నలు వెయ్యలేదు. సీత ముందే ఈ విషయం చెప్పినా సీతనీ ఏమీ అనలేదు. విని ఊరుకున్నాడు. అసలిది అతనికి వినిపించిందా అని ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

తిట్లూ దీవెనలూ అలవాటయిపోయాయి సీతకి. కాని ప్రేమకి నిజమైన అర్థం ఇన్నాళ్ళకి అర్థమైంది. తను నాగరాజుని ఎంత ప్రేమిస్తోంది వాళ్ళకేం తెలుసు? అతను ఎక్కడో సుఖంగా ఉంటే తనెంత సంతోషిస్తుందో. కాని అతనిది నిజమైన ప్రేమే అయితే ఈ త్యాగానికి అర్థం లేదని, తన దృష్టిలో 'వంచన' అవుతుందనీ ఆలోచించలేదు సీత.

కానీ ఆశ్చర్యమేమంటే త్యాగమనీ, ప్రేమనీ, ఖర్మనీ ఏ విధంగా మనస్సుని సమాధానపరచుకోవాలన్నా ఏ మూలో, ఏదో అసంతృప్తి తొంగి చూస్తోంది. దుఃఖం ఆగడంలేదు. ఉరిశిక్షకు సిద్ధపడే ఖైది చివరిక్షణాల్లో ప్రాణం మీద తీపిలేదని చెప్పే వేదాంతంలాగా తన ధోరణి ఉందని తనకే అప్పుడప్పుడనిపించేది. ఏమైనా రాత్రయేసరికి కళ్ళు చెమ్మగిల్లి దుఃఖం పొంగి తలగడ తడిసి ముద్దయేది.

"భగవాన్ నాకేదయినా మార్గం చూపించు" అని వేడుకునేది.

మార్గం దానంతట అదే ఏర్పడిపోయింది.

ఎంచేతనంటే మరి మూడువారాలు తిరగకుండానే గోవిందరావు కన్ను మూశాడు. అతి నిశ్శబ్దంగా పోయారాయన. బెలూన్ లోంచి గాలిపోయినట్టు చాలా నిశ్శబ్దంగా అతని ప్రాణం పోయింది. చెట్టునున్నకాయ, బయటికి నిగనిగా కనిపిస్తూనే, లోపల కుళ్ళిపోయినట్టు ఈ దుఃఖాలకి మనస్సు లోపలనుంచి కుళ్ళిపోయింది. కూతురు అభిమానానికీ, ఆమె చర్యల అవమానానికీ మధ్య నలిగిపోయి, ఎవరితోనూ పోరాడలేక నిస్సహాయంగా జీవితం నుంచి నిష్క్రమించాడు. ఆశలు తెగిపోయాయి. తర్వాత తీరికగా తీసుకుని తీసుకుని గుండె పగిలిపోయింది. నిశ్శబ్దంగా మూల కూర్చున్నవాడు చెంపపెట్టు పెట్టినట్టుగా నిశ్శబ్దంగా దుఃఖాన్ని దిగమింగుతూనే హఠాత్తుగా తమ బ్రతుకుల మీద దెబ్బతీశారని గుండె బాదుకుంది వర్ధనమ్మ. ఏమయినా సమస్యకి అంత కన్నా పరిష్కార మార్గం కనిపించలేదు.

తండ్రిపోవడం వల్ల తన జీవితాన్ని ఆవేశించిన నష్టాలు వెంటనే తెలియలేదు. కాని క్రమంగా తెలిసి వచ్చాయి సీతకి. గోపాలం దూరమయ్యాక కూతురికి పెళ్ళిచేయాలనే ఆతృతతో గోవిందరావు రెండువేలు అప్పుచేశాడు. ఆ డబ్బు క్రమంగా ఇంటికి ఖర్చయిపోయింది. మరికొన్ని చిల్లర మల్లర అప్పులు బయటికొచ్చాయి. వ్యక్తి జీవన్మరణ సమస్యకి బాధాకరమైన గుర్తులివి. ఇవన్నీ తీర్చడం, తల్లిని, తమ్ముడిని పోషించడం వంటి బాధ్యతలు ఇంతో అంతో టైపు పరీక్షలయినా పాసయిన సీత మీద పడ్డాయి. సీత జీవితంలో అతి విచిత్రమయిన దశ ఆరంభమైంది. తండ్రిపోయిన రోజున ఇంటికి యజమానురాలిగా ఆ అమ్మాయిని పలకరించారు చాలామంది.

నాగరాజు పెళ్ళికి, ప్రేమ, త్యాగంలాంటి కారణాలు గాలిలో ఎగిరిపోయాయి. వాటి స్థానంలో అంతకుమించిన బలమైన కారణం చోటుచేసుకుంది. దీన్ని మొదట గుర్తు చేసింది మాధవరావే.

"కష్టం మీద కష్టం మోపయిందమ్మా నీకు, నాన్న బ్రతికుండగానే నాగరాజుతో మూడు ముళ్ళు పడినా సంతోషించి ఉందుము. ఇప్పుడిక నువ్వు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే అమ్మ, తమ్ముడు గతేం కావాలి? అయినా మొగుడన్న తర్వాత - భార్యమీద ఉంటుంది కాని అత్తగారి మీద, బావమరుదుల మీద ఉండాల్సిన అవసరం ఏముంది?"

మనస్సులో ఈ ఆలోచన బాగా నాటుకుంది సీతకి. ఇంతవరకూ తన బ్రతుకు గురించే ఆలోచించింది. ఇప్పుడిక కుటుంబాన్ని బ్రతికించడాన్ని గురించి ఆలోచించాలి. ఇప్పుడు తన సుఖాన్ని మాత్రమే కోరుకునే హక్కులేదు. తనతోపాటు మిగతా ఇద్దరి సుఖాలకూ జవాబుదారీ తనదే.

ఇప్పుడు టైప్ ఇనిస్టిట్యూట్‌కి వెళ్ళడం తగ్గించేసింది. నాగరాజుతో సంబంధం ఉన్న అన్ని పనుల్ని ఆలోచనలకే దూరం చెయ్యడానికి ప్రయత్నించింది.

"నన్ను చేసుకుంటే నా కుటుంబాన్ని పోషించుకునే వరం నాకివ్వాలి" అని అతన్ని అడలేదు. "నన్ను చేసుకోవాలనీ అడగలేదు. కాని విచిత్రమేమంటే నాగరాజు కూడా గోవిందరావు పోయాక "నన్ను చేసుకుంటావా" అనలేదు.

రంగధామారావుగారితో సంభాషణ జరిగిన తర్వాత వాళ్ళిద్దరి మధ్యా ఏదో బాంధవ్యపు తీగ తెగిపోయిందని అతనికి అర్థమైంది. ఇప్పుడు గోవిందరావు మరణంతో మరికొన్ని తీగలు తెగిపోయాయి. ఇక ఈ స్నేహం మధ్య జీవన సంగీతం పలకదు. ఇది వారిద్దరూ అర్థం చేసుకుని, ఒకరికొకరు దూరమయిపోయారు.

## *మాధవరావు కథ*

22

ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి తలలో నాలుకైన వ్యక్తి మాధవరావు. ఎండనక, వాననక ఆఫీసుల చుట్టూ తిరిగి గవర్నమెంటు దగ్గర్నుంచి నాలుగురాళ్ళు తెచ్చి ఇచ్చాడు. చివర్లో గోవిందరావు మతిస్థిమితం లేక కుక్కలు చింపిన విస్తరిలాగా అస్తవ్యస్తంగా వదిలేసిన వ్యవహారాలన్నింటినీ చక్కపెట్టాడు. అన్నిటికన్నా ముఖ్యంగా వాళ్ళు అన్నివిధాలా స్థిమితపడేవరకూ, ఇంటి అద్దెకూడా వసూలు చెయ్యలేదు. కష్టకాలంలో తమకి మాట సాయమైనా దొరుకుతుందా అని బెంగపెట్టుకున్న వర్ధనమ్మకి మాధవరావుని చూడగానే సగం బెంగ తీరిపోయింది. చాలా కావలసిన ఆప్తుడు కూడా ఇబ్బందుల్లో అంతగా కలిసిరాడు. భగవంతుడులాగా అతను అడ్డుపడ్డాడు. ఈ మాట అతని ముందే చాలాసార్లు అంది. మొదట నవ్వేశాడు. తర్వాత పొగిడినందుకు చిరుకోపం కూడా తెచ్చుకున్నాడు.

"మీకు అన్నో, తమ్ముడో ఉంటే ఈ మాత్రం చెయ్యరా? దానికోసం మాటిమాటికి పొగిడితే నాకు బాధగా ఉంటుంది" అన్నాడు.

సీత కూడా అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఇదివరకు అతను చేసిన పనులన్ని దుర్మార్గాలని తను అపోహపడ్డదేమోనని అనుకుంది. అయినా ఆవేశంలో ఉన్నవాళ్ళకి ఎవరు మంచి చెప్పినా చెడ్డగానే కనిపిస్తుంది. ఇప్పుడు ఆవేశం దిగిపోయింది. ఇవాళ వెనక్కి తిరిగి చూస్తే అతను చేప్పేవన్నీ మంచిగానే కనిపించాయి. ఇప్పుడు తనకు తెలియకుండానే 'మామయ్య' అనే పిలుపులో ఆత్మీయత చోటు చేసుకుంది. కొందరు సుఖాల్లో స్నేహం కలిపితే, మరికొందరు కష్టాల్లో ఆప్తులవుతారు. మాధవరావు అలా కలిసి వచ్చాడని తల్లీ కూతురూ అనుకున్నారు.

తను చెయ్యగలిగిన వాటినే కాదు, తను చెయ్యలేని వాటిని కూడా నెత్తిన వేసుకున్నాడు. మాధవరావు. చాలా ఆఫీసులకి తనే స్వయంగా వెళ్ళి టైపు నేర్చుకున్న అమ్మాయిలకి ఉద్యోగాలు ఉన్నాయా అని వాకబు చేశాడు. కొన్నిచోట్లకి సీతని వెంటబెట్టుకు వెళ్ళాడు. ఎన్నో మధ్యాహ్నాలు సీతా, అతనూ ఉద్యోగం కోసం, తండ్రి ఆఫీసు కాగితాల మీద సంతకాల కోసం, ఇతర లావాదేవీలకోసం కలిసి తిరిగారు. చివరికి మాధవరావు భార్యకు దూరపు బంధువెవరో ఒక టీ కంపెనీలో తటస్థపడి పలకరిస్తే అతని కాళ్ళు పట్టేసుకున్నాడు మాధవరావు. ఈ అమ్మాయికి ఉద్యోగం ఇవ్వందీ కదలనని. సీతతో పాటే తిష్టవేశాడు. అదృష్టవశాత్తూ ఆ బంధువు కంపెనీలో మాట బరువు ఉన్నవాడు. అందుకని మాట తీసెయ్యలేక మేనేజరు దగ్గరికి సీతను తీసుకెళ్ళి పరిచయం చేశాడు.

మేనేజరు గుర్నాథం సనన్‌గా, పొడుగ్గా, రివటలాగా ఉన్నాడు. సన్నటి బారు మీసాలూ, గుండ్రటి ముఖం, ఇంకా వయస్సులో ఉండగానే వెనక్కి పోతున్న జుత్తూ, ఖంగుమనే గొంతూ, చాలా విపర్యయాలకి ప్రత్యక్షసాక్షిగా ఉన్నాడు. అధికారం చూపవలసి వచ్చినప్పుడు తెచ్చిపెట్టుకున్న కరుకుదనం గొంతులో పొరమారినట్టు ధ్వనిస్తుంది. ఎప్పుడోగాని చిరునవ్వు నవ్వడు. కానీ నవ్వినప్పుడు మాత్రం లేకలేక దొరికిన వస్తువులాగా, అపురూపంగా, అందంగా కనిపిస్తుంది నవ్వు. నిజానికి అది అందమైన నవ్వు కాదు కాని అపురూపం కావడం వల్ల ఆకర్షణీయమైంది.

అతను సీతను చూసి ఒకటే ప్రశ్న వేశాడు.

"నీకేమైనా అవుతుందా?"

''కాదండీ'' అన్నాడు పరిచయం చేసిన బంధువు.

''మరి?'' అన్నట్టు చూశాడు బంధుత్వాన్ని వివరించాడు ఆయన.

''టైపు స్పీడు ఎంతుంది?'' అనడిగాడు సీతని.

పాసయిన పరీక్షలు చెప్పింది. వాటితోపాటు ఆతృతగా మరొక వాక్యం చేర్చింది. ''మా నాన్నగారు పోయారు. లేకపోతే నేను ఉద్యోగం చేసేదాన్ని కాదు.''

ఇంత పెద్దలోపాన్ని దాచిపెట్టి ఉంచినందుకు నేరస్తురాల్ని చూసినట్టు ఆశ్చర్యంగా చూశాడు మేనేజరు.

''మీ నాన్నగారు పోయినందుకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరు. మీరు పరీక్షలు పాసయ్యారని ఇస్తున్నాను. పని నచ్చకపోతే రెండు నెలలు చూసి తీసేస్తాను'' అన్నాడు. ఉద్యోగం పోతే మానె, కనీసం సానుభూతయినా చూపే మనస్సు కాదని చాలా చిన్నబుచ్చుకుంది సీత. అక్కడ ఉద్యోగం దొరకడం ఏమంత సంతోషంగా తోచలేదు. లేచి బయటికి రాబోతూంటే గుర్నాధం ఓ ప్రశ్న వేశాడు.

''మీ నాన్న ఎందుకు పోయాడు?''

''ఏమో తెలియదండీ?''

''కారణం ఏమీ లేకుండానే?''

విసుగేసింది సీతకి. నోటివరకూ వచ్చిన మాటని అనేసింది. ''నేను పెళ్ళి చేసుకోలేకపోయానని. ఇది ఈ ఉద్యోగానికి మరొక అర్హత అయితే నాకు మీ ఉద్యోగం అక్కరలేదు'' అని బయటికి వచ్చేసింది. ఆ మాటకి గుర్నాధం, ఆమెను పరిచయం చేసిన బంధువు నిర్ఘాంతపోయారు.

''వెల్, ఆమె మంచి అమ్మాయిలాగా ఉందోయ్. నాకు కాన్ఫిడెన్స్ ఉంది. రేపు ఉద్యోగంలో చేరమను'' అన్నాడు గుర్నాధం.

జరిగిందంతా విని మాధవరావు కోప్పడ్డాడు. తల్లి కోప్పడింది.

''బయటికి కఠినంగా మాట్లాడేవాళ్ళంతా చెడ్డవాళ్ళు కారమ్మా. మాధవరావుగారినే చూడు. అలాగే బయటికి నవ్వుతు మాట్లాడేవాళ్ళ చెడ్డతనాన్ని నువ్వు అనుభవిస్తూనే ఉన్నావు'' అంది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ. ఈ మాట నచ్చింది సీతకి. మర్నాడు ఆఫీసుకు వెళ్ళింది. ఈసారి గుర్నాధం చాలా దయగా పలకరించాడు. మొత్తం మీద ఆఫీసులో పని చెయ్యడం ముందు అనిపించినంత కష్టంగా తోచలేదు.

అక్కడికి ఓ పెద్ద విజయం సాధించినట్టు సంతోషించాడు మాధవరావు. ఎప్పుడేనా బజారు పనిమీద సాయంకాలం వెళ్తే సీత బయటికి వచ్చేవరకూ కంపెనీలో వచ్చి ఎదురుగుండా కూర్చునేవాడు. ''నీకు తెలీదమ్మా, రోజులు మంచివి కావు. ఈసారి మనస్సుకి దెబ్బ తగిలితే మీ అమ్మ కూడా బ్రతకదు'' అనేవాడు.

కృతజ్ఞతతో సీతకి కూడా కళ్ళనీళ్ళు వచ్చేవి. అతను చెప్పింది నిజమే. భర్తపోయి, సీత పెళ్ళి ఆగిపోయి, కూతురి ఆర్జన మీద బ్రతకవలసి వచ్చాక ఆమె మనస్సు తీవ్రంగా గాయపడింది. జీవితంలో ఏం జరుగుతుందన్న ఆతృతపోయి ఏం జరిగినా ఒకటే' నిస్పృహ ప్రవేశించింది. ఆరోగ్యం కూడా క్రమంగా క్షీణించనారంభించింది.

ఈ సందర్భంలో ఓ తమాషా జరిగింది.

సీత పనిచేస్తున్న ఆఫీసులో మురళి అనే గుమస్తా ఉన్నాడు. అందమైన ఉంగరాల జుత్తు, సన్నటి మెడా, ఎప్పుడూ తెల్లటి బట్టలూ, ఆడపిల్లలాగా నాజూకుగా పల్చగా ఉంటాడు. మాట కూడా మెల్లగాణ సిగ్గుపడుతూ మాట్లాడుతాడు. అతను వ్రాసే అక్షరాలు ఉలితో చెక్కినట్టు అందంగా ఉంటాయి. వ్రాయడంలో అతని కలం చూపించే ఠీవి, నేర్పూ అతని కదలికల్లో కనిపిస్తుంది. సాధారణంగా ఒకరి జోలికి పోడు. ఒకరితో మాట్లాడడు. సీత చేరిన మూడోరోజే కుర్చీలో కూర్చుని ఉండగా మురళి దగ్గరకి వచ్చి నిలబడ్డాడు. ఆమె తలెత్తితే, సిగ్గుపడుతూ "సారీ, ఆ కుర్చీ నాదండి" అన్నాడు. 'దాని మీద మీ పేరు వ్రాశారా?' అని అడుగుతుందనుకున్నాడేమో. "దాని మీద నా పేరు కూడా వ్రాశాను" అన్నాడు. చాలా అందమైన అక్షరాలు కనిపించాయి ... మురళి, అప్పుడర్థమైంది, ఫైళ్ళల్లో కనిపించే అందమైన వ్రాత అతనిదని. కానీ కుర్చీకి ఇంత పట్టింపేమిటో మొదట అర్థకాలేదు. కాని అతని కాళ్ళు పొట్టి. ఎగురుతూ నడుస్తాడు. అయితే అలవాటు మీద అదో పద్ధతిలాగా తోచేటట్టు చేశాడు. టేబుల్ అందడం కోసమని ఎత్తయిన కుర్చీ తెచ్చి వేశాడు. అతన్ని చూసి జాలేసింది సీతకి. ఆ రోజు ఒకటికి రెండుసార్లు అతన్ని గమనించింది. వ్రాస్తున్నప్పుడు మరొక లోపం కనిపించింది. అతని చేతికి ఆరువేళ్ళున్నాయి. చెయ్యి కొద్దిగా వంపు తిరిగింది. ఇంత అందమైన అబ్బాయికి ఈ అవలక్షణాలేమిటా అని విస్తుపోయింది.

కొత్తగా ఉద్యోగంలో చేరిన ముచ్చట్లు ఇంట్లో తల్లిముందూ, తమ్ముడి ముందూ, మాధవరావు ముందూ చెప్పడం సరదా అయింది సీతకి. ఈసారి మురళి గురించి చెప్పినప్పుడు 'అవునవును. ఒక అవలక్షణం ఉన్నవాడికి మరో గొప్పతనం ఉంటుంది. అతని చేతులకి వంకపెట్టి అతని వ్రాతని అలంకరించాడు దేవుడు' అన్నాడు మాధవరావు.

మర్నాడు బజారుకు వెళ్ళి అలా సీత ఆఫీసుకి వచ్చినప్పుడు ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ "ఎవరమ్మా నువ్వు చెప్పిన అబ్బాయి" అని అడిగాడు మాధవరావు.

దూరంగా బల్ల ముందు కూర్చుని వ్రాసుకుంటున్న మురళిని చూపించింది. ఒక్కసారి చూసి 'బాగున్నాడే పాపం ఎలాంటి వాడికి ఎలాంటి శిక్ష వేశాడు భగవంతుడు" అనుకున్నాడు.

రెండు రోజుల తర్వాత సీత కాస్త ఆలస్యంగా ఆఫీసుకి వచ్చేసరికి మురళితో మాట్లాడుతూ కనిపించాడు మాధవరావు. చాలా హుషారుగా నవ్వుతు, కబుర్లు చెప్తూ నవ్విస్తున్నాడు. భగవంతుడి ముందు భక్తుడిలాగా, అతి వినయంగా అతను చెప్పినవి వింటూ కూర్చున్నాడు మురళి. సీతని చూసి లేచి వచ్చాడు. నీకు తెలీదేమో అతనికి కొంచెం నత్తికూడా ఉన్నట్టుంది" అన్నాడు మాధవరావు. ఆ మాటల్లో అన్ని అవలక్షణాలున్నందుకు ఏదో తృప్తినీ, సంతోషాన్ని అనుభవిస్తున్నట్టు కనిపించాడు మాధవరావు. ఏమీ సమాధానం చెప్పలేదు సీత.

ఓ రోజు మధ్యాహ్నం వాళ్ళిద్దరూ కాఫీ హోటలు నుంచి వస్తూ కనిపించారు. ఆశ్చర్యపోయింది సీత. కాని మాధవరావు ముందు ఈ విషయం ప్రస్తావించకుండానే ఊరుకుంది. కాని అప్పట్నుంచి మురళి తనని మాటిమాటికీ చూస్తుండడం గమనించి విస్మితురాలయింది. తను అది గ్రహించి తలెత్తితే, భయం భయంగా కాని నిలకడగా చిరునవ్వు నవ్వడం ప్రారంభించాడు. ఒకరోజు 'కాఫీ తాగుతారా?' అని ఫ్లాస్కు తీసుకొచ్చి ముందు పెట్టాడు. మరొకరోజు టిఫిన్ తెచ్చాడు. ఎవరితోనూ మాట్లాడని వ్యక్తి తనపట్ల తీసుకునే చొరవకి కాస్త ఆశ్చర్యం కలిగినా, అది తెలియనివ్వలేదు సీత. ఒకరోజు మధ్యాహ్నం ఏదో టైపు చేస్తున్న సీత దగ్గరకి చాలా అందంగా మడిచిన చీటీ పంపించాడు. విప్పి చూసింది.

"మీతో మాట్లాడాలని ఉంది" ఉదయం నుంచీ అదొక్కటే వ్రాసినట్టున్నాడు. తలెత్తగానే నవ్వాడు. విపరీతమైన కోపం వచ్చింది సీతకి. నలుగురూ కాఫీకి లేచేవరకూ ఊరుకుంది. అతనూ అర్థం చేసుకున్నట్టున్నాడు. నలుగురూ వెళ్ళిపోయేవరకూ కదలలేదు. అంతా వెళ్ళగానే చర్రున లేచి టేబులు ముందుకు వచ్చి నిలబడింది.

"ఏం మాట్లాడతారు?" అంది సూటిగా.

అతను దిమ్మెరపోయాడు. నోట మాట రాలేదు.

"మీరు చాలా మంచివారనుకున్నాను. ఎప్పుడూ ఇలాంటి కాగితాలు వ్రాయకండి."

అని వచ్చేసింది.

ఇది జరిగిన మరుసటి రోజు సాయంకాలమే మాధవరావు ఆఫీసుకి వచ్చినప్పుడు సీత జరిగిన విషయమంతా చెప్పింది. కాని అంతా విన్నాక కూడా అతను ఆశ్చర్యపడలేదు. కిమ్మనలేదు. "నాకంతా తెలుసునమ్మా" అన్నాడు.

ఆమె తెల్లబోయింది. "మీకెలా తెలుసు?"

"అతనే చెప్పాడు. జరిగిన విషయానికి బాధపడుతున్నాడు. ఏదో పొరపాటు జరిగిపోయింది. అంతా మరచిపో" అని సర్దేశాడు. కాని అసలు రహస్యం బయటపెట్టలేదు మాధవరావు. అసలు విషయం ఇది.

## 25

**పెళ్ళి మురళినీ**, శాంతనీ ఇద్దర్నీ మార్చింది. శాంత బలంగా, నిండుగా ఇదివరకటికంటే అందంగా కనిపించింది. స్త్రీకి సతీత్వం ప్రసాదించిన సమగ్రత ఏమో అది. జీవితమంటే ఎంతో తెలిసినదానిలాగా గస్డుసుగా ఉంది. మురళీ మరీ సన్నంగా రివటలాగా తయారయాడు. అరిగి నాణెంలాగా ఉన్నాడు. ఇదివరకున్న అందం, అమాయకత్వం కనిపించలేదు. వాటి స్థానే అనుభవం నేర్పిన ధీమా, జీవిత రహస్యాల్ని గ్రహించిన తృప్తీ ముఖంలో కనిపించాయి

అల్లుడికోస్మ మంచి గ్లాస్కో పంచెలు తెప్పించాడు మాధవరావు. పనిలో పనిగా తనకూ రెండు తెచ్చుకున్నాడు. కొత్త బట్టల్లో ఇద్దరూ కొత్తయింటి అల్లుళ్ళలాగే కనిపించారు. పండుగనాడు మామగారిచ్చిన పంచెలో నిటారుగా కనిపించాడు మురళి.

తండ్రి ఇదివరకటికంటే ఆరోగ్యంగా, సంతోషంగా ఉండడాన్ని చూసి ఆశ్చర్యపోయింది శాంత. అతని పెట్టెలో రెండు మూడు రకాల సెంట్లు కనిపించాయి. రెండు కొత్త పెద్దాపురం సిల్కు లాల్చీలు దండానికి ఉన్నాయి. అమలాపురం చెప్పులు పువ్వులు అల్లినవి రెండు జతలు తెప్పించి ఉంచాడు. నవ్వితే, ఇప్పుడు బంగారం పన్ను తళతళమంటుంది.

"నాన్నగారిలో మార్పుకు కారణం నీకు తెలుసా?" అనడిగింది మాటల సందర్భంలో శాంత సీతని.

సీత నవ్వి "తెలుసు" అంది.

"ఏమీటి?"

"నీకు పెళ్ళయిపోయిందని."

ఆ కారణం అంత తృప్తి కలిగించలేదు శాంతకి. ఎందుకంటే తన పెళ్ళికోసం ఎప్పుడూ ఎక్కువ బాధపడలేదు తండ్రి. కనీస్మ పడీనట్టు అక్నిపించనూ లేదు. అదొక బాధయ్తలాగా పెళ్ళిచేసి చేతులు కడుక్కున్నాడు. అసలు కారణం ఏమిటో ఆవిడకి ఎంతకీ అర్ధం కాలేదు. అయినా తండ్రి పదికాలాల పాటు బాగుంటే తనకీ సంవత్సరానికోసారి గుర్తు చేసుకోవడానికైనా పుట్టిల్లు ఉంటుందనుకుంది.

సీత తలంటి పోసుకుని భుజం మీద జుట్టు తిప్పుకుని ఆరబెట్టుకుంటున్న సమయంలో కొత్త పెళ్ళికొడుకులాగా బంగారు జరీకండువా కప్పుకుని వచ్చాడు మాధవరావు. చేతిలో కాగితం పొట్లాం ఉంది.

పసుపుఓ పచ్చగా మెరుస్తున్న ముఖాన్ని వెలిగించిన్ ఎర్రటి బొట్టును చూస్తూ క్షణకాలం ముగ్ధుడయి నిలబడిపోయాడు.

"ఏమిటి మామయ్యా?" అంటే

"నల్ల కలువలాగా ఉన్నావమ్మా నువ్వు. ఒకరు కాదు ఇద్దరు కుర్రాళ్ళు నిన్నెలా మరచిపోయి దూరంగా పోగలిగారా అని ఆశ్చర్యం నాకు" అన్నాడు.

సిగ్గుపడి ఎండ వెలుగులోకి నడిచింది సీత. తల్లితో మాట్లాడడానికి అతను లోప;లికి వచ్చాడనుకుంది. కాని తనకి రహస్యం చెప్తున్నంత సమీపంలో 'సీతా ' అని పిలిచేసరికి తుళ్ళిపడింది.

"నువ్వేమీ అనుకోకపోతే నాదొక చిన్న కోరిక" అన్నాడు.

ఏమిటని అడిగే వ్యవధి కూడా ఇవ్వలేదతను. "నువ్వీ చీర కట్టుకోవాలమ్మా" ఆమె దిగ్భ్రాంతురాలయి చూస్తే "కనీస్మ నా స్మతోషానికి" అన్నాడు.

"నాకెందుకు మామయ్యా ? నాకిప్పుడేం వద్దు" అంది సీత తొందరగా.

వర్ధనమ్మ ఇంట్లోంచి వసారాలోకి వస్తూ మాధవరావుని చూసి ఆగింది.

"ఏం అన్నయ్యా, పొద్దుటే వచ్చావు?" అంటూ.

"ఏం లేదమ్మా? నీ తోబుట్టువు వుంటే ఇలాంటి కోరిక కోరాఏవాడా కాదా చెప్పు. సీతకి చీర పెట్టాలనిపించింది. తెచ్చాను. వద్దంటుంది చూడు. పండగపూట నలుగురిలో నవ్వుతూ తిరిగితే నాకూ ఆనందం."

అతని ఆప్యాయతకీ, ప్రేమకీ కళ్ళనీళ్ళు వచ్చాయి వర్ధనమ్మకి. నిజమే. ఆమెకి తోబుట్టువులు లేరు. కాని ఉంటే ఇంత ప్రేమాభిమానాలు చూసేవారు కారా?

"తీసుకో అమ్మా, ఆయన మనకి ఆత్మీయుల కన్నా ఎక్కువ. అక్కడ ఉంచండన్నయ్యా. అదే కట్టుకుంటుంది" అంది.

బల్లమీద ఉంచుతూ, జుత్తు ఆరబోసుకుంటున్న సీతతో అన్నాడు "కట్టుకుని నా కళ్ళబడాలమ్మాయ్. మరచిపోకు" అంటూ బయటికి నడిచాడు.

అతని ప్రేమకు సీత కూడా చలించిపోయింది. తనకి గుర్తున్నంతలో ఇంత ఆదరాన్ని ఎవరూ ఈ మధ్య చూపలేదు తమ మీద. చీర రెండు చేతుల్లోకి తీసుకుంది. పెద్ద ఆడంబరంగా లేకుండా నల్లటి రంగు మీద తెల్లటి చుక్కల చీర. నవ్వుకుంది.

అతని ఎంపిక కూడా తెలీదు. తన నల్లటి శరీరం మీద ఈ చీర, నల్లటి ఆకాశం మీద చుక్కల పందిరిలాగా ఉంటుంది.

మనస్సు ఆనందంగా ఉన్నప్పుడు, ఆనందం కరువైన క్షణాల జ్ఞాపకాలు వెంట తరుముతాయి. సుఖానికి గానీ, కష్టాలకి గాని వీగిపోకుండా సమాభ్రాన్ని కాపాడే త్రాసు మనస్సు.

కొత్తచీర కట్టుకుని సంధ్య వాకిట్లో మంచం మీద కూర్చుంది. ఒకటి రెండుసార్లు కూతుర్ని పిలిచి, పలక్కపోయేసరికి బయటికి వచ్చింది. లైటు వేసుకోకుండా చీకట్లో కూర్చున్న కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది. లైటు వేస్తే కళ్ళనీళ్ళు ధారాపాతంగా కురుస్తున్నాయి సీతకి.

"సీతా" అంటే తుళ్ళిపడి కళ్ళు తుడుచుకుంది.

"ఏం అమ్మా?" అని లేచి నిలబడింది.

ఇలాంటి సమయాల్లో ఒంటరతనం భయాన్ని మరింత రెచ్చగొడుతుంది. ఆ విషయాన్ని గ్రహించింది వర్ధనమ్మ.

"ఒక్కసారి శాంత వాళ్ళింటికి వెళ్ళిరామ్మా. మామయ్య ఈ చీరతో నిన్ను చూస్తానన్నాడు. నమస్కారం చేసి రా" అంది.

మరోమాట చెప్పకుండా బయలుదేరింది సీత.

చీకటి దుర్మార్గుడి దురాలోచనలాగా ప్రపంచమంతా అల్లుకుపోయింది. నల్లని ఆకాశం మీద చుక్కలు భూమి మీద ప్రతిఫలించినట్టుగా ఉంది సీత.

సీత గొంతు వినేసరికి కాఫీ పెట్టుకుంటున్నవాడల్లా వాకిట్లోకి వచ్చాడు మాధవరావు.

"రా అమ్మా – రా, రా – రోజంతా వస్తావని ఎదురుచూశాను. ఉండు, మిఠాయి తెస్తాను" అని లోపలికి వెళ్ళాడు. మిఠాయి పళ్ళెంతో వచ్చిన మాధవరావు కాళ్ళకి వంగి నమస్కారం చేసింది.

"ఇదేమిటమ్మా, మనమధ్య ఈ మర్యాదలేమిటి? లే" అని రెండు భుజాలు పట్టుకుని లేవనెత్తాడు.

భక్తితో వినమ్రమైన ఆమె ముఖాన్నీ, కళ్ళనీ దిగ్భ్రమతో అలానే చూస్తున్న అతని దృష్టిని తప్పించుకునే ఉద్దేశంతో "శాంత ఏది మామయ్యా?" అంది సీత భుజం  వదిలించుకుంటూ.

"పండగ కదు? తీరికగా ఇద్దరూ సినిమాకు బయలుదేరారు. వాళ్ళ వెనుక గిరిజ కూడా పడింది. కాఫీ పెట్టుకోవడం, వంట చెయ్యడం నా నెత్తిన పడేసి అంతా వెళ్ళారు" నవ్వాడు.

"ఆ చేతికి కట్టేమిటి?"

"పొయ్యి వెలిగించబోయి చెయ్యి కాల్చుకున్నాను."

జాలేసింది సీతకి.

"నేను చేసి పెడతాలే మావయ్యా" అని లేచింది.

"బాగుందమ్మా. ఇంటికొచ్చిన అతిధి చేత వంట చేయించడమా? నువ్వు మిఠాయి తింటూ ఉండు. కాఫీ చేసి తెస్తాను" అన్నాడు.

కానీ కూచోలేదు సీత. అతని వెనుకనే వంట ఇంట్లోకి వచ్చింది. ఒక్కరైనా సరిగ్గా తిరగడానికి వీలులేని ఆ గదిలో తంటాలు పడుతున్నాడు మాధవరావు.

"నువ్వు లే మావయ్యా నేను చూస్తాను" అంది.

ఇంక కాదనలేదు. కాఫీ పని ఆవిడకి అపప్పెప్పి బయటికి వచ్చేశాడు.

ఉన్నట్టుండి సెంటువాసన ఇల్లంతా గుప్పుమంది. గదిలో మాధవరావు ఏదో పాట గొణుగుతున్నాడు.

"నాకు కాఫీలో చక్కెర తక్కువ వెయ్యి సీతా" అని కేక పెట్టాడు.

పెద్దాపురం పట్టు గదిలో రెపరెపలాడింది.

పొయ్యి మీద బియ్యం పడేసి సీత కాఫీ తెచ్చేసరికి మాధవరావు కొత్తబట్టలు వేసుకుని ఉన్నాడు.

"ఉదయం నుంచి బట్టలు తొడిగి చూసుకోలేదమ్మా! చూడు, కుర్రాళ్ళకి కుట్టినట్టు షోకు చేశాడు ఈ దర్జీవాడు" అని నవ్వాడు. అతన్ని చూసి విస్మితురాలయింది సీత.

వంటగదిలో పచ్చిపుల్లల పొగకి సీత కళ్ళు జ్యోతుల్లాగా అయాయి. ఎంత తుడుచుకున్నా కళ్ళనీళ్ళు ఆగలేదు. అసలే పెద్ద కళ్ళు తడిలో మరీ నిండుగా, ఎర్రగా కనిపించాయి. ఆమెను చూడగానే అతని నవ్వు మాయమైంది.

"ఏమైంది సీతా, ఏమైంది?" అని దగ్గరకు వచ్చాడు.

"ఏం లేదు మామయ్యా" అంటూ కారణం చెప్పబోయింది. కానీ అప్పటికే ఆమె చేతిలో కాఫీ గ్లాసు అందుకుని బల్లమీద పెట్టాడు.

"బాధపడకు సీతా, ఎందుకు కళ్ళనీళ్ళు కారుస్తున్నావో నాకు తెలుసు. అలాంటి సంతోషకరమైన సమయంలో నీతో కలిసి తిరిగిన స్నేహితురాలు సంతోషంగా ఉండడం చూస్తే నీకు అలాగే ఉండాలనిపిస్తుంది. నాకు తెలుసు"

తను ఈర్ష్య పడుతున్నదని అతను పరోక్షంగా చేసే ఓదార్పు ఆమెకి ఉదాసీనత కలిగించింది.

"లేదు మావయ్యా అదేం కాదు" అంది. కాని అతన్నెలా వొప్పించాలో అర్థం కాలేదు.

"నేను దాని గురించి ఆలోచించడం లేదు" అని ఏమేమో చెప్పబోయింది. ఆ నిస్సహాయతలో నిజంగానే కళ్ళనీళ్ళు తిరిగాయి.

"నేనర్థం చేసుకోగలను సీతా" అంటూ దగ్గరకి వచ్చి భుజం చూట్టూ చేయివేసి కళ్ళనీళ్ళు కండువాతో తుడిచాడు. కండువాకి ఉన్న సెంటు అంతా ముఖానికి అంటుకుంది. సువాసన తప్పించుకోలేని జ్ఞాపకంలాగా శరీరాన్ని చుట్టేస్తోంది. "పాత అనుభవాలు గుర్తుకొస్తున్నాయా?"

తెల్లబోయి అతన్ని చూసింది.

దయగా, ఆదరంగా నవ్వాడు మాధవరావు. భుజం మీద అతని చెయ్యివణుకుత్నంది. సీత ఆ చేతులని మెల్లగా తప్పించుకోబోయింది. ఆ పలకరింతకి గుండె గొంతులో కదిలింది. దుఃఖం తెరలాగా వచ్చింది.

"అనవసరంగా జీవితాన్ని నష్టపెట్టుకున్నావు సీతా, మరేం బాధపడకు. నేనున్నాను" అంటున్నాడు.

అవసరంలేని ఓదార్పు కలిగించే బాధ ఉపశమనం కలిగించదు. తనకి ఆ ఓదార్పు అవసరం లేదని చెప్పే వ్యవధి కూడా ఇవ్వడం లేదు మాధవరావు. ఇటు చూడబోతే సీతని మెల్లగా తనవేపు తిప్పుకుంటున్నాడు. పెద్దాపురం సిల్క్ చెమటతో తడిసింది. ఆమె కన్నీరు అతని గుండెకు తగిలి దాన్ని కరిగించలేకపోయింది. తనకిప్పుడు కన్నీరు రావడంలేదు.

కానీ "వద్దమ్మా, కన్నీరు వద్దు, నేను చూడలేను" అని తనని చుట్టేస్తున్నాడు. ఆ వయస్సులోనూ అతని బలాన్ని ఎదిరించలేకపోతోంది సీత.

"మావయ్యా" అనబోయింది దిగ్భ్రాంతురాలయి.

కాని ఆమెని మాట్లాడనివ్వలేదు. "నువ్వేం చెప్పకు. నాకంతా తెలుసు" అని రహస్యంగా చెవిలో అన్నాడు. తన వీపు మీద అతని చేతులు బిగుసుకుంటున్నాయి. ఆ తొందరలో జడ అతని చేతిని పగపట్టిన త్రాచుపాములాగా మెలిక వేసుకుంది. చెయ్యి విదిలించుకోబోతే, సీత తప్పించుకుని కుప్పలా కూలబడిపోయింది దుఃఖంతో.

"ఏమిటి మావయ్యా ఇది? ఛీ,ఛీ నువ్వు మా పట్ల చూపిన ప్రేమంతా ఇందుకేనా?" అంది.

అసలు ఆ విషయమే మాట్లాడడం లేదు మాధవరావు. "ఏడవకు సీతా, నాకామాత్రం కృతజ్ఞత చూపలేవా? నీకేం భయంలేదు."

అతని మీద ఎక్కడలేని జుగుప్సా పుట్టుకొచ్చింది. ఒక్క మాటయినా అనకుండా లేచి విసురుగా వీధి గుమ్మం వేపు పోబోయింది. అలా జరుగుతుందని తెలుసులాగుంది. మాధవరావు ఆ క్షణంలో అక్కడే వున్నాడు. ఆ విసురులో అతని చేతుల్లో జారింది మళ్ళీ.

"నన్ను పోనీ" అంది.

"ఇన్నాళ్ళూ మీకు చేస్తున్న సహాయం ఎందుకో ఊహించలేవా సీతా, నీకిదేం కొత్తా? నీకేం భయం లేదు" మళ్ళీ చుట్టూ చేతులు బిగించాడు. మెడమీద చెయ్యి బిగుసుకుంటోంది. మెడకి చెమట పట్టి చెయ్యి జారింది. గింజుకుంది. జాకెట్టు మీదికి చెయ్యిపోయింది. తోక తొక్కిన త్రాచయింది. బలంగా చేతిని కొరికింది.

ఆ ఉద్రేకంలో అది గాయమనిపించలేదు మాధవరావుకి. ఆమె కొరికిన చోట చప్పరించాడు.

"నా రక్తం కూడా చప్పగానే ఉంటుంది సీతా. కోరికలకి వయస్సుతో సంబంధం లేదు. ఇందుకు నేనేమీ అనుకోనులే. రా"

విసురుగా అతని చేతుల్లోంచి తప్పించుకోబోతే అతను కొనిచ్చిన తెల్లచుక్కల నల్లచీర అతని చేతుల్లోనే చిరిగింది.

భయంతో, దైన్యతతో, పగతో అతన్ని చూస్తూ స్థంభానికి చేరబడిపోయింది సీత.

ఆ చూపుకి అర్థం తెలిసింది మాధవరావుకి. "నువ్వు నన్నేం చెయ్యలేవు సీతా. నువ్వీ విషయం నలుగురికి చెప్పినా ఎవరూ నమ్మరు. నేను ఎంత మంచివాడినో మీ ఆఫీసులో గుమాస్తాలు చెపుతారు. మీ మేనేజరు గుర్నాధం చెపుతాడు. మీ చుట్టుపక్కల వాళ్ళు చెపుతారు. అంతెందుకు? మీ అమ్మ చెపుతుంది. నా మంచికి ఇన్ని నెలల రుజువుంది. మరి నీ చరిత్రకీ చాలా నెలల రుజువుంది."

నిర్ఘాంతపోయింది సీత.

"ఇందుకేనా ఇన్నాళ్ళూ మాకు తోడై నిలిచింది? నలుగురికీ మంచివాడిలా కనిపించింది"

ఇన్నాళ్ళకి పిడికిలి విప్పి రహస్యం బట్టబయలు చేసినవాడిలాగా గర్వంగా నవ్వాడు.

"అది నువ్వు అనుకోడంలో ఉంటుంది. మిమ్మల్ని చూసి జాలిపడి సహకరించానని ఎందుకనుకోకూడదు?"

నిస్సహాయతతో భోరుమని ఏడవాలనిపించింది సీతకి. కళ్ళు ధారాపాతంగా కురవడం ప్రారంభించాయి. మళ్ళీ జాలి, దయ అతన్ని ఆవరించుకున్నాయి.

"ఛఛ! ఏడవకు సీతా, ఏడిస్తే నేను భరించలేను. ఊరుకో, అతా మంచే జరుగుతుంది" అని మళ్ళీ దగ్గరకి వచ్చి తలని గుండెకి పొదుపుకున్నాడు. అందులో కొన్ని మాటలే వినిపించాయి సీతకి. దయకీ, జాలికీ ఇంకా అర్ధం తెలీని సీత అతని చేతుల్లో ఒరిగిపోయింది.

ఇక్కడ ఏభై ఏళ్ళ ఆకలి తీర్చుకుంటున్న మాధవరావుకి లోపల పొయ్యి మీద మాడి బొగ్గులవుతున్న అన్నం మీద దృష్టేలేకపోయింది.

## 26

ఒకే ఒక్క సాయంకాలం –

ఒక్క సాయంకాలపు నిశ్శబ్దంలో జరిగిన ఒకే ఒక్క సంఘటన ఈ ప్రపంచాన్నేమీ మార్చలేదు.

మర్నాడూ మామూలుగానే తెల్లవారింది, సీత జీవితంలాగే.

ఆమెకు మాధవరావు మీద కోపం, అసహ్యం కలగలేదు. తన మీద తనకే అసహ్యం కలిగింది. వాడిపోయిన పువ్వు కనిపిస్తే పక్కకి తోసెయ్యక చేసేదేముంది? తలమీద పెట్టుకోలేదని కోపం ఎందుకు?

అప్పుడామెకి తెలిసి వచ్చింది. మృత్యువు ఎంత విలువైన వరమో. అది అందరికీ ప్రసాదితం కాదు. లోకంలో మృత్యువు ఆహ్వానించేవాళ్ళంతా దాన్ని అపార్ధం చేసుకుంటారు. మృత్యువుని ఆహ్వానించేవాళ్ళని అది అపార్ధం చేసుకుంటుంది.

"ఏమే అలా వున్నావు?" అని అడిగింది వర్ధనమ్మ చెదిరిన జుట్టు, పీక్కుపోయిన కళ్ళతో ఆలస్యంగా నిద్రలేచిన సీతని.

"నేనిక ఎప్పుడూ ఇలాగే ఉంటాను" అంది సీత పరాకుగా. ఆమె తరచు చెప్పే వేదాంతంలో ఇది ఒక భాగమేనని తల్లి ఆ మాటని సరిపెట్టుకుంది.

శాంత నవ్వుతూ వచ్చి "నిన్న ఇంటికి వచ్చి అన్నం వండిపెట్టావటగా? మా నాన్న వండిన వంట చూశాను. అన్నం మాడీ బొగ్గు అయింది" అంది.

"అవును, ఆయన ఆకలి తీరింది" అనుకుని నవ్వుకుంది సీత.

"మీ నాన్న చేసిన సహాయానికి ఎంత చేస్తే ఋణం తీరుతుందమ్మా. మా చర్మం వొలిచి చెప్పులు కుట్టించి ఇవ్వాళి" అంది వర్ధనమ్మ.

ఇక అక్కడ కూచోలేక లేచిపోయింది సీత. సాయంత్రమవుతున్న కొద్దీ మరీ స్వాస్థ్యం లేకుండా పోయింది. ప్రతీ సాయంకాలం భయంకరమైనదిగా కనిపించేటంత పీడకల అయిపోయింది క్రితం రోజు సంఘటన.

లోపభూయిష్టమైన ప్రపంచంలో పాపభూయిష్టమైన బ్రతుకు బ్రతికే ప్రాణికి లోపరహితుడు, పరమపావనుడూ అయిన భగవంతుడొకడున్నాడన్న ఆలోచన చాలా ఆనందాన్నిస్తుందేమో.

స్వచ్ఛంగా, ప్రశాంతంగా చిరునవ్వు నవ్వి పలకరించే రాధ గుర్తుకొచ్చింది సీతకి. ఆమె సమక్షంలో మనస్తాపాన్ని కొంతవరకూ మరిచిపోగలదనిపించింది. అనిపించడమే తడవుగా గుర్నాధం ఇంటికి బయలుదేరింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంటిముందు కారులేదు. గుర్నాధం భార్యను తీసుకుని ఎక్కడికయినా వెళ్ళాడేమో? తిరిగి వెళ్ళిపోదామా అనుకుంది. అయినా ఒక్కసారి కనుక్కుని పోవడంలో తప్పులేదు.

ముందు హాల్లోనే కనిపించాడు గుర్నాధం. కుర్చీలో కూర్చుని మరొక కుర్చీ మీద కాళ్ళు పెట్టుకున్నాడు. అతని కాళ్ళమీద అబ్బాయి నిద్రపోతున్నాడు. అతన్ని చూడగానే నిశ్చేష్టురాలయింది సీత. జుట్టు చిందరవందరై ఉంది. టై వదులై జారింది. కాలికి ఇంకా మేజోళ్ళు వున్నాయి. బూట్లు నేలమీద పడివున్నాయి. ఎప్పుడూ అతను సిగరెట్లు కాల్చడం చూడలేదు. అలాంటిది నేలంతా కాల్చిన సిగరెట్లు పడీవున్నాయి. రాత్రంతా నిద్రపోయినట్టు లేదు. ముఖం పీక్కుపోయి ఉంది. కళ్ళు ఎర్రగా వున్నాయి. తను లోపలికి వచ్చేసరికి కునుకు తీస్తున్నాడు. తలుపు కదిలిన శబ్దానికి కళ్ళిప్పాడు. అతన్ని చూసి మొదట భయపడింది. ఒక్కమాటైనా అనకుండా గేటువేపు పరిగెత్తాలనిపించింది. కానీ చాలా తాపీగా, మెల్లగా పలకరించాడు.

"రా సీతా! అప్పుడే నీకెలా తెలిసింది?" అంటూ.

ఆమెకి ప్రశ్న అర్థం కాలేదు.

"ఏమిటి?" అంది ఆశ్చర్యపోతూ.

అతనూ వింతగా ఆమె ముఖం చూశాడు. అబ్బాయిని ఎత్తుకుని సోఫాలో పడుకోపెట్టాడు.

"నీకు తెలీదా? తెల్లవారుఝామున రాధ హాస్పిటల్లో పోయింది"

తలమీద పిడుగు పడినట్టయింది సీతకి. తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది.

"నిజంగా?" అంది.

నవ్వాడు – "అబద్ధమని వీణ్ణి నమ్మించాలని అప్పట్నుంచి ప్రయత్నిస్తున్నాను. ఇందాకే నిద్రపోయాడు. రాత్రి కడుపులో నొప్పని బాధపడింది. వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను. బిడ్డ పొజిషన్ తప్పిందట, వెంటనే ఆపరేట్ చెయ్యాలన్నారు. పురుడు సరిగ్గా రాలేదు. తెల్లవారుఝామున పోయింది."

ఏం చెప్పడానికీ, ఏం చెయ్యడానికీ తోచలేదు సీతకి. ఒక్కసారి రాధ ముఖం మనస్సులో కదిలింది. తనకి తెలియకుండానే కళ్ళనీళ్ళు తిరిగాయి.

"ఇక్కడ ఉన్నారేం అమ్రి?" అంది ఎంతోసేపటికి.

"ఏం చెయ్యను? ఆమె పక్కన కూచోలేకపోయాను. హాస్పిటల్ అధికారులకి ఫోన్ చేశాణు. శవాన్ని తీసుకెళ్ళడానికి ఇంకా అనుమతి రాలేదు" ఆగాడు.

"నిన్న పదిగంటలవరకూ నాతో కబుర్లు చెప్తూనే ఉంది. ఇంకా ఆ మాటలు వింటున్నట్టే ఉంది" అన్నాడు.

వాళ్ళ అన్యోన్యతని కళ్ళారా చూసింది సీత. ఈ కష్టం అతని జీవితం మీద ఎలాంటి దెబ్బ తీస్తుందో ఊహించలేకపోయింది. ఆ క్షణంలో తన బాధ మరచిపోయింది "మీకింత కష్టం వస్తుందనుకోలేదు గుర్నాధంగారు. రాధగారు పోయారంటే నమ్మలేకుండా ఉన్నాను."

"నాకు కన్నీళ్ళు రావడం లేదు సీతా, తలమీద పెద్ద దెబ్బ తగిలితే దిమ్ము ఎక్కినట్టుగా ఉంది. పోవాలనిలేదు లేదు. 'డాక్టర్, మేలుకుని ఉండడానికి మందు ఇవ్వండి' అని అడిగాను. డాక్టర్ నా బాధని కనిపెట్టినట్టున్నాడు. ఈ సిగరెట్టు పాకెట్టు నా జేబులో ఉంచాడు" అని కాలిన సిగరెట్టు పీకల్ని చూపించాడు.

చివరగా కాల్చిన సిగరెట్టు నేలమీద పొగ వదులుతోంది ఇంకా. బాధాతప్త హృదయం వదిలిన నిట్టూర్పులాగా ఉంది ఆ పొగ.

గుర్నాధం ఆ దుఃఖాన్ని తట్టుకున్నాడు. కొడుకు కోసం ఒక నర్సుని పెట్టాడు. పదిహేనురోజుల్లో మళ్ళీ యథాప్రకారం ఆఫీసుకు వచ్చేశాడు.

అతన్ని చూసి సీత విస్మితురాలయింది. అంత స్థయిర్యం అంత తక్కువ వ్యవధిలో ఎలా కూడదీసుకున్నాడా అనిపించింది ఆ మాటే సంశయించకుండా అడిగింది కూడా.

"మేం మగవాళ్ళం. మేం వాడే మందులు మీరు వాడలేరు" అన్నాడు గుర్నాధం.

మాధవరావు మాత్రం ఇంటికి రావడం మానలేదు. ఆప్యాయంగా పలకరించడమూ మానలేదు. అతని ముందు తనే ఒదుగుబాటుతో, సిగ్గుతో తనే ఏదో నేరం చేసినట్టు తప్పించుకు తిరగడం బాధాకరంగా కనిపించింది సీతకి. ఈ అంతర్యుద్ధాన్ని తట్టుకోలేని పరిస్తితికి వచ్చింది. ఒకరోజు తల్లి ముందు బయటపడింది.

"ఈ ఇంట్లో మనం ఉండొద్దు. మరో ఇంటికి పోదాం."

వర్ధనమ్మకి అర్ధం కాలేదు.

"ఇప్పుడేమొచ్చిందే?'

"నాకిక్కడ బాగుండడం లేదు."

"ఏం? మాధవరావుగారు మంచివారు. ఈ సహాయం మనకి మరో చోట దొరుకుతుందా"

"అతను లేకపోతే మనం చచ్చిపోతామా?"

"అదేమిటే అలా అంటావ్?"

"నన్నింకేం అడక్కు. నేనిక్కడుంటే బ్రతకను."

ఆవిడకి అర్ధం కాలేదు. సీత మొదట్నుంచి చేస్తున్న తెలివితక్కువ పనుల్లో ఇది ఒకటని సరిపెట్టుకుంది. సరిపెట్టుకోక చేసేదేమీ లేదు. సీతకి నచ్చచెప్పే శక్తి ఆమెకి ఏనాడో పోయింది. అయితే ఆ రోజు చెడు నుండి ఆమెని మళ్ళించలేకపోయింది, ఈ రోజు మంచివేపు మొగ్గించలేకపోతోంది అనుకుంది. అనుకుని ఇక మాట్లాడలేదు.

ఈ విషయం విని మాదవరావు అన్నాడు "ఇప్పుడు ఇల్లు మారే అవసరం ఏమొచ్చిందమ్మా, పదేళ్ళుగా ఉంటున్నారాయె. నేను అద్దె అడిగానా?మీ ఇష్టం వచ్చినప్పుడే ఇవ్వండి. మీరు వెళ్ళిపోతే మీలాంటి వాళ్ళు దొరుకుతారా?" అని అర్ధయుక్తంగా అన్నాడు.

"మీలాంటి 'మంచి'వారికి చాలామందే దొరుకుతారు మామయ్యగారూ. లోకంలో మాలాంటి దురదృష్టవంతులకీ, మీలాంటివాళ్ళకీ కొదవలేదు" అంది సీత పెడీలుమని ముఖం మీద కొట్టినట్టు. అతని ముఖం నల్లనయింది. మరి మాట్లాడలేదు. కానీ ఈ సంబంధం ఇంతతోనే తెగిపోయినందుకు బాధ కలిగింది.

ఇంతలో ఎలా పుట్టిందో, ఒక భయంకరమైన పుకారు ఆ వీధంతా వ్యాపించింది. అమ్మాయిని ఎరగా పెట్టి ముసలావిడ మాధవరావుని లోబరుచుకున్నదని, అతని చేత సమస్త చాకిరీ చేయించుకుని తమ అవసరం తీరిపోగానే జారిపోతున్నారని. ఒకరిద్దరు తెలిసినవాళ్ళు "అయితే ఇల్లు ఖాళీ చేస్తున్నారటగా" అని అడిగారు.

సీత సమాధానం చెప్పకముందే "అయినా దేవుడులాంటి ముసలాయన. మనకి మొహం మొత్తాలి కాని, ఎన్నాళ్ళున్నా కంటికి రెప్పలాగా కాపాడే మనిషి" అని వ్యంగ్యంగా అంటూ నవ్వుకున్నారు. ఇలాంటి మాటలు ఆనోటా ఈ నోటా పాకి వర్ధనమ్మకు కూడా తెలిసాయి. ఆ రాత్రంతా తల్లీకూతుళ్ళిద్దరూ ఏడుస్తూ కూర్చున్నారు.

ఈ ప్రచారం ఎక్కడ ప్రారంభమైందో సులువుగా అర్ధమైంది సీతకి. ఇల్లుకూడా వదిలిపోయే పరిస్థితి వచ్చాక తన ప్రయోజకత్వం బయటపడుతుందని భయపడి మాధవరావే మొదట నోరు చేసుకున్నాడు. కనీసం నలుగురి నోళ్ళలోనైనా సీతతో పొత్తు కుదిరినట్టు తెలిసేటట్లు తృప్తిపడ్డాడు. ఇలాంటి ప్రపంచంలో, తప్పు ఎవరిదైనా, మగాడికి అఖండ గౌరవం లభిస్తుంది. స్త్రీదే నష్టమంతా.

"మగాడికి దూరంగా ఉండక్కర్లా? అయినా దానికి బుద్ధిలేకపోతే అతనేం చేస్తాడు?" అని ఒక తీర్పు ఉండనే ఉంది.

ఈ ప్రచారం కూడా ప్రారంభమయాక ఆ ఇంట్లో, ఆ వీధిలో ముళ్ళమీద ఉన్నట్టనిపించింది సీతకి. చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు ఫలహారాలతోపాటు సీత కథ చెప్పి, ఆమెను చూపించి 'కనువిందు' చేసి పంపుతున్నారు

చీమలు కరుస్తున్నా లేవడానికి శక్తి చచ్చిపోయిన వానపాములాగా తలవొంచి వాళ్ళ మధ్య నుంచి నడిచిపోవడం నేర్చుకుంది.

ఒకరోజు గుర్నాధం సీతని పలకరించాడు. "రోజూ చూస్తున్నాను. అలా ఉన్నావేం? ఆరోగ్యం బాగుండలేదా?" అని.

ఆ మాత్రం పరామర్శకి ఈ మధ్య నోచుకోలేదు సీత. కానీ ఆ ప్రశ్నకు ఏ ఒక్క కారణం జవాబుగా చెప్దామా అని మనస్సుని శోధిస్తే ఎన్నో కారణాలు కనిపించాయి. 'ఇల్లు బాగోలేదు. మారాలి ' అని మాత్రం అనగలిగింది. మిగతావి చెప్పుకోగలిగేవి కావు.

"ఇంతేనా? ఇంత చిన్న సమస్యకి ఇంత బాధా?" అన్నాడు.

"నాకు మాత్రం ఈ బాధ ప్రాణాల్ని తీసేస్తోంది. మీకు తెలిస్తే ఏదైనా ఇల్లు చూపించి పుణ్యం కట్టుకోండి" అంది.

అప్పటికింకేం మాట్లాడలేదు. మర్నాడు మధ్యాహ్నం గదికి పిలిచి 'అంతగా ఇల్లు అవసరమైతే మన టీ గోడౌన్ ఆవరణలో ఔట్ హౌస్ ఉంది. పెద్ద ఆవరణ ప్రశాంతంగా ఉంటుంది. ఏం భయం లేదు. నైట్ వాచర్ ఉంటాడు. కావలిస్తే అక్కడ దిగండి' అన్నాడు.

సీత మరి ఆలోచించలేదు. ఆలోచించే వ్యవధి కూడా వృధా చెయ్యలేదు. తప్పకుండా దిగుతామని చెప్పి మర్నాటికే ఇల్లు మార్చేసింది.

*గుర్నాధం కథ*

27

ఇల్లు చాలా సౌకర్యంగా ఉంది. ఇదివరకే ఇక్కడ ఎవరో ఉన్నట్టున్నారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన పటం, కొన్ని వార్తాపత్రికలూ చిందరవందరగా ఉన్నయి. నైట్‌వాచర్ వచ్చి ఇల్లంతా శుభ్రం చేశాడు. అతని పేరు మౌలాలి. నెల్లూరు సాయిబు. స్వచ్ఛంగా తెలుగు మాట్లాడతాడు. పెళ్ళాం పిల్లలూ లేరు. అందుకని అతనిది గొడౌన్‌లోనే ఓ మూల కాపురం. ఆవరణంతా టీ వాసన వేస్తుంటుంది. ఇంటిముందు పెద్ద బాదం చెట్టూ, రేగుచెట్టూ ఉన్నాయి. చల్లగా ప్రశాంతంగా ఉంది. కాని వర్ధనమ్మకి మాత్రం ఇది నచ్చలేదు. 'నిక్షేపంలాంటి సంసారుల కొంప వదులుకుని ఇక్కడ బజారున పడ్డాం. అక్కడ లేని సుఖం ఇక్కడేం వచ్చిందో?' అంది కూతురితో.

కాని సీతకి ఆ మాటలేం వినిపించలేదు. ఇల్లు మంచిదైనా మనస్సుకి శాంతి లేకపోయాక ఏం లాభం? ఇక్కడ రెండూ ఉన్నాయి.

ఎప్పుడైనా టీ పెట్టెల్ని తీసుకెళ్ళడానికి బళ్ళు వస్తే వస్తాయి. లేకపోతే లేదు. మిగతా సమయాల్లో అటు ఎవరూ రారు. చుట్టుపక్కలన్నీ ఆఫీసులు. సాయంకాలమయేసరికి ఆ ప్రాంతమంతా నిర్మానుష్యమవుతుంది.

"ఇది ఎవరికి అద్దెకి ఇవ్వడంలేదు. మీకు మేనేజరుగారు తెలుసు కనక ఇచ్చారు" అన్నాడు మౌలాలి.

వేణుకి మాత్రం కొత్త ఇల్లు బాగా నచ్చింది. రేగుపళ్ళు కోసుకు తింటూ ఒక రోజంతా ఆవరణని చుట్టబెట్టాడు.

కానీ చీకటి పడ్డాక ఆవరణలో వాతావరణం మారింది. గొడౌన్ ముందున్న ఖాళీస్థలంలో కుర్చీలు వేశాడు మౌలాలి. లైటు తీసుకొచ్చి పెట్టాడు. తొమ్మిది గంటలు అయేసరికి బయట బిగ్గరగా మాటలూ, నవ్వులూ వినిపిస్తే కిటికీ దగ్గరికి వచ్చి చూసింది సీత. గ్లాసుల చప్పుళ్ళూ, సీసాల తిరగమోతలూ, సోడాబుడ్లు తెరిచే శబ్దాలూ, సుఖాన్ని బూతద్దంలో చూసి ఆనందించే తాపత్రయం. క్షణంలో అర్ధమైంది సీతకి. ఎప్పుడూ నెమ్మదిగా, ప్రశాంతంగా కనిపించే గుర్నాధం కట్టలు తెంచుకుని విజృంభించిన నదిలాగా ఉన్నాడు. ప్రతి చిన్నరాయికీ నీరు చేరినట్టు, ప్రతి చిన్న మాటకీ నవ్వుతో విరిగిపోతున్నాడు. అతన్ని చూసి నిర్ఘాంతపోయింది. వాళ్ళ పక్కన విశ్వాస పాత్రమైన కుక్కలాగ చేతులు కట్టుకుని మౌలాలి నిలబడి సేవలు చేస్తున్నాడు.

"సోడా" అని ఎవరో అరిచారు.

మౌలాలి పరాకుగా ఉన్నాడు – అంతే.

గ్లాసు అతని కాలిమీద విరిగింది. బాధతో మూలిగాడు మౌలాలి.

"ఏమైందిరా?" అన్నాడు గుర్నాధం.

కళ్ళ నీళ్ళని చీకటి వేపు తిరిగి తుడుచుకుని నవ్వాడు. "ఏం లేదు సాబ్, ఐస్ కావాలా?"

దిమ్మెరపోయి చూస్తోంది సీత. కొంతసేపటికి యెవరో తలుపు తట్టినట్టయితే తుళ్ళిపడింది. మౌలాలి పిలిచాడు.

"కాలు తెగింది. మందేమైనా ఉందా అమ్మా?"

తెచ్చింది సీత. "కొట్టారా నిన్ను?"

"ఆ మత్తులో వాళ్ళకేం అర్థంకాదు. కాని పాపం, అంతా మంచివాళ్ళే"

"రోజూ మేనేజరుగారు త్రాగుతారా?"

నవ్వాడు. "ఇది మామూలేనమ్మా."

"ఎప్పట్నుంచి?"

"భార్య పోయినప్పటినుంచీ, అలవాటయిపోయింది."

కిటికీలోంచి బిగ్గరగా నవ్వుతూ, కబుర్లు చెబుతున్న గుర్నాధం కనిపిస్తున్నాడు. దుఃఖాన్ని తొక్కిపెట్టి, క్షణకాలమైనా బుద్ధిని మరిపించే మందు ఇంతకంటె మరొకటి లేదనుకున్నాడు. కొందరు కష్టాల్ని మరిచి బ్రతకడం నేర్చుకుంటారు. కొందరు కష్టాలనుంచి పారిపోతారు.

ఈ విషయం వర్దనమ్మకి తెలియడానికి చాలాసేపు పట్టింది. కాని తెలిశాక రాగాలు మొదలుపెట్టింది. "నేను చెప్తున్నా వినకుండా ఆఖరికి ఈ త్రాగుబోతు కొంపలో పారేశావే. వాళ్ళు త్రాగి మన పీకలు కోసినా మాట్లాడే నాధుడు లేడు" అని మొత్తుకుంది.

నవ్వొచ్చింది సీతకి. వాళ్ళని చూస్తే ఆమెకి భయం కలగడంలేదు. జాలి కలిగింది. "ఇంకొకరికి కీడు చెయ్యలేక వాళ్ళకి వాళ్ళే కీడు చేసుకుంటున్నారమ్మా. వాళ్ళు మనల్ని నాశనం చెయ్యలేరు. వాళ్ళే నాశనమయారు కనక" అంది.

ఇది సీత వేదాంతంలో ఒక భాగంగా కనిపించింది వర్ధనమ్మకి. ఒకప్పుడు గౌరవంగా బ్రతికిన కుటుంబం. ఆఖరికి ఇలాంటివాళ్ళ మధ్యకి రావలసి వచ్చినందుకు ఆమె గుండె పగిలింది.

"ఏడవకమ్మా. వాళ్ళ కష్టాలనుంచి విముక్తికి తంటాలు పడుతున్నారు. మనల్నేమీ చెయ్యలేరు" అంది.

ఆ స్థలానికి రావడం విచిత్రంగా, ఇదీ ఒక విధంగా దైవికంగా కనిపిచింది సీతకి. "బాగుంది. నాలాగే బ్రతుకులో వీగిపోయిన వాళ్ళ మధ్యకే వచ్చాను. నాకిప్పుడింకేం భయం? అయినా ఎందుకు భయం? నాశనం కావడమంటే ఇంతకంటే వేరే ఏముంది?" మంచం మీద ఆలోచిస్తూ పడుకుంటే నిద్రపట్టేసింది.

ఒక రాత్రికి తెలివొచ్చేసరికి వాచీ చూసింది. అప్పటికి మూడుగంటలయింది. కిటికీలోంచి బయటికి చూసింది. వాళ్ళంతా వెళ్ళిపోయారు. మౌలాలి రెండు కుర్చీల మీద పడుకుని, వాళ్ళు వదిలిపోయిన విస్కీ త్రాగి ఏవో పిచ్చి పాటలు పాడుతున్నాడు. మధ్య మధ్య మగతగా నిద్రపోతున్నాడు. మళ్ళీ నిద్రపట్టేసింది సీతకి.

మర్నాడు "ఇల్లు ఎలా ఉంది?" అని గుర్నాధం పలకరిస్తే సూటిగా అతన్ని చూసింది. తనకింకా రాత్రి విషయం తెలియదనే అతననుకుంటున్నాడని గ్రహించింది.

"ఇల్లు బాగుంది. కాని అమ్మ రాత్రి భయపడింది. మీరంత గట్టిగా నవ్వగలరని తెలీదు నాకు. నాకు మాత్రం భయం వెయ్యలేదు. ఆశ్చర్యపోయాను."

సిగ్గుపడ్డట్టు కనిపించాడు. ఏదో మాట మార్చాడు.

లేచి వచ్చేముందు "ఒక్క మాట చెప్పేదా?" అంది సీత.

ఏమిటి?"

"రాధగారు నాకిచ్చిన చనువుని ఇలా వినియోగించుకుంటున్నాననుకోకండి. నాకు చాలా కష్టాలొచ్చాయి. మీకొచ్చిన కష్టాలకి నాలుగింతలు వచ్చాయి. కాని నేను వాటినింకా ఎదుర్కొంటూనే ఉన్నాను. మీరు పారిపోతున్నారు. మీకు నేను చెప్పవలసిన దాన్నికాదు. కాని బాధ తీరడానికి మరేదైనా మర్గముంటుందేమో ఆలోచించండి" అనేసి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి మరీ తప్పతాగి అర్ధరాత్రి గుమ్మం దగ్గర, అరుగు మీద కూర్చున్నాడు గుర్నాధం. అతని పిలుపు విని భయకంపితురాలయింది సీత. కాని కూర్చున్న చోటునుంచి కదలలేదు గుర్నాధం.

"నువ్వు చెప్పిన దాన్ని మళ్ళీ ఆలోచించాను సిస్టర్. ఒక్కటే మార్గం కనిపించింది చావు. విషాన్ని ఒక్కసారే మ్రింగడానికి భయమేసి ఇలా చిన్న చిన్న మోతాదుల్లో పుచ్చుకుంటున్నాను" అని పకాలున నవ్వాడు. ఒక్క క్షణం ఆగి "నీ కథంతా మాధవరావు చెప్పాడు సీతా. అంతా విన్నాను" అన్నాడు.

"ఏమిటి విన్నారు?" అంది తెల్లబోతూ.

నవ్వాడు దయగా. "నేను ప్రేమించిన వ్యక్తిని నష్టపోయాను. నువ్వు ప్రేమనేనష్టపోయావు. నేను భార్యని పోగొట్టుకున్నాను. నువ్వు భర్తను సంపాదించుకునే అవకాశాన్నే పోగొట్టుకున్నావు. నేను కష్టాల్నుంచి పారిపోతున్నాను. నువ్వు ఎదిరించి నిలబడుతున్నావు. నాకంటే నువ్వే గొప్ప" మత్తు ఎక్కువైనట్టుంది. ఒక్క ఉదుటున లేచి సరాసరి ఆమెకు నమస్కారం చేశాడు. చేతిలో గ్లాసు ఒక్కగుక్కలో ముగించాడు. మౌలాలి పక్కనే ఉన్నాడు. మాటలంటుంటే గుర్నాధం

కంఠం వణికింది. అతని అలవాట్లు తెలిసిన మౌలాలి ఆ స్థితికి భయపడలేదు కాని, ఆ పరిస్థితిలో ఆడవాళ్ళ ముందుండడం మంచిది కాదని భయపడ్డాడు.

"రండి బాబూ – ఇక పోదాం" అని భుజం పట్టుకున్నాడు. అంత మైకంలోనూ మచ్చిక చేసిన జంతువులాగా మౌలాలి వెనుక నడిచాడు గుర్నాధం.

అంతలో ఆగి "నన్ను చూస్తే భయమేస్తోందా సిస్టర్" అని హఠాత్తుగా అడిగాడు.

"లేదు – జాలేస్తోంది."

నవ్వాడు. "వెరీ గుడ్. ఒక్కమాట విను. నా వల్ల నీకేం ప్రమాదం లేదు సిస్టర్. అమ్మగారికి కూడా చెప్పు. నన్ను చూసి ఎవరూ భయపడనక్కరలేదు."

మౌలాలి భుజం మీద ఊడిగిల పడుతూ వెళ్ళాడు గుర్నాధం.

"ఏం బ్రదర్ పండా, కాయా?" అని ఏదో బండగొంతు నవ్వుతూ పలకరించిన ప్రశ్న వినిపించింది. అంతే, మరుక్షణంలో సీసా పగిలింది. గుర్నాధం అతని చొక్కా చింపాడు. పట్టుకుని కొట్టబోతే మధ్య మరిద్దరు పడ్డారు. వాళ్ళలో ఎవరికీ ఉద్రేకాలకి ఉన్న బలం శరీరాలకి లేదు. మౌలాలి అందర్నీ విడదీశాడు.

"సీత నా సిస్టర్‌రా. మళ్ళీ నోరెత్తితే చంపేస్తాను" అని అరుస్తున్నాడు గుర్నాధం.

తన గురించి పోరాడే వ్యక్తిని చూడడం కొత్త సీతకి.

గదిలో వొణుకుతూ కూర్చుంది సీత. రేగిన పాత గాయం స్రవించినట్టు కళ్ళు ధారాపాతంగా నీటిని కారుస్తున్నాయి.

❦❦❦

వర్ధనమ్మ మొదట అనుకున్నంత భయంకరంగా గాని, బాధాకరంగా గాని అనిపించలేదు కొత్త ఇంట్లో జీవితం. రాత్రివేళల్లో భాగోతం క్రమంగా వాళ్ళకీ అలవాటైపోయింది. ఎప్పుడో ఒకప్పుడు వచ్చి ఎంతో కొంత రాత్రి వరకూ కూర్చుని వెళ్ళేవారు వాళ్ళంతా. సీత కనిపిస్తే ఆ మత్తులోనే 'సిస్టర్ ' అని పలకరించి వెళ్ళేవాడు. లేకపోతే అటువేపే వచ్చేవాడు కాదు. అక్కడ జీవితం మీద క్రమంగా నమ్మకం కుదిరింది వర్ధనమ్మకి.

ఒకసారి తనిఖీకి పై ఆఫీసరు వచ్చాడు. పేరు అహోబిలరావు. సన్నగా, ఛామన ఛాయగా ఉంటాడు. నున్నగా గుండు చేసినట్టు బట్టతల, గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళద్దాలు. నవ్వితే ఇరవైఏళ్ళ కుర్రాడికి సరిపోయే కట్టుడు పళ్ళు, కళ్ళకి సుర్మా, వయస్సుతో రాజీపడక ఎదిరిస్తున్నట్టు కనిపించాడు. తలమీద జుత్తులేదు. కాని ఉంటే రంగువేసేవాడే. నవ్వుతున్నా కోప్పడుతున్నట్టుంటుంది చూపు. కసిరినట్టుంటుంది మాట. కొట్టినట్టుంటుంది చేతుల కదలిక. కాని జీవితం మీద చాలా విచిత్రమైన దృక్పథం కలవాడు. వచ్చినరోజు ఆఫీసంతా స్థూలంగా తనిఖీ చేసి 'ఈ ఆఫీసులో ఒక్క పొరపాటైనా

జరుగుతున్నట్టు లేదే" అన్నాడు. అందుకు చాలా ఆశాభంగం చెందుతున్నట్టు "ఇలా అయితే ఇనస్పెక్టర్స్ బ్రతకడం ఎలా?" అన్నాడు గుర్నాధంతో.

గుర్నాధం నవ్వాడు.

"మీరు చాలా మంచివారులాగా ఉన్నారు. ఎనిమిది వందలతో ఎలా బ్రతుకుతున్నారు?" అని ప్రశ్నించాడు. ఇంకా డబ్బు సంపాదించే మార్గం లేకపోలేదని సూచిస్తూ.

ఆఫీసరు పట్ల మొదట ఉన్న భయం క్రమంగా జారిపోయింది అందరికీ. సీతని చూసి ఆమె ఉద్యోగం కనుక్కుని వెయ్యి ప్రశ్నలు వేశాడు. "ఇంతకంటే మంచి అర్హతలుండగా ఆమెకెందుకిచ్చారు? ఇంత తక్కువ బాధ్యతలు ఎందుకు అప్పచెప్పారు?" కాని ఇంత అందమైన అమ్మాయికి ఉద్యోగం ఇవ్వడానికి తను ఊహించిన కారణం ఒక్కటీ రాకపోయేసరికి నిరాశ చెందాడు అహోబలరావు.

తనిఖీ పూర్తయిన సాయంకాలం అసలైన విషయం తెలిసింది అహోబలరావుకి. వెంటనే కబురుచేసి గుర్నాధాన్ని పిలిపించాడు. అతను రాగానే సీరియస్‌గా మొహం పెట్టి.

"ఆఫీసు ఆవరణని ఈవిధంగా దుర్వినియోగం చేస్తున్నావన్నమాట" అన్నాడు.

నిర్ఘాంతపోయాడు గుర్నాధం.

"ఏం చేశానంటారు?"

నాకంతా అర్ధమైందిలే."

"ఏమిటి అర్ధమైంది?"

"గొడౌన్‌లో మీరు రాత్రిళ్ళు చేసే పని."

కాళ్ళల్లో వణుకు ప్రారంభమైంది గుర్నాధానికి. "అదా? అది.."

"అది సరే, అధికారి అతిధికి మర్యాదలు చేసే బాధ్యత లేదా ఏమిటి?"

తెల్లబోయాడు గుర్నాధం.

"అలా తెల్లబోతావేమయ్యా. రాత్రికి వాట్‌సిక్స్టీ నైన్ తెప్పించు. పద, నేనూ మరో గంటలో వస్తాను" అన్నాడు.

అంత భయమూ ఒక్కసారి జారిపోయింది. గాలిలో తేలిపోతున్నట్టనిపించింది గుర్నాధానికి. "అదా! అలాగే రండి. తప్పకుండా ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

ఆవరణలో ప్రవేశించగానే తమ వాటా అరుగుమీద కూర్చున్న సీతని చూసి ఆశ్చర్యపడ్డాడు అహోబలరావు. సీత కూడా విస్మితురాలై లేచి నమస్కారం చేసింది.

"ఈవిడ మన ఆఫీసులోనే పనిచేస్తుంది కదూ?" అన్నాడు ఏమీ ఎరగనట్టు.

"అవునండి. ఆఫీసులో చూశారు మీరు."

"ఇక్కడ ఉంటోందేం?"

"ఇల్లు దొరక్కపోతే ఇది ఖాళీగా ఉందికదా అని ఉండమన్నాను."

నవ్వి, ఏదో అర్థమైనట్టు వేలుతో గుర్నాధం కడుపులో పొడిచాడు. "చెప్పవే?" అంటూ.

"పొద్దుట్నుంచీ మిగతావాళ్ళని విస్మరించి ఈవిడకి ఉద్యోగం ఇచ్చావేమయ్యా అంటే వందసాకులు చెప్తావేం మరి. అసలయింది వదిలేసి?" అన్నాడు కళ్ళకొసల నుంచి నవ్వు కురిపిస్తూ.

గుర్నాధానికి ఒళ్ళు మండింది. అయినా కోపాన్ని దాచుకుంటూ "ఆమె నాకు సిస్టర్" అన్నాడు.

తడబడ్డాడు అహోబలరావు. "బంధువా?"

"కాదు."

మళ్ళీ తృప్తిగా నవ్వాడు. "అంతేనా, మాడర్న్ భాషలో సిస్టర్‌లకీ, బ్రదర్‌లకీ అర్థం లేదోయ్. ఏదో పేరు పెట్టి పిలవాలి కనక అలా పిలుస్తాం. త్వరగా బాటిల్ ఓపెన్ చేయించు."

మెల్లగా ఒకరిద్దరు మిత్రులు కలిశారు. మాట్లాడడానికి భోళాగా ఉన్నాడు కాని, శరీరం పెద్దది కావడం వల్ల రెండు గ్లాసులకే ఊగిపోవడం ప్రారంభించాడు అహోబలరావు. మనిషిలో నవ్వూ, హాస్యం మాయమై క్రమంగా నిశ్శబ్దం కావడం ప్రారంభించాడు.

ఉన్నట్టుండి గుర్నాధాన్ని పొగడడం ప్రారంభించాడు.

"ఏమిటో అనుకున్నాను. నువ్వు చాలా ష్రూడ్ ఆఫీసరవోయ్. నెమ్మదిగానే ఉంటూ పనులు జరిపేసుకుంటున్నావు. ఐ ఎప్రిషియేట్ యూ" అన్నాడు.

"ఇక్కడే ఇల్లు ఇచ్చావ్. వాళ్ళని మరి ఈ పార్టీలు డిస్టర్బ్ చేయవా?"

"మరేం పరవాలేదండి. మేం నెమ్మదిగా వచ్చిపోతాం. వాళ్ళు భయపడరు."

అర్థమైనట్టు నవ్వాడు. "అవునులే, ఈ మాత్రానికే భయపడితే ఎలా?"

ప్రతీమాటలోనూ అర్థం వెదుకుతుండడం చికాకనిపించింది గుర్నాధానికి. ఎంత త్వరగా ఈ పార్టీ ముగించివేస్తే అంత మంచిదనిపించింది.

మొదటి గ్లాసుకి పెద్దమనిషిలాగా ఉన్నవాడు, రెండోగ్లాసుకి వేదాంతిలాగ మారి, మూడో గ్లాసుకి సమకాలీన రాజకీయాలు, అంతర్జాతీయ సమస్యల మీద ఉపన్యాసం ప్రారంభించాడు అహోబలరావు. అతను అధికారి అనే జ్ఞాపకం

అందర్నీ నొక్కి పట్టి ఉంచింది. గుర్నాధాన్ని చూసి అతని మిత్రులు మాట్లాడకుండా ఊరుకున్నారు కానీ అతని వాగుడు మరీ ఎక్కువయేసరికి విసిగి మిత్రులు లేచి వెళ్ళిపోయారు.

"చూశావా, మనిషిని విసిగించాలంటే రాజకీయాలు ఎలా ఉపయోగిస్తాయో, రాజకీయ హత్యల్లో సైకాలజికల్ పాయింటే ఇది. మరో స్ట్రాంగ్ పెగ్ కలుపు" అన్నాడు.

గ్లాసు ఒక గుక్కలో తాగాడు. మనిషిలో వణుకు వచ్చింది. గ్లాసు బల్లమీద ఉంచి గుర్నాధం భుజం తట్టి 'ఇక నేను రెడీ ' అన్నాడు.

"పోదాం పదండి, మౌలాలి కారు తెమ్మను" అని లేచాడు గుర్నాధం.

"భలే జోక్ చేశావోయ్. ఇప్పుడు బంగళాకెళ్ళి ఏం చెయ్యాలి? ప్రోగ్రామ్ అంతా ఇక్కడుండగా. నాతో వేళాకోళాలాడకు. కమాన్" అన్నాడు.

గుర్నాధానికి అర్ధం కాలేదు.

"అంటే?" అన్నాడు.

"ఇల్లిచ్చి, ఉద్యోగమిచ్చి, గుమ్మంలోనే పెట్టుకుని అతిధిని ఉత్తసీసాల్తోనే పంపుతావా? పార్టీని పూర్తిగా జరిపించు. పద" అన్నాడు.

అర్ధమయిందిప్పుడు. గుర్నాధానికి తల తిరిగిపోయింది. అతనున్నాడని తను తక్కువ పుచ్చుకోవడం వల్ల, అధికారి కావడం వల్ల కాని, ఇలాంటి సందర్భంలో ఇదివరలో స్నేహితుడి తలమీద గ్లాసు పగిలింది .ఈ త్రాగుడులో కష్టాలతోపాటు మొదటిసారిగా కోపాన్ని దిగమింగాడు.

"ఆమె కష్టాల్లో చివికిపోయిన మనిషి సార్. ఒక్కసారి కూర్చుంటే కథంతా చెప్తాను"

ఈ సందర్భాన్ని ఉద్రేకంలో కంటే, అతని సానుభూతి వల్ల సాధించవలసిన అవసరం ఉందని గుర్నాధం గ్రహించాడు. ఇలాంటి సందర్భాల్లో ఓర్పు ఎంత అవసరమో అహోబలరావుకీ తెలుసు. అందుకని సీత కథంతా విన్నాడు. అంతా విని పగలబడి నవ్వాడు.

తెల్లబోయి చూశాడు గుర్నాధం.

"ఇదంతా నీకు ఆ అమ్మాయే చెప్పిందా?"

“లేదు. ఆమెకు కావలసిన వ్యక్తి ఒకరు చెప్పారు."

"పిచ్చివాడా అప్పటికయినా అర్ధం చేసుకోలేదా? ఒక అమ్మాయి గురించి మూడో వ్యక్తి చెప్పడంలో గల అంతరార్ధం తెలియకుండా ఎలా బ్రతుకుతున్నావయ్యా. అంత కష్టాల్లో ఉన్న అమ్మాయిని రక్షించమనే అతని ఉద్దేశ్యం."

బిక్క చచ్చిపోయాడు గుర్నాధం.

"నిన్ను అతను ఒప్పించలేకపోయినందుకు అతనితో దెబ్బలాట పెట్టుకుని ఉంటుంది ఆ అమ్మాయి. అతని పేరేమిటన్నావ్?"

"మాధవరావు"

నైట్‌వాచర్‌ని పిలిచాడు. "నువ్వెళ్ళి మాధవరావు ఎప్పుడైనా కనిపిస్తున్నాడా అని అమ్మగార్ని అడిగిరా" అని కబురు పంపించాడు. గుర్నాధం అతన్ని ఆపబోతే నోరు మూశాడు.

"నిజానికి మేం ఇక్కడ త్రాగడం ఆ అమ్మాయికి ఇష్టంలేదు. నా కష్టాలనుంచి విముక్తికి ఇంతకన్నా మంచిమార్గం ఏదన్నా ఉందేమో ఆలోచించుకోండి అని మరీ మరీ చెప్పింది" అన్నాడు దీనంగా.

ఈసారి మరీ బిగ్గరగా నవ్వాడు అహోబిలరావు. "అంత చెప్పినా అర్థం చేసుకోలేకపోయావంటే నువ్వు పనికిరానివాడవని అనుకుని ఉంటుందా అమ్మాయి. అంతకంటే ఎవరు మాత్రం కుండబద్దలు కొట్టినట్టు చెప్తారయ్యా. ఇప్పటికైనా మించిపోయింది లేదులే"

గుర్నాధం వాదన క్రమంగా బలహీనమైంది. అతనూ ఆలోచనలో పడ్డాడు. సీత సలహా వెనుక ఏదైనా ఉద్దేశముందా అనే ఆలోచన మొదటిసారి అతని మెదడులో కదిలింది. అతనికి తెలియకుండానే రెండు గ్లాసులు త్రాగేశాడు గుర్నాధం.

"మాధవరావుగారితో మాటల్లేవటండి. ఆరింకరారట" అంటూ వచ్చాడు మౌలాలీ.

"కోపంగా రుసరుసలాడుతూ చెప్పిందా ఈ మాటలు?"

ఎలా తెలుసా అని ఆశ్చర్యపోయాడు మౌలాలీ. "అవునండి. ఆరి పేరెత్తితేనే చాలా కోప్పడిపోయారు" అన్నాడు.

గుర్నాధానికి మతిపోయింది. అహోబలరావు వాదన మీద ఆసక్తి పెరిగింది. తల క్రమంగా దిమ్మెక్కుతోంది. రక్తం ఎప్పుడూ లేనంతగా వేడెక్కింది.

"ఇప్పుడేమంటావ్? అంటున్నాడు అహోబలరావు.

"నా ప్రాణం పోయినా ఆమెకి అన్యాయం జరగనివ్వను. ఏమైనా సరే" అని గొణిగాడు గుర్నాధం.

అహోబలరావుకి కోపం వచ్చింది. "ఉద్యోగం పోయినా సరేనా?"

తుళ్ళిపడ్డాడు గుర్నాధం.

"గొడౌన్‌లో అమాయిని పెట్టి రాత్రుళ్ళు సీసాలతో, అమ్మాయిలతో జల్సా చేస్తున్నావని పై ఆఫీసర్లకి తెలిసినా సరేనా?"

గుర్నాథం రక్తం కళ్ళల్లోకి, మెదడులోకి పాకింది.

"చావు ఒక్క క్షణంలోనే వస్తుంది బ్రదర్. ఇలాంటి అపవాదులు వస్తే బ్రతికినన్నాళ్ళూ చావాలి. నేను దుర్మార్గుణ్ణికాదు. నీకు చాతకాకపోతే కర్తవ్యం నాకు వదిలేయ్" అన్నాడు.

గుర్నాధానికి మాట పెగల్లేదు. వెంటనే మరో గ్లాసు అందించాడు అహోబలరావు. అతను తాగలేకపోయాడు. లేచి వచ్చి అతన్ని వొళ్ళో కూర్చోబెట్టుకుని కుక్కకిలాగా మెల్లగా గ్లాసంతా త్రాగించచాడు.

"ఏమంటావ్?" అని ఈసారి అహోబలరావు రెట్టిస్తే గుర్నాథం ఏడవడం ప్రారంభించాడు.

"ఆ అమ్మాయినేమీ చెయ్యకండి. మీ కాళ్ళు పట్టుకుంటాను. రేపే ఖాళీ చేయిస్తాను. నా సిస్టర్.." మాటలు తడబడి ఆలోచనలు విరిగిపోతున్నాయి.

ఇక తన కర్తవ్యాన్ని ఆలోచించే సమయం వచ్చిందని గ్రహించాడు అహోబలరావు. దూరంగా గేటు దగ్గర బీడీ కాలుస్తున్న మౌలాలీని పిలిచి, "ఆ అమ్మాయిని ఒక్కసారి అర్జంటుగా రమ్మను ఇంట్లో వాళ్ళని అనవసరంగా లేపకు. కారులో వెళ్ళి నువ్వూ, డ్రైవరూ భోజనం చేసి రండి" అని పదిరుపాయల కాగితం ఇచ్చాడు.

కళ్ళజోడు తీసి విస్కీతో ఒక్కసారి తుడిచి పెట్టుకున్నాడు జీడిపప్పు పలుకుల్ని గాలిలో ఎగరేసి బంతిని కొట్టినట్టు చేత్తో కొట్టాడు. మొద్దు నాలిక తిరిగిన మేరకు పదాలు గుణిగాడు. రెండుసార్లు 'రమ్మన్నారట' అని సీత అనేవరకూ అని సీత అనేవరకూ అతనికి స్పృహలేదు.

భయం, సంకోచం లేకుండా నిర్మలంగా ఉన్న సీత ముఖం చూసి క్షణకాలం నిర్ఘాంతపోయాడు అహోబలరావు. అప్పుడే నిద్రపట్టినట్టుంది. కళ్ళు సగం నూసుకుపోయి మత్తుగా కనిపించాయి. తెల్లటిచీర భుజం చుట్టూ కప్పుకుంది. మనస్సులోని విసుగుని మాటలో కనబరచకుండా అడిగింది. 'రమ్మన్నారట!'

గుర్నాథం ఎప్పుడూ అలా పిలవడని తెలుసు. ఒకవేళ పిలిచినా తను వెళ్ళవలసిన అవసరంలేదని తెలుసు. కాని అధికారి పిలిచినప్పుడు రాలేదని గుర్నాధానికి మాట వస్తుందేమోనని భయపడింది. అయినా పిలిచినప్పుడు పలికితే తప్పేం? అప్పట్లో అంతకన్నా ఆలోచించే స్వాస్థ్యం, వ్యవధిలేదు. ఆమెను చూడగానే అహోబిలరావు ముణుకుతో పొడిచాడు గుర్నాధాన్ని. అతను కళ్ళువిప్పి తెల్లచీరని చూసి 'రాధా' అన్నాడు మత్తులో క్షణంలో బుద్ధి పరిసరాల్ని గుర్తుచేసింది.

"నువ్వా సీతా ఎందుకొచ్చావ్? వెళ్ళు, వెళ్ళు" అన్నాడు తొందరగా. అతని కళ్ళనీళ్ళు చూసి ఆశ్చర్యపోయింది సీత.

"ఒక్క నిముషం కూర్చో" అధికారం, ఆతృత ధ్వనించే కంఠంతో అన్నాడు అహోబిలరావు.

"నీ గురించి గుర్నాథం అంతా చెప్పాడు సీతా, నాకు చాలా జాలిగా ఉంది నీ మీద. మద్రాసు బదిలీ చేయిస్తే వెళ్తావా?" అన్నాడు.

"వద్దండీ ఏదో తప్పనిసరిగా ఈ ఉద్యోగం చేస్తున్నాను."

"అవునులే. నాకర్థమైంది. నువ్వు చాలా మంచిదానివి. కష్టపడ్డవాళ్ళకే మరొకరి కష్టాలు అర్థమవుతాయి. నేనూ కష్టాలు పడే పైకొచ్చాను. నీకో ప్రమోషన్ ఇవ్వాలని రికమెండ్ చేస్తాను" అన్నాడు అహోబలరావు. ఎక్కడలేని ధోరణి త్రోసుకు వచ్చిందతనికి.

"ఇంక వెళ్ళు" అన్నాడు గుర్నాధం.

కోప్పడ్డాడు అహోబలరావు. "ఏమిటయ్యా తమాషా? పిలిచింది నువ్వయితే వెళ్ళమని తొందరపెడతావేం? ఆ అమ్మాయిని ఆలోచించుకోని. నీ తొందరేమిటి మధ్య. నువ్వు కూర్చో సీతా."

"ఏమిటండీ ఇదంతా?" అంది విసుగునీ, కోపాన్నీ దాచుకోకుండా.

ఆ ప్రశ్న గుర్నాధాన్నే వేసినట్టు మాట తిప్పి "అలా అడుగు అతన్ని. గుర్నాధానికి లోకధర్మం తెలీదు. నీ కథ విన్నాక, అదీ నువ్వు పంపిన ఆ మాధవరావు ద్వారా విన్నాక నిన్నర్థం చేసుకోవలసింది. అయినా కార్యశూరులు మాటలు విగుల్చుకోరులే."

"మళ్ళీ మాట్లాడితే నిన్ను చంపుతాను రాస్కెల్" అని గొంతు చించుకుని లేచాడు గుర్నాధం.

కోపం తెచ్చుకోలేదు అహోబలరావు. విసుక్కోలేదు. చిరునవ్వుతో అతని రెండు చేతుల్నీ పట్టుకుని కుర్చీలోకి విసిరేశాడు. అంత మనిషి గుర్నాధం వ్రేళ్ళు తెగిన వృక్షంలాగా కూలిపోయాడు.

"పాపం డోసు ఎక్కువైందిలే" అన్నాడు సీతతో.

సీత వెళ్ళిపోబోతుందని గ్రహించాడల్లే ఉంది. ఆమె అటు కదలబోయేసరికి లేచి బాదం చెట్టు వేపు రెండడుగులు వేసి ఇంటికీ, గోడౌన్‌కీ మధ్య నిలబడ్డాడు.

"ఒక్కసారి జీవితం మంచితోవ పడితే మరల వెనక్కి రాలేం సీతా, నీకు పెళ్ళయిపోయి ఉంటే ఎక్కడో, ఏ ముసలి పీనుగుకో వంట చేసి పెడుతూ బ్రతికేదానివి. కాని నువ్వు అదృష్టవంతురాలివి. ఇప్పుడూ చూడు, రోజూ కొత్తగా తెల్లవారుతుంది. కొత్తగా చీకటి పడుతుంది"

"నేను రోజు గురించి ఆలోచించడం లేదు సార్. నిద్రగురించి ఆలోచించి నా దారి కడ్డువేస్తారా?"

అదో పెద్ద జోకులాగా నవ్వాడు.

"ఎంత గొప్ప నిజం చెప్పావు సీతా. ఇంత హ్యూమర్ నీలో ఉన్నా ఇన్నాళ్ళూ మనవాడు నిద్రపోతున్నాడంటే నాకు విచారంగా ఉంది. బ్రతుకు మీద సరైన అభిప్రాయాలు లేవు. బ్రతికే మార్గాలు తెలీవు. స్టుపిడ్‌కి."

ఏదో మరిచిపోయినట్టు హఠాత్తుగా చేతిలో ఉన్న గ్లాసు ఆమె చేతిలో ఉంచి వెనక్కి నడిచిపోయి కుర్చీలో కూర్చున్నాడు. సీసా ఎత్తి "గ్లాసు ఇలా తే" అన్నాడు. 'కీ' ఇచ్చిన యంత్రాన్ని శాసించినంత యథాలాపంగా.

సీత టేబుల్ మీద గ్లాసు ఉంచబోయింది. చెయ్యి పట్టుకున్నాడు. "చాలా లోకానుభవం ఉన్నదానివి. ఇంత చిన్న వయసులో ఇన్ని తెలివితేటలున్నందుకు నువ్వు నిజంగా పైకి వస్తావు. ఒకరోజు నువ్వు బాస్‌వయినా ఆశ్చర్యంలేదు. నాపై అధికారి చాలా రసికుడే. ఈసారి అతనితో వస్తాను" అన్నాడు కన్ను మలిపిస్తూ.

వొళ్ళు జలదరించింది సీతకి. దుఃఖం, ఆవేశం పెనవేసుకోగా రొట్టె కోసుకునేందుకు పెట్టిన కత్తిని ఒక్క ఉదుటున చేతిలోకి తీసుకుంది. ఆశ్చర్యపడలేదు అహోబలరావు. పిచ్చిక నోట కరుచుకున్న గడ్డిపోచను తప్పించినట్టు దాన్ని విసిరి అవతల పారేశాడు. కానీ ముఖం కోపంతో జేవురించినట్టు చేసుకుని, గొంతు వీలయినంత పెంచి, సీతని రెక్కలు విరిచి గుండెల మీదకి లాక్కుని అరవడం ప్రారంభించాడు.

"రాక్షసీ! నన్ను చంపాలనుకున్నావా? నువ్వెంతకైనా తగుదువు. అసలిదంతా ఆ స్కౌండ్రల్ పన్నిన కుట్ర. మీ ఇద్దరు కలిసి నా చేత తాగించి నన్ను హత్య చెయ్యాలనుకున్నారా? తన రహస్యాలు బయటపెడతానని గుర్నాధం తన ఉంపుడు కత్తె చేత తాగించి నన్ను హత్య చెయ్యాలనుకున్నారా? తన రహస్యాలు బయటపెడతానని గుర్నాధం తన ఉంపుడు కత్తె చేత నన్ను చంపిమాలనుకున్నాడు. మీ ఇద్దర్నీ అరెస్టు చేయిస్తాను. మీ అంతు తేలుస్తాను."

సీత అరుస్తున్నా  చేతుల్లోంచి కదలకుండా పట్టుకునే ఒడుపు  తెస్తోందతనికి. అయినా గొంతు తగ్గించలేదు. ఎప్పుడు తెలివొచ్చిందో గుర్నాధం ఆ కేకలకి ఆకులాగా రెపరెపలాడిపోయాడు. అహోబలరావు మాట పూర్తికాకుండా, కాళ్ళు పట్టుకుని "గట్టిగా అరవకండి. మీకు పుణ్యముంటుంది. నన్ను శిక్షించండి. కానీ నా చెల్లెల్ని మాత్రం కాపాడండి. మీకు దండం పెడతాను" అంటూ అతని కాళ్ళ దగ్గరే తల నేలకేసి బాదుకున్నాడు గుర్నాధం. తాగుడు మైకంలో మనస్సులో అనుకున్న భావానికి బలం వస్తుంది గావును. కంఠంలో ఉద్వేగం, భయం, వేదన ద్యోతకమయాయి. ఆ ఊపుకి నుదురు చితికి చిక్కని రక్తం అహోబలరావు కాలికి తగిలింది.

స్థంభీభూతురాలైంది సీత. జీవితంలో స్వార్థాన్ని, దుర్మార్గాన్నీ, మోసాన్నీ మాత్రమే చూసిన సీత ఈ దృశ్యం గుండెను కదిలించివేసింది. కన్నీరు  ధారలు కట్టాయి. తనకోసం నేలమీద పొర్లాడే వ్యక్తి మీద కృతజ్ఞతతో, దయతో ఆమె హృదయం ద్రవీభూతమైంది. కొందరు తమ జీవితం కోసం తనని బలిచేస్తే, ఇతను తనకోసం జీవితాన్ని పణంగా పెడుతున్నాడు. అలా జరగనివ్వకూడదు. ప్రపంచంలో ఈ మాత్రం మంచితనం ఉందన్న నమ్మకం తనకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది. ఈ మాత్రం సానుభూతి చాలు. తనకి ఎవరి సహాయం అక్కరలేదు. ఒకసారి పాడైన జీవితం తనది. ఈసారి ఒక సహృదయుడి బ్రతుకు తెరువు నిలపడానికి మరొకడి కోరికకు 'ఎర' కాబోతోంది. అంతే తేడా.

తలెత్తి అహోబిలరావుని సూటిగా చూసింది.

కన్నీళ్ళ మధ్య నవ్వు తెర వచ్చింది సీతకి. నవ్వు క్రమంగా పెరిగి, విశాలమై, పక్కున నవ్వింది.

తుళ్ళిపడ్డాడు అహోబలరావు. తన కోరిక పైశాచిక వికటాట్టహాసం చేసినట్టనిపించింది.

ముఖం ఎత్తే ఓపికన్నా లేక, కాళ్ళ దగ్గరే నిద్రపోయాడు గుర్నాధం. యజమాని పెట్టే భోజనానికి ఎదురు చూసి నిరాశ చెంది నీరసంగా నిద్రపోయిన కుక్కలాగా.

సీత నవ్వు ముఖంలో ఆవేశంలేదు, ఉద్రేకం లేదు, ఆహ్వానం లేదు, విచిత్రం. ఈసారి తిరస్కారం కూడా లేదు. ఇప్పుడు భుజం మీద చెయ్యి వేస్తే ఎదురు చెప్తుందన్న సంశయం లేదు అతనికి.

దగ్గరికి వచ్చాడు. భుజం మీద చెయ్యి వేశాడు.

ఈసారి అతని చెయ్యి వణికింది.

గొంతు సవరించుకుంటూ 'ఇంటికి వెళ్ళమ్మా చెల్లీ' అన్నాడు.

నిర్ఘాంతపోయింది సీత. అదికూడా అతని పన్నాగంలో ఒక భాగమేనా అని చూసింది.

బిగ్గరగా ఆలోచించుకున్నట్టు అన్నాడు.

"తెలిసే చెప్తున్నానమ్మా. నేను దుర్మార్గుడినే. కానీ ఇవాళ గుర్నాధాన్ని చూశాక మనస్సు చెదిరిపోయింది. చెల్లెలి మీద ప్రేమ ఇలా ఉంటుంది కాబోలు. వెళ్ళమ్మా"

కళ్ళు తుడుచుకుంటూ వెనక్కి తిరిగింది సీత.

చల్లని గాలి తెర శరీరాన్ని రివ్వుమనిపించింది.

మంచివాళ్ళని భ్రమింపచేసే దుర్మార్గుల మధ్య ఓడిపోయి, దుర్మార్గులని చెప్పుకునే వాళ్ళలో మంచితనాన్ని జయించిన సీత సురక్షితంగా గుమ్మంలో అడుగు పెట్టింది.

జీవితంలో నాలుగోసారి ఓడిపోవడానికి సిద్ధపడ్డ సీత, మానవ స్వభావాన్ని మొదటిసారిగా జయించి నిలబడింది.

ప్రపంచం తప్పించుకోవడానికి వీలులేకుండా ముసుగువేసినట్టున్న చీకటి ఒక మూలనుంచి మెల్లగా విడిపోతోంది.

బాదం చెట్టు వెనక కనిపించే పట్టెడు ఆకాశంలో తెల్లవారుతోంది.

*(సమాప్తం)*